www.andhrajyothy.com
విజయవాడ సిటీ**
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHI
వెల (Price) : Rs. 6.50
శనివారం | 10-8-2024 | పేజీలు: 14 | సంపుటి (Volume) : 65 | సంచిక (Issue) : 116
Vijayawada | Hyderabad | Mahaboobnagar | Tirupathi | Visakhapatnam | Ananthapuramu | Karimnagar | Tadepalligudem | Warangal |
Guntur | Kurnool | Nellore | Srikakulam | Rajamahendravaram | Khammam | Kadapa | Ongole | Nallagonda | Nizamabad and Bengaluru

శ్రీ క్రోధి నామ సంవత్సరం, దక్షిణాయనం, వర్షరుతువు, శ్రావణమాసం, శుక్లపక్షం, తిథి: షష్ఠి తె. 5.45 తదుపరి సప్తమి; నక్షత్రం: చిత్త తె. 5.49 తదుపరి స్వాతి; వర్జ్యం: ఉ. 11.45-1.34; దుర్ముహూర్తం: ఉ. 6.00-7.41; అమృతఘడియలు: రా. 10.35-12.24; రాహుకాలం: ఉ. 9.00-10.30; సూర్యోదయం: 6.00; సూర్యాస్తమయం: 6.40

అమన్.. అదిరెన్

9



కుస్తీలో భారత్‌కు కాంస్యం
పారిస్ ఒలింపిక్స్‌లో ఆరో పతకం
పురుషుల 57 కిలోల విభాగంలో
సాధించిన అమన్ సెహ్రావత్

ఓరి దేవుడా!

మద్యం అధికారి నడమంత్రపు సిరి

జగన్ పాలసీతో దండిగా పాపపు సొమ్ము

పరిహారం కోసం అమ్మోరి గుడికి 2 కోట్లు
కృష్ణా, గుంటూరులో 50 ఎకరాల కొనుగోలు
హైదరాబాద్‌లోనూ రియల్ ఎస్టేట్ వ్యాపారం
స్థిరాస్తులన్నీ బినామీ పేర్ల మీదే
విచారణ జరిపితేనే విషయం తెలిసేది!

ఒకప్పుడు రాష్ట్రంలో 'మద్య కాంతు'లతో వెలుగొందిన అధికారి అవినీతి బాగోతమిది! తవ్వేకొద్దీ తన్నుకొస్తున్న 'కిక్కు' కథ ఇది! జగన్ మద్యం విధానం ఆ నాటి సర్కారు పెద్దలకే కాదు... ఈ అధికారికీ కాసుల వర్షం కురిపించింది. ఎంతగా అంటే... చేసిన పాపాలకు పరిహారంగా ఒక గుడి నిర్మాణానికి రెండు కోట్ల రూపాయలు విరాళంగా ఇచ్చేంత! కోట్ల విలువైన భూములు కొనేంత! ఆ అధికారికి గుంటూరు జిల్లా దుగ్గిరాల మండలంతో బినామీ సంబంధాలున్నాయి. దీంతోపాటు హైదరాబాద్, ఇతర ప్రాంతాల్లోనూ ఆస్తులు పోగేశారు.

(గుంటూరు - ఆంధ్రజ్యోతి)

జగన్ హయాంలో డిస్టిలరీలను చెరబట్టి, సొంత బ్రాండ్లు ప్రవేశపెట్టి... వాటినే ప్రభుత్వ దుకాణాల్లో విక్రయించారు. ఇది వేల కోట్ల వ్యవహారం. కథ, స్క్రీన్‌ప్లే ఎవరిదైనా... దానిని నడిపింది మాత్రం ఆ అధికారే! ఈ క్రమంలోనే భారీగా అవినీతి సొమ్ము సంపాదించారు. చేసిన పాపాలు పోగొట్టుకునేందుకు కాబోలు... ఒక గుడి నిర్మాణానికి భారీగా విరాళమిచ్చారు. దుగ్గిరాల మండలంలోని కంఠంరాజు కొండూరులో వేంచేసి ఉన్న అమ్మ వారి మహత్యాన్ని మిత్రుల ద్వారా తెలుసుకున్నారు. ఒకసారి అక్కడకు వెళ్లొచ్చారు. ఆ తర్వాత... ఆయన దశ తిరిగింది. జగన్ సర్కారు కొత్త మద్యం పాలసీ తీసుకొచ్చింది. ఈ వ్యాపారం చేసే పదవి ఆ అధికారికే వచ్చింది. ఆ నాటి నుంచి అధికారి పని మూడు బీర్లు, ఆరు ఫుల్లులుగా సాగింది. 'అంతా అమ్మోరి దయ' అనుకున్నారు. అదే ప్రాంతంలో రూ.4 కోట్లతో ఆరెకరాల భూమిని కొనుగోలు చేశారు. అక్కడి అమ్మవారి గుడి నిర్మాణానికి 2022లో ప్రభుత్వం రూ.99 లక్షలతో టెండరు పిలిచింది. మరో రూ.రెండు కోట్లు

మిగతా 11వ పేజీలో...





ఆదివాసీ దినోత్సవ కార్యక్రమంలో గిరిజన సంప్రదాయ డోలు వాయిస్తున్న ముఖ్యమంత్రి చంద్రబాబు, పక్కన మంత్రి సంధ్యారాణి

ఇక చైతన్యం 2.0

పేదరికం ఎక్కడుంటే అక్కడికొస్తాం.. ఆదివాసీలకు కావాల్సినవన్నీ అందిస్తాం
పేదరికం నుంచి బయటకు తెస్తాం.. ఏఐ రోజుల్లోనూ డోలీ మోతలా?
ఈ పరిస్థితి తొలగాలని నాడు 'చైతన్యం' పథకం తెచ్చాం
ఏజెన్సీల్లో ఫీడర్ అంబులెన్స్‌లు పెట్టాం.. వాటిని వైసీపీ మూలనపడేయటంతో తిరిగి డోలీ కష్టాలు
ప్రపంచ నగరాల్లో అరకు కాఫీకి ప్రచారం.. ఆదివాసీ దినోత్సవంలో సీఎం

"ఏఐ గురించి మాట్లాడుకుంటున్న ఈ రోజుల్లో ఏజెన్సీలో డోలీమోతలు కనబడటం చాలా బాధగా ఉంది. రహదారి సదుపాయం లేని ప్రాంతాల నుంచి ఆస్పత్రులకు డోలీల్లో వెళ్తున్నారని గుర్తించి ఆనాడు ఫీడర్ అంబులెన్సులు తీసుకొచ్చాం. కానీ గత ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేసింది. మళ్లీ డోలీల్లో ఆదివాసీలను మోసుకొచ్చే పరిస్థితికి తీసుకొచ్చింది. డోలీల్లోనే ప్రసవాలు అవడం ఏమిటీ? ఏమిటీ ఈ దౌర్భాగ్యం?"

- చంద్రబాబు

అమరావతి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఎక్కడ పేదవాడుంటే అక్కడకొచ్చి, కావాల్సిన వనరులిచ్చి పేదరికం నుంచి బయటకు తీసుకొస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. "గతంలో గిరిజనుల కోసం చైతన్యం కార్యక్రమం తీసుకొచ్చాను. ఈరోజు నుంచి చైతన్యం 2.0ను తీసుకొస్తున్నాను. గిరిజనుల మోముల్లో సంతోషం నింపడం ఈ కార్యక్రమం లక్ష్యం" అని చంద్రబాబు పేర్కొన్నారు. శుక్రవారం విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో నిర్వహించిన ప్రపంచ ఆదివాసీ దినోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆదివాసీలు పండించిన ఉత్పత్తులు, తయారుచేసిన కళాకృతులను పరిశీలించారు. అరకు కాఫీని తాగారు. స్వాతంత్ర్యోద్యమంలో ఆదివాసీల పాత్ర, చరిత్రను తెలిపే ఫొటో ఎగ్జిబిషన్‌ను పరిశీలించారు. అనంతరం చంద్రబాబు మాట్లాడారు. గిరిజనులు పేదరికంలో పుట్టి పేదరికంలోనే

మిగతా 11వ పేజీలో...

పీఎస్ఆర్ బది'లీలలు'

జగన్‌పై అప్పటి రవాణా కమిషనర్ స్వామిభక్తి
50 మంది ఏఆర్ కానిస్టేబుళ్లు రవాణా శాఖలోకి బదిలీ



నిబంధనలకు విరుద్ధంగా డిపార్ట్‌మెంట్ ట్రాన్స్‌ఫర్లు
పాదయాత్రలో జగన్‌కు రక్షణగా కానిస్టేబుళ్లు
ఆ తర్వాత తాడేపల్లి ప్యాలెస్‌కూ రెండేళ్లు కాపలా
కోరిన శాఖలోకి బదిలీ చేసిన వైసీపీ సర్కారు..2021 ఆగస్టు 25న రహస్యంగా జీవో
ఇప్పుడు అక్రమాలు తెలిసిపోతాయని హడల్
మూడేళ్ల సెలవు కోసం పలువురి దరఖాస్తు

(రాయచోటి-ఆంధ్రజ్యోతి)

వారంతా వివిధ పోలీసు బెటాలియన్లలో ఏఆర్ కానిస్టేబుళ్లుగా పనిచేసేవారు. ప్రతిపక్ష హోదాలో జగన్ రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర నిర్వహించిన సమయంలో ఆయనకు రక్షణ విధుల్లో పాల్గొన్నారు. ఆ తర్వాత తాడేపల్లి ప్యాలెస్‌కు రెండేళ్లకు పైగా కాపలా కాశారు. ఈ సేవలకు గుర్తింపుగా గత వైసీపీ ప్రభుత్వం నిబంధనలకు విరుద్ధంగా వారు కోరుకున్న శాఖలోకి అడ్డగోలుగా బదిలీ చేసేసింది. రాష్ట్రవ్యాప్తంగా ఆర్మ్‌డ్ రిజర్వు పోలీసు కానిస్టేబుళ్లుగా పనిచేస్తున్న సుమారు 50మంది 2021లో రోడ్డు రవాణా శాఖలోకి(ఆర్టీవో) బదిలీపై వచ్చారు. ఇంతమందినీ ఒకే జీవోపై కాకుండా.. ఒక్కొక్కరినీ ప్రత్యేక కేసులుగా పరిగణించి.. అప్పటివరకు ఉన్న నిబంధనలు సడలించి మరీ గత ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. వీరందరినీ రవాణా శాఖలోకి చేర్చుకుంటూ అప్పటి రవాణా కమిషనర్ పీఎస్ఆర్ ఆంజనేయులు ఆదేశాలు ఇచ్చారు. ఇంతమంది ఏఆర్ కానిస్టేబుళ్లు రవాణా శాఖలోకి ఎందుకు బదిలీపై వచ్చారు? వీరిపై ప్రభుత్వం ఎందుకంత ప్రత్యేక ప్రేమ చూపించింది? అని ఆరా తీస్తే అసలు విషయం వెలుగు చూసింది. మాజీ సీఎం జగన్‌పై ఐపీఎస్ అధికారి పీఎస్ఆర్ ఆంజనేయులుకు ఉన్న స్వామి భక్తికి మచ్చుతునక లాంటి విషయం బయటపడింది. 2019 ఎన్నికలకు ముందు ప్రతిపక్ష నేత హోదాలో జగన్ రాష్ట్రవ్యాప్తంగా పాదయాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో ఆయనకు ప్రైవేటు భద్రతా సిబ్బందితో పాటు రాష్ట్రంలోని పలు పోలీసు బెటాలియన్ల నుంచి సుమారు 50మంది ఏఆర్ కానిస్టేబుళ్లు సైతం విధులు నిర్వర్తించారు. 2019లో జగన్ సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఈ 50మంది

మిగతా 12వ పేజీలో...



జైలు నుంచి విడుదలయ్యాక ఢిల్లీ సీఎం కేజ్రీవాల్ తల్లికి పాదాభివందనం చేస్తున్న సిసోడియా

సిసోడియాకు బెయిల్

17 నెలల తర్వాత ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎంకు ఊరట
విచారణ లేకుండా ఎంత కాలం జైల్లో ఉంచుతారు?
ఆయన ప్రాథమిక హక్కులకు భంగం కలిగించడమే
బెయిల్ నిబంధన.. జైలు మినహాయింపు: సుప్రీం
ఢిల్లీ మద్యం కేసు విచారణలో తీవ్ర జాప్యమే బెయిల్ ఇవ్వడానికి కారణమన్న ధర్మాసనం 2
త్వరలోనే కేజ్రీవాల్, కవితకు కూడా బెయిల్?

నీకో దండం సామీ!

జగన్ తీరుతో వైసీపీకి ముఖ్య నేతలు టాటా

మొన్న ధర్మాన.. నిన్న పెండెం.. నేడు ఆళ్ల
అధినేత నిరంకుశ వైఖరిపై అసంతృప్తి
ఓటమిపాలైనా ఆయన మారలేదని గుర్రు
తమను పట్టించుకోవడం లేదని ఆవేదన
ఇలాగైతే జనం లెక్కచేయరని ఆందోళన
వైసీపీలో ఉంటే భవిష్యత్ ఉండదని ఇంకొందరు
కొన్ని చోట్ల పార్టీ కార్యాలయాలు మూత
పలు నియోజకవర్గాల్లో చిరుహోటళ్లుగా మార్పు
కేంద్ర కార్యాలయమూ తాడేపల్లి నివాసంలోకి

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

సౌమ్యులు, వివాదరహితులు, పార్టీకి నిబద్ధులుగా పనిచేసినవారు, మృదుస్వభావులుగా పేరున్న నేతలు సైతం వైసీపీని వీడిపోతున్నారు. ఇటీవలి ఎన్నికల్లో పార్టీ ఘోరపరాజయం పాలైనా తమ అధినేత జగన్మోహన్‌రెడ్డి తీరులో మార్పు రాకపోవడం.. ఆయన నిరంకుశ వైఖరిని తట్టుకోలేక దండం పెట్టి మరీ వెళ్లిపోతున్నారు. రాష్ట్ర రాజకీయాల్లో ఒకప్పుడు ఓ వెలుగు వెలిగిన ఉత్తరాంధ్ర నేత, మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు మొన్నటికి మొన్న ప్రత్యక్ష రాజకీయాలకు దూరం కాగా.. పిఠాపురం మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు బుధవారం వైసీపీకి రాజీనామా చేశారు. తాజాగా ఏకంగా ప్రత్యక్ష రాజకీయాల నుంచే తప్పుకొంటున్నానని మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల నాని ప్రకటించారు. గుంటూరు జిల్లాకు చెందిన మాజీ ఎమ్మెల్యే మద్దాలి గిరి కూడా రాజకీయ వైరాగ్యంతో వైదొలిగారు. అధికారంలో ఉన్నప్పుడు మంత్రులను, ఎమ్మెల్యేలను కలవడానికి కూడా ఇష్టపడని జగన్.. ఇప్పుడు ఓటమితో గద్దె దిగిపోయినా మారలేదని.. తమను పట్టించుకోవడం లేదని పలువురు వాపోతున్నారు. ఇలాగైతే జనం తమను కూడా పట్టించుకోవడమే మానేస్తారని.. రాజకీయ భవిష్యత్ ప్రశ్నార్థకం అవుతుందని ఆందోళన చెందుతున్నారు. ఈ క్రమంలోనే కొందరు అధికార కూటమి వైపు చూస్తుండగా.. ఇంకొందరు ప్రత్యక్ష రాజకీయాల నుంచే నిష్క్రమిస్తున్నారు. ప్రజాతీర్పును జగన్ ఆమోదించకపోవడం.. కొత్త ప్రభుత్వం కుదురుకోక ముందే అనవసర విమర్శలు చేయడం.. శవరాజకీయాలు, శాంతిభద్రతలు క్షీణించాయంటూ గగ్గోలు పెడుతుండడం వంటివి చాలామందికి మింగుడుపడడం లేదు. ఆయనిక మారరని

మిగతా 11వ పేజీలో...



వైసీపీకి ఆళ్ల నాని గుడ్‌బై

ఏలూరు జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా
అసెంబ్లీ ఇన్‌చార్జిగా కూడా.. ప్రత్యక్ష రాజకీయాల్లోనే ఉండనంటూ జగన్‌కు లేఖ
అధినేతకు అత్యంత సన్నిహితుడు
పార్టీ పెట్టినప్పటి నుంచీ ఆయన వెంటే



సీఎం చంద్రబాబుతో 'అపోలో' ప్రీతారెడ్డి, సంగీతా రెడ్డి


ఏపీలో అపోలో సేవల విస్తరణ

11

అపోలో వర్సిటీ పరిధి పెంచేందుకు సహకరించండి
సీఎం చంద్రబాబుకు అపోలో యాజమాన్యం విజ్ఞప్తి
సీఎంను కలిసిన ప్రతినిధులు ప్రీతారెడ్డి, సంగీతా రెడ్డి

రాష్ట్రం మీదుగా కొత్త రైల్వే లైన్

ఏపీ, తెలంగాణ, ఒడిశాలో 173.63 కి.మీ.మార్గం
మల్కాన్‌గిరి నుంచి భద్రాద్రి కొత్తగూడెం మీదుగా పాండురంగాపురం వరకు..
అల్లూరి జిల్లాలోని ఎటపాక, కోనవరాన్ని కలుపుతున్న లైన్ 2
దీనితోపాటు మరో ఏడు ప్రాజెక్టులకు రూ.24,657 కోట్లు
ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ ఆమోదం



అంబేడ్కర్ విగ్రహం కింది భాగంలో తొలగించిన జగన్ పేరు

రాజ్యాంగ శిల్పి పేరుతో రాతోన్మాదం!

అంబేడ్కర్‌కు అపచారమంటూ జగన్ పత్రిక రాతలు
విజయవాడలో 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహం
రాజ్యాంగ నిర్మాత పేరుతో సమానంగా జగన్ పేరు
'విగ్రహ ఆవిష్కర్త' అంటూ ఆర్భాటం 11
జగన్ పేరు తొలగించిన ఆగంతకులు

సీఐడీ రిటైర్డ్ ఏఎస్పీ విజయ్‌పాల్‌కు షాక్

ముందస్తు బెయిల్‌కు హైకోర్టు నో



బెయిల్ ఇవ్వరాదన్న వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి
కస్టడీలో రఘురామకృష్ణరాజును తీవ్ర చిత్రహింసలకు గురిచేశారు
గాయాలైనట్లు సుప్రీంకోర్టు పేర్కొంది
టార్చర్ వెనుక ఎవరున్నారో తేలాలి
ముందస్తు బెయిలిస్తే దర్యాప్తుపై ఎఫెక్ట్
పోలీసుల తరఫున లూథ్రా వాదనలు
ఇది మూడేళ్లనాటి కేసు.. గాయాలూ లేవు
పాల్ తరఫున న్యాయవాది వాదనలు
కౌంటర్ దాఖలుకు పోలీసులకు ఆదేశం

12

మొదటి దశతో ఆపేద్దామనుకున్నాం

11

సీఎంగా చంద్రబాబు వచ్చారు.. విస్తరణకు వెళ్తాం
నాడు ఆయనే శంకుస్థాపన చేశారు



అక్టోబరు 25న బాబు చేతుల మీదుగా స్టీల్ ఉత్పత్తికి శ్రీకారం చుడతాం
జైరాజ్ ఇస్పాత్ ఎండీ గోయంకా



2

మేం అస్థిరపడితే మీకు ముప్పు!


ఈశాన్య భారతం, బెంగాల్‌పై తీవ్ర ప్రభావం.. భారత్‌కు బంగ్లా తాత్కాలిక ప్రభుత్వాధినేత యూనస్ హెచ్చరిక

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో

క్రీమీ లేయర్‌కు నో!

కేంద్ర కేబినెట్ నిర్ణయం

సుప్రీంకోర్టు సూచనలపై విస్తృతంగా చర్చించాం
అంబేడ్కర్ రాజ్యాంగంలో క్రీమీలేయర్ నిబంధన లేదు
ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లన్నీ రాజ్యాంగం ప్రకారమే: వైష్ణవ్
ఆవాస్ యోజన కింద మరో మూడు కోట్ల ఇళ్లు



ఏం ధరించాలో ఎలా చెబుతారు?

హిజాబ్‌పైనే నిషేధమా? బొట్టు, తిలకానికీ వర్తిస్తుందా?
2 పేర్లతో మతం వెల్లడవటం లేదా?
ఇలాంటి నిర్ణయాలతో మహిళా సాధికారత ఎలా?
హిజాబ్‌పై నిషేధం విధించిన ముంబై కాలేజీని నిలదీసిన సుప్రీంకోర్టు.. స్టే విధింపు

దక్షిణాది భాషలు ఏకతాటిపైకి రావాలి

బుక్ బ్రహ్మ సాహిత్య ఉత్సవ్‌లో వక్తలు.. పాల్గొన్న 450 మంది రచయితలు



కార్యక్రమంలో ప్రసంగిస్తున్న జయమోహన్

బెంగళూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): భిన్నత్వంలో ఏకత్వంలా ప్రతి భాషకు తనదైన గుర్తింపు ఉందని, దక్షిణాది భాషలను ఏకతాటిపైకి రావాల్సిన అవసరం వచ్చిందని ప్రముఖ సాహితీవేత్తలు అభిప్రాయపడ్డారు. బుక్ బ్రహ్మ సాహిత్య ఉత్సవ్ (బీబీఎల్ఎఫ్)-2024ను ఏర్పాటు చేయడం హర్షణీయమని కొనియాడారు. బెంగళూరు కోరమంగళలోని సెయింట్‌జాన్స్ ఆడిటోరియంలో మూడు రోజుల ఉత్సవానికి శుక్రవారం శ్రీకారం చుట్టారు. ముఖ్య అతిథులుగా సాహితీవేత్తలు సచ్చిదానందన్, హెచ్ఎస్ శివప్రకాశ్, ఓల్గా, వివేక్ శాన్‌భోగ్, జయమోహన్ పాల్గొన్నారు. బుక్ బ్రహ్మ ఉత్సవ్ డైరెక్టర్ సతీశ్ చప్పరికె స్వాగతోపన్యాసం చేస్తూ.. 450 మంది రచయితలు, 250కి పైగా సబ్జెక్ట్ ఎక్స్‌పర్ట్స్, ఐదు రాష్ట్రాల నుంచి వందకుపైగా పబ్లికేషన్స్, 120 మంది కళాకారులు ఈ ఉత్సవాల్లో పాల్గొంటున్నారని తెలిపారు. విభిన్న భాషలకు చెందిన పుస్తకాల కోసం 60కు పైగా స్టాల్స్ ఏర్పాటు చేశామని తెలిపారు. దక్షిణాదిన కన్నడ, తమిళ, మళయాళ, తెలుగు భాషలకు వేల సంవత్సరాల చరిత్ర ఉందని సచ్చిదానందన్ అన్నారు. ఈ భాషల సాహిత్యం జనానికి మరింత దగ్గర చేసేలా ఒకే వేదిక ఏర్పాటు కావడం సంతోషకరమని అన్నారు. కన్నడలో వచన సాహిత్యం నేటికీ కొనసాగుతోందని తెలిపారు. కేరళలో కథాకళి, తెలుగులో బుర్రకథ.. ఇలా భిన్నమైనవి మన సంస్కృతిని చాటుతున్నాయని తెలిపారు. రానున్న రోజుల్లో తుళు, బ్యారి, గిరిజన భాషలు కూడా ఇలాంటి వేదికల్లో పాలుపంచుకునే అవకాశం ఉందని తెలిపారు. హెచ్ఎస్ శివప్రకాశ్ మాట్లాడుతూ సుమారు 8వ శతాబ్దంలో కన్నడ కవితలకు గుర్తింపు వచ్చిందని అన్నారు. కన్నడలో ఆదికవిగా పేరొందిన పంప రచనలను ప్రస్తావించారు. తమిళంలో రాసిన తిరుప్పావై పాశురాలు భక్తికి మోక్షానికి మార్గంగా ఉన్నాయని వివరించారు. ప్రస్తుతం డిజిటల్ యుగంలో సోషల్ మీడియా ద్వారా ఎవరైనా తమ భావాలను వ్యక్తం చేసే అవకాశం లభిస్తోందని అన్నారు. వందేళ్ల క్రితం మద్రాస్ కేంద్రంగా ప్రచురణలు సాగేవని ఓల్గా అన్నారు. అందుకే తెలుగు, తమిళ సాహితీవేత్తలు, రచయితలు అక్కడే ఎక్కువగా ఉండేవారని అన్నారు. అప్పట్లో బ్రహ్మ సమాజం కొంతమేర సాహిత్యాన్ని ప్రోత్సహించేదని అన్నారు. బెంగాలీ నుంచి తెలుగు అనువాదం ఉండేదని అన్నారు. 1960 దశకంలో రష్యన్, అమెరికన్, బ్రిటీష్ భాషల నుంచి తెలుగులోకి అనువాదాలు జరిగాయని చెప్పారు. చలం, శ్రీశ్రీ, కృష్ణశాస్త్రి వంటి వారు సమకాలీనులు కావడంతో అప్పట్లో సాహిత్యాన్ని తమ అభిరుచి మేరకు నాటకాలు, సంగీతం ద్వారా కూడా చాటారని అన్నారు. ప్రస్తుతం కాస్మోపాలిటన్ నగరాలలో నాలుగు ప్రధాన భాషలైన తెలుగు, కన్నడ, తమిళ, మళయాళ సాహిత్యం ఎలా ఉందనేది ఈ వేదిక ద్వారా చర్చించనున్నట్టు తెలిపారు. మాతృభాష ఏదైనా, పలు కారణాలతో పొరుగు రాష్ట్రాల్లో స్థిరపడిన కారణంగా అక్కడి భాషపై మక్కువతో సాహిత్యంలో రాణించినవారు ఎందరో ఉన్నారని జయమోహన్ అన్నారు. అందులో తానొకడినని.. మళయాళం మాతృభాష అయినా తమిళంలో రాణించినట్టు తెలిపారు. గ్రామీణ ప్రాంతాల వారితో పోలిస్తే పట్టణాలు, నగరాల వారిలో సాహితీ అభిలాష తక్కువేనని వివేక్‌శాన్‌భోగ్ అన్నారు. డిజిటలీకరణతో భావాలు వ్యక్తం చేసే అవకాశం చాలా తగ్గిందని అభిప్రాయపడ్డారు. మరో వేదికపై ప్రముఖ కవి హంపా నాగరాజయ్య నేతృత్వంలో పాలి-కన్నడ శబ్దకోశ పుస్తకాన్ని ఆవిష్కరించారు.



ఏపీలో అరాచకాలు, రెడ్‌బుక్ పాలన సాగుతోంది: జగన్

సిసోడియాకు బెయిల్

» 17 నెలల తర్వాత ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎంకు ఊరట



సిసోడియాకు కుటుంబసభ్యుల స్వాగతం

న్యూఢిల్లీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మద్యం కుంభకోణం కేసులో ఢిల్లీ మాజీ డిప్యూటీ సీఎం మనీశ్ సిసోడియాకు ఎట్టకేలకు బెయిలు లభించింది. 17 నెలలుగా తిహాడ్ జైల్లో ఉన్న ఆయనకు సుప్రీంకోర్టు శుక్రవారం బెయిలు మంజూరు చేసింది. ఈ సందర్భంగా జస్టిస్ బీఆర్ గవాయ్, జస్టిస్ కేవీ విశ్వనాథన్‌ల ధర్మాసనం తీవ్ర వ్యాఖ్యలు చేసింది. విచారణ ఎప్పుడు ప్రారంభమవుతుందో తెలియని పరిస్థితుల్లో సిసోడియాను శాశ్వతంగా జైల్లో ఉంచలేమని, ఇది ఆయన ప్రాథమిక హక్కులకు భంగకరమని స్పష్టం చేసింది. జైల్లో పెట్టడం కంటే బెయిల్ ఇవ్వడం కనీస న్యాయసూత్రం అని పేర్కొంది. బెయిల్ ఇవ్వకుండా నెలల తరబడి సాగదీయడం శిక్షగా పరిణమించకూడదంటూ దిగువ కోర్టు, హైకోర్టులను సుప్రీం ధర్మాసనం మందలించింది. బెయిల్ అనేది నిబంధన, జైలు అనేది మినహాయింపు కావాలని జస్టిస్ గవాయ్ అన్నారు. విచారణ వేగంగా జరగడం నిందితుడి హక్కు అని ధర్మాసనం స్పష్టం చేసింది. సిసోడియాపై దర్యాప్తు ఎప్పుడు పూర్తవుతుందని అదనపు సొలిసిటర్ జనరల్ ఎస్వీ రాజును ప్రశ్నించగా.. కేసులో చార్జిషీటు దాఖలైన నెల రోజుల్లో విచారణ ప్రారంభమవుతుందని చెప్పారు. కేసు విచారణలో జాప్యానికి నిందితులే కారణమని, వారిని విడుదల చేస్తే సాక్ష్యాలను తారుమారు చేస్తారని తెలిపారు. సాక్ష్యాలన్నీ డాక్యుమెంట్లలోనే ఉన్నప్పుడు, వాటిని ఎలా తారుమారు చేస్తారని ధర్మాసనం ప్రశ్నించింది. సాక్ష్యాలను తారుమారు చేస్తే మళ్లీ జైలుకు వెళ్లాల్సి ఉంటుందని సిసోడియాను హెచ్చరించింది. సిసోడియా సచివాలయానికి వెళ్లకుండా ఆదేశాలు జారీ చేయాలన్న ఈడీ, సీబీఐ అభ్యర్థనను తిరస్కరించింది. మనీలాండరింగ్ కేసులో ఆయనపై విచారణలో మితిమీరిన జాప్యమే ఈ బెయిల్ ఇచ్చేందుకు కారణమని ధర్మాసనం తెలిపింది. 2023 ఫిబ్రవరి 26న సిసోడియాను సీబీఐ అరెస్టు చేయగా, ఆ తర్వాత రెండు వారాలకు ఈడీ కూడా అరెస్టు చేసింది. ఈ రెండు కేసుల్లోనూ ఆయనకు బెయిల్ మంజూరు చేసింది. రూ.10లక్షల పూచీకత్తు సమర్పించాలని, పాస్‌పోర్టును దర్యాప్తు అధికారులకు అప్పగించాలని, ఢిల్లీ వదిలి వెళ్లరాదని, ప్రతి సోమ, గురువారాల్లో రెండుసార్లు పోలీస్‌స్టేషన్‌కు హాజరు కావాలని సిసోడియాకు షరతులు విధించింది. శుక్రవారం సాయంత్రం సిసోడియా జైలు నుంచి విడుదలయ్యారు. రాజ్యాంగం కల్పించిన హక్కుల వల్లే ఈ న్యాయపోరాటంలో గెలిచామని సిసోడియా అన్నారు. సిసోడియాకు బెయిలు ఇవ్వడంతో ఇదే కేసులో అరెస్టయి జైల్లో ఉన్న ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితకు కూడా బెయిల్ వచ్చే అవకాశాలు ఉన్నాయని న్యాయ నిపుణులు చెబుతున్నారు.

మేం అస్థిరపడితే మీకు ముప్పు!

తాత్కాలిక ప్రభుత్వాధినేత యూనస్ హెచ్చరిక



సీతల్‌కుచీ సరిహద్దు కంచెకు ఆవల బంగ్లాదేశీయులు

» మా శత్రువుకు ఆశ్రయమిస్తే భారత్‌తో కలిసి పనిచేయలేం: బీఎన్‌పీ

ఢాకా/న్యూ, ఆగస్టు 9: షేక్ హసీనా రాజీనామా దరిమిలా విచ్చలవిడి హింసాకాండతో బంగ్లాదేశ్‌లో అస్థిరత నెలకొంటే ఈశాన్య భారతం, పశ్చిమ బెంగాల్ తీవ్రంగా ప్రభావితమవుతాయని తాత్కాలిక ప్రభుత్వాధినేత మహమ్మద్ యూనస్ హెచ్చరించారు. మయన్మార్ కూడా ఇందుకు మినహాయింపు కాదన్నారు. అటు హసీనాకు ఆశ్రయమిచ్చినందుకు బంగ్లా ప్రతిపక్ష పార్టీ బంగ్లాదేశ్ నేషనలిస్ట్ పార్టీ (బీఎన్‌పీ) కూడా భారత్‌కు వార్నింగ్ ఇచ్చింది. తమ శత్రువుకు ఆశ్రయమిస్తే భారత్-బంగ్లా మధ్య పరస్పర సహకారం కష్టమవుతుందని స్పష్టం చేసింది. గురువారం ప్రభుత్వ ప్రధాన సలహాదారు(ప్రధానికి ఉండే అధికారాలతో)గా బాధ్యతలు చేపట్టేముందు యూనస్ ఎన్‌డీటీవీ చానల్‌కు ఇంటర్వ్యూ ఇచ్చారు. దేశంలో శాంతిభద్రతల స్థాపనే తన ప్రథమ కర్తవ్యమని స్పష్టం చేశారు. హసీనా పాలనలో చాలా ఏళ్లుగా శాంతిభద్రతలు లోపించాయని ఆరోపించారు. ఆ కారణంగానే ఆమె రాజీనామా చేయాలన్న డిమాండ్ పెద్దదైందని.. చివరకు వైదొలగక తప్పలేదని అన్నారు. దీంతో బంగ్లా ప్రజలు పండుగ చేసుకుంటున్నారని.. ఈ ఆనందోత్సాహాలే దేశంలో అస్థిరతను సృష్టించాయని.. త్వరలోనే సుస్థిరత నెలకొంటుందని ఆశాభావం వ్యక్తంచేశారు. అస్థిరతకు ప్రజాస్వామ్యమే ఔషధమని గుర్తెరగాలన్నారు. బంగ్లాలో ఉగ్రవాదం, ఇస్లామిక్ ఛాందసవాద కార్యకలాపాలు, హసీనా తండ్రి, బంగ్లా జాతిపిత షేక్ ముజిబుర్ రహమాన్ విగ్రహాన్ని కూల్చడం గురించి ప్రశ్నించగా.. ఈ ఘటనలకు హసీనాయే బాధ్యురాలని ఆయన ఆరోపించారు. ముజిబుర్ రహమాన్ ప్రతిష్ఠను ఆమె మసకబార్చారని ఆరోపించారు. దేశంలో అసలైన ప్రజాస్వామ్యం నెలకొంటే మైనారిటీలు సురక్షితంగా ఉంటారని చెప్పారు. ఇంకోవైపు.. హసీనాకు భారత్ మద్దతివ్వడంపై బీఎన్‌పీ సీనియర్ నేత గయేశ్వర్ రాయ్ తీవ్ర అసంతృప్తి వ్యక్తంచేశారు. బంగ్లాలోని ఒక పార్టీకి మద్దతివ్వడం కాకుండా యావద్దేశానికి ఇండియా మద్దతివ్వాలని కోరారు. రెండు దేశాల ప్రజల నడుమ ఎలాంటి సమస్యలూ లేవు. కానీ భారత్ మొత్తం బంగ్లాదేశ్‌ను కాకుండా ఒక్క పార్టీనే ప్రోత్సహించడం సబబా' అని ప్రశ్నించారు. తమ పార్టీ హిందువుల వ్యతిరేకి కాదన్నారు. తాము స్వాతంత్ర్యం సంపాదించేందుకు ఇండియా తోడ్పడిందని.. ఆ దేశానికి వ్యతిరేకంగా వ్యవహరించే అవకాశమే లేదని స్పష్టంచేశారు. కాగా.. బంగ్లాలో జాతివ్యతిరేక, మతపరమైన దాడులకు, హింసాకాండకు తాము వ్యతిరేకమని ఐరాస తెలిపింది.

బంగ్లాతో సరిహద్దు పర్యవేక్షణకు కమిటీ

బంగ్లాదేశ్‌లో హిందువులపై ప్రాణాంతక దాడులు, ఆస్తుల లూటీ, ధ్వంసం నేపథ్యంలో ఆ దేశ ప్రజలు భారీ సంఖ్యలో భారత్‌లోకి ప్రవేశించేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నారు. వారు రాకుండా సరిహద్దు భద్రతా దళం (బీఎస్ఎఫ్) అడ్డుకుంటోంది. ఈ నేపథ్యంలో సరిహద్దు భద్రతను, బంగ్లాలోని భారతీయులు, హిందువులు, ఇతర వర్గాల భద్రతను పర్యవేక్షించేందుకు ప్రధాని మోదీ ఓ కమిటీని నియమించారని కేంద్ర హోం మంత్రి అమిత్‌షా వెల్లడించారు. ఈ కమిటీ బంగ్లా అధికారులతో నిరంతరం సంప్రదిస్తుంటుందని తెలిపారు. ఇదిలా ఉండగా, బంగ్లాదేశ్‌లో హిందువులపై హింసాత్మక దాడులు జరగడంపై ఆర్ఎస్ఎస్ తీవ్ర ఆందోళన వ్యక్తంచేసింది. అక్కడ హిందువులు, ఇతర మైనారిటీల భద్రతకు సాధ్యమైనంత కృషిచేయాలని సంఘ్ ప్రధాన కార్యదర్శి హోసబోలే శుక్రవారం మోదీ ప్రభుత్వాన్ని కోరారు.

బెంగాల్ సరిహద్దుల్లో వేల మంది బంగ్లాదేశీయులు!

కోల్‌కతా, ఆగస్టు 9: హింసాకాండతో అట్టుడుకుతున్న బంగ్లాదేశ్ నుంచి ప్రాణాలు అరచేత పట్టుకుని భారత్‌లోకి వచ్చేందుకు ప్రయత్నిస్తున్న వేలాది బంగ్లాదేశీయులను బీఎస్ఎఫ్ బలగాలు సరిహద్దులో అడ్డుకుంటున్నాయి. వీరిలో అత్యధికులు హిందువులు కావడం గమనార్హం. గత సోమవారం ఆ దేశప్రధాని షేక్ హసీనా రాజీనామా చేసినప్పటి నుంచి అక్కడ హిందువులు , బౌద్ధులు, ఇతర మైనారిటీలపై పెద్దఎత్తున దాడులు జరుగుతున్నాయి. వారి ఆస్తులు, వ్యాపారాలు ధ్వంసం చేస్తున్నారు. అవామీలీగ్ పార్టీకి చెందిన ఇద్దరు హిందూ నేతలు హత్యకు కూడా గురయ్యారు. ఈ నేపథ్యంలో ప్రాణభయంతో పలువురు భారత్ వచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. దీంతో సరిహద్దుల్లో బీఎస్ఎఫ్ బలగాలు భారీగా మోహరించాయి. శుక్రవారం బెంగాల్లోని కూచ్‌బిహార్ జిల్లా సీతల్‌కుచీ సరిహద్దు కంచె దూకి వచ్చేందుకు వెయ్యి మంది ప్రయత్నించగా భారత బలగాలు వమ్ముచేశాయి. సరిహద్దుకు సమీపంలో వారంతా సమావేశమై తమను భారత్‌కు రానివ్వాలని నినాదాలు చేశారు.

నీట్-పీజీ వాయిదాకు సుప్రీం నో

న్యూఢిల్లీ, ఆగస్టు 9: ఆదివారం జరగాల్సిన నీట్-పీజీ పరీక్షను వాయిదా వేయడానికి శుక్రవారం సుప్రీంకోర్టు నిరాకరించింది. పరీక్షలు రాయాల్సిన నగరాలను అభ్యర్థులకు ఇప్పటికే కేటాయించారని, చివరి నిమిషంలో వాయిదా వేస్తే చాలా అవస్థలు పడుతారని తెలిపింది. అయిదుగురు విద్యార్థుల కోసం 2లక్షల మంది భవిష్యత్తును ఇబ్బందుల్లోకి నెట్టలేమని సీజేఐ జస్టిస్ చంద్రచూడ్, జస్టిస్ పార్దీవాలా, జస్టిస్ మనోజ్‌మిశ్రాల ధర్మాసనం వ్యాఖ్యానించింది. "ఈ రోజుల్లో ప్రతి ఒక్కరూ వచ్చి పరీక్షలు వాయిదా వేయాలని అడుగుతున్నారు. ఇలాంటి పరీక్షను ఎలా వాయిదా వేస్తాం? ఒకవేళ వాయిదా వేస్తే 2లక్షల మంది విద్యార్థులు, 4లక్షల మంది తల్లిదండ్రులు కన్నీళ్లు పెట్టుకుంటారు" అని వ్యాఖ్యానించింది.

రాష్ట్రం మీదుగా కొత్త రైల్వే లైన్

న్యూఢిల్లీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రూ.24,657 కోట్ల విలువైన ఎనిమిది కొత్త ప్రాజెక్టులకు కేంద్ర ఆర్థిక వ్యవహారాల కేబినెట్ కమిటీ శుక్రవారం ఆమోదముద్ర వేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ సహా ఏడు రాష్ట్రాల్లో 900 కిలోమీటర్ల మేర ఈ ప్రాజెక్టులను చేపడతారు. ప్రధానమంత్రి గతిశక్తి మాస్టర్ ప్లాన్ లో భాగంగా ఈ నిర్ణయం తీసుకున్నారు. ఈ ప్రాజెక్టుల్లో భాగంగా 64 కొత్త స్టేషన్లను రూపొందిస్తారు. ఒడిశా (మల్కాన్ గిరి), ఆంధ్రప్రదేశ్ (అల్లూరి జిల్లా) తెలంగాణ (భద్రాద్రి కొత్తగూడెం జిల్లా) పరిధిలో మల్కాన్ గిరి-పాండురంగాపురం వయా భద్రాచలం మార్గంలో 173.63 కిలోమీటర్ల మేరకు కొత్త రైల్వే లైన్ ను నిర్మిస్తారు. అల్లూరి జిల్లా ఎటపాక, కూనవరాన్ని ఈ లైను కలుపుతుంది. కాగా, తాజాగా కేంద్రం ఆమోదించిన ప్రాజెక్టులన్నీ 2030-31 వరకు పూర్తవుతాయి. 40 లక్షల జనాభాతో కూడిన దాదాపు 510 గ్రామాల ప్రజలకు ప్రయోజనం లభిస్తుంది. వ్యవసాయ ఉత్పత్తులు, ఎరువులు, బొగ్గు, ఇనుప ఖనిజం, స్టీలు, సిమెంట్, బాక్సైట్, సున్నపురాయి, అల్యూమినియం పౌడర్, గ్రానైట్, బల్లాస్ట్ ,కంటైనర్లు వంటివి రవాణా చేసేందుకు ఈ మార్గాలు ఉపయోగపడతాయి.

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్‌కు నో

కేంద్ర క్యాబినెట్ నిర్ణయం

న్యూఢిల్లీ, ఆగస్టు 9: "డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ రచించిన రాజ్యాంగం ప్రకారం ఎస్సీ, ఎస్టీలకు కల్పించిన రిజర్వేషన్లలో క్రీమీలేయర్ నిబంధన లేదు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లకు సంబంధించి ఇటీవల సుప్రీం కోర్టు చేసిన నిర్దిష్టమైన సూచనలపై క్యాబినెట్‌లో పూర్తిస్థాయిలో చర్చించాం. మేధోమథనం తర్వాత.. రాజ్యాంగంలో ఉన్న నిబంధనలకే కట్టుబడి ఉండాలని ఎన్డీయే ప్రభుత్వం నిర్ణయించింది" అని కేంద్ర సమాచార, ప్రసార శాఖ మంత్రి అశ్వినీ వైష్ణవ్ వెల్లడించారు. ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన కేంద్ర క్యాబినెట్ సమావేశం శుక్రవారం ఢిల్లీలో జరిగింది. అనంతరం ఆ వివరాలను వైష్ణవ్ విలేకరులకు వివరించారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ నిబంధనలన్నీ రాజ్యాంగం ప్రకారమే ఉంటాయని పునరుద్ఘాటించారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్ల వర్గీకరణకు ఇటీవల సుప్రీం కోర్టు పచ్చజెండా ఊపిన సంగతి తెలిసిందే. రాష్ట్రాలు తమ పరిధిలో వర్గీకరణ చేసుకోవచ్చని తెలిపింది. అదే సమయంలో, ఎస్సీ, ఎస్టీల్లో క్రీమీలేయర్‌ను గుర్తించడానికి ఓ విధానాన్ని నిర్దేశించుకోవాలని, రిజర్వేషన్లలో నిజమైన సమానత్వం సాధించడానికి ఇదే మార్గమని కూడా వ్యాఖ్యానించింది. ఈ నేపథ్యంలో, క్యాబినెట్ సమావేశంలో విస్తృత స్థాయిలో చర్చించి.. రాజ్యాంగానికే కట్టుబడి ఉండాలని నిర్ణయించారు. తద్వారా, సుప్రీం కోర్టు సూచించినట్లు ఎస్సీ, ఎస్టీల్లో క్రీమీ లేయర్‌ను అమలు చేసేది లేదని తేల్చి చెప్పారు. అలాగే, ప్రధాన మంత్రి ఆవాస్ యోజన పథకం కింద మరో మూడు కోట్ల ఇళ్లను నిర్మించాలని మోదీ 3.0 తొలి క్యాబినెట్‌లో తీర్మానించిన విషయం తెలిసిందే. తాజా భేటీలో అందుకు ఆమోదం తెలిపింది. గ్రామీణ ప్రాంతాల్లో రెండు కోట్ల ఇళ్లను నిర్మించనుంది. ఇందుకు రూ.3 లక్షల కోట్లు ఖర్చవుతుంది. ఇందులో కేంద్రం రెండు లక్షల కోట్లు; రాష్ట్రాలు లక్ష కోట్లను ఖర్చు చేయనున్నాయి. అలాగే, పట్టణ ప్రాంతాల్లో కోటి ఇళ్లను నిర్మించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఇందుకు రాబోయే ఐదేళ్లలో రూ.10 లక్షల కోట్లను ఖర్చు చేయనుంది. కాగా, హార్టీకల్చర్ రంగాన్ని విప్లవాత్మకం చేయడంలో భాగంగా రూ.1766 కోట్లతో క్లీన్ ప్లాంట్ ప్రోగ్రామ్ (సీపీపీ) పథకానికి క్యాబినెట్ ఆమోదం తెలిపింది. పంటను, నాణ్యతను దెబ్బతీస్తున్న వైరస్ ఇన్ఫెక్షన్ల సమస్యను పరిష్కరించడమే దీని ధ్యేయమన్నారు.

మోదీ హామీ ఇచ్చారు

ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ విధానాన్ని అవలంభించాలని సూచిస్తూ ఇటీవల సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పుపై ఆయా వర్గాలకు చెందిన బీజేపీ ఎంపీలు అభ్యంతరం తెలిపారు. క్యాబినెట్ భేటీ కంటే ముందు వారు ప్రధాని మోదీని కలిసి ఆందోళన వ్యక్తం చేశారు. మోదీని కలిసిన బృందంలో ఉన్న బీజేపీ రాజ్యసభ సభ్యుడు సికిందర్ కుమార్ పార్లమెంటు ఆవరణలో మీడియాతో మాట్లాడారు. క్రీమీలేయర్‌ను ఎస్సీ ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్‌ను అమలు చేయబోమని ప్రధాని హామీ ఇచ్చారని వెల్లడించారు. ఎస్సీ, ఎస్టీ రిజర్వేషన్లలో క్రీమీలేయర్ విధానాన్ని తీసుకురావాలనేది ఒక జడ్జి సూచన మాత్రమేనని, అది మెజారిటీ తీర్పులో లేదని కేంద్ర మంత్రి అర్జున్ మేఘ్వాల్ తెలిపారు.

మాట నిలబెట్టుకున్న మోదీ: కృష్ణ మాదిగ


న్యూఢిల్లీ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ వర్గీకరణ అంశంలో ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఏకైక వ్యక్తి ప్రధాన మంత్రి మోదీ మాత్రమేనని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మంద కృష్ణ మాదిగ అన్నారు. ప్రధాని మోదీ, కేంద్ర హోం మంత్రి అమిత్ షాను ఆయన శుక్రవారం రాత్రి ఢిల్లీలో కలిశారు. ఎస్సీ వర్గీకరణకు సహకరించినందుకు ధన్యవాదాలు తెలిపారు. మంద కృష్ణను ఆప్యాయంగా పలకరించి హత్తుకున్న ప్రధాని శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ సందర్భంగా మంద కృష్ణ మాదిగ మాట్లాడుతూ.. తెలుగు రాష్ట్రాల్లో వర్గీకరణ త్వరితగతిన అమలు అయ్యేలా చూడాలని కోరారు. వర్గీకరణ అంశంపై కొందరు సుప్రీం కోర్టు వెళ్లే ఆలోచనలో ఉన్న నేపథ్యంలో ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కాకుండా చూడాలని అన్నారు.

ఏం ధరించాలో ఎలా చెబుతారు?

హిజాబ్‌పైనే నిషేధమా? బొట్టు, తిలకంకు కూడా వర్తిస్తుందా?

» పేర్ల ద్వారా మతం వెల్లడవటం లేదా?

» హిజాబ్, బుర్ఖాలపై నిషేధం విధించిన ముంబై కాలేజీని నిలదీసిన సుప్రీంకోర్టు



న్యూఢిల్లీ, ఆగస్టు 9: కళాశాలకు వచ్చే విద్యార్థులు 'హిజాబ్, బుర్ఖా, నఖాబ్, టోపీ' వంటివి ధరించవద్దంటూ ఓ ముంబై కాలేజీ విధించిన నిషేధాన్ని సుప్రీంకోర్టు నిలిపివేసింది. ఏ దుస్తులు ధరించాలో నిర్ణయించుకునే స్వేచ్ఛ విద్యార్థినులకు ఉందని స్పష్టం చేసింది. విచారణ సందర్భంగా జస్టిస్ సంజీవ్ ఖన్నా, జస్టిస్ సంజయ్‌కుమార్‌లతో కూడిన ధర్మాసనం పలు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ నిషేధం బొట్టు, తిలకంలకు కూడా వర్తిస్తుందా? అని ప్రశ్నించింది. 'ఏం ధరించాలో నిర్దేశించటం ద్వారా మహిళలను, విద్యార్థినులను ఏ విధంగా మీరు సాధికారిత వైపు తీసుకెళ్తారు' అని ప్రశ్నించింది. ఈ సందర్భంగా సదరు కళాశాల 'ఎన్‌జీ ఆచార్య, డీకే మరాఠే కాలేజీ' తరపు న్యాయవాది మాధవి దివాన్ వాదనలు వినిపిస్తూ, తమది కో-ఎడ్యుకేషన్ కాలేజీ అని, విద్యార్థులు ఏయే మతాలకు చెందినవారో వెల్లడి కాకూడదనే ఉద్దేశంతోనే ఈ ఆదేశాలు జారీ చేశామని చెప్పారు. దీనిపై జస్టిస్ సంజీవ్ ఖన్నా స్పందిస్తూ.. 'అలా అనుకుంటే విద్యార్థుల పేర్ల ద్వారానే వారు ఏ మతానికి చెందిన వారో తెలుస్తుంది కదా? ఇటువంటి నిర్ణయాలను వారిపై రుద్దకండి' అని పేర్కొన్నారు. జస్టిస్ సంజయ్‌కుమార్ కూడా దీనిపై స్పందిస్తూ.. 'స్వాతంత్ర్యం వచ్చిన ఇన్నేళ్ల తర్వాత దేశంలో పలు మతాలు ఉన్నాయని ఇప్పుడు మీరు గుర్తించటం దురదృష్టకరం. విద్యార్థినులు హిజాబ్ మొదలైన వాటిని ధరిస్తున్న విషయాన్ని ఇన్నేళ్ల తర్వాత ఇప్పుడే మీరు నిద్రలోంచి లేచినట్టుగా గుర్తించారు' అని పేర్కొన్నారు. కాలేజీ క్యాంపస్‌లో ఎవరూ హిజాబ్, టోపీ, బ్యాడ్జీలు ధరించవద్దంటూ జారీ చేసిన ఆదేశాలపై కోర్టు స్టే విధించింది. విచారణను నవంబరు 18కి వాయిదా వేసింది.

కొందరు కాలేజీకి రావటం మానేశారు!

పిటిషన్లు దాఖలు చేసిన విద్యార్థినుల తరపున వాదనలు వినిపించిన న్యాయవాదులు కొలిన్ గోంజాల్వెజ్, అబిహా జైదీ.. హిజాబ్‌పై నిషేధం వల్ల కొందరు విద్యార్థినులు కాలేజీకి వెళ్లటం మానుకున్నారని తెలిపారు. ఈ సందర్భంగా కాలేజీ తరపు లాయర్ వాదిస్తూ, కాలేజీకి వచ్చిన తర్వాత హిజాబ్, బుర్ఖాలను తీసి భద్రపర్చుకోవటానికి లాకర్ సదుపాయం కల్పించామని, కాలేజీలో ఉన్న 441 మంది ముస్లిం విద్యార్థినుల్లో పిటిషన్ వేసిన ముగ్గురికి తప్ప ఇతరులెవరికీ అభ్యంతరం లేదన్నారు.

విస్తృత ధర్మాసనం విచారణ?

కర్ణాటకలో గత బీజేపీ ప్రభుత్వం.. విద్యాసంస్థల్లో హిజాబ్‌ను నిషేధిస్తూ ఆదేశాలు జారీ చేయటం, దానిపై తీవ్ర వ్యతిరేకత వ్యక్తమైన విషయం తెలిసిందే. దీనిపై 2022 అక్టోబరు 13న సుప్రీంకోర్టు ద్విసభ్య ధర్మాసనంలో ఒక న్యాయమూర్తి అనుకూలంగా, మరో న్యాయమూర్తి వ్యతిరేకంగా తీర్పునిచ్చారు. దీంతో ఈ అంశంపై విస్తృత ధర్మాసనాన్ని ఏర్పాటు చేసే అంశం పెండింగ్‌లో ఉంది.

'గుడ్ మార్నింగ్' బదులు 'జైహింద్' అనండి

విద్యార్థులకు హరియాణా ప్రభుత్వం సూచన

చండీగఢ్, ఆగస్టు 9: స్వాతంత్ర్య దినోత్సవం ఆగస్టు 15 నుంచి అన్ని పాఠశాలల్లోని విద్యార్థులు.. టీచర్లకు తోటి స్నేహితులకు గుడ్ మార్నింగ్‌కు బదులుగా జైహింద్ చెప్పాలని హరియాణా ప్రభుత్వం నిర్ణయించింది. ఈ మేరకు గురువారం ఆ రాష్ట్రంలోని అన్ని జిల్లాలకు పాఠశాల విద్యా డైరెక్టరేట్ జీవో జారీ చేసింది. "ప్రతిరోజు జైహింద్ చెప్పడం వల్ల విద్యార్థులకు చిన్నప్పటి నుంచే దేశ భక్తి పెరుగుతుంది" అని జీవోలో పేర్కొంది.

రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోంది!

» ఊళ్లలో వ్యవస్థలను భ్రష్టు పట్టిస్తున్నారు.. లా అండ్ ఆర్డర్ నాశనం: జగన్

» నంద్యాల జిల్లాలో సుబ్బరాయుడి కుటుంబానికి పరామర్శ



నంద్యాలలో ఇటీవల చనిపోయిన సుబ్బారాయుడుకు నివాళులర్పిస్తున్న జగన్

నంద్యాల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం నడుస్తోందని మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ఆరోపించారు. సీఎం చంద్రబాబు, ఆయన కొడుకు లోకేశ్ రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నడిపిస్తుంటే.. నియోజకవర్గాల్లో ఎమ్మెల్యేలు, మండల, గ్రామ స్థాయిలో ఆయా నాయకులు సొంత రెడ్‌బుక్ రాజ్యాంగాన్ని నడిపిస్తూ ఊళ్లలో వ్యవస్థలను భ్రష్టుపట్టిస్తున్నారని విమర్శించారు. ఇక పోలీసుల సమక్షంలోనే లా అండ్ ఆర్డర్‌ను నాశనం చేస్తున్నారని అన్నారు. నంద్యాల జిల్లా మహానంది మండలం సీతారామాపురంలో ఈ నెల 3వ తేదీన హత్యకు గురైన వైసీపీ కార్యకర్త పసుపులేటి సుబ్బరాయుడి కుటుంబాన్ని జగన్ శుక్రవారం పరామర్శించారు. అతడి భార్య బాల సుబ్బమ్మతో మాట్లాడి ఘటన వివరాలు అడిగి తెలుసుకున్నారు. భయాందోళనలకు గురికావద్దని, కుటుంబానికి ఎల్లప్పుడూ అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. ఆ తర్వాత ఆయన విలేకరులతో మాట్లాడారు. రాష్ట్రంలో మారణహోమం సాగించేలా పాలన సాగుతోందన్నారు. చంద్రబాబు ప్రతి ఒక్క వర్గాన్నీ మోసం చేశాడని, ఎన్నికల వేళ తానిచ్చిన హామీలను ప్రజలు ప్రశ్నిస్తారనే.. రాష్ట్రవ్యాప్తంగా భయానక వాతావరణాన్ని సృష్టిస్తున్నారని ఆరోపించారు. తాను అధికారంలో ఉండి ఉంటే గతంలో అమలు చేసిన పథకాలన్నీ అందేవన్నారు. సీతారామాపురంలో ఆధిపత్యం కోసం.. వైసీపీ తరఫున ఎన్నికల్లో ఏజెంట్లుగా కూర్చున్న సుబ్బరాయుడి కుటుంబాన్నే కాకుండా.. పెద్దిరెడ్డి, పల్లం శేఖర్, జయనారపురెడ్డి కుటుంబాలనూ చంపాలని ఇదే గ్రామానికి చెందిన శ్రీనివాసరెడ్డి చూశారన్నారు. ఎస్సై సమక్షంలోనే మారణకాండ జరిగిందన్నారు. ఇంత గొడవ జరిగితే అదనపు పోలీసులు ఎందుకు రాలేదని ప్రశ్నించారు. ఈ ఘటనను హైకోర్టుకు, సుప్రీంకోర్టుకు తీసుకెళ్తామన్నారు. వైసీపీ ఏజెంట్లుగా కూర్చున వారికి పోలీసు రక్షణ కల్పించేలా న్యాయస్థానాల నుంచి ఉత్తర్వులు తీసుకొస్తామన్నారు. సుబ్బరాయుడిని హత్య చేసిన వారిపైనే కాకుండా.. చేయించిన వారిపైనా కేసులు పెట్టాలని డిమాండ్ చేశారు.

టీడీపీ మెడకు చుట్టే యత్నం..!

» సుబ్బరాయుడి హత్యలో ఆ పార్టీ హస్తం ఉందంటూ జగన్ గగ్గోలు

» తన హయాంలో ఎన్ని ఘోరాలు జరిగినా గప్‌చుప్

నంద్యాల, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మాజీ సీఎం వైఎస్ జగన్.. ఆర్థిక లావాదేవీల విషయంలో జరిగిన హత్యను టీడీపీపైకి నెట్టే యత్నం చేశారు. నంద్యాల జిల్లాలో జరిగిన వైసీపీ కార్యకర్త సుబ్బరాయుడి హత్య కేసులో టీడీపీ ప్రజాప్రతినిధుల హస్తం ఉందని ఆరోపించారు. అదే మండలంలో జరిగిన మరో అనుమానాస్పద మృతిని టీడీపీ చేసిన హత్యగా చిత్రీకరించే ప్రయత్నమూ చేశారు. సీతారామాపురంలో హత్యకు గురైన సుబ్బరాయుడు, ఈ కేసులో ప్రధాన నిందితుడైన బుడ్డారెడ్డి శ్రీనివాసరెడ్డి, జయనారపురెడ్డి మొదటి నుంచీ వైసీపీలో ఉండేవారు. వీరి మధ్య గతంలో భూములకు సంబంధించిన వ్యవహారాలు నడిచాయి. సుబ్బరాయుడికి చెందిన 15 సెంట్ల స్థలాన్ని శ్రీనివాసరెడ్డి తీసుకుని.. మరో చోట స్థలం ఇస్తానని చెప్పాడు. అయితే మూడేళ్లుగా స్థలం ఇవ్వకుండా దాటవేస్తున్నాడు. మరోచోట మూడు సెంట్ల స్థలాన్ని రూ.2 లక్షలకు సుబ్బరాయుడితో కొనుగోలు చేయించిన శ్రీనివాసరెడ్డి.. ఆ స్థలం కూడా ఎక్కడుందో చూపించకుండా ఇబ్బంది పెట్టేవాడన్న ప్రచారం ఉంది. ఈ విషయంలో పలుమార్లు వీరిద్దరి మధ్య గొడవలు జరిగినట్లు తెలుస్తోంది. ఈ గొడవలు ఇలా ఉండగానే.. ఎన్నికల సమయంలో శ్రీనివాసరెడ్డి టీడీపీలో చేరగా.. సుబ్బరాయుడు వైసీపీలోనే ఉన్నాడు. స్థలవివాదాన్ని మనసులో పెట్టుకున్న శ్రీనివాసరెడ్డి తన అనుచరులతో కలిసి సుబ్బరాయుడి ఇంటిపై దాడి చేసి అతడిని హత్య చేశాడు. అయితే జగన్ పూర్తిగా పక్కదారి పట్టించారు. అంతేకాదు.. జూన్ 26న ఇదే మండలం ఆర్ఎస్ గాజులపల్లెకు చెందిన జవ్వాజి దాసు (65) అనే వ్యక్తి మృతిని కూడా రాజకీయ లబ్ధికి వాడుకునే ప్రయత్నం చేశారు. ఈ కేసును అనుమానాస్పద మృతిగా నమోదు చేసుకుని పోలీసులు విచారిస్తున్నారు. ఇప్పటి వరకు ఎవరినీ నిందితులుగా చేర్చలేదు. జగన్ మాత్రం నిస్సిగ్గుగా టీడీపీ హస్తం ఉందని చెబుతున్నారని ఆ పార్టీ నేతలు ఆక్షేపిస్తున్నారు.

గత ఐదేళ్లలో జరిగిన దాడుల మాటేమిటి?

టీడీపీ కూటమి ప్రభుత్వంలో అరాచక పాలన సాగుతోందని గగ్గోలు పెడుతున్న జగన్.. తన హయాంలో నంద్యాల జిల్లాలోనే జరిగిన పలు ఘోరాలపై స్పందించలేదు. అబ్దుల్ సలాంను ఓ దొంగతనం విషయంలో వైసీపీ నేతల అండతో పోలీసులు వేధించారు. మనస్తాపం చెందిన సలాం తన భార్య, కుమార్తె, కుమారుడితో కలిసి 2020 నవంబరులో రైలు కిందపడి ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అయితే ఆ కుటుంబానికి చెందిన వారిని అప్పటి సీఎం జగన్ పలుకరించిన పాపాన పోలేదు. 2021లో ఉమ్మడి కర్నూలు జిల్లా పెసరవాయిలో టీడీపీకి చెందిన వడ్డు ప్రతాప్‌రెడ్డి సోదరులు వైసీపీ నేతల చేతిలో దారుణ హత్యకు గురయ్యారు. జగన్ కనీసం స్పందించలేదు. 2022లో కానిస్టేబుల్ సురేంద్ర హంతకులను కడప జైలుకు వెళ్లి మరీ అప్పటి నంద్యాల ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి కలిశారన్న ఆరోపణలు గట్టిగా వినిపించాయి. ఇదేమిటని ఆయన్ను జగన్ అడుగలేదు. తన హయాంలో జరిగిన ఘోరాలను విస్మరించి.. వ్యక్తిగత కారణాలతో జరిగిన హత్యలను టీడీపీ పైకి నెట్టడమే కాకుండా, కూటమి ప్రభుత్వం వచ్చాక ఆంధ్రలో 36 రాజకీయ హత్యలు జరిగాయంటూ జగన్ అసత్యాలు ప్రచారం చేస్తున్నారు.

సాగర్‌కు కొనసాగుతున్న వరద

» 26 గేట్ల ద్వారా నీటి విడుదల

» పులిచింతల, ప్రకాశం బ్యారేజీకి వరద తగ్గుముఖం

విజయవాడ (ఆంధ్రజ్యోతి), మాచర్ల రూరల్, ఆగస్టు 9: ఎగువన శ్రీశైలం నుంచి నాగార్జున సాగర్‌కు వరద కొనసాగుతోంది. దీంతో శుక్రవారం సాగర్ 26 గేట్ల ద్వారా నీటికి దిగువకు విడుదల చేస్తున్నారు. 22 క్రస్ట్‌గేట్లను 5 అడుగులు, 4 గేట్లను 10 అడుగుల మేర ఎత్తి 2,30,504 క్యూసెక్కులు దిగువకు విడుదల చేశారు. జలాశయం నీటి మట్టం 587.50 అడుగులుగా ఉంది. కుడి కాల్వ ద్వారా 8,680 క్యూసెక్కులు, ఎడమ కాల్వ ద్వారా 8,367, 26 క్రస్ట్ గేట్ల ద్వారా 2,30,504, ప్రధాన జలవిద్యుత్ కేంద్రం ద్వారా 29,029, ఎస్ఎల్‌బీసీ ద్వారా 1,800 మొత్తం 2,78,380 క్యూసెక్కుల నీరు విడుదల చేస్తున్నారు. శ్రీశైలం నుంచి సాగర్‌కు ఇన్‌ఫ్లో 3,11,491 క్యూసెక్కులు వస్తోంది. సాగర్ గేట్లు ఎత్తడంతో శుక్రవారం కూడా పర్యాటకులు పోటెత్తారు. దీంతో ఇక్కడి రహదారులు జనసంద్రంగా మారాయి. కాగా, పులిచింతల ప్రాజెక్టుతోపాటు ప్రకాశం బ్యారేజీకి వరద తగ్గుముఖం పడుతోంది. నాగార్జున సాగర్ నుంచి పులిచింతలకు 2,30,504 క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో 11 గేట్లను 2.5 మీటర్ల మేర ఎత్తి 2,42,748 క్యూసెక్కులు దిగువన ప్రకాశం బ్యారేజీకి విడుదల చేస్తున్నారు. ప్రకాశం బ్యారేజీకి ఎగువ నుంచి 2,66,107 క్యూసెక్కుల వరద వస్తోంది. దీంతో బ్యారేజీ 70 గేట్లలో 60 గేట్లను ఆరు అడుగులు, పది గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి 2,51,750 క్యూసెక్కుతు దిగువకు విడుదల చేస్తున్నారు.

'ఎత్తిపోతలున్నా' వలపోతలే!



కర్నూలు జిల్లా నందవరం మండలంలో గురురాఘవేంద్ర ప్రాజెక్టు చికలడోణ ఎత్తిపోతల పథకం



చిలకలడోణ ఎత్తిపోతల పథకం స్టేజ్-1 పంప్ హౌస్‌లో ప్యానల్ బోర్డులు పగులగొట్టి కాపర్ వైర్ దోచుకెళ్లిన దొంగలు

గురు రాఘవేంద్ర ఎత్తిపోతల పథకాల్లో విద్యుత్ పరికరాలు చోరీ

- తుంగభద్రలో నీళ్లున్నా పంపులు నడపలేని దుస్థితి
- 45,790 ఎకరాలకు సాగునీరు ప్రశ్నార్థకం
- రూ.10 కోట్లు ఖర్చు చేస్తేనే పంటలకు వీలు
- ప్రభుత్వం దృష్టి సారించాలని రైతుల వేడుకోలు

(కర్నూలు - ఆంధ్రజ్యోతి)

కర్నూలు జిల్లాలో గురురాఘవేంద్ర ప్రాజెక్టులోభాగంగా నాడు టీడీపీ ప్రభుత్వం నిర్మించిన ఎత్తిపోత పథకాలివి. తుంగభద్ర వరద జలాలు పరవళ్లు తొక్కుతూ, ప్రాజెక్టులు నిండిన వేళ, ఈ ఎత్తిపోతలు జలకళను సంతరించుకోవాల్సిన సమయమిది! అయితే, లిఫ్టుల పంప్‌హౌస్‌లను దొంగలు ధ్వంసం చేయడంతో చుక్కనీరు కూడా ఎత్తిపోయలేని పరిస్థితి. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం తెచ్చిపెట్టిన దుస్థితి ఇది! కొత్త ప్రభుత్వం వీటిపై దృష్టి పెట్టి అదును దాటకముందే మరమ్మతులు చేయించాలని రైతులు కోరుకుంటున్నారు. లేనిపక్షంలో... వేలాది ఎకరాలకు నీరందకుండా పోయే ప్రమాదముంది. నీళ్లున్నా కన్నీళ్లే మిగిలుతాయి. కర్నూలు జిల్లా మంత్రాలయం, ఎమ్మిగనూరు, కోడుమూరు నియోజకవర్గాల్లో రైతుల జలజీవనాడి గురురాఘవేంద్ర ఎత్తిపోతల ప్రాజెక్టులు. దాదాపుగా రూ.616 కోట్లకు పైగా ప్రజాధనం ఖర్చు చేసి నిర్మించిన గురురాఘవేంద్ర ఎత్తిపోతల పథకాల నిర్వహణను గత జగన్ ప్రభుత్వం గాలికి వదిలేసింది. పులికనుమ, పులకుర్తి లిఫ్టులు మినహా మిగిలిన వాటి వద్ద రాత్రి కాపలా, రక్షణ చర్యలు లేదు. ఇంజనీర్లు, లస్కర్లు ఆ లిఫ్టుల వైపు కన్నెత్తి కూడా చూడటం లేదు. దొంగలకు ఇది బాగా కలిసి వచ్చింది. లిఫ్టుల్లోని ట్రాన్స్‌ఫార్మర్లు, పానల్ బోర్డులు, స్టార్టర్లు ధ్వంసం చేసి కాపర్ వైర్, కాయిన్స్, ఆయిల్ దోచుకెళ్లారు. వాటి విలువ సుమారుగా రూ.10 కోట్లకుపైగా ఉంటుందని ప్రాథమిక అంచనా. మూగలదొడ్డి ఎత్తిపోతల పథకంలో మే నెలలో ధ్వంసం చేస్తే జూలైలో కేసు నమోదైంది.



మంత్రాలయం మండలంలో గురురాఘవేంద్ర ప్రాజెక్టు మాధవరం స్టేజ్-2 ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్‌లో దుండగులు ధ్వంసం చేసిన ప్యానల్ బోర్డులు

ధ్వంసం చేశారు.. దోచుకెళ్లారు

మంత్రాలయం మండలం మాధవరం స్టేజ్-1 పంప్‌హౌస్ తుంగభద్ర నది ఒడ్డునే ఉంది. తుంగభద్రకు వరద రావడంతో పంపులు ఆన్ చేద్దామని గత నెల 28న గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఇంజనీర్లు, లస్కరు అక్కడకువెళ్లారు. తలుపులు బద్దలై ఉండటం చూసి షాక్ అయ్యారు. లోపలికి వెళ్లి చూస్తే హెచ్‌టీ, హెల్‌టీ ప్యానల్ బోర్డులు, స్టార్టర్లు ధ్వంసమై ఉన్నాయి. పంప్‌హౌస్ పక్కనే ఉన్న 1000 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లనూ దండగులు ధ్వంసం చేశారు. కాపర్ వైర్, కాయిన్స్, పవర్ ఆయిల్ దోచుకెళ్లారు. మరమ్మతులకు కూడా పనికి రావని అంటున్నారు. వీటి విలువ దాదాపు రూ.2.15 కోట్లు ఉంటుందని అంచనా. పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ ఘటనతో మేల్కొన్న ఇంజనీర్లు మిగిలిన గురురాఘవేంద్ర ప్రాజెక్టు (జీఆర్‌పీ) లిఫ్టులను పరిశీలించారు. మూగలదొడ్డి, మాధవరం స్టేజ్-1, స్టేజ్-2, బసలదొడ్డి స్టేజ్-1, చిలకలడోణ స్టేజ్-1, స్టేజ్-2, సోగనూరు స్టేజ్-1, పులచింత స్టేజ్-1, స్టేజ్-2 ఎత్తిపోతల పథకాలు పంప్‌హౌస్ దగ్గర ఏర్పాటు చేసిన 1000 కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్లు 14 ధ్వంసం చేసినట్లు గుర్తించారు. మాధవరం స్టేజ్-1 లిఫ్ట్‌లో హెచ్‌టీ, ఎల్‌టీ ప్యానల్ బోర్డులు, స్టార్టర్లు, బలసదొడ్డి స్టేజ్-1 పంప్‌హౌస్‌లో ప్యానల్ బోర్డులు ధ్వంసం చేశారు. కడప జిల్లాకు చెందిన ఇంటిగ్రేటెడ్ ఇంజనీరింగ్ సంస్థ ఎండీ శివశంకర్‌రెడ్డి బుధవారం మూగలదొడ్డి లిఫ్ట్‌ను పరిశీలించారు. ధ్వంసం చేసిన ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతులకు పనికిరాదని, కొత్తది ఏర్పాటు చేయాలని జీఆర్‌పీ ఇంజనీర్లకు సూచించారు. దాదాపుగా రూ.36 లక్షలు ఖర్చు అవుతుందని అంచనా వేశారు. ఈ లెక్కన దొంగలు దోచుకెళ్లిన ట్రాన్స్‌ఫార్మర్లు, ప్యానల్ బోర్డుల మరమ్మతులకు దాదాపుగా రూ.5.50 కోట్లు అవసరమని అంచనా వేస్తున్నారు. క్షేత్రస్థాయిలో పరిశీలిస్తే ఇది పెరిగే అవకాశం ఉందంటున్నారు.

జగన్ నిర్లక్ష్యం.. రైతులకు శాపం

గత జగన్ ప్రభుత్వం ఐదేళ్లలో ఎత్తిపోతల పథకాల నిర్వహణకు నిధులు ఒక్కపైసా ఇవ్వలేదు. రూ.15 కోట్లు ఇవ్వాలని 2022 సెప్టెంబరులో ప్రతిపాదనలు పంపితే కనికరించలేదు. కొత్త ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక గల నెలలో మరోసారి ప్రతిపాదనలు పంపించారు. మరమ్మతులకు రూ.5.50 కోట్లు, ఓ అండ్ ఎం గ్రాంట్ రూ.15 కోట్లు ఇవ్వాలని కోరారు. ఒకవేళ ప్రభుత్వం నిధులు ఇచ్చినా పరిపాలన, టెక్నికల్ అనుమతులు, టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి పంపులు ఆన్ చేయాలంటే నెలన్నరకు పైగా పడుతుందని ఇంజనీర్లే అంటున్నారు. గురురాఘవేంద్ర ప్రాజెక్టు ఈఈ భాస్కర్‌రెడ్డి దృష్టికి 'ఆంధ్రజ్యోతి' తీసుకెళ్లగా, గత జూలై నెలలోనే ఈఈగా తాను బాధ్యతలు తీసుకున్నానని, అదే నెల 28న మాధవరం స్టేజ్-1 లిఫ్ట్ పంపులు ఆన్ చేద్దామని వెళితే ట్రాన్స్‌ఫార్మర్లు, ప్యానల్ బోర్డులు ధ్వంసమై కనిపించాయని అన్నారు. పోలీసులకు ఫిర్యాదు చేశానన్నారు.

స్వదేశానికి చేరుకున్న కోనసీమ మహిళ

- మంత్రి లోకేశ్ కృషితో అబుదాబీ నుంచి రాక



జ్యోతితో ఆమె భర్త చంద్రశేఖర్

కపిలేశ్వరపురం, ఆగస్టు 9: కోనసీమ జిల్లా కపిలేశ్వరపురం మండలం వీధివారిలంక గ్రామానికి చెందిన కాశీ జ్యోతి ఎట్టకేలకు అబుదాబీ నుంచి శుక్రవారం స్వదేశానికి చేరుకున్నారు. హైదరాబాద్‌కు చేరుకున్న జ్యోతిని భర్త చంద్రశేఖర్ స్వగ్రామం వీధివారిలంకకు తీసుకువచ్చారు. ఆర్థిక ఇబ్బందుల నేపథ్యంలో ఆమె 4 నెలల క్రితం పి.గన్నవరానికి చెందిన ఏజెంట్ ద్వారా అరబ్ షేక్ ఇంట్లో పనిచేయడానికి వెళ్లారు. అక్కడ సరైన వసతులు లేకపోవడంతో జ్యోతి అనారోగ్యానికి గురయ్యారు. అయినప్పటికీ యజమానులు పట్టించుకోకపోవడంతో ఆమె తన వేదనను సెల్ఫీ వీడియో ద్వారా తెలియజేశారు. ఈ విషయం మంత్రి నారా లోకేశ్ దృష్టికి వెళ్లడంతో ఆయన అబుదాబీలోని భారత రాయబార కార్యాలయం అధికారులతో చర్చించి ఆమెను స్వదేశానికి తరలించే ఏర్పాట్లు చేశారు.

ట్రిపుల్ ఐటీలో ముగిసిన రెండో విడత కౌన్సెలింగ్

వేంపల్లె, ఆగస్టు 9: రాష్ట్రంలో ఆర్జీయూకేటీ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఇడుపులపాయ, ఒంగోలు, నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో రెండో విడత కౌన్సెలింగ్ శుక్రవారం ముగిసింది. అడ్మిషన్ కౌన్సెలింగ్ కన్వీనర్ ప్రొఫెసర్ అమరేంద్రకుమార్ సంద్ర పర్యవేక్షణలో ఇడుపులపాయ క్యాంపస్‌లో ఇడుపులపాయ, ఒంగోలు క్యాంపస్‌లో చేరే విద్యార్థులు.. నూజివీడు క్యాంపస్‌లో నూజివీడు, శ్రీకాకుళం ట్రిపుల్ ఐటీల్లో చేరే విద్యార్థులకు కౌన్సెలింగ్ పూర్తిచేశారు. నాలుగు ట్రిపుల్ ఐటీల్లో 756 మందికి కాల్ లెటర్లు పంపగా 444 మంది హాజరై అడ్మిషన్ పొందారు. మిగిలిన 312సీట్లను భర్తీ చేసేందుకు త్వరలో విద్యార్థుల ఎంపిక జాబితా ప్రకటించి మూడో విడత కౌన్సెలింగ్ నిర్వహిస్తామని అమరేంద్రకుమార్ తెలిపారు. ప్రవేశం పొందిన విద్యార్థులు ఈ నెల 19, 20 తేదీల్లో ఆయా ట్రిపుల్ ఐటీల్లో రిపోర్టు చేయాల్సి ఉంది. 21వ తేదీ నుంచి తరగతులు ప్రారంభమవుతాయి.



కేరళ సీఎంకు విరాళం అందజేస్తున్న జి.శ్రీనివాసరావు

కేరళకు 'లిఖిత' అధినేత రూ.25 లక్షల విరాళం

అవనిగడ్డ, ఆగస్టు 9: వరద బీభత్సంతో తీవ్రంగా నష్టపోయిన కేరళలో సహాయ కార్యక్రమాల కోసం పారిశ్రామికవేత్త, లిఖిత ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ అధినేత, నాగాయలంక వాసి గడ్డిపాటి శ్రీనివాసరావు (జీఎస్ రావు) శుక్రవారం 25 లక్షల విరాళాన్ని ఆ రాష్ట్ర ప్రభుత్వానికి అందజేశారు. కేరళ ముఖ్యమంత్రి పినరయి విజయన్‌ను కలిసిన జి.ఎస్.రావు రూ.25 లక్షల చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడుతూ మానవతా దృక్పథంతో తన వంతు సాయంగా లిఖిత ఇన్‌ఫ్రా లిమిటెడ్ తరపున రూ.25 లక్షలు సాయమందించినట్టు చెప్పారు.



బాపట్ల జిల్లా కారంచేడులో శుక్రవారం రాత్రి జరిగిన హైకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ తాళ్లూరి సునీల్ చౌదరి కుమార్తె వివాహానికి ఆంధ్ర, తెలంగాణ హైకోర్టులకు చెందిన పలువురు న్యాయమూర్తులు హాజరయ్యారు. -కారంచేడు

'సహకార' స్కామ్‌లపై త్వరలో సమగ్ర విచారణ: అచ్చెన్న

అమరావతి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సహకార వ్యవస్థను బలోపేతం చేసే ప్రక్రియలో సహకార ఉద్యోగులు భాగస్వాములు కావాలని సహకార శాఖ మంత్రి అచ్చెన్నాయుడు కోరారు. శుక్రవారం విజయవాడలో ఏపీ సహకార కేంద్ర బ్యాంక్ ఉద్యోగుల అసోసియేషన్, తెలుగునాడు ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు మంత్రిని కలిశారు. కాగా, శుక్రవారం ప్రపంచ ఆదివాసీల దినోత్సవం సందర్భంగా గిరిపుత్రులకు మంత్రి శుభాకాంక్షలు తెలిపారు.

అచ్చెన్నా... విత్తన కొరత లేదని చెప్పగలరా?: షర్మిల

అమరావతి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): విత్తనాల కొరతపై వ్యవసాయ శాఖ మంత్రి అచ్చెన్నాయుడు ఇచ్చిన వివరణ తలాతోకాలేనిదని ఏపీసీసీ అధ్యక్షురాలు షర్మిల అసహనం వ్యక్తం చేశారు. 'సాగర్ కుడికాల్వ కింద రైతులకు విత్తన కొరత లేదని అచ్చెన్నాయుడు గుండెలమీద చేయివేసుకుని చెప్పగలరా? సంబంధిత శాఖా మంత్రిగా నేరుగా పరిస్థితిని చూసే మాట్లాడుతున్నారా? రైతులు అడిగింది ఎందుకు ఇవ్వరని ప్రశ్నించడం రెచ్చగొట్టడం ఎలా అవుతుంది?' అని మంత్రి షర్మిల అచ్చెన్నను ప్రశ్నించారు.



దువ్వాడ శ్రీనును నిలదీస్తున్న భార్య వాణీ, కుమార్తె హైందవి

దువ్వాడ వారి కుటుంబ కథా చిత్రం!

- పరువు రోడ్డున పడుతోందని ఎమ్మెల్సీ శ్రీనివాస్ భార్య, కుమార్తె ఆవేదన
- ఇంటికి వచ్చిన వాణిపై దాడికి శ్రీనివాస్ యత్నం
- మీడియా ముందుకు వచ్చిన దివ్వెల మాధురి
- స్నేహితుల్లా ఉంటున్నామని వెల్లడి

టెక్కలి/శ్రీకాకుళం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): వైసీపీ ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీనివాస్ వ్యవహారశైలిపై ఆయన భార్య, టెక్కలి జడ్పీటీసీ దువ్వాడ వాణి, పెద్దకుమార్తె డాక్టర్ హైందవి మీడియా ఎదుట ఆవేదన వ్యక్తం చేశారు. గురువారం అర్థరాత్రి వరకు శ్రీనివాస్ ఇంటి వద్ద ఆయన కుమార్తెలు నిరసన వ్యక్తం చేసిన విషయం విదితమే. ఈ నేపథ్యంలో శుక్రవారం టెక్కలిలో ఆయన భార్య, కుమార్తె మీడియాతో మాట్లాడారు. తన భర్త వివాహేతర సంబంధం కారణంగా తమ కుటుంబం పరువు రోడ్డున పడుతోందని వాణి ఆవేదన వ్యక్తం చేశారు. సుదీర్ఘ రాజకీయ చరిత్ర కలిగిన కుటుంబం నుంచి వచ్చిన తాను.. తన భర్త వేరే మహిళతో స్థానికంగా నివాసం ఉంటూ చేస్తున్న నిర్వాకంతో మథనపడుతున్నానన్నారు. తన భవిష్యత్తు ఎలా ఉన్నా పర్వాలేదని, తన కుమార్తెల భవిష్యత్తు కోసం ఆలోచిస్తే ఆందోళన కలుగుతోందని కన్నీటిపర్యంతమయ్యారు. తన భర్తపై పార్టీ అధిష్ఠానం చర్యలు తీసుకోవాలని వాణి కోరారు. హైందవి మాట్లాడుతూ తన తండ్రిని కలిసేందుకు గురువారం అర్ధరాత్రి 2 గంటల వరకు వేచి ఉన్నప్పటికీ స్పందన లేదన్నారు. ఆయన తమతోనే ఉండాలని, ఒక మహిళ కారణంగా కుటుంబసభ్యులకు దూరంగా ఉంటున్నారన్నారు. తమకు న్యాయం జరిగే వరకు పోరాడతామని స్పష్టం చేశారు. కాగా.. ఆరోపణలు ఎదుర్కొంటున్న దివ్వెల మాధురి కూడా శ్రీకాకుళంలో విలేకరులతో మాట్లాడారు. దువ్వాడ వాణి తనను ట్రాప్ చేసి రాజకీయ లబ్ధి కోసం వాడుకున్నారని ఆరోపించారు. శ్రీను తనను ఎప్పుడూ రాజకీయాల్లోకిగానీ.. ఇతర కార్యక్రమాల్లోకి పిలవలేదని తెలిపారు. పార్టీలో చురుగ్గా ఉండాలని.. వాణి పిలిచి మహిళా అధ్యక్ష పదవి ఇచ్చారనాన్నరు. వాణి చేస్తున్న ప్రచారం కారణంగానే తాము స్నేహితుల్లా ఉంటున్నామని తెలిపారు. మరోవైపు.. వాణి, కుమార్తెలు.. శుక్రవారం రాత్రి నేరుగా అక్కవరంలో ఉన్న శ్రీను ఇంటివద్దకు తాడోపేడో తేల్చుకునేందుకు వెళ్లారు. గేటు తొలగించుకొని తన భర్త నివాసిస్తున్న ఇంట్లోకి ప్రవేశించారు. అప్పటికే పోలీసు బలగాలు, దువ్వాడ శ్రీనివాస్‌తో పాటు ఆయన సోదరులు, అనుచరులు అక్కడకు చేరుకున్నారు. ఇక్కడి నుంచి వెళ్లిపోవాలని వాణిని గదమాయించారు. ఒకానొక సందర్భంలో సహనం కోల్పోయి భార్యను బూతులు తిడుతూ రాడ్డుతో కొట్టేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకున్నారు. తాను ఇక్కడి నుంచి వెళ్లేది లేదని, తన సంగతి, తన పిల్లల సంగతి తేల్చేంత వరకూ ఇక్కడే ఉంటామని వాణితో పాటు కుమార్తెలు శ్రీనివాస్‌కు బదులిచ్చారు. ఇది పలాస కాదని, తన సొంతం ప్రాంతం టెక్కలి అని, ఇటువంటి వ్యవహారాలు సరికాదని వాణి స్పష్టంచేశారు. పరిస్థితి ఉద్రిక్తంగా మారడంతో పోలీసులు కలుగజేసుకుని ఆమెను నిలువరించారు. శ్రీనివాస్ ఇంట్లోకి వెళ్లిపోయినా వాణితో పాటు కుమార్తెలు అక్కడే ఉన్నారు.

ఆంధ్రజ్యోతి
▲ తమసోమా జ్యోతిర్గమయ

ఎన్నికలతోనే కశ్మీర్‌కు న్యాయం

జమ్మూకశ్మీర్‌లో సాధ్యమైనంత త్వరలో అసెంబ్లీ ఎన్నికలు నిర్వహిస్తామని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్‌కుమార్ అన్నారు. ఇక్కడి రాజకీయపక్షాలన్నింటితో ఎన్నికల సంఘం బృందం భేటీ అయినప్పుడు, ఆ పార్టీలన్నీ ఏకకంఠంతో వెంటనే ఎన్నికలు జరగాలని డిమాండ్ చేశాయి. సీఈసీతో పాటు ఇద్దరు కమిషనర్లు కూడా ఈ పర్యటనలో ఎన్నికల నిర్వహణకు సంబంధించి ప్రభుత్వ ఉన్నతాధికారులతో, పోలీసు డైరెక్టర్ జనరల్‌తో భేటీ అయ్యారు. అన్ని పార్టీలూ తక్షణమే ఎన్నికలు జరగాలని అంటున్నాయనీ, సాధ్యమైనంత త్వరగా ఆ పనిచేస్తామన్న హామీకి తాము కట్టుబడివున్నామని సీఈసీ మీడియా సమావేశంలో వ్యాఖ్యానించారు. సెప్టెంబరు ముప్పైలోగా ఎన్నికలు జరిగిపోవాలంటూ సుప్రీంకోర్టు ఇచ్చిన ఆదేశాలను ఒమర్ అబ్దుల్లా మరోసారి గుర్తుచేస్తున్నారు. సెప్టెంబరులో ఎన్నికలు ఖాయమని మొన్ననే కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మరో కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథవాలే గురువారం శ్రీనగర్‌లో మీడియాతో మాట్లాడుతూ, అక్టోబర్‌లో రాష్ట్రహోదా పునరుద్ధరణతో పాటు, అసెంబ్లీ ఎన్నికలు కూడా జరుగుతాయనీ, మహారాష్ట్ర, హర్యాణా, జార్ఖండ్ రాష్ట్రాల అసెంబ్లీలతో పాటు వీటిని నిర్వహిస్తామన్నారు. ఏది నిజమో, ఏమి జరుగుతుందో తెలియదు కానీ, త్వరలో ఎన్నికలు అంటూ ఈసీ ఎంతో కాలంగా ఊరిస్తూండటంతో ఈ సరి కొత్త హామీ కూడా ఎక్కువమందిలో నమ్మకం కలిగించలేకపోతోంది.

ఎన్నికలు ఎప్పుడు జరుగుతాయో తెలియదు కానీ, ఏదో హడావుడి అయితే మొదలైంది. ఆర్టికల్ 370 రద్దుచేస్తున్నప్పుడే కేంద్ర హోంమంత్రి అమిత్ షా జమ్మూకశ్మీర్‌కు రాష్ట్రహోదా తిరిగి ఇచ్చేస్తామని, ఎన్నికలు కూడా జరిపేస్తామని హామీ ఇచ్చిన విషయాన్ని అక్కడ పర్యటించిన ప్రతీ కేంద్రమంత్రీ గుర్తుచేస్తున్నారు. అమిత్ షా ఆడిన మాట తప్పరని కూడా భరోసా ఇస్తున్నారు. ఈ నెల ఐదవ తేదీకి 370వ అధికరణను రద్దుచేసి ఐదేళ్ళవుతోంది. ప్రత్యేక ప్రతిపత్తిని పీకివేసి, రాష్ట్రాన్ని రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా మార్చేస్తున్నప్పుడు పాలకులు చాలా మాటలు చెప్పారు. ఉగ్రవాదానికి రక్షణకవచంగా ఉంటున్న ఈ అధికరణ తొలగింపుతో శాంతిసుస్థిరతలు వెల్లివిరుస్తాయనీ, మిగతా దేశంతో అసంపూర్తిగా జరిగిన జమ్మూకశ్మీర్ విలీనం ఇక పరిపూర్ణమవుతుందనీ అన్నారు. ఉగ్రవాదం నశించి, వేర్పాటువాదం బలహీనపడి, ఆర్థికవృద్ధి హెచ్చి నయా కశ్మీర్ అవతరిస్తుందన్నారు. 370 రద్దుతో మొత్తమే మారిపోయిందని ప్రధానితో పాటు చాలామంది బీజేపీ నాయకులు వాదిస్తున్నప్పటికీ, క్షేత్రస్థాయిలో అది ప్రతిఫలించడం లేదు. సుదీర్ఘకాలం తీవ్రనిర్బంధం అమల్లో ఉంటూ, సైనిక బలగం ఎంతో హెచ్చిన తరువాత అల్లర్లు, నిరసనలు ఆమాత్రం తగ్గుముఖం పట్టడం సహజం. ఉగ్రవాద ఘటనలు పెద్దగా తగ్గకపోగా, జమ్మూకు వ్యాపించడం మరింత భయపెడుతున్నది. దీనికితోడు ఈ ఐదేళ్ళకాలంలో ఆర్థికవృద్ధి మందగించిందనీ, ఉత్పత్తి పడిపోయిందని విశ్లేషణలు వెలువడుతున్నాయి. ప్రత్యేక ప్రతిపత్తి రద్దుకు ముందు కశ్మీర్ మాత్రమే రగిలిపోయేదని, ఇప్పుడు జమ్మూ, లద్దాఖ్ కూడా మండుతున్నాయన్న వ్యాఖ్యలో అసత్యమేమీ లేదు. ఐదేళ్ళక్రితం ప్రత్యేక ప్రతిపత్తి తొలగింపును స్వాగతించిన మిగతా ప్రాంతాలవారు ఇప్పుడు ఆ నిర్ణయం తమకు తీవ్ర నష్టం తెచ్చిందని బాధపడుతున్నారు.

జమ్మూకశ్మీర్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరిగి పదేళ్ళయింది. 2018లో రాష్ట్ర శాసనసభ రద్దయింది. 2019లో ఎన్నికలు జరగాల్సి ఉండగా, ఆగస్టులో ఆ రాష్ట్రం రెండు కేంద్రపాలిత ప్రాంతాలుగా మారిపోయింది. 2022లో డీలిమిటేషన్ ప్రక్రియ పూర్తయినా సరే, ఇప్పటివరకూ ఎన్నికలు జరపకపోవడానికి కారణాలు ఏమిటో తెలియదు. అత్యంత సమస్యాత్మకమైన పరిస్థితుల మధ్య 1996లో సైతం అక్కడ ఎన్నికలు నిర్వహించగలిగినప్పుడు, ఇప్పుడు ఎందుకు సాధ్యంకాదని నాయకులు అడుగుతున్నారు. ఎన్నికల నిర్వహణకు ఉగ్రవాదం అడ్డుకాబోదనీ, వరుస ఉగ్రవాద దాడులు తమను నిలువరించలేవనీ అటు ఎన్నికల సంఘం అధికారులు, ఇటు లెఫ్టినెంట్ గవర్నర్ ఎంతో గంభీరంగా చెబుతున్నారు. లెఫ్టినెంట్ గవర్నర్ ఏలుబడిలో అభివృద్ధి అద్భుతంగా ఉన్నదనీ, ప్రజలు మెచ్చుకుంటున్నారని బీజేపీ నాయకులు అంటున్నారు. మరి, ఎన్నికల నిర్వహణకు వారిని నిలువరిస్తున్నదేమిటో తెలియదు. రాష్ట్ర హోదాను పునరుద్ధరించిన తరువాతే ఎన్నికలు జరపాలని చాలామంది కోరిక. ఐదేళ్ళక్రితం చేసిన అన్యాయాన్ని సాధ్యమైనంత వేగంగా సరిదిద్దాల్సిన బాధ్యత కేంద్రప్రభుత్వం మీద ఉంది.

ప్రజాస్వామ్య లోటుతో బంగ్లా ప్రళయం

జూలై 4, 1776న పదమూడు అమెరికా రాష్ట్రాలు తమ స్వాతంత్ర్యాన్ని ప్రకటించుకున్నాయి. ఫ్రెంచ్ విప్లవం సంభవించి రెండు శతాబ్దాలకు పైగా గడిచిపోయింది. బ్రిటిష్ సామ్రాజ్యం నుంచి స్వేచ్ఛ పొందిన తొలి వలస రాజ్యం ఆస్ట్రేలియా (1901లో). భారత్ 1947లో స్వాతంత్ర్యాన్ని సాధించుకున్నది. అమెరికా, ఫ్రాన్స్, ఆస్ట్రేలియా ఇప్పటికీ స్వతంత్ర, ప్రజాస్వామిక దేశాలుగా వర్ధిల్లుతున్నాయి. వలస పాలనా శక్తుల (బ్రిటన్, ఫ్రాన్స్, బెల్జియం, పోర్చుగల్ మొదలైనవి) నుంచి విముక్తి పొందిన దేశాలన్నీ చిరకాలం నిజంగా 'స్వతంత్ర' దేశాలుగా లేవు. పలు దేశాల పౌరులు అందరూ పౌర స్వేచ్ఛా స్వాతంత్ర్యాలకు పూర్తిగా నోచుకోవడం లేదు. స్వేచ్ఛాయుత, నిష్పాక్షికమైన ఎన్నికలలో తాము కోరుకుంటున్న వారిని ఎన్నుకోలేని దుస్థితినెదుర్కొంటున్నారు. ఒక అంచనా ప్రకారం ప్రపంచ జనాభాలో కేవలం 20 శాతం మంది మాత్రమే నిజమైన స్వేచ్ఛా స్వాతంత్ర్యాలను పొందుతున్నారు. ప్రజాస్వామిక హక్కులను అనుభవిస్తున్నారు. ఆ అదృష్ట భాగ్య దేశాలలో భారత్ కూడా ఉన్నది. ఇది మనకు సంతోషకరమేకాదు, గర్వకారణం కూడా.



■ పి. చిదంబరం

'పళని' పలుకు

ప్రజాస్వామ్యం ఒకరు ఇచ్చేది కాదు. మరొకరి నుంచి స్వీకరించేదీ కాదు. ఆగస్టు 14, 1947న పాకిస్థాన్ స్వతంత్ర దేశంగా ప్రభవించింది. అయితే అనేకమార్లు సైనిక నియంతృత్వ పాలనలోకి వెళ్లింది. మన మరో పొరుగు దేశం (తొలుత పాకిస్థాన్‌లో ఒక రాష్ట్రంగా ఉన్న) బంగ్లాదేశ్ పాకిస్థాన్‌ను ఏలిన సైనిక ప్రభుత్వాల పద ఘట్టనలో దశాబ్దాల పాటు నలిగిపోయింది. సైనిక పాలకులపై తిరుగుబాటుగా గెరిల్లా ఉద్యమం ఆరంభమయింది. క్రమేణా బలోపేతమై విముక్తి పోరాటంగా పరిణమించింది. భారత్ జోక్యంతో 1971లో బంగ్లాదేశ్ స్వతంత్ర దేశంగా ఆవిర్భవించింది. 1975–91 సంవత్సరాల మధ్య పలువురు సైనిక పాలకులు వచ్చారు, పోయారు. ప్రధాన రాజకీయ పక్షాలు అవామీ లీగ్, బంగ్లాదేశ్ నేషనల్ పార్టీ (బిఎన్‌పి) కలసికట్టుగా సైనిక పాలకులను వ్యతిరేకించాయి. ప్రజాస్వామ్యం కోసం పోరాడాయి. 1991లో పౌర ప్రభుత్వం అధికారంలోకి వచ్చింది. అవామీ లీగ్ అధినేత్రి బేగం షేక్ హసీనా ప్రధానమంత్రిగా 1996లో ప్రప్రథమంగా ఎన్నికయ్యారు. ఆ తరువాత 2008, 2014, 2019, 2024లో ఆమె ప్రధానమంత్రిగా ఎన్నికవుతూ వచ్చారు. ఈ ఏడాది ఆరంభంలో జరిగిన ఎన్నికలను ప్రతిపక్షాలు బాయ్‌కాట్ చేశాయి.

షేక్ హసీనా నేతృత్వంలో బంగ్లాదేశ్ గణనీయమైన ఆర్థిక పురోగతిని సాధించింది. బంగ్లా తలసరి ఆదాయం భారత్ తలసరి ఆదాయం కంటే అధికం. శ్రీలంక, పాకిస్థాన్, నేపాల్ మొదలైన ఇతర దక్షిణాసియా దేశాల కంటే కూడా బంగ్లాదేశ్ ముందంజ వేసింది. మానవాభివృద్ధి సూచీలో బంగ్లాదేశ్, శ్రీలంక తరువాయి స్థానంలో ఉన్నది; భారత్, నేపాల్, పాకిస్థాన్ కంటే ఉన్నత స్థాయిలో ఉన్నది. బంగ్లాదేశ్‌లో శిశు మరణాల రేటు భారత్‌లో కంటే తక్కువగా నమోదవుతోంది. ఇదిలా ఉంటే ఎన్నికల నిర్వహణలో ఢాకా పాలకుల వ్యవహార శైలిని ఫ్రీడమ్ హౌజ్ నివేదిక తూర్పార బట్టింది. అలాగే పత్రికా స్వాతంత్ర్యం, న్యాయ వ్యవస్థ స్వతంత్రత, పౌరుల వ్యక్తిగత స్వేచ్ఛా స్వాతంత్ర్యాల విషయంలో కూడా బంగ్లా పాలకుల తీరుతెన్నులు అంతర్జాతీయ సంస్థల ఆమోదాన్ని పొందలేదు. ప్రజాస్వామ్య స్వేచ్ఛలను అదుపు చేస్తే లేదా నిరుద్యోగిత, అసమానతలు, వివక్షలపై ప్రజల అసంతృప్తి తగ్గితేనే ఆర్థికాభివృద్ధి సుసాధ్యమవుతుందని పాలకులు భావించడం కద్దు. అయితే ఇది చాలా చాలా అరుదుగా మాత్రమే నిజం. బంగ్లాదేశ్‌లో పాలకుల పట్ల ప్రజల వ్యతిరేకత మహోధృతంగా వెల్లువయింది. ప్రభుత్వోద్యోగాలలో వివక్షాపూరిత, ఆశ్రిత పక్షపాత రిజర్వేషన్ల విధానంతో విద్యార్థిలోకం ఆగ్రహావేశాలకు అవధులు లేకపోయాయి. ప్రజాస్వామ్య ప్రళయాగ్నులు ప్రజ్వరిల్లాయి.



ప్రజలు పూర్తిగా ఆశాభావాన్ని కోల్పోయినప్పుడే సామూహికోద్యమాలు ప్రజ్వరిల్లుతాయి. స్వేచ్ఛాయుత, న్యాయమైన ఎన్నికల ద్వారా ప్రభుత్వాన్ని మార్చివేసే మార్గం పూర్తిగా మూసుకుపోయినప్పుడు ప్రజల అసంతృప్తి, ఆగ్రహానికి అంతు ఉండదు. ప్రజాందోళనలు ఒకసారి ప్రారంభమయితే అందులో సామాన్య ప్రజలు మాత్రమే ఉండరు. తీవ్రవాద శక్తులు, ఉగ్రవాద బృందాలు కూడా పాల్గొంటాయి. బంగ్లాదేశ్‌లో ఇదే జరిగింది.

ఇదిలా వుండగా ఆర్థిక వ్యవస్థ పెరుగుదల మందగించింది. ధరలు పెరిగాయి. ఉద్యోగాలు మృగ్యమయ్యాయి. పరిస్థితులు విషమిస్తున్నాయన్న వాస్తవాన్ని షేక్ హసీనా గుర్తించలేదు. గుర్తించినా నిరాకరిస్తూ వచ్చింది. ఇది నియంతలు అందరూ చేసే తప్పే. రిజర్వేషన్ల విధానం ఆందోళనాగ్నులకు ఆజ్యం పోసింది. అవినీతి, పోలీసు క్రౌర్యాలు, న్యాయవ్యవస్థ ఉదాసీనత మొదలైనవి కూడా బంగ్లా ప్రజల ఆందోళనను మరింత తీవ్రం చేశాయి. పర్యవసానాలు సుపరిచితమైన కథే కదా. సకల జనులు వీధుల్లోకి వచ్చారు. పోటెత్తారు. పోరాటాల వెల్లువలకు అడ్డు లేకపోయింది. ఇటువంటి పరిణామాలు ప్రభుత్వాలను కూల్చివేయడం సహజమే.

ప్రజలు పూర్తిగా ఆశాభావాన్ని కోల్పోయినప్పుడే సామూహికోద్యమాలు ప్రజ్వరిల్లుతాయి. స్వేచ్ఛాయుత, న్యాయమైన ఎన్నికల ద్వారా ప్రభుత్వాన్ని మార్చివేసే మార్గం పూర్తిగా మూసుకుపోయినప్పుడు ప్రజల అసంతృప్తి, ఆగ్రహానికి అంతు ఉండదు. ప్రజాందోళనలు ఒకసారి ప్రారంభమయితే అందులో సామాన్య ప్రజలు మాత్రమే ఉండరు. తీవ్రవాద శక్తులు ఉగ్రవాద బృందాలు కూడా పాల్గొంటాయి బంగ్లాదేశ్‌లో ఇదే జరిగింది. వివిధ సంస్థలు, పలువురు వ్యక్తులు ఈ వాస్తవాన్ని ధ్రువీకరించారు. విదేశీ జాతీయులు, మైనారిటీ వర్గాలు ఉద్యమ తీవ్రతను చవిచూడడం అనివార్యమవుతుంది. అల్పసంఖ్యాక వర్గాల గృహాలపై దాడులు జరుగుతాయి. వారి వ్యాపార సంస్థలు, ఆరాధనా మందిరాలను ధ్వంసం చేస్తారు.

బంగ్లాదేశ్‌లో పరిస్థితులు అందుకు భిన్నమైనవి కావు. చాలా దేశాలలో అటువంటి ఉపద్రవాలలో మైనారిటీలు తీవ్ర ఇక్కట్లనే ఎదుర్కొన్నారు. కారణమేమిటి? ప్రజాస్వామ్య లోటు. దానివల్లే ప్రజలు వీధుల్లోకి వచ్చి తమ ఆగ్రహాన్ని వ్యక్తం చేయడం అనివార్యమవుతుంది. పరిష్కారమేమిటి? ప్రజాస్వామ్య లోటును పూరించడమే. ప్రజాస్వామ్య లోటును పూరించడమనే కళలో అమెరికా, బ్రిటన్‌లు దాదాపుగా సమగ్ర ప్రావీణ్యాన్ని, పరిణతిని సాధించాయి. పార్టీలోను, పార్లమెంటులోను, ప్రజలలోను అసంతృప్తి తీవ్రమయినప్పుడు బ్రిటిష్ ప్రధానమంత్రులు థాచర్, జాన్సన్, మే స్వచ్ఛందంగా పదవి నుంచి వైదొలిగి కొత్త నాయకుడిని ఎన్నుకొనే అవకాశాన్ని తమ పార్టీకి కల్పించారు. అమెరికా అధ్యక్షుడు లిండన్ బి జాన్సన్, జో బైడెన్‌లు అధ్యక్ష పదవికి మళ్లీ పోటీ చేసేందుకు నిరాకరించారు. జవాబుదారీతనాన్ని డిమాండ్ చేసి ప్రభుత్వాధినేతల రాజీనామాలు సాధించవచ్చు. పదవీకాల పరిమితులు కూడా చాలా ఉపయోగపడతాయి. పత్రికా స్వేచ్ఛ సంపూర్ణంగా ఉంటే పరిస్థితులను చక్కదిద్దడం మరింత తేలికవుతుంది సుప్రీంకోర్టు అప్రమత్తంగా ఉండి ప్రజాస్వామ్య కాపలాదారుగా వ్యవహరించడం వల్ల చాలా మేలు జరుగుతుంది. స్వతంత్ర ఎన్నికల సంఘం ప్రతి ఐదేళ్లకు ఒకసారి విధిగా ఎన్నికలను స్వేచ్ఛగా, నిష్పాక్షికంగా నిర్వహించడం వల్ల పేదలు, అణగారిన వర్గాలవారు, నిర్లక్ష్యానికి గురవుతున్న వారికి ఎంతైనా ఉపశమనం కలుగుతుంది. పార్లమెంటు ప్రతి నెలా విధిగా సమావేశమవుతూ సభాపతి అనవసర జోక్యం లేకుండా ప్రతి రోజూ అధికార, ప్రతిపక్షాల మధ్య వాద ప్రతివాదనలు అనుమతించడమే ప్రజాస్వామ్య లోటుకు అంతిమ సమాధానమని నేను భావిస్తున్నాను.

ప్రజాస్వామ్య లోటుకు బంగ్లాదేశ్ భారీ మూల్యాన్ని చెల్లించింది. ప్రజా ప్రళయాగ్నులలో ఆహుతి అయిన వారి కోసం నేను దుఃఖిస్తున్నాను.

(వ్యాసకర్త కేంద్ర మాజీ మంత్రి, కాంగ్రెస్ సీనియర్ నాయకులు)

కమ్యూనిస్టు చైనా గుట్టువిప్పిన 'నిప్పుకణాలు'!

'గతాన్ని ఎవరైతే నియంత్రిస్తారో వారే భవిష్యత్తునూ నియంత్రిస్తారు. వర్తమానాన్ని ఎవరైతే నియంత్రిస్తారో వారే గతాన్నీ నియంత్రిస్తారు'– జార్జి ఆర్వెల్ నవల '1984' లోని సుప్రసిద్ధ వాక్యాలవి. ఈ వ్యాఖ్యలు నియంత స్టాలిన్ కాలం నాటి రష్యాను ఉద్దేశించి చేసినవి. అయితే ఆర్వెల్ సుభాషితం పూర్తిగానో పాక్షికంగానో అధికార పక్షం, దాని అధినేత తమకు అనుకూలంగా ఉండే చరిత్ర కథనాలను వృద్ధులు, యువజనులు; స్త్రీ పురుషులు; ధనికులు, దరిద్రులు... జనాభాలో ప్రతి ఒక్కరిపై రుద్దేందుకు ప్రయత్నించే నిరంకుశ పాలనా వ్యవస్థలు అన్నిటికీ వర్తిస్తుంది.

సాపేక్షంగా బహిరంగ సమాజం (ఓపెన్ సొసైటీ)లో పాలకులకు ఆమోదయోగ్యమయ్యే ఏ ఒక్క తరహా చరిత్రను మొత్తం ప్రజలు అందరిపై రుద్దలేరు. ఉదాహరణకు అమెరికాలో రిపబ్లికన్లు అధికారంలో ఉన్నప్పుడు జాతి సంబంధాలు ఎలా ఉండేవో, ఎలా ఉండాలో అన్న విషయమై తమ దృక్పథాన్ని రుద్దడానికి ప్రయత్నించవచ్చు. అయితే జాతి సంబంధిత పరిణామాలను భిన్నంగా అర్థం చేసుకున్న వారు ఆ కథనాన్ని తీవ్రంగా వ్యతిరేకించడం, సవాల్ చేయడం తప్పక జరుగుతుంది. భారత్ లాంటి లోపభూయిష్టమైన లేదా పాక్షిక ప్రజాస్వామ్య వ్యవస్థలో కూడా గతాన్ని గురించి ప్రభుత్వ ప్రాయోజిత దృక్పథాలు, కథనాలపై తీవ్ర చర్చలు జరుగుతాయి. ఉదాహరణకు హిందూ–ముస్లిం సంబంధాలపై స్వాభిప్రాయబద్ధమైన కథనాలను ప్రజలకు నివేదించేందుకు మోదీ ప్రభుత్వం తన శక్తియుక్తులు, వనరులు సమస్తాన్ని సంపూర్ణంగా ఉపయోగించుకున్నది. నవ భారతదేశ నిర్మాణానికి ప్రథమ ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ చేసిన అనుపమేయమైన కృషిని, ఆయన అనితరసాధ్యమైన సేవలను తక్కువ చేసేందుకు కూడా మోదీ సర్కార్ చాలా శ్రద్ధగా నిరంతరం పని చేసింది. అయినప్పటికీ ప్రభుత్వ వైఖరిని అంగీకరించని, నిర్ద్వంద్వంగా తిరస్కరించే వెబ్‌సైట్‌లు, ప్రచురణ సంస్థలు, యూట్యూబ్ చానెల్స్, వార్తాపత్రికలు ఎన్నో ఉన్నాయి. ఆ చారిత్రక అంశాలను భిన్నంగా అవగాహన చేసుకున్నవారు ప్రభుత్వ వాదనలను తీవ్రంగా ఖండిస్తున్నారు. తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడిస్తున్నారు. ఈ స్వతంత్ర ఆలోచనాశీలురను అదుపు చేసే లక్ష్యంతోనే మోదీ ప్రభుత్వం ఒక కొత్త 'బ్రాడ్‌కాస్టింగ్ బిల్లు'ను తీసుకురావడానికి ప్రయత్నిస్తోంది.

ఎలా ఆలోచించాలి, ఎలా ఆలోచించకూడదు అంటూ ప్రజల ఆలోచనలను నియంత్రించడంలో చైనా కమ్యూనిస్టు పార్టీ(సిపిసి)కి సాటిరాగల సంస్థ మరేదీ మన కాలంలో లేదనడం సత్యదూరం కాదు. చైనా గతం, వర్తమానం, భవిష్యత్తు విషయమై చారిత్రక కథనాలు ఎలా ఉండాలన్న దానిపై సిపిసి నాలుగు నిర్దేశాలు చేసింది. అవి: 1) కమ్యూనిస్టు పార్టీ ఎప్పుడూ సరైన విధంగానే వ్యవహరిస్తుంది, తప్పు చేయదు. నాయకుడు (ఒకప్పుడు మావో, ఇప్పుడు జిన్‌పింగ్) సదా సబబుగా, నిర్దుష్టంగా, అమోఘంగా వ్యవహరిస్తారు; 2) పార్టీ కార్యకర్తలు, అధికారులు, మరీ ముఖ్యంగా మహానాయకుడు రేయింబవళ్లు, ఆరు రుతువులూ చైనా సర్వతోముఖ అభివృద్ధికి అవిరామంగా పనిచేస్తుంటారు. ప్రజలకు సుఖసంతోషాలు సమకూర్చడం, జాతిని సర్వశక్తిమంతం చేయడమే ధ్యేయంగా వారి కార్యకలాపాలు సాగుతాయి; 3) పార్టీని దాని విధానాలను, ఆచరణలను విమర్శించేవారు జాతి శత్రువులు, విదేశాల ప్రోద్బలంతోనే వారు ఆ విమర్శలకు పాల్పడుతున్నారు; 4) ఆ విమర్శలను పార్టీ దృఢంగా, సత్వరమే ఖండించి, విమర్శకులను తొలగించని పక్షంలో 1949లో కమ్యూనిస్టులు, అధికారానికి రాకముందు ఉన్న అల్లకల్లోల పరిస్థితులు పునరావృతమవుతాయి. విభజనలు, అంతర్యుద్ధంతో దేశం అతలాకుతలమవుతుంది. పాశ్చాత్య దేశాల దుష్ట ప్రభావంలోకి మళ్లీ వెళుతుంది.



akbar

ప్రజల ఆలోచనలను నియంత్రించడంలో చైనా కమ్యూనిస్టు పార్టీకి సాటి రాగల సంస్థ మరేదీ మన కాలంలో లేదు. కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాస్తున్నవారు, మాట్లాడుతున్నవారు చంపివేయబడడం సర్వసాధారణం. ఆ పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొన్న, అధికారిక వాదనలకు భిన్నమైన కథనాలను ప్రజలకు నివేదించేందుకు సాహసించిన కొంతమంది మేధావులు, విద్యావేత్తల గురించి ఇటీవల ఒక పుస్తకం విశాల ప్రపంచానికి తెలియజేసింది. ఆప్తులు, ఆత్మీయులను కోల్పోయిన బాధే కమ్యూనిస్టు పాలనలోని చీకటి కోణాలను ప్రజలకు నివేదించేలా వారిని పురిగొల్పాయి.

చరిత్రపై పార్టీ దృక్పథానికి భిన్నాభిప్రాయాన్ని వ్యక్తం చేయడమనేది అమెరికాలో వలే కాదుకదా భారత్‌లో కంటే కూడా చైనాలో చాలా చాలా కష్టం. 1949 నుంచి కమ్యూనిస్టు పార్టీ ప్రభుత్వానికి వ్యతిరేకంగా రాస్తున్నవారు, మాట్లాడుతున్నవారు ఉద్యోగాల నుంచి తొలగించబడడం, అరెస్ట్ కావడం చిత్రహింసలకు గురవడం, అంతిమంగా చంపివేయబడడం చాలా సాధారణమైపోయింది. అటువంటి పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కొన్న, ఆధునిక చైనా చరిత్ర, ముఖ్యంగా కమ్యూనిస్టు పార్టీ చరిత్ర గురించి అధికారిక వాదనలకు భిన్నమైన కథనాలను ప్రజలకు నివేదించేందుకు సాహసించిన కొంతమంది మేధావులు, కళాకారులు, విద్యావేత్తలు, సృజనశీలురు గురించి ఇటీవల ఒక పుస్తకం విశాల ప్రపంచానికి తెలియజేసింది. చైనాలో సుదీర్ఘకాలం విలేఖరిగా పనిచేసి చివరకు బీజింగ్ పాలకులచే బహిష్కరణకు గురైన పాత్రికేయుడు, రచయిత ఇయాన్ జాన్సన్ రాసిన. 'Sparks: China's Underground Historians and their Battle for the Future' గురించి నేను ప్రస్తావిస్తున్నాను.

మనస్తత్వంలో చంచల స్వభావం, హంతక ప్రవృత్తి మిళితమై ఉన్న విలక్షణ నాయకుడు మావో. 1956లో వివిధ అంశాలపై ప్రజలు తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వెల్లడించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. వేయి పువ్వులు వికసించాలని, వేయి ఆలోచనలు వర్ధిల్లాలని ఆయన నినదించారు. చైనా ప్రజలు మావో పిలుపునకు ప్రతిస్పందించారు. తమ అభిప్రాయాలను స్వేచ్ఛగా వ్యక్తం చేయసాగారు. దీంతో మావో తన మాట మార్చారు. తన విజ్ఞప్తిని ఉపసంహరించుకున్నారు. మితవాద ధోరణుల వ్యతిరేక పోరాటం పేరిట రచయితలు, విద్యార్థులు, న్యాయవాదులు, మేనేజర్లు, సివిల్ సర్వెంట్లు, శాస్త్రవేత్తలను, ఇంతెందుకు సొంతంగా ఆలోచించగల సామర్థ్యమున్న వారిని తీవ్ర ఇక్కట్లపాలు చేశారు. ఈ క్రమంలో విశ్వవిద్యాలయాలు, పాఠశాలలు, పరిశోధన కేంద్రాలు, ప్రభుత్వ కార్యాలయాలు ధ్వంసమయ్యాయి. వేలాది బుద్ధిజీవులను నిర్బంధ శ్రమ శిబిరాలకు తరలించారు. మిగిలిన వారిని లొంగదీసుకుని, అణచివేశారు. పార్టీ ఆదేశాలను సర్వత్రా ప్రతి ఒక్కరూ పాటించేలా చేశారు.

జాన్సన్ విపులంగా రాసిన అజ్ఞాత చరిత్రకారులలో చాలా మంది జైలుపాలయిన లేదా చంపివేయబడ్డ వారి బిడ్డలు లేదా తోబుట్టువులే. ఆప్తులు, ఆత్మీయులను కోల్పోయిన బాధే కమ్యూనిస్టు పాలనలోని చీకటి కోణాలను ప్రజలకు నివేదించేలా వారిని పురిగొల్పాయి. గ్రేట్ లీప్ ఫార్వర్డ్, సాంస్కృతిక విప్లవం, టిబెట్ ఆక్రమణ, 'మహానాయకుడు' రూపొందించి స్వీయ పర్యవేక్షణలో అమలుపరిచిన కార్యక్రమాలు, ప్రాజెక్టుల వాస్తవాల గురించి తమ రచనల ద్వారా ప్రజలకు తెలియజేసేందుకు వారు సాహసించారు. జాన్సన్ పేర్కొన్న చరిత్రకారులు, ఇతర మేధావులలో చాలా మంది 21వ శతాబ్ది తొలి దశకంలో చురుగ్గా ఉన్నవారు. అప్పట్లో అసాధారణ బహిరంగతత్వం అమల్లో ఉండేది. ఇంటర్నెట్ వారికొక ఆలంబనగా ఉండేది. ఆ మీడియం ద్వారా వారు తమ రచనలు, సినిమాలకు స్వేచ్ఛగా పరిమిత స్థాయిలో ప్రాచుర్యం కల్పించారు. మరికొంత మంది 1980ల నుంచి క్రియాశీలంగా ఉన్నారు. ఆ దశకంలో వర్ధిల్లిన కళా, సృజనాత్మక స్వేచ్ఛ 1989లో జూన్‌లో తియనాన్మెన్ స్క్వేర్ ఊచకోతలతో ముగిసింది.



■ రామచంద్ర గుహ

గతానుగతం

2012లో జిన్‌పింగ్ అధికారంలోకి వచ్చిన తరువాత ఈ స్వతంత్ర చరిత్రకారుల మేధోకృషికి పరిస్థితులు మరింత ప్రతికూలమయ్యాయి. జిన్‌పింగ్ అధికారానికి వచ్చిన తొలి రోజులలోనే చైనా కమ్యూనిస్టు పార్టీ చరిత్రను సాధ్యమైనంతగా ఒక మహోజ్వల గాథగా ప్రజలకు నివేదించేందుకు ఒక కార్యక్రమాన్ని ప్రారంభించి, లక్ష్య నిర్దేశం చేశారు. ఇందుకు చాలా పెద్ద సంఖ్యలో చరిత్రకారులను నియోగించారు. కమ్యూనిస్టు పార్టీ 'మహా విజయాలు, అద్వితీయ సాఫల్యాల'ను సువర్ణాక్షరాలతో లిఖించాలని వారిని ఆదేశించారు. మావో కాలంలో వలే జిన్‌పింగ్ హయాంలో కూడా స్వతంత్ర మేధావుల కష్టాలు మిక్కుటమయ్యాయి. అయినప్పటికీ కొంతమంది మేధావులు ఆ పరిస్థితులకు ధైర్య సాహసాలతో ఎదురీదారు. జాన్సన్ ఇలా రాశారు: 'నిజమేమిటంటే చైనా స్వతంత్ర చింతన సజీవంగా ఉన్నది. అది ఎప్పుడూ నామరూపాలు లేకుండా పోలేదు'. 'కమ్యూనిస్టు పార్టీయే ఎల్లప్పుడూ గెలవలేదు' అనే సత్యాన్ని కొంతమంది రచయితలు, జర్నలిస్టులు, కళాకారులు, సినిమా స్రష్టలు ప్రజలకు చెప్పడాన్ని కొనసాగిస్తారు.

జాన్సన్ 'నిప్పు కణాలు' నన్ను అప్రతిభుడిని చేశాయి. ఆ స్వతంత్ర చరిత్రకారుల నైతిక స్థైర్యం, భౌతిక ధైర్యమే కాదు వారి మేధా స్పష్టత కూడా నన్ను ఆశ్చర్యపరిచింది. కమ్యూనిస్టు చైనాలో చరిత్ర రచన, బోధన గురించి జియాంగ్ జుయె అనే రచయిత్రి ఏమన్నారో చూడండి: 'మావో, మనం చరిత్రను పునర్లిఖించాలని అన్నారు. అయితే చరిత్ర సంభవించింది. తిరిగి రాయడానికి అదొక నవల కాదు. దానినెలా మీరు తిరిగి రాయగలరు? ధర్మాధర్మ విచక్షణ ఉన్నవారెవరైనా సరే తిరగరాసిన చరిత్రను తిరస్కరించి తీరుతారు'. ఝూంగ్ షిహె అనే పాత్రికేయుడు ఇలా అన్నాడు: 'ఏదైనా ఒక అపకారం ప్రజలకు జరగడాన్ని చూసినప్పుడు నిజంగా ఆగ్రహం చెందే వ్యక్తులలో నేనూ ఒకరిని. తత్కారణంగా ఆ యథార్థ ఘటనల గురించి మాట్లాడాలి గనుక నేను భిన్న దృక్పథంతో రాస్తున్నాను'. విద్యావేత్త అయిన చెన్ హింగ్యయో ఇలా ఎత్తి పొడిచారు: "మన కాలం రాజకీయాలు 'గుడ్డివాళ్లను ముందుకు తీసుకువెళుతున్న ఉన్మాదుల' తరహా వ్యక్తులవి కావూ?" మళ్లీ జియాంగ్ జుయె వద్దకు వెళదాం: ప్రత్యామ్నాయ రీతిలో నీవు చేస్తున్న చరిత్ర రచనా కృషి వ్యర్థమైనది, అసంగతమైనది. కమ్యూనిస్టు చైనా లాంటి నిరంకుశ పాలన వ్యవస్థ ఉన్న సమాజంలో ఆ చరిత్ర ఎటువంటి ప్రభావాన్ని చూపలేదు అన్న తన స్నేహితురాలి ఆక్షేపణకు జుయె ఇలా ప్రతిస్పందించారు. 'నేను విభేదిస్తున్నాను. భిన్న దృక్పథంతో రాయడానికి ప్రయత్నిస్తే అది ప్రాధాన్యం పొందుతుంది. ఒక విపరీత సమాజంలో ఒక మామూలు వ్యక్తిగా నేను ఉండదలిచాను. సత్యసమ్మతమైన విషయాలను నేను చెప్పదలుచుకున్నాను. నా హృదయంలోని ఘోషలను వ్యక్తం చేయాలన్నదే నా ఆరాటం'.


(వ్యాసకర్త చరిత్రకారుడు)

తెలుగు పాత్రికేయ దిగ్గజం

పిన్న వయసులో పాత్రికేయవృత్తిలో ప్రవేశించి ఏడున్నర దశాబ్దాల పాటు ఆ రంగంలో కొనసాగిన తుర్లపాటి కుటుంబరావు కారణజన్ములు. 1946లో 14వ ఏట జర్నలిజంలోకి ప్రవేశించిన తుర్లపాటి 1951 ఆంధ్రకేసరి టంగుటూరి ప్రకాశం పంతులు గారి 'ప్రజాపత్రిక' దినపత్రికలో చేరారు. దరిమిలా కొంత కాలం ప్రకాశంకు కార్యదర్శిగా కూడా పనిచేశారు.

విఖ్యాత జర్నలిస్ట్ నార్ల వెంకటేశ్వరరావు ఎడిటర్‌గా 1960లో ప్రారంభమైన ఆంధ్రజ్యోతి దినపత్రికలో సహాయ సంపాదకుడిగా చేరిన తుర్లపాటి 1993 వరకు అదే దినపత్రికలో సుదీర్ఘంగా పనిచేసారు. 'వార్తల్లోని వ్యక్తి' అనే శీర్షికను తొలుత ఆంధ్రజ్యోతిలో, ఆ తరువాత 'వార్త' దినపత్రికలో మొత్తం దాదాపు 50 సంవత్సరాలపాటు కొనసాగించి శీర్షికా నిర్వహణలో రికార్డ్ నెలకొల్పారు. 'ఆంధ్రప్రదేశ్ ఫిల్మ్ ఫాన్స్ అసోసియేషన్‌'ను స్థాపించి రాష్ట్రంలోని 42 బ్రాంచిలతో ప్రతి సంవత్సరం ఉత్తమ నటుడు, నటి అవార్డులు ఇచ్చేవారు. ఈ అవార్డులకు ఎంపిక అవడాన్ని నటీనటులు గర్వంగా భావించేవారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 1960వ దశకంలో 'నంది' అవార్డులు ప్రవేశపెట్టడానికి కారణం కుటుంబరావు గారే. అక్కినేని నాగేశ్వరరావుకు 1957లో నటసమ్రాట్ బిరుదునిచ్చింది కూడా తుర్లపాటి వారే. అలాగే హీరో కృష్ణకు సూపర్ స్టార్ అనే ప్రఖ్యాతిని కల్పించింది కూడా తుర్లపాటి కుటుంబరావే కావడం విశేషం. తెలుగు సినీ పరిశ్రమలోని అందరికీ అత్యంత ఆప్తులు తుర్లపాటి. నేషనల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ మెంబెర్‌గా, నంది అవార్డ్స్ కమిటీ సభ్యుడిగా, 'జ్యోతిచిత్ర' ఎడిటర్‌గా, నేషనల్ ఫిల్మ్ సెన్సార్ బోర్డ్ అడ్వైజర్‌గా, కేంద్ర సాహిత్య అకాడమీ మెంబర్‌గా, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గ్రంథాలయ పరిషత్తు చైర్మన్‌గా, వివిధ హోదాలలో తుర్లపాటి పనిచేశారు.

మహాత్మాగాంధీ, డాక్టర్ బి.ఆర్.అంబేడ్కర్, ఖాన్ అబ్దుల్ గఫర్ ఖాన్, పండిట్ నెహ్రూ, నరేంద్ర మోదీ, వెంకయ్య నాయుడు మొదలైన మన జాతీయ నాయకులతో పాటు బిల్ క్లింటన్, జార్జ్ బుష్, మార్గరెట్ థాచర్ తదితర పాశ్చాత్య దేశాల నాయకులతో కూడా ఉత్తర ప్రత్యుత్తరాలు నడిపిన నేర్పరి, మేధావి తుర్లపాటి. శ్రీమతి ఇందిరాగాంధీ, మొరార్జీ దేశాయ్, జగజీవన్‌రామ్, రాజీవ్‌గాంధీ లాంటి ఉద్దండులు ఆంధ్రప్రదేశ్‌లో పర్యటనకు వచ్చిన సందర్భంలో ఇంగ్లీష్ ఉపన్యాసాలను తెలుగులోకి తుర్లపాటి వారే అనువదించేవారు.



చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరితో సత్సంబంధాలు కొనసాగించి కులమతాలకు అతీతంగా, ప్రేమే తన కులంగా, మానవత్వమే తన అభిమతంగా కన్న ఊరు విజయవాడకు సువిఖ్యాతి సాధించిన పాత్రికేయ దిగ్గజం తుర్లపాటి కుటుంబరావు. ఎంతోమంది ప్రేమాభిమానాలు పొంది తన జన్మను సార్ధకం చేసుకున్న ధన్యజీవి.

రచయితగా 'మహా నాయకులు', 'జాతి నిర్మాతలు', '1857 విప్లవ వీరులు' ఇత్యాది ఎన్నో గొప్ప పుస్తకాలను రాసి యువతరానికి గొప్ప జాతీయోద్యమ స్ఫూర్తి కల్పించారు. తుర్లపాటి కుటుంబరావు తన సుదీర్ఘ జీవితంలో దాదాపు 18,000 ఉపన్యాసాలు వెలువరించారు. ఈ విషయంలో గిన్నీస్ బుక్ వారి ప్రత్యేక ప్రశంసను కూడా పొందిన ఘనాపాటి. సభాధ్యక్షుడిగా సభలను నడిపించటంలో ఆయనకు ఆయనే సాటి. ఈ కారణంగానే ఆయన 'ఉపన్యాస కేసరి', 'దశ సహస్ర సభా కేసరి'గా సువిఖ్యాతులయ్యారు. ఆంధ్రా యూనివర్సిటీ వారి 'కళాప్రపూర్ణ', తొలి తెలుగు ప్రధాని పి.వి. నరసింహారావు చేతుల మీదుగా 'నేషనల్ సిటిజన్స్' అవార్డ్, ముట్నూరి కృష్ణారావు ఉత్తమ జర్నలిస్ట్ అవార్డు, అమెరికన్ బయోగ్రాఫికల్ ఇన్‌స్టిట్యూట్ ద్వారా 'ఇంటర్నేషనల్ మాన్ ఆఫ్ ద ఇయర్ అవార్డు', ఇంకా ఎన్నెన్నో అవార్డులు సాధించారు. తెలుగుకు అధికార భాషా హోదా రావడానికి అనితర సాధ్యమైన కృషి చేశారు తుర్లపాటి.

2002లో భారత ప్రభుత్వం ఆయన్ని 'పద్మశ్రీ' పురస్కారంతో సత్కరించింది. నాటి రాష్ట్రపతి కె.ఆర్. నారాయణన్ చేతుల మీదుగా ఆయన ఆ అవార్డు నందుకున్నారు. ప్రతిష్ఠాత్మక 'పద్మశ్రీ' అందుకున్న ఏకైక తెలుగు జర్నలిస్ట్ తుర్లపాటి కుటుంబరావే. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ముఖ్యమంత్రులుగా పనిచేసిన నాయకులు అందరితోను తుర్లపాటికి సన్నిహిత సంబంధాలు ఉండేవి. ప్రధానమంత్రులు, ముఖ్యమంత్రులతో ఎంతో సన్నిహిత సంబంధాలు కలిగి ఉన్నా ఏ రోజు కూడా ఆయన వారి వద్ద ఏమీ ఆశించకుండా నీతి, నిజాయితీలతో వ్యవహరించేవారు. చివరకు కనీసం సొంత ఇల్లు కూడా లేకుండా వెళ్లిపోయారంటే ఆయన ఎటువంటి నిస్వార్థపరుడో అర్థం చేసుకోవచ్చు.

తుర్లపాటి కుటుంబరావు కుటుంబ జీవితం ఆదర్శప్రాయమైనది. ప్రముఖ కూచిపూడి నర్తకి కృష్ణ కుమారిని ప్రేమించి వివాహం చేసుకున్నారు. చిన్న వయసులోనే చనిపోయిన శ్రీమతి కృష్ణ కుమారి దాదాపు వెయ్యికి పైగా నృత్య ప్రదర్శనలు ఇచ్చారు. దేనికీ కృంగిపోని స్థితప్రజ్ఞుడు తుర్లపాటి. 1979లో కీర్తిశేషురాలు అయిన కృష్ణకుమారి పేరు మీద నాలుగు దశాబ్దాల పాటు ప్రతి సంవత్సరం ఒక నాట్య కళాకారుడి అవార్డ్ ఇచ్చి సత్కరించేవారు. ఈ దంతుల ఏకైక కుమార్తె ప్రేమ జ్యోతి, తండ్రి జీవిత కాలంలోనే దివంగతురాలయింది. కుమారుడికి జవహర్‌లాల్ నెహ్రూ అని పేరు పెట్టుకున్న జాతీయవాది తుర్లపాటి. భార్య పోయినా, కుమార్తె మరణించినా ఎన్నో ఆరోగ్య సమస్యలు, ఆర్థిక బాధలు వచ్చినా, ఎన్ని కష్టాలు వచ్చినా, ఎంతో ధైర్యంగా ఎదుర్కొని, ఎప్పుడు నవ్వుతూ అందరినీ ప్రేమగా, ఆప్యాయంగా చూసిన తుర్లపాటి జీవితం అందరికి ఆదర్శం. పెద్దా చిన్న, పేద గొప్ప అనే తేడాలు లేకుండా అందరినీ ఆయన గౌరవించేవారు.

అన్ని పార్టీలతో కూడా సత్సంబంధాలు కలిగిన అజాత శత్రువు. తెలుగు జర్నలిజం దిగ్గజాలలో ఆయన ఒకరు. నీతి నిజాయితీలతో, అత్యున్నత విలువలతో, శ్రీరాముడి లాంటి వ్యక్తిత్వంతో, అత్యంత పాజిటివ్ దృక్పథంతో ఉండేవారు ఆయన. తన వద్దకు సహాయం కోసం వచ్చిన ప్రతి ఒక్కరినీ ఆదరించేవారు. చిన్న పెద్ద అనే తేడా లేకుండా ప్రతి ఒక్కరితో సత్సంబంధాలు కొనసాగించారు. కులమతాలకు అతీతంగా, ప్రేమే తన కులంగా, మానవత్వమే తన అభిమతంగా విజయవాడను, ఆంధ్రప్రదేశ్‌ను ఎన్నెన్నో అవార్డులు, రివార్డుల ద్వారా అంతర్జాతీయ స్థాయికి తీసుకువెళ్లి ఎంతో మంది ప్రేమాభిమానాలు పొంది తన జన్మను సార్థకం చేసుకున్న ధన్యజీవి ఆయన. తుర్లపాటి కుటుంబరావు మా తాతగారు అయినందుకు ఎంతో గర్విస్తున్నాను.

■ తుర్లపాటి కృష్ణ సుప్రియ

(నేడు తుర్లపాటి కుటుంబరావు జయంతి)


రాష్ట్రాభివృద్ధికి మార్గాలనేకం

సంక్షేమం ఒక్కటే కాదు అభివృద్ధితో కూడిన సంక్షేమం ఉండాలనేది ఏపీ ప్రజల అభీష్టం. ఇదే ఆకాంక్షను అసెంబ్లీ ఎన్నికల్లో వారు తమ తీర్పు రూపంలో స్పష్టం చేశారు. కొత్త ప్రభుత్వం అప్పులు–సంక్షేమం అనే సిద్ధాంతంతో నడవకూడదు. ప్రజలు పెట్టుకున్న నమ్మకాన్ని నిలుపుకునేందుకు అభివృద్ధి ద్వారా సంపదను సృష్టించి దాన్ని సంక్షేమం కోసం ఖర్చు చేయాలనేది సీఎం చంద్రబాబు తలంపు. ఇందులో భాగంగానే పోలవరం, రాజధాని అమరావతి నిర్మాణం విషయాల్లో మెరుగైన కదలిక కనిపిస్తున్నది. వీటికి సమాంతరంగా పారిశ్రామిక అభివృద్ధిపైనా దృష్టి పెట్టవలసి ఉంది. పారిశ్రామిక అభివృద్ధి అంటే అదేదో పూర్తిగా ప్రైవేటు రంగానికి సంబంధించి అంశం కాదు. బడా పెట్టుబడుల కన్నా చిన్న, మధ్యతరగతికి చెందిన పరిశ్రమల స్థాపనకు పెద్దపీట వేయాలి. రైతుల పంట ఉత్పత్తులను నిల్వ చేసుకునేందుకు అవసరమైన గిడ్డంగులు పెద్దగా లేవు. కేవలం 12 లక్షల వ్యయంతో ఒక గిడ్డంగిని నిర్మించవచ్చు. ఇది రైతులకు మేలు చేయడంతో పాటు ఉపాధి అవకాశాలను కూడా కల్పిస్తుంది.

గడిచిన 20 ఏళ్లుగా ఉత్తరాంధ్ర ప్రాంతంలో సుమారు 23,593 వేల ఎకరాలు ప్రజల నుంచి సేకరించారు. ఏపీ సెజ్ అచ్యుతాపురం, జెఎస్సీసీ పరవాడ, ఫార్మా పరవాడ, నక్కపల్లి క్లస్టర్, కోనా ల్యాండ్స్, తమ్మవరం, కాకినాడ సెజ్‌ల కోసం అంటూ 19,436 వేల ఎకరాల్లో ఇండస్ట్రియల్ బ్లాకుల ఏర్పాటు జరిగింది. అయితే ఇప్పటికి వినియోగించుకుంది కేవలం 5 వేల ఎకరాల్లోపే. మరో 14 వేల ఎకరాలకు పైగా ఖాళీగా ఉన్నాయి. అభివృద్ధి కోసమని రైతుల నుంచి సమీకరించిన ఇంత భూమి నిరుపయోగం అవడంతో లక్షలాదిమంది ఉపాధి అవకాశాలను అందుకోలేకపోతున్నారు. అభివృద్ధి కోసం భూ సమీకరణ తప్పు కాకపోయినా దానిని సరైన పద్ధతిలో వినియోగించుకోకపోవడం తప్పే.

రాష్ట్రానికి సముద్రతీరం ఒక వరం. సరైన చర్యలు తీసుకుంటే ఉపాధి అవకాశాలకు కొదువ ఉండదు. రాష్ట్ర ఆర్థికవృద్ధికి వ్యవసాయం, అనుబంధ రంగాలూ కీలకమని గుర్తించాలి. ఆయా విభాగాల్లో మెరుగైన అభివృద్ధి ప్రణాళికల్ని రూపొందించుకోవడం ద్వారా ఉపాధి అవకాశాలను విస్తృతపరచవచ్చు. ప్రభుత్వమే చిన్న మొత్తాల్లో పెట్టుబడులు పెట్టడం, యువతకు లోన్లు ఇప్పించడం ద్వారా వేల మందికి గ్రామీణ స్థాయిలోనే ఉపాధిని చూపించవచ్చు. ఏపీలో ఇప్పటికీ సేవల రంగం కూడా పెద్దగా అభివృద్ధి చెందలేదు. పట్టుదలతో కృషి చేస్తే హైదరాబాద్, బెంగళూరు, చెన్నై వంటి నగరాలతో సమానంగా విశాఖ, విజయవాడ, తిరుపతి వంటి నగరాలు సేవల రంగానికి ఊతం అవుతాయి. రాష్ట్రంలో సోలార్ విద్యుత్ ఉత్పత్తికి అవకాశాలు అధికం. ఐటీ రంగాన్ని రాష్ట్రంలోని వివిధ వ్యవస్థల కోసం వినియోగించుకోవచ్చు. ఏపీలో ఉన్న జనాభాలో 65 శాతం మంది 35 ఏళ్ళ యువతే. ఈ యువశక్తిని రాష్ట్ర ప్రగతికి చుక్కానిగా ఉపయోగించుకోవడం ప్రభుత్వానికి తక్షణ కర్తవ్యం కావాలి.

– సి.ఎస్. క్షేత్రపాల్ రెడ్డి



• శ్రావణ శోభ

శ్రావణమాసం మొదటి శుక్రవారం కావడంతో ఇంద్రకీలాద్రిపై దుర్గమ్మ సన్నిధి భక్తులతో కిటకిటలాడింది. అమ్మవారికి విశేషమైన రోజు కావడంతో వేకువజాము నుంచే భక్తులు భారీగా తరలివచ్చారు. క్యూలైన్లు సహా ఆలయ ప్రాంగణమంతా రద్దీగా కనిపించింది.





గ్రేటర్ విజయవాడ ప్రతిపాదన మళ్లీ ఊపిరి పోసుకుంటోంది. 2017లో సీఎం చంద్రబాబు ఆలోచనల నుంచి రూపుదాల్చిన గ్రేటర్ విజయవాడ ఆ తర్వాత వైసీపీ హయాంలో అటకెక్కింది. తాజాగా టీడీపీ నేతృత్వంలో కూటమి ప్రభుత్వం మళ్లీ అధికారంలోకి రావడంతో గ్రేటర్ విజయవాడ ప్రతిపాదన దిశగా శరవేగంగా అడుగులు పడుతున్నాయి. ఇందుకోసం ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని) అధికారులకు దిశానిర్దేశం చేస్తూనే.. త్వరలో ప్రతిపాదనను సీఎం చంద్రబాబు ముందుంచేందుకు సిద్ధమవుతున్నారు.

మళ్లీ గ్రేటర్

తెరపైకి గ్రేటర్ విజయవాడ ప్రతిపాదనలు

వైఎస్సార్ తాడిగడప, కొండపల్లి మున్సిపాలిటీలు విలీనం చేసే యోచన

- తొలిదశలో సుమారు 45 గ్రామాలతో కసరత్తు
- తుది ప్రతిపాదనలో మరిన్ని గ్రామాలకు చోటు
- అధికారులకు ఎంపీ కేశినేని చిన్ని దిశానిర్దేశం
- త్వరలో సీఎం చంద్రబాబు వద్దకు..

(విజయవాడ-ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం విజయవాడ నగరం విస్తరణకు అవకాశం లేకుండా ఉంది. ఈ నేపథ్యంలో చుట్టుపక్కల గ్రామాల విలీనంతో గ్రేటర్ విజయవాడ ఏర్పాటు ఒక్కటే నగర విస్తరణకు ప్రత్యామ్నాయమని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. నగరం చెంతనే రామవరప్పాడు, ప్రసాదంపాడు, నిడమానూరు, ఇబ్రహీంపట్నం, కానూరు, పోరంకి వంటి శివారు గ్రామాలున్నాయి. వైసీపీ హయాంలో పంచాయతీల నిధులను దారి మళ్లించి, నిర్వీర్యం చేశారు. ఫలితంగా ఐదేళ్లలో పంచాయతీల్లో పరిస్థితి అధ్వానంగా మారింది. వీధిదీపాలకు సైతం డబ్బులు లేని పరిస్థితి. ఇక రహదారుల పరిస్థితి ఘోరంగా ఉంది. వైసీపీ హయాంలో కానూరు, తాడిగడప, పోరంకి, యనమలకుదురు పంచాయతీలను విలీనం చేస్తూ వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీని 2020లో ఏర్పాటు చేశారు కానీ, పట్టించుకున్నవారు లేరు. మున్సిపాలిటీ ఏర్పడి నాలుగేళ్లు గడుస్తున్నా ఇక్కడ ఎలాంటి అభివృద్ధి ఛాయలు లేవు. కొండపల్లి మున్సిపాలిటీది అదే పరిస్థితి. ఈ నేపథ్యంలో ఒకప్పుడు గ్రేటర్‌లో భాగమైతే.. పన్నుల భారమని భయపడిన శివారు గ్రామాల ప్రజలే.. నేడు పన్నుల భారమైనా కనీస మౌలిక సౌకర్యాలు సమకూరతాయన్న ఆశతో గ్రేటర్ విజయవాడ ఏర్పాటుకు మద్దతు పలుకుతున్నారు. దీంతో విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్ గ్రేటర్ ప్రతిపాదనను సీఎం చంద్రబాబు ముందుంచేందుకు ప్రయత్నిస్తున్నారు.

దశాబ్దాలుగా ప్రతిపాదనలకే పరిమితం

గ్రేటర్ విజయవాడ ప్రతిపాదన తొలిసారి 2011లో ఊపిరి పోసుకుంది. అప్పట్లో 40 గ్రామాలను కలిపేలా ప్రతిపాదనను అధికారులు తీసుకొచ్చారు. కానీ, అధికార కాంగ్రెస్ పార్టీ నాయకులు దాన్ని వ్యతిరేకించడంతో అటకెక్కింది. ఆ తర్వాత 2017 డిసెంబరులో అప్పటి సీఎం చంద్రబాబు గ్రేటర్ ప్రతిపాదనను మళ్లీ తెరపైకి తెచ్చారు. అప్పట్లో ఆయన రామవరప్పాడు, ప్రసాదంపాడుల్లో పర్యటించారు. అక్కడి అధ్వాన పారిశుధ్య పరిస్థితులపై వీఎంసీ అధికారులను ప్రశ్నించగా, అవి పంచాయతీలుగా ఉన్నాయని సమాధానమిచ్చారు. దీంతో విజయవాడలో భాగంగా ఉండీ అభివృద్ధికి నోచుకోని అలాంటి గ్రామాలను విలీనం చేస్తూ గ్రేటర్ విజయవాడ ప్రతిపాదనను సిద్ధం చేయాలని ఆయన అధికారులను ఆదేశించారు. అప్పుడు విజయవాడ మున్సిపల్ కమిషనర్‌గా ఉన్న జె.నివాస్ సమగ్ర అధ్యయనం చేసి గ్రేటర్ విజయవాడ డీపీఆర్‌ను సిద్ధం చేశారు. చంద్రబాబు సూచనలకు అనుగుణంగా 59 గ్రామాలను

- మిగతా 6లో

లైట్‌మెట్రో డీపీఆర్‌పై కదలిక

త్వరలో సీఎం చంద్రబాబుకు ఏపీఎంఆర్‌సీ వివరణ

- ఇప్పటికే మునిసిపల్ మంత్రి, ప్రిన్సిపల్ సెక్రటరీతో ఎండీ చర్చలు


(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : విజయవాడ లైట్ మెట్రోరైల్ ప్రాజెక్టుకు సంబంధించి త్వరలో ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించేందుకు ఏపీ మెట్రో రైల్ కార్పొరేషన్ (ఏపీఎంఆర్‌సీ) రంగం సిద్ధం చేస్తోంది. రాష్ట్రంలో మెట్రో ప్రాజెక్టులకు సంబంధించి గత టీడీపీ ప్రభుత్వ హయాంలో తలపెట్టిన డీపీఆర్‌లను కిందటి వైసీపీ ప్రభుత్వం ఏ విధంగా తొక్కిపట్టింది? వాటి ప్రస్తుత స్థితిగతులేంటి? అనే అంశాలపై ఏపీఎంఆర్‌సీ అధికారులు సమగ్ర నివేదికను తయారు చేస్తున్నారు. ఏపీ మెట్రోరైల్ కార్పొరేషన్ ఎండీగా ఎన్‌పీ రామకృష్ణారెడ్డిని ప్రభుత్వం నియమించిన సంగతి తెలిసిందే. కిందటి సోమవారం

- మిగతా 6లో


తగ్గుముఖం

శాంతిస్తున్న కృష్ణానది వరద ప్రవాహం

ప్రతి మూడు గంటలకు తగ్గుతున్న అవుట్‌ఫ్లో



ప్రకాశం బ్యారేజీ వద్ద విద్యుత్ వెలుగుల్లో వరద ప్రవాహం



పులిగడ్డ వద్ద ఉధృతి

విజయవాడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : కృష్ణమ్మ శాంతిస్తోంది. ఎగువ నుంచి వస్తున్న ఇన్‌ఫ్లో, దిగువకు వెళ్తున్న అవుట్‌ఫ్లో తగ్గుముఖం పడుతున్నాయి. మరో రెండు రోజులకు వరద పూర్తిగా తగ్గుముఖం పడుతుందని జలవనరుల శాఖ అధికారులు చెబుతున్నారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు ప్రకాశం బ్యారేజీకి 2లక్షల66వేల107 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రికార్డయింది. బ్యారేజీ వద్ద 12 అడుగుల నీటిమట్టాన్ని నిర్వహిస్తూ అధికారులు నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. బ్యారేజీ నుంచి దిగువకు విడుదలయ్యే నీటి పరిమాణాన్ని ప్రతి మూడు గంటలకు అధికారులు తగ్గిస్తున్నారు. బ్యారేజీ వద్ద 60 గేట్లను ఆరు అడుగులు, పది గేట్లను ఐదు అడుగుల మేర ఎత్తి నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. శుక్రవారం ఉదయం 6 గంటలకు 2లక్షల75వేల950 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేశారు. తర్వాత ప్రతి మూడు గంటలకు అవుట్‌ఫ్లో తగ్గుతూ వచ్చింది. సాయంత్రం 6 గంటలకు ఇది 2లక్షల51వేల750 క్యూసెక్కులకు తగ్గిపోయింది. ఈ నీటి ద్వారా కేఈబీకి 1,507, బందరు కాల్వకు 1,300, ఏలూరు కాల్వకు 1,404, రైవస్‌కు 4,619, కేఈ మెయిన్‌కు 8,830, కేడబ్ల్యూకు 5,527 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. పులిచింతల నుంచి బ్యారేజీకి 2లక్షల39వేల117, పాలేరు నుంచి 154, కీసర నుంచి 29,286 క్యూసెక్కుల నీరు వస్తోంది. వెరసి 2లక్షల68వేల557 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. అది క్రమంగా 2లక్షల66వేల క్యూసెక్కులకు తగ్గింది. నాగార్జునసాగర్ నుంచి పులిచింతల ప్రాజెక్టుకు 2లక్షల30వేల195 క్యూసెక్కుల నీరు వస్తోంది. ఈ ప్రాజెక్టు 11 గేట్లను 2.5 మీటర్ల మేర ఎత్తి 2లక్షల47వేల748 క్యూసెక్కుల నీటిని దిగువకు విడుదల చేస్తున్నారు. పులిచింతలలో ప్రస్తుతం 35.2852 టీఎంసీల నీరు ఉంది. రెండు రోజుల్లో ఇన్‌ఫ్లో పూర్తిగా తగ్గుముఖం పడుతుందని ప్రాజెక్టు అధికారులు చెబుతున్నారు.

నామినేషన్ టెన్షన్!

పాలఫ్యాక్టరీ ఎన్నికలకు నామినేషన్లు నిల్

- మూడు డైరెక్టర్ల పదవులకు ఎవరూ ముందుకురాని వైనం
- ఒక్క నామినేషన్ కూడా రాకపోవడంపై అనుమానాలు
- ముగిసిన ఎన్నికల ప్రక్రియ.. సర్వత్రా చర్చ
- స్పందించని కృష్ణా మిల్క్ యూనియన్ చైర్మన్, పాలకవర్గం

చిట్టినగర్, ఆగస్టు 9 : మూడు డైరెక్టర్ల పదవులకు గానూ పాలఫ్యాక్టరీలో శుక్రవారం జరిగిన ఎన్నికల నామినేషన్ల ప్రక్రియ ప్రశ్నార్థకంగా మారింది. ముగ్గురు డైరెక్టర్ల పదవులకు ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాకుండానే ఎన్నికల ప్రక్రియ ముగిసింది. అయితే, ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాకపోవడంపై అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. నామినేషన్లు వేసేందుకు సొసైటీ అధ్యక్షులు ఎందుకు ముందు రాలేదనేది చర్చకు దారితీసింది. ఇందులో పాలకవర్గం పాత్ర ఉందా? స్వచ్ఛందంగా జరిగిందా? అనేది సందేహంగా ఉంది. ఎన్నికలంటే నామినేషన్లు దాఖలు చేయడమనేది సాధారణం. గడువు ముగిసేలోపు వచ్చిన నామినేషన్లను పరిగణనలోకి తీసుకుని ఏకగ్రీవమా, పోటీ ఉందో, లేదో సూచిస్తారు. కానీ, పాలఫ్యాక్టరీ ఎన్నికల నామినేషన్ల ప్రక్రియలో ట్విస్ట్ చోటుచేసుకుంది.

కృష్ణా మిల్క్ యూనియన్‌లో చర్చ

పాలఫ్యాక్టరీలోని క్షీరదర్శన్ హాల్లో శుక్రవారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 3 గంటల వరకు నామినేషన్ల దాఖలు చేపట్టారు. ఒక్క నామినేషన్ కూడా దాఖలు కాకపోవడంలో ఎన్నికల అధికారి గురునాథం ఎన్నికల ప్రక్రియ ముగిసినట్లు ప్రకటించారు. దీనిపై కృష్ణా మిల్క్ యూనియన్‌లో తీవ్ర చర్చకు దారితీసింది. సెప్టెంబరు నెలాఖరు నాటికి కౌతవరం-గుడ్లవల్లేరు క్లస్టర్‌కు చెందిన వీబీకేవీ సుబ్బారావు, చీపురుగూడెం-తిరువూరు క్లస్టర్‌కు చెందిన బొట్టు రామచంద్రరావు, కొండూరు-గుడ్లవల్లేరుకు చెందిన యెర్నేని సీతాదేవి.. మూడు డైరెక్ట్ పోస్టులు ఖాళీ కానున్నాయి. వాటికి సంబంధించి ఈ నెల ఒకటో తేదీన ఎన్నికల నోటిఫికేషన్ ఇచ్చారు. పాలఫ్యాక్టరీ చరిత్రలో నామినేషన్లు పడకుండా శుక్రవారం నాటి ప్రక్రియ ముగియడం గమనార్హం. ఇంతా జరుగుతున్నా పాలకవర్గ చైర్మన్, పాలకవర్గం మిన్నకుండిపోవడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



శ్రావణ శుక్రవారం సందర్భంగా క్యూలైన్‌లో భక్తుల రద్దీ

కొండపై శ్రావణ సందడి..

▸▸ దుర్గమ్మ దర్శనానికి తరలివచ్చిన భక్తులు

వన్‌టౌన్, ఆగస్టు 9 : ఇంద్రకీలాద్రిపై కనకదుర్గమ్మ ఆలయంలో శ్రావణమాసం తొలి శుక్రవారం పురస్కరించుకుని అమ్మవారిని దర్శించుకోవటానికి వేకువజామునుంచే భక్తులు తరలివచ్చారు. శ్రావణమాసం శుక్రవారం మహాకాళి, మహాలక్ష్మి, మహాసరస్వతి, ముగురమ్మల మూలపుటమ్మ కనకదుర్గమ్మను దర్శించుకుంటే సుఖశాంతులు, భోగభాగ్యాలతో వర్ధిల్లుతారని నమ్మిక. ఈ క్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో దుర్గమ్మను దర్శించుకున్నారు. క్యూలైన్లలో భక్తులకు ఎటువంటి ఇబ్బందులు రాకుండా ఈవో ఏర్పాట్లు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకుని పొంగళ్లు సమర్పించారు. పలువురు భక్తులు ఖడ్గమాలార్చన, లక్ష కుంకుమార్చన, శ్రీచక్రనవావరణార్చన, చండీహోమం, శాంతి కళ్యాణం తదితర ఆర్జిత సేవల్లో పాల్గొన్నారు. శుక్రవారం వల్లీ దేవసేన సుబ్రహ్మణేశ్వరస్వామి ఆలయం వద్ద నాగ పుట్టల వద్ద ప్రత్యేక పూజలు చేశారు. నాగ పంచమి తిథి కావటంతో పుట్టలో పాలుపోసి, సుబ్రహ్మణేశ్వర స్వామికి అర్చనలు చేశారు. విజయవాడ ఆటోనగర్‌లోని దుర్గా ఆటో బాడీ బిల్డర్స్ అధినేత కార్తీక్ ఆర్య శుక్రవారం అన్నవితరణకు రూ.1,35,000లు విరాళం ఆలయ అధికారులకు అందజేశారు.





చల్లపల్లి సెంటర్లో మాట్లాడుతున్న రైతుసంఘం నేతలు

రైతు వ్యతిరేక విధానాలపై సంఘటితంగా పోరాడుదాం

▸▸ ఏపీ రైతు సంఘం నేత సురేంద్రనాథ్ బెనర్జీ

చల్లపల్లి, ఆగస్టు 9 : కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన రైతు వ్యతిరేక చట్టాలకు నిరసనగా రైతులంతా సంఘటితమై పోరాడాలని ఆంధ్రప్రదేశ్ రైతుసంఘం రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు హనుమానుల సురేంద్రనాథ్ బెనర్జీ పిలుపునిచ్చారు. సంయుక్త కిసాన్ మోర్చా, కేంద్ర కార్మిక సంఘాల సమాఖ్య ఆధ్వర్యంలో తలపెట్టిన క్విట్ కార్పొరేట్ కార్యక్రమం సందర్భంగా శుక్రవారం చల్లపల్లి ప్రధాన సెంటర్లో అఖిలపక్షం ఆధ్వర్యంలో నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన వ్యవసాయ చట్టాలతో దేశానికి ప్రమాదం పొంచి ఉందన్నారు. రైతు వ్యతిరేక చట్టాలను వెంటనే వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సులను అమలుచేస్తానని అధికారంలోకి వచ్చిన మోదీ ప్రభుత్వం ఆ మాటను విస్మరించి రైతుల నడ్డివిరిచే చట్టాలను తీసుకువచ్చిందన్నారు. కాంట్రాక్ట్ వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తూ వ్యవసాయదారులను కూలీలుగా మార్చేందుకు కుట్ర జరుగుతోందన్నారు. రైతు సమస్యలపై పోరాడేందుకు పార్టీలకతీతంగా రైతుసంఘాల నాయకులు సంఘటితం కావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో రైతుసంఘం అవనిగడ్డ నియోజకవర్గ అధ్యక్షుడు వేమూరి రత్నగిరిరావు, సీపీఎం నేతలు యద్దనపూడి మధు, వాకా రామచంద్రరావు, మహమ్మద్ కరీముల్లా, వెనిగళ్ల వసంతరావు, రైతు కూలీ సంఘం నేత జన్ను జగన్, సీపీఐ నాయకులు మల్లుపెద్ది బోసు, డొక్కు శ్రీనివాసరావు, అల్లూరి బాబూరావు, సీపీఐ ఎంఎల్ నేత పరుచూరి జనార్దన్, ఈపూరి రాంబాబు, కాంగ్రెస్ నేత మీర్ రిజ్వాన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయాన్ని కాపాడాలి

▸▸ లెనిన్ సెంటర్‌లో రైతు సంఘాల నిరసన

గవర్నర్‌పేట : దేశ సంపద, సహజ వనరులను కొల్లగొడుతు దేశాన్ని పట్టిపీడిస్తున్న బహుళజాతి కంపెనీలను తరిమికొట్టాలని రైతు నేత మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు పిలుపునిచ్చారు. ఎన్టీఆర్ జిల్లా కార్మిక, కర్షక సంఘాల నేతృత్వంలో లెనిన్ సెంటర్‌లో శుక్రవారం నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, దేశం నుంచి బ్రిటిష్ వారిని తరిమి కొట్టేందుకు ఆగస్టు 9న క్విట్ ఇండియా నిర్వహించారని, అదేవిధంగా దేశం నుంచి విదేశీ, స్వదేశీ బహుళజాతి కంపెనీలను తరిమికొట్టాలన్న డిమాండ్‌తో నిరసన కార్యక్రమం చేపట్టినట్టు వివరించారు. వ్యవసాయ, పారిశ్రామిక రంగాలను శాసిస్తూ బడా కంపెనీల అనుకూల చట్టాలను ప్రభుత్వాలు మార్చడాన్ని తప్పుబట్టారు. పారిశ్రామిక రంగంలో 42 కార్మిక చట్టాలు రద్దు చేసి, నాలుగు లేబర్ కోడ్‌ల విధానాలను తీసుకురావడాన్ని తక్షణమే ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ రంగంలో తీసుకువచ్చిన 4 చట్టాలను రద్దు చేసినప్పటికీ పరోక్షంగా అదే విధానాలను కొనసాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. రైతాంగ డిమాండ్లను పరిష్కరించలేని పక్షంలో రానున్న రోజుల్లో కార్మిక, కర్షకుల నేతృత్వంలో పెద్ద ఎత్తున మరో ఉద్యమానికి నాంది పలుకుతామని ప్రకటించారు. కార్యక్రమంలో రైతు సంఘాల నాయకులు వై.కేశవరావు, జి.ఈశ్వరయ్య, ఎం.సూర్యానారాయణ, సింహాద్రి ఝాన్సీ, డి.హరినాథ్, చుండూరి రంగారావు, మరీదు ప్రసాద్‌బాబు, బసవయ్య, యం.హరిబాబు, బుడ్డి రమేష్, కార్మిక సంఘాల నేతలు ఆర్.రవీంద్రనాథ్, ఎ.వెంకటేశ్వరరావు, జె.కిషోర్‌బాబు, ఎ.రవిచంద్ర, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు కోట కళ్యాణ్, రంగారెడ్డి, అనిల్ తదితరులు పాల్గొన్నారు.

వరద ప్రాంతాల్లో ఎమ్మెల్యే పర్యటన

అవనిగడ్డ/అవనిగడ్డ రూరల్ : వరద ప్రభావిత ప్రాంతాల్లో ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ శుక్రవారం పర్యటించారు. పులిగడ్డ ఆక్విడెక్ట్ వద్ద వరద పరిస్థితిపై ఇరిగేషన్ అధికారులతో సమీక్షించిన అనంతరం పాత ఎడ్లంక గ్రామానికి వెళ్లే కాజ్ వేను పరిశీలించారు. ఈ సందర్భంగా సర్పంచ్ పాలేపు సామ్రాజ్యం, మాజీ సర్పంచ్ పీతా వెంకటేశ్వరరావు, మాలమహానాడు అధ్యక్షులు దోవా గోవర్ధన్‌లు వరదల వల్ల ఇబ్బందులను బుద్ధప్రసాద్‌కు తెలిపారు. మండలి స్పందిస్తూ ఎడ్లంక దీవి వాసుల రాకపోకలకు అనువుగా నాబార్డు సాయంతో వంతెన నిర్మిస్తామని, త్వరలోనే పనులు ప్రారంభమవుతాయని భరోసా ఇచ్చారు. ఈ సందర్భంగా బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, దివి ప్రాంతంలో నదీ గమనంలో అనూహ్య మార్పులు సంభవించాయని, దీనిపై శాస్త్రీయమైన అధ్యాయనం జరగాల్సి ఉందని తెలిపారు. కార్యక్రమంలో అవనిగడ్డ సీఐ త్రినాథ్, ఎస్ఐ శ్రీనివాస్, వీఆర్వో చిన్నారి, వేకనూరు ఆరోగ్య సిబ్బంది, జనసేన నేత రాయపూడి వేణుగోపాలరావు తదితరులు పాల్గొన్నారు. కృష్ణానది వరదల కారణంగా ఎడ్లంకకు వెళ్లే ప్రధాన బాట కొట్టుకుపోగా, శుక్రవారం పారిశ్రామిక వేత్త విక్కుర్తి శ్రీనివాస్ కాజ్‌వే దెబ్బతిన్న ప్రాంతాన్ని పరిశీలించారు. విరాళాలు వేసుకుని తాత్కాలిక కాజ్‌వే ఏర్పాటు చేసుకుంటున్నామని మాజీ సర్పంచ్ పీతా వెంకటేశ్వరరావు తెలిపారు.



పాత ఎడ్లంక వద్ద వరద పరిస్థితిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

త్వరలో ఉచిత బస్సు ప్రయాణం

▸▸ 1500 బస్సులు కొనుగోలు చేస్తాం

▸▸ తొలివిడతగా 200 బస్సులు

▸▸ బస్సులు ప్రారంభించిన మంత్రి రవీంద్ర



జెండా ఊపి ఆర్టీసీ సర్వీసులను ప్రారంభిస్తున్న మంత్రి రవీంద్ర

మచిలీపట్నం టౌన్, ఆగస్టు 9 : ఎన్నికల్లో చేసిన వాగ్దానం మేరకు త్వరలో మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ సౌకర్యం కల్పిస్తామని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. మచిలీపట్నం ఆర్టీసీ డిపోలో కొత్తగా కొనుగోలు చేసిన ఐదు బస్సులను శుక్రవారం మంత్రి ప్రారంభించారు. ఈ సందర్భంగా సభలో మంత్రి రవీంద్ర మాట్లాడుతూ, రాష్ట్ర వ్యాప్తంగా 1500 కొత్త బస్సులను కొనుగోలు చేస్తామని, తొలివిడతగా 200 బస్సులు కొనుగోలు చేశామన్నారు. దీనిలో భాగంగా మచిలీపట్నం ఆర్టీసీ డిపోకు ఐదు కొత్త సర్వీసులు అందించామన్నారు. విలీనం పేరుతో జగన్‌రెడ్డి, పేర్ని నాని ఆర్టీసీ ఉద్యోగులను మోసం చేసి అప్పుల పాలు చేశారన్నారు. ప్రయాణికులకు మెరుగైన సేవలు అందించేందుకు కృత నిశ్చయంతో ఉన్నామన్నారు. ఆర్టీసీని బలోపేతం చేసి ఉద్యోగుల సమస్యలు పరిష్కరిస్తామన్నారు. జిల్లా ప్రజారవాణా అధికారి వాణిశ్రీ మాట్లాడుతూ, ఐదు బస్సుల్లో రెండింటిని బీహెచ్‌ఈఎల్‌కు, మూడు బస్సులు బందరు-విజయవాడ నాన్‌స్టాప్ సర్వీసులుగా నడుపుతామన్నారు. కార్యక్రమంలో డిపో మేనేజరు పెద్దిరాజు, టీడీపీ నేత గొర్రెపాటి గోపీచంద్, జనసేన నేత బండి రామకృష్ణ, మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గోపు సత్యనారాయణ, మోటమర్రి బాబా ప్రసాద్, లంకే నారాయణ ప్రసాద్, కుంచే నాని, అక్కుమహంతి రాజా, పీవీ ఫణికుమార్, జనసేన నాయకులు పాల్గొన్నారు.

పోషకాహార లోపం నివారిస్తాం.. : రవీంద్ర

పోషకాహారలోపం నివారించేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉందని మంత్రి కొల్లు రవీంద్ర అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో శుక్రవారం కుష్ఠు రోగులకు మంత్రి పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పోషకాహార విలువలు గల ఆహారాన్ని ప్రజలకు అందించేందుకు కృషి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో లెప్రసీ మెడికల్ ఆఫీసరు వెంకట్రావు, సీఎస్‌ఆర్ లక్ష్మీనారాయణ స్వామి తదితరులు పాల్గొన్నారు.

విశాఖపట్నం-సికింద్రాబాద్ వందే భారత్ షెడ్యూల్‌లో మార్పు

రైల్వేస్టేషన్, ఆగస్టు 9 : 20833, 20834 విశాఖపట్నం-సికింద్రాబాద్ వందే భారత్ ఎక్స్‌ప్రెస్ షెడ్యూల్‌లో మార్పుచేశారు. ఈ మేరకు విజయవాడ డివిజన్ పబ్లిక్ రిలేషన్ అధికారి నుస్రత్ మండ్రూపకర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతం ఈ రైలు ఆదివారం తప్ప మిగతా ఆరు రోజులు నడుస్తున్నది. దీనిని మంగళవారం తప్ప విగతా ఆరు రోజులు నడిచేలా షెడ్యూల్ చేశారు. ఈనెల 10వ తేదీ నుంచి సికింద్రాబాద్ నుంచి విశాఖపట్నంకు అలాగే విశాఖపట్నం నుంచి సికింద్రాబాద్‌కు మార్చిన షెడ్యూల్ ప్రకారం రైళ్లు నడువనున్నాయి.

పంట పరిహారంలో అవకతవకలపై ఫిర్యాదు

పెడన : మిచౌంగ్ తుపాను వల్ల పంట నష్టపోయిన రైతులకు పరిహారం పంపిణీలో అవకతవకలకు పాల్పడిన వ్యవసాయ శాఖ సిబ్బందిపై జిల్లా వ్యవసాయ శాఖాధికారిణి ఎన్.పద్మావతి క్రిమినల్ కేసు పెట్టించారు. మిచౌంగ్ తుపాను కారణంగా అనర్హులైన 152 మంది నష్టపోయినట్టుగా చూపి వారి ఖాతాలకు రూ. 47.30 లక్షలు జమ చేశారు. దీంతో అర్హులైన రైతులు ఆందోళన చేశారు. అవకతవకలకు కారకులైన పెడన వ్యవసాయ శాఖ ఏవో జీవీ శ్రీనివాసరావు, వీఏఏలు ఎన్.హరిత, మహమ్మద్ తాజ్ అహమ్మద్, కంప్యూటర్ ఆపరేటర్ వై.నాగమల్లేశ్వరరావు, పీపీసీ టెక్నికల్ అసిస్టెంట్ కాగిత సరళలపై పద్మావతి కేసు పెట్టారు. సీఐ నాగేంద్రప్రసాద్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ఖోఖో పోటీలో తలపడుతున్న విద్యార్థులు

ముగిసిన నవోదయ క్లస్టర్ క్రీడలు

హనుమాన్‌జంక్షన్‌రూరల్, ఆగస్టు 9 : జవహర్ నవోదయ విద్యాలయ వేలేరు ఆవరణలో నిర్వహించిన క్లస్టర్ లెవెల్ క్రీడా పోటీలు గురువారం రాత్రితో ముగిసాయి. తొమ్మిది జిల్లాలకు చెందిన నవోదయ క్రీడాకారులు ఖోఖో, కబడ్డీ, షటిల్‌బ్యాడ్మింటన్, టేబుల్ టెన్నిస్ తదితర పోటీల్లో హోరాహోరీ గా తలపడ్డారు. అండర్ 14, అండర్ 17, అండర్19 విభాగాల్లో జరిగిన వివిధ క్రీడాంశాల్లో 223మంది విద్యార్థులు రీజనల్ స్థాయి పోటీలకు ఎంపికయ్యారని ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు తెలిపారు. తదనంతరం నిర్వహించిన సభలో ఎన్టీ ఫీడ్స్ జనరల్ మేనేజర్ బి.పి. ఇస్సాక్ ముఖ్యఅతిథిగా పాల్గొని విద్యార్థులకు బహుమతి ప్రదానం చేశారు. క్రీడల్లో పాల్గొనడం వల్ల క్రీడాస్ఫూర్తి పెరుగుతుందని విద్యార్థులకు సూచిస్తూ విజేతలను అభినందించారు. వివిధ జిల్లాలకు చెందిన నవోదయ విద్యార్థులు చేసిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆహూతులను ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ యదునందన్, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

చంద్రబాబుకు కలెక్టర్ సృజన స్వాగతం



తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం ప్రపంచ ఆదివాసీ దినోత్సవ వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరైన ముఖ్యమంత్రి చంద్రబాబుకు కలెక్టర్ జి.సృజన స్వాగతం పలికారు.

వసూళ్లు వద్దు!

▸▸ వీఆర్వోల అంతరంగిక సమావేశంలో గన్నవరం తహసీల్దార్ వ్యాఖ్యలు

▸▸ రైతులకు ఉచితంగా సేవలు అందించాలని ఆదేశాలు

▸▸ బ్రోకర్లకు చెక్‌పెట్టేలా చర్యలు

(ఆంధ్రజ్యోతి, విజయవాడ) : నాకు డబ్బులు ఇవ్వొద్దు.. ప్రొటోకాల్ కోసం డబ్బులు వసూళ్లు చేయవద్దు.. అంటూ వీఆర్వోల అంతరంగిక సమావేశంలో గన్నవరం తహసీల్దార్ కె.వెంకటశివయ్య వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశంగా మారింది. ఇటీవలే తహసీల్దార్‌గా శివయ్య బాధ్యతలు స్వీకరించిన సంగతి తెలిసిందే. గ్రామ రెవెన్యూ అధికారుల (వీఆర్‌ఓ)తో శుక్రవారం శివయ్య ఆంతరంగిక సమావేశాన్ని నిర్వహించారు. గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావును మర్యాదపూర్వకంగా కలిసిన నేపథ్యంలో, గత ప్రభుత్వంలో రైతులు పాస్‌బుక్‌లు, ఇతర సేవలకు సంబంధించి ఎదుర్కొన్న సమస్యలను శివయ్య దృష్టికి తెచ్చారు. అనంతరం వీఆర్వోలతో అంతరంగిక సమావేశంలో తహసీల్దార్ శివయ్య వ్యాఖ్యలు తీవ్ర చర్చనీయాంశమైంది. రైతులకు పట్టాదారు పుస్తకాలను ఉచితంగా అందజేయాల్సిందిగా ఆదేశించారు. వారి నుంచి ఎలాంటి డబ్బులు తీసుకోవద్దని గట్టిగా చెప్పారు. ప్రొటోకాల్ పేరుతో ఎలాంటి వసూళ్లు చేయవద్దని నిర్దేశించారు.



తెంపల్లికి సంబంధించి నెల రోజులకు పైగా పెండింగ్‌లో ఉన్న మ్యుటేషన్ కేసు

ఎవ్వరూ తనకు ఒక్క రూపాయి కూడా ఇవ్వాల్సిన పని లేదని చెప్పారు. లంచాలు వసూలు చేస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. తహసీల్దార్ కార్యాలయాన్ని బ్రోకర్ల కేంద్రంగా మార్చివేశారని, ఇకపై సహించేది లేదన్నారు.

ప్రైవేటు వ్యక్తుల పెత్తనం..

గతంలో ఏ తహసీల్దార్ ఇలా చెప్పలేదని వీఆర్వోలంతా చర్చించుకోవటం గమనార్హం. ఐదేళ్లుగా వీఆర్వోలు ఉత్సవ విగ్రహాలుగా పనిచేయాల్సి వచ్చేది. ప్రైవేటు వ్యక్తుల పెత్తనం నడిచేది. గన్నవరం తహసీల్దార్ కార్యాలయంలో చాలాకాలంగా దళారుల రాజ్యం నడుస్తోంది. పట్టాదారు పాసుపుస్తకాలకు బ్రోకర్లు వేలాది రూపాయలను వసూలు చేసేవారు. పాసు పుస్తకం ఇవ్వాలంటే ఎకరానికి రూ. 10 వేల చొప్పున వసూలు చేసేవారు. మ్యుటేషన్ల కోసం అక్రమ వసూళ్లు చేసేవారు. ప్రైవేటు వ్యక్తులు నేరుగా తహసీల్దార్లతో చేతులు కలిపి ఈ తతంగాన్ని నడిపించేవారు. నాటి వైసీపీ నేత ముఖ్య అనుచరులకు కొంత వాటాలు చెల్లించేవారు. ఇప్పటికీ భారీ సంఖ్యలో పాసుపుస్తకాలు ఆర్ఐ టేబుల్ మీద ఉన్నాయి. దీనికి ఉదాహరణ తెంపల్లి కేసులో భర్త చనిపోతే మ్యుటేషన్ కోసం దరఖాస్తు చేయగా.. నెల రోజులకు పైగా పెండింగ్‌లో ఉంది. కొత్త తహసీల్దార్ ఈ పెండింగ్ ఫైల్స్ బూజు దులపాల్సి ఉంది.

గిరిజనులను ఆదుకుంటాం

▸▸ ప్రపంచ ఆదివాసి దినోత్సవంలో కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

మచిలీపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని గిరిజనులను అన్ని విధాల ఆదుకుంటామని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని పురస్కరించుకుని కలెక్టరేట్‌లోని సమావేశపుహాలులో శుక్రవారం జిల్లాస్థాయి వేడుకలను నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, పాడేరు సబ్‌కలెక్టర్‌గా పనిచేసిన సమయంలో గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను స్వయంగా చూశానన్నారు. అరకు కాఫీ, సంబంధిత ఉత్పత్తులను విక్రయించుకునేందుకు కో-ఆపరేటివ్‌సొసైటీని ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ప్రభుత్వం గిరిజనుల సంక్షేమకోసం పనిచేస్తోందని,



జ్యోతి వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఎస్పీ గంగాధరరావు, తదితరులు

సంక్షేమ పథకాలు పొందాలంటే ఆధార్‌కార్డు తప్పనిసరిగా ఉండాలన్నారు. ఉన్నతాధికారులతో మాట్లాడి అందరికీ ఆధార్‌కార్డులు ఇప్పించేందుకు కృషి చేస్తానన్నారు. ఎస్పీ ఆర్.గంగాధరరావు మాట్లాడుతూ, గిరిజనుల పట్ల ఎవరైనా నేరాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తన దృష్టికి తీసుకువస్తే, పూర్తిస్థాయిలో న్యాయం చేస్తామని తెలిపారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన నూజివీడు ట్రిపుల్ ఐటీ అసిస్టెంట్ ప్రొఫెసర్ జ్యోతిలాల్ నాయక్ మాట్లాడుతూ, గత ప్రభుత్వం జీవోనెంబరు 52ద్వారా ఆర్థికంగా, రాజకీయంగా బలంగా ఉన్న బీసీ ఉపకులాలను ఎస్టీలలో కలిపేందుకు ప్రయత్నం చేసిందన్నారు. ఆ జీవోను వెంటనే రద్దు చేయాలని కోరారు. ఈసందర్భంగా 10మంది గిరిజనులకు హౌసింగ్‌స్కీం ద్వారా రూ.6.30లక్షల చెక్కును కలెక్టర్ అందజేశారు.

మళ్లీ గ్రేటర్

(5వ పేజీ తరువాయి)

కలుపుతూ ఈ డీపీఆర్ సిద్ధమైంది. గ్రేటర్ విజయవాడలో 8 జోన్లను ఏర్పాటు చేసేలా కూడా ప్రతిపాదనలు చేశారు. అయితే, అప్పట్లో ఆయా గ్రామాల నుంచి వ్యతిరేకత రావడం, ఎన్నికల సంవత్సరం కావడంతో టీడీపీ ప్రభుత్వం ఆ ప్రతిపాదనను తాత్కాలికంగా పక్కన పెట్టింది. 2019లో వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే గ్రేటర్ విజయవాడ ప్రతిపాదన పునరాలోచనలో పడింది. తొలుత 56 గ్రామాలను కలుపుతూ గ్రేటర్ విజయవాడను ఏర్పాటు చేయాలనుకున్న అధికారులు వైసీపీ హయాంలో 29 గ్రామాలకు కుదించారు. చివరికి అది కూడా కార్యరూపం దాల్చకుండానే మరుగునపడింది.

గ్రేటర్‌తో అభివృద్ధి పరుగులు

ఒకప్పుడు పన్నులు పెరుగుతాయనే భయంతో విజయవాడ చుట్టుపక్కల గ్రామాలు గ్రేటర్ ప్రతిపాదనను వ్యతిరేకించాయి. ప్రస్తుతం అధ్వాన పారిశుధ్యం, గోతులతో కూడిన రహదారులు, వెలగని వీధిదీపాలతో విసుగెత్తిపోయిన శివారు గ్రామాల ప్రజలు గ్రేటర్‌కు జై కొడుతున్నారు. 2020లో ఏర్పడిన తాడిగడప మున్సిపాలిటీలో విజయవాడ నగరంతో పోటీగా పన్నులు ఉన్నాయి. కానీ, ఆ స్థాయిలో మౌలిక వసతుల కల్పన జరగడం లేదు. కొండపల్లి మున్సిపాలిటీలోనూ అదే పరిస్థితి. మరోవైపు ఆయా ప్రాంతాల్లో జనసాంద్రత విపరీతంగా పెరిగిపోయింది. పెరుగుతున్న జనాభాకు తగ్గట్టు మౌలిక సౌకర్యాల కల్పన మాత్రం ఉండటం లేదు. ఇవన్నీ ప్రజలను గ్రేటర్‌కు మొగ్గుచూపేలా చేస్తున్నాయి.

ఇదీ ప్రాథమికంగా గ్రేటర్ ముఖచిత్రం

తాజాగా గ్రేటర్ విజయవాడలో ఏయే గ్రామాలను విలీనం చేయాలనే అంశంపై అధికారులు ప్రాథమిక కసరత్తు పూర్తి చేశారు. సుమారు 45 గ్రామాలతో గ్రేటర్ విజయవాడను ఏర్పాటు చేయాలని యోచిస్తున్నట్లు సమాచారం. వైఎస్సార్ తాడిగడప మున్సిపాలిటీలోని కానూరు, తాడిగడప, పోరంకి, యనమలకుదురు, కొండపల్లి, ఇబ్రహీంపట్నం, పెనమలూరు, గంగూరు, గోశాల, ఈడ్పుగల్లు, పునాదిపాడు, కంకిపాడు, వేల్పూరు, ఉప్పులూరు, రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, ఆత్కూరు, గూడవల్లి, కేసరపల్లి, వెంకటనరసింహాపురం, అజ్జంపూడి, బుద్ధవరం, గన్నవరం, వెదురుపావులూరు, సవారిగూడెం, జక్కులనెక్కలం, రామచంద్రపురం, పురుషోత్తపట్నం, బీబీగూడెం, చినఅవుటపల్లి, అల్లాపురం, నున్న, పాతపాడు, పి.నైనవరం, అంబాపురం, జక్కంపూడి, గొల్లపూడి, తుమ్మలపాలెం, గుంటుపల్లి, రాయనపాడు, మల్కాపురం, గూడూరుపాడు ఇతర గ్రామాలను విలీనం చేస్తూ సుమారు 343 చదరపు కిలోమీటర్లతో గ్రేటర్ ప్రతిపాదన సిద్ధం చేయాలని భావిస్తున్నారు. తుదిదశలో మరిన్ని గ్రామాలు కూడా కలిసే అవకాశం లేకపోలేదని అధికారులు చెబుతున్నారు.

లైట్ మెట్రో డీపీఆర్‌పై కదలిక

(5వ పేజీ తరువాయి)

ఆయన విజయవాడలోని ప్రధాన కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. గత టీడీపీ ప్రభుత్వ హయాంలో మెట్రో ప్రాజెక్టులకు సంబంధించి సిద్ధం చేసిన ప్రణాళిక వివరాలన్నింటినీ ఇవ్వాలని ఆయన సిబ్బందిని ఆదేశించారు. ఇప్పటికే మునిసిపల్ మంత్రి నారాయణతో చర్చించారు. ఈ వ్యవహారాలను చూసే సంబంధిత ప్రిన్సిపల్ సెక్రటరీతో కూడా ఆయన చర్చించారు. ఇక ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడమే తరువాయి. త్వరలోనే ముఖ్యమంత్రితో ఏపీఎంఆర్‌సీ అధికారులు భేటీ కానున్నారని సమాచారం. ఈ సమావేశంలో విజయవాడ, విశాఖ మెట్రో ప్రాజెక్టులకు సంబంధించి చర్చ జరిగే అవకాశం ఉంది.

అన్న క్యాంటీన్లు సిద్ధం చేయండి

▸▸ ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన పిలుపు

కృష్ణలంక, ఆగస్టు 9 : నిరుపేదలకు తక్కువ ధరకే భోజనాన్ని అందించే అన్న క్యాంటీన్లను ప్రారంభోత్సవానికి సిద్ధం చేయాలని ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. ఈనెల 15వ తేదీన రాష్ట్రవ్యాప్తంగా అన్న క్యాంటీన్లను లాంఛనంగా ప్రారంభిస్తున్న దృష్ట్యా నగరంలో



అన్న క్యాంటీన్లను పరిశీలిస్తున్న కలెక్టర్ సృజన

క్యాంటీన్ల నిర్వహణ పనులను శనివారం నాటికి పూర్తిచేసి సిద్ధం చేయాలన్నారు. దీనిలో భాగంగా వన్‌టౌన్ గాంధీ పార్కు వద్ద, అలంకార్ ధర్నాచౌక్ వద్ద అన్న క్యాంటీన్లను శుక్రవారం కలెక్టర్ సృజన, నగరపాలక సంస్థ కమిషనర్ హెచ్.ఎం.ధ్యానచంద్ర, ఆర్డీవో బీహెచ్ భవానీశంకర్‌లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, అన్న క్యాంటీన్ల ద్వారా నిరుపేదలకు నాణ్యమైన ఆహారాన్ని రూ.5కే అందించనున్నారన్నారు. క్వాలిటీ, క్వాంటిటీ విషయంలో రాజీ పడకుండా నాణ్యమైన ఆహారాన్ని అందించే విధంగా సిద్ధం చేయాలన్నారు. ప్రతి రోజు ఉదయం అల్పాహారంతో పాటు మధ్యాహ్నం, రాత్రి భోజనం మూడుపూటలా అన్న క్యాంటీన్ల ద్వారా పేదలకు రూ.15 లకే లభ్యంకానున్నదన్నారు. ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు.

కూటమి పాలన చూసి ఓర్వలేక

▸▸ జగన్‌పై దేవినేని ఉమా ఫైర్

గొల్లపూడి, ఆగస్టు 9 : కూటమి ప్రభుత్వంలో సీఎం చంద్రబాబు చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను చూసి ఓర్వలేక మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి అరుపులు పెడబొబ్బలు పెడుతున్నారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాజీ మంత్రి దేవినేని ఉమామహేశ్వరరావు అన్నారు. ఆయన గొల్లపూడిలో విలేకర్లతో మాట్లాడుతూ.. అసెంబ్లీలో కూర్చునే దమ్ము ధైర్యం లేక తాడేపల్లి కొంపలో కూర్చొని మాట్లాడుతున్నాడని దుయ్యబట్టారు. ప్రతిపక్ష హోదా కావాలని, సీఎం సెక్యూరిటీ కావాలని కోర్టులో కేసులు వేసిన జగన్ రెడ్డి నేడో రేపో ముఖ్యమంత్రి పదవి కావాలని వేసినా ఆశ్చర్యపోవాల్సిన అవసరం లేదన్నారు. ఆయన చర్యలే ఆయన మానసిక పరిస్థితికి అద్దం పడుతున్నాయన్నారు. 36 హత్యలు జరిగాయంటాడు.. ఒక్క దానికి ఆధారం ఉండదు. రోత పత్రిక, సోషల్ మీడియాలో విషప్రచారం మాత్రం ఆపడం లేదన్నారు. జగన్ తీసుకున్న అహంకారపు మూర్ఖపు నిర్ణయాల వల్ల రాష్ట్ర వ్యాప్తంగా వైసీపీ నేతలు జెండా పీకేస్తున్నారన్నారు. తన బాబాయ్ హత్య కేసులో ఫోన్ డేటా కాల్ లిస్టు సీబీఐకి, కోర్టుకు ఇచ్చే ధైర్యం ఉందా జగన్ అని ప్రశ్నించారు.

కట్న వేధింపులు.. భార్యపై దాడి



మచిలీపట్నం టౌన్, ఆగస్టు 9 : మచిలీపట్నం భాస్కరపురానికి చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగిని అదనపు కట్నం కోసం ఆమె భర్త కిరాతకంగా కొట్టడంపై పోలీసులు కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. భాస్కరపురానికి చెందిన స్వర్ణకు, హైదరాబాద్‌కు చెందిన వెంకట రోహిత్‌తో మూడేళ్ల క్రితం వివాహమైంది. రోహిత్ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాడు. అక్కడే మరో కంపెనీలో స్వర్ణ పనిచేస్తోంది. పెళ్లయిన నాటి నుంచి భర్త, అత్తలు అదనపు కట్నం కోసం వేధించడం, పుట్టింటికి వెళ్లిపోమని బెదిరించేవారు. ఒక రోజు ఉద్యోగానికి వెళ్లి తిరిగి వచ్చిన స్వర్ణ ఆమె భర్త, అత్తలు ఇల్లు ఖాళీ చేసి వేరే చోటకు వెళ్లిపోవడంతో ఖంగుతింది. నాటి నుంచి భర్తతో కాపురం చేసేందుకు స్వర్ణ శాంతియుత పోరాటం చేస్తోంది. ఈ నేపథ్యంలో స్వర్ణ దిశ పోలీసులను ఆశ్రయించింది. ఇదిలా ఉంటే మచిలీపట్నంలో బంధువుల ఇంటికి వచ్చిన భర్త, అత్తలు శుక్రవారం స్వర్ణను తీవ్రంగా గాయపరిచారు. బాధితురాలు జిల్లా ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స పొందుతోంది. న్యాయం చేయాలంటూ పోలీసులను ఆశ్రయించింది.



పోలీసులు స్వాధీనం చేసుకున్న మోటార్ బైక్‌లు

బైక్ దొంగలు దొరికారు

వీరులపాడు : వీరులపాడు మండలం జుజ్జూరు, అల్లూరు గ్రామానికి చెందిన ఆరుగురు మైనర్ బాలురు ముఠాగా ఏర్పడి ఇళ్ల ముందు ఉంచిన మోటార్ బైక్‌లను తస్కరిస్తూ ఎట్టకేలకు పోలీసులకు పట్టుబడ్డారు. శుక్రవారం ఏసీపీ రవికిరణ్ విలేకర్లతో మాట్లాడుతూ, చెడు వ్యసనాలకు బానిసై డబ్బు కోసం వక్ర మార్గం ఎంచుకున్న ఆరుగురు మైనర్లు మోటార్ బైక్‌లు తస్కరిస్తున్నారని చెప్పారు. బాధితుల ఫిర్యాదు మేరకు సాంకేతిక పరిజ్ఞానంతో స్థానిక ఎస్సై లక్ష్మణుడు, సిబ్బందితో కలిసి నిందితులను పట్టుకుని, వారి నుంచి 10 మోటార్ బైక్‌లను స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు.

ఇసుక తరలిస్తూ..



జగ్గయ్యపేట రూరల్ : రామచంద్రునిపేట గ్రామ సరిహద్దులో తెలంగాణాలోకి ఇసుక అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకుని చిల్లకల్లు పోలీసులకు అప్పగించినట్టు ఎస్ఈబీ సీఐ మణికంఠ రెడ్డి తెలిపారు. శుక్రవారం సాధారణ తనిఖీలలో భాగంగా ఇసుక అక్రమంగా తరలిస్తున్నారనే సమాచారంతో పరిశీలించగా అనుమంచిపల్లి స్టాకు యార్డు నుంచి రామచంద్రునిపేటకు వే బిల్లు తీసుకుని ఖమ్మం జిల్లా నేలకొండపల్లి మండలం అప్పలనర్సాపురం గ్రామానికి తరలిస్తున్న ఐదు టన్నుల ఇసుకట్రాక్టర్, ముదిగొండ మండలం బాణాపురం గ్రామానికి చెందిన డ్రైవర్ పేరం అఖిల్‌ను అదుపులోకి తీసుకున్నట్టు తెలిపారు. వేల్టా కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ సతీష్ చెప్పారు.

బ్రాయిలర్ ధరలు

అమరావతి (రూ.లలో)

బ్రాయిలర్ బర్డ్	92, 101, 112
చికెన్ విత్ స్కిన్	178
చికెన్ స్కిన్‌లెస్	188

నెక్ కోడిగుడ్డు ధర

విజయవాడ జోన్ రైతు ధర రూ. 4.30

నేడు విద్యుత్ సరఫరా ఉండని ప్రాంతాలు

పాయకాపురం, ఆగస్టు 9 : విద్యుత్ లైన్లకు, ట్రాన్స్‌ఫార్మర్లకు మరమ్మతుల కారణంగా స్థానిక విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని కొత్త రాజీవ్‌నగర్, జర్నలిస్టు కాలనీ, కండ్రిక రామాలయం, ఉడా కాలనీలోని ఎంఐజీ పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు కార్యనిర్వాహక ఇంజనీర్ బీవీ సుధాకర్ శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. **అజిత్‌సింగ్‌నగర్:** అజిత్‌సింగ్‌నగర్ విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని కొత్త తోటవారి వీధి, వైఎస్సార్ రోడ్డు, సిద్ధార్థ స్ట్రీట్, సాగి హనుమంత్‌రావు వీధి, వినాయక కాలనీ, భరతమాత కాలనీ పరిసర ప్రాంతాల్లో శనివారం ఉదయం 8 గంటల నుంచి 10 గంటల వరకు విద్యుత్ సరఫరా ఉండదు.

ప్రారంభానికి సిద్ధమైన అన్న క్యాంటీన్లు

15న అందుబాటులోకి ...

భవానీపురం, ఆగస్టు 9: పశ్చిమ నియోజకవర్గంలోని 43వ డివిజన్ ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డు, హెచ్‌బీ కాలనీ పోలీస్‌స్టేషన్ రోడ్డులో ఈ నెల 15న ప్రారంభోత్సవానికి అన్న క్యాంటీన్లు సిద్ధం అయ్యాయి. టీడీపీ ప్రభుత్వం హయాంలో 2017 నుంచి ఈ రెండు చోట్ల అన్న క్యాంటీన్లు కూలీలు, ఐరన్‌యార్డు ముఠా కార్మికులకు ఎంతోగానో ఉపయోగపడ్డాయి. ఉదయం 8 గంటల నుంచి 10 గంటలకు అల్పాహారం, మధ్యాహ్నం 12 గంటల నుంచి, రాత్రి 7 గంటల నుంచి ఈ క్యాంటీన్‌లు రూ.5లకు భోజనం అందించే వారు. ప్రతీ చోట 500 మందికి తగ్గకుండా అతి తక్కువ ధరకే నాణ్యమైన ఆహారం అందించడంతో కూలీలు ఇంటి తరహాలో అల్పాహారం, భోజనం స్వీకరించేవారు. వైసీపీ ప్రభుత్వం రాగానే దుర్మార్గంగా అన్నక్యాంటీన్లను మూసేసి, వాటి స్థానంలో సచివాలయాలను ఏర్పాటు చేసింది. ఎన్నికల్లో మాట ఇచ్చిన విధంగా సీఎం చంద్రబాబు రాష్ట్ర వ్యాప్తంగా ఈనెల 15న 103 చోట్ల అన్నక్యాంటీన్లు ప్రారంభిస్తుండగా, ఈ రెండు కూడా ఆ జాబితాలో ఉన్నాయి. ఎంపీ కేశినేని శివనాథ్, ఎమ్మెల్యే సుజనా చౌదరి ఆధ్వర్యంలో ఇవి ప్రారంభించనున్నట్లు మాజీ కార్పొరేటర్ యేదుపాటి రామయ్య తెలిపారు.




ఆర్టీసీ వర్క్‌షాపు రోడ్డులో, హెచ్‌బీ కాలనీ పోలీస్ స్టేషన్ రోడ్డులో ముస్తాబైన అన్న క్యాంటీన్లు

18వ డివిజన్‌లో...



రాణిగారితోట: టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో 18వ డివిజన్‌లో అన్న క్యాంటీన్ ప్రారంభానికి సిద్ధం అవుతోంది. గత ఐదేళ్ల వైసీపీ ప్రభుత్వం అన్న క్యాంటీన్ల భవనాలను సచివాలయాలకు వాడడంతో వాటి రూపురేఖలను మార్చేశారు. దీంతో ప్రస్తుతం ఆయా భవనాలను టీడీపీ ప్రభుత్వం గతంలో క్యాంటీన్లు ఏవిధంగా ఉన్నాయో అదే విధంగా తీర్చిదిద్దాలని ఆదేశించడంతో అధికారులు వాటి పునరుద్ధరణ పనులను శరవేగంగా పూర్తి చేస్తున్నారు. వారం రోజుల గడువు ఉండడంతో పనులు పూర్తయ్యే దశకు వచ్చాయి.

పేదలు చాలా ఆనందంగా ఉన్నారు



అన్న క్యాంటీన్లను తెలుగుదేశం ప్రభుత్వం తిరిగి ప్రారంభించేందుకు సిద్ధమవుతుండడంతో పేద ప్రజలు చాలా ఆనందంగా ఉన్నారు. ఇకపై తక్కువ ధరకే పేదలకు కడుపు నిండా ఆహారం అందుతుంది.

\- వేముల దుర్గారావు, టీడీపీ 18వ డివిజన్ అధ్యక్షుడు

ప్రభుత్వ చిత్తశుద్ధికి నిదర్శనం

టీడీపీ నేత మోరబోయిన రాంబాబు



అన్న క్యాంటీన్లను తిరిగి ప్రారంభించనుండటం ప్రభుత్వం చిత్తశుద్ధికి నిదర్శనం. ఈ రెండు కేంద్రాలు మా 43వ డివిజన్‌లోనే ఉండటం శుభ పరిణామం.

ఆలయాల్లో శ్రావణ సందడి

● భక్తులతో కిటకిటలాడిన శక్తిక్షేత్రాలు

చిట్టినగర్, ఆగస్టు 9: నగరంలోని ఆలయాలన్నీ శుక్రవారం భక్తులతో కిటకిటలాడాయి. శ్రావణ శుక్రవారం కావడంతో మహిళలు తెల్లవారుజామునే పుణ్యస్నానాలు ఆచరించి ఆలయాలకు తరలి వెళ్ళి అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. చిట్టినగర్‌లోని పద్మావతి గోదాదేవి సమేత వేంకటేశ్వర స్వామి ఆలయంలోని వేంకటేశ్వరస్వామిని వివిధ రకాల పూలతో, పద్మావతి అమ్మవారిని ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు. గోదాదేవి అమ్మవారికి ప్రత్యేక అభిషేకం చేశారు. మహాలక్ష్మి అమ్మవారిని అర్చకులు అమరలింగేశ్వర ప్రసాదశర్మ ప్రత్యేకంగా అలంకరించి విశేష పూజలు నిర్వహించారు భక్తులు ఆలయప్రాంగణంలో కుంకుమ పూజలు చేశారు. భక్తులకు అసౌకర్యం కలగకుండా నిర్వాహకులు ఏర్పాట్లు పర్యవేక్షించారు.

● కొత్తపేట గంగానమ్మ దేవస్థానంలో ఉన్న గంగానమ్మ, మంగళగౌరి, శాంభవి అమ్మవార్లకు విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు అమ్మవార్లను పూలతో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. భక్తులు అమ్మవార్లను దర్శించుకొని పూజలు చేశారు. ఆలయ నిర్వాహకులు భక్తులకు ప్రసాదాల వితరణ చేశారు. ● పాలఫ్యాక్టరీ చనమోలు వెంకట్రావ్ ఫ్లైఓవర్ సమీపంలో విజయ దుర్గా, రామలింగేశ్వర అంజనేయ స్వామి దేవాలయంలో విజయ దుర్గా అమ్మవారికి ప్రత్యేక పూజలు, కుంకుమార్చనలు చేశారు. ఆలయ వ్యవస్థాపకుడు, అర్చకులు చింతలపాటి వెంకటసుబ్రహ్మణ్య శర్మ అమ్మ వారికి విశేష అభిషేకాలు చేశారు. భక్తులు అమ్మవారిని దర్శించుకొని పూజలు చేశారు.



ప్రత్యేక అలంకారంలో చిట్టినగర్ మహాలక్ష్మి అమ్మవారు, విజయదుర్గా అమ్మవారి ఉత్సవమూర్తి

నాగపంచమి ప్రత్యేక పూజలు

గవర్నర్‌పేట: నాగపంచమి పర్వదినాన్ని పురస్కరించుకుని శుక్రవారం లెనిన్ సెంటర్‌లో ఓం శ్రీషిర్డి నాగసాయిబాబా, నాగమానసాదేవి మందిరంలో నాగమానసాదేవి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మహిళా భక్తులు మందిరాన్ని సందర్శించి జంట నాగుల విగ్రహాలకు పాలతో అభిషేకాలు నిర్వహించి పండ్లు, పసుపు, కుంకుమ సమర్పించారు. మందిర వ్యవస్థాపక అధ్యక్షుడు సుధాస్వామి ఆధ్వర్యంలో హారతి జరిగింది. భక్తులకు ప్రసాదవితరణ నిర్వహించారు.

ఇంటర్ డిస్ట్రిక్ట్ సాఫ్ట్‌టెన్నిస్‌లో రేవంత్‌కు పతకం

మొగల్రాజపురం, ఆగస్టు 9: ఏపీ జూనియర్ ఇంటర్ డిస్ట్రిక్ట్ సాఫ్ట్ టెన్నిస్ చాంపియన్‌షిప్ పోటీల్లో మొగల్రాజపురం శారద కళాశాల విద్యార్థి ఎం.రేవంత్(ఇంటర్) ద్వితీయ స్థానం సాధించాడు. శనివారం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో విద్యార్థిని కళాశాల ఛైర్మన్ డాక్టర్ వై. రమేష్ బాబు, మేనేజింగ్ డైరెక్టర్ వై.శారదా దేవి అభినందించారు. కళాశాల జీఎం జీవిరావు, అడ్వైజర్ ఈఎస్ఆర్‌కే ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

యువకుడిపై పోక్సో కేసు

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 9 : ప్రేమ పేరుతో బాలికను వేధిస్తున్న యువకుడిపై అజిత్‌సింగ్‌నగర్ పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. వివరాల ప్రకారం స్థానిక లూనాసెంటర్ ప్రాంతానికి చెందిన బాలిక(16)ను అదే ప్రాంతానికి చెందిన ఆనంద్(21) ప్రేమ పేరుతో వేధింపులకు గురిచేస్తున్నాడు. విషయం తెలుసుకున్న బాలిక తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

● అయోధ్యనగర్‌కు చెందిన బాలికను అదే ప్రాంతానికి చెందిన బాలుడు(15) ప్రేమపేరుతో వేధిస్తున్నాడు. గురువారం రాత్రి బాలిక ఇంటి దగ్గరలోని దుకాణానికి వెళ్లి వస్తుండగా బాలుడు అడ్డగించి ప్రేమించాలంటూ బెదిరించాడు. బాలిక ద్వారా విషయం తెలుసుకున్న తల్లిదండ్రులు అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు పోక్సో కేసు దర్యాప్తు చేస్తున్నారు.

స్ట్రామ్ వాటర్ నిధులతో నగరం అభివృద్ధి

● కేంద్రంతో మాట్లాడటానికి సీఎం అంగీకారం ● ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

గుణదల, ఆగస్టు 9: నగర అభివృద్ధికి కేంద్రంతో మాట్లాడి స్ట్రామ్ వాటర్ నిధులను అధిక భాగం కేటాయించేలా చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు అంగీకరించారని తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ తెలిపారు. స్థానిక 4వ డివిజన్లో ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ శుక్రవారం పర్యటించి స్థానికులను సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఇప్పటికే ఈ అంశంపై నగర పరిధిలోని ముగ్గురు ఎమ్మెల్యేలం చర్చించుకుని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లామని అన్నారు. ఎల్ఐసీ కాలనీ, క్రీస్తురాజపురం పరిసర ప్రాంతాల్లో కొద్దిపాటి వర్షానికే వర్షంనీరు నిల్వ ఉంటున్నాయని తెలిపారు. స్థానిక నెల్సన్ మండేలా పార్క్ రోడ్లో అసాంఘిక కార్యకలాపాలు జరుగుతున్నాయని వాటిని అరికట్టడానికి చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, స్థానికులు కలిసి పనిచేస్తే మంచిఫలితాలు రావడం ఖాయమన్నారు. కార్పొరేషన్ అధికారులు, మాచవరం పోలీసులు ఈ విషయమై దృష్టి పెట్టాలని ఆదేశించారు. కార్పొరేటర్ సాంబశివరావు, పెద్దలు పాల్గొన్నారు.



నాల్గో డివిజన్లో సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్

బీఎస్ఆర్‌కేలో వైద్యశిబిరం

మొగల్రాజపురం: స్థానిక జమ్మిచెట్టు సెంటర్‌లో ఉన్న బోయపాటి శివరామకృష్ణయ్య మున్సిపల్ ప్రాథమికోన్నత పాఠశాలలో ఆంధ్రామోటార్ మర్చంట్స్ అసోసియేషన్(అమ్మ) శనివారం భారీ వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ ప్రారంభించి మాట్లాడుతూ విద్యార్థులకు ఆరోగ్య సమస్యల పట్ల అవగాహన ఉండాలన్నారు. అమ్మ అధ్యక్షుడు వడ్లమూడి వెంకటేశ్వరరావు మాట్లాడుతూ పాఠశాలలో విద్యార్థులకు, తల్లిదండ్రులకు ఎన్ఆర్ఐ మెడికల్ అకాడమీ అడ్మినిస్ట్రేటర్ మండవ విష్ణువర్ధనరావు, ప్రొఫెసర్ లక్ష్మి చౌదరి ఆధ్వర్యంలో డాక్టర్లు, వైద్య సిబ్బంది చెవి, ముక్కు, గొంతు, నేత్ర, చర్మ, గైనిక్, జనరల్ విభాగంలో పరీక్షలు నిర్వహించామన్నారు. కార్పొరేటర్ చెన్నుపాటి ఉషారాణి, అమ్మ మాజీ అధ్యక్షుడు యార్లగడ్డ సుబ్బారావు, ప్రధాన కార్యదర్శి సుంకర చంద్రశేఖర్, కోశాధికారి అన్నే శ్రీనివాసరావు, పూర్వ అధ్యక్షుడు బొబ్బానారాయణ రావు, ఉపాధ్యక్షుడు సుబ్బారావు, హెచ్ఎం నాగరాజు, నగేష్ పాల్గొన్నారు.

ఇళ్లల్లోకి వస్తున్న వరద నీటిని తొలగించండి

కృష్ణలంక: కృష్ణానదికి వరద ప్రవాహం పెరుగుతుండటంతో కృష్ణలంక 21వ డివిజన్ పాత పోలీస్‌స్టేషన్ రోడ్డు చివర ఉన్న ఘాట్ సమీపంలో రిటైనింగ్ వాల్ కిందగా వరద ఊట నీరు కరకట్టను ఆనుకుని వున్న ఇళ్లల్లోకి చేరడంతో స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. దీనిని పరిశీలించేందుకు శుక్రవారం ఉదయం ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్, గోరిపర్తి నామేశ్వరరావు, స్థానికులతో కలిసి ఆ ప్రాంతాన్ని పరిశీలించారు. నీట మునిగిన ఇళ్లను వీక్షించారు. మోటారు పెట్టించి ఇళ్లల్లోకి వచ్చిన మురుగునీరు, ఊటనీటి మొత్తాన్ని నదిలోకి తోడేయాలని గద్దె ఆదేశించారు. టీడీపీ నాయకుడు కేశనం భావన్నారాయణ, జనసేన నాయకుడు కొవ్వూరు కిరణ్‌బాబు పాల్గొన్నారు.

21వ డివిజన్‌లో ఫ్రై డే - డ్రై డే

ఫ్రైడే - డ్రై డే కార్యక్రమంలో భాగంగా కృష్ణలంక 21వ డివిజన్‌లో మలేరియా, డెంగ్యూ వ్యాధులను అరికట్టేందుకు ఆరోగ్యశాఖ సిబ్బంది, ఆశా కార్యకర్తలు ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్ మాట్లాడుతూ ప్రజారోగ్యంపై చంద్రబాబు ఎప్పటికప్పుడు చర్యలు తీసుకొంటున్నారన్నారు. మలేరియా సిబ్బంది, టీడీపీ నాయకులు గోరిపర్తి నామేశ్వరరావు, కేశనం భావన్నారాయణ, కొవ్వూరి కిరణ్‌బాబు పాల్గొన్నారు.

ఘనంగా ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠ

పాయకాపురం, ఆగస్టు 9 : స్థానిక జై సంతోషిమాత ఆలయంలో ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠ మహోత్సవ కార్యక్రమం శుక్రవారం ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ అధ్యక్షుడు చిన్ని చిట్టిబాబు ఆధ్వర్యంలో వేద పండితుడు దెందుకూరి శ్రీకాంత్ శర్మ నేతృత్వంలో వేద మంత్రోచ్ఛరణలతో అంగరంగ వైభవంగా అమ్మవారి ఆలయంలో ధ్వజస్తంభ, శిఖర ప్రతిష్ఠా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమా హాజరై ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం 5000 మందికి అన్న సంతర్పణ చేశారు. ఆలయ కమిటీ సభ్యులు నాగేశ్వరరావు, మార్కండేయులు, గుంటయ్య చిన్ని లక్ష్మీ, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.



ఆలయ శిఖర ప్రతిష్ఠ చేస్తున్న వేద పండితులు

59వ డివిజన్‌లో ఎమ్మెల్యే బొండా ఉమా పర్యటన



అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 9 : అజిత్‌సింగ్‌నగర్ 59వ డివిజన్‌లోని పలు ప్రాంతాల్లో శుక్రవారం ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు పర్యటించి స్థానిక సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా బొండా ఉమా మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత శుభ్రతను పాటించాలని తద్వారా వ్యాధులు దూరమవుతాయని పేర్కొన్నారు.

ప్రిన్స్ మహేష్‌బాబు పుట్టినరోజు వేడుకలు

గవర్నర్‌పేట, ఆగస్టు 9: సినీనటుడు, ప్రిన్స్ మహేష్‌బాబు పుట్టిన రోజు సందర్భంగా లెనిన్ సెంటర్‌లోని ఓం శ్రీ షిర్డినాగ సాయిబాబా, నాగమానసాదేవి మందిరంలో శుక్రవారం అభిమానులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలిండియా సూపర్‌స్టార్ కృష్ణ, మహేష్‌బాబు ఫ్యాన్స్ రాష్ట్ర అధ్యక్షుడు సుధాస్వామి అభిమానులు ఏర్పాటు చేసిన భారీ కేక్‌ను కట్ చేసి, స్వీట్లు పంచారు. మహిళలకు క్యారేజి బాక్సులు పంపిణీ చేశారు. మహేష్‌బాబు అభిమానులు పాల్గొన్నారు.



మహిళలకు క్యారేజీ బాక్సులు అందజేస్తున్న సుధాస్వామి

మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

కుట్టుమిషన్ల పంపిణీలో ఎమ్మెల్యే సుజనా చౌదరి

విద్యాధరపురం, ఆగస్టు 9 : మహిళలు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని పశ్చిమ ఎమ్మెల్యే సుజనా చౌదరి అన్నారు. రోటరీ విజయవాడ మిడ్ టౌన్, రోటరీ విజయవాడ శ్రీదుర్గా విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం భవానీపురం ఎన్డీఏ కార్యాలయంలో జరిగిన కుట్టు మిషన్ల పంపిణీ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేసిన అనంతరం ఆయన మాట్లాడుతూ కోల్ ఇండియా లిమిటెడ్ కుట్టుమిషన్లను అందించిందన్నారు. రోటరీ పాస్ట్ డిస్ట్రిక్ట్ గవర్నర్ రావూరి వెంకట సుబ్బారావు, ఛైర్మన్ గొడుగు కృష్ణారెడ్డి, గుడిపాటి కిషోర్, కె.వి.శ్రీనివాసరావు, మార్ట్ ఆంధ్రా ఫౌండేషన్ శివశంకర్‌రావు, కూటమి నాయకులు అడ్డూరి శ్రీరామ్, ఎంఎస్ బేగ్, తిరుపతి అనూష, అబ్దుల్ ఖాదర్, రోటరీ మహిళలు, తదితరులు పాల్గొన్నారు.



మహిళలకు కుట్టుమిషన్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సుజనా

కనకమహాలక్ష్మి కో -ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ శాఖ ప్రారంభం

39వ డివిజన్‌లో కనకమహాలక్ష్మి కో ఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ శాఖను శుక్రవారం ఎమ్మెల్యే సుజనా చౌదరి ప్రారంభించారు. బ్యాంక్ ఛైర్మన్ కొమ్మారెడ్డి రాంబాబు, టీడీపీ జాతీయ అధికార ప్రతినిధి కొమ్మారెడ్డి పట్టాభిరామ్, బ్యాంక్ వైస్ ఛైర్మన్ గోలి రామకృష్ణ, సీఈవో కె.శ్యామ్‌ప్రసాద్, బీఎం సత్యవతి, విజయవాడ చాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు బాలవెంకటరత్నం, నాయకులు బేగ్, లక్ష్మణరావు పాల్గొన్నారు.

గోవిందరాజులు పాఠశాల విద్యార్థుల శాంతి ర్యాలీ

పటమట, ఆగస్టు 9: యుద్ధాలను నివారించి ప్రపంచ మానవాళి వికాసానికి ఐక్యరాజ్య సమితి కృషి చేయాలని ఇస్కఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కాగితాల రాజశేఖర్ కోరారు. నాగసాకి డే సందర్భంగా శుక్రవారం ఇస్కఫ్, అయిప్సో ఆధ్వర్యంలో పటమట గోవిందరాజులు మున్సిపల్ పాఠశాలలో విద్యార్థినీ విద్యార్థులకు యుద్ధాల వలన జరిగే అనర్థాలపై అవగాహన నిర్వహించారు. పాఠశాల ఆవరణ నుంచి స్థానిక సర్కిల్-3 మున్సిపల్ కార్యాలయం వరకు శాంతి ర్యాలీ నిర్వహించారు. జిల్లా అధ్యక్షుడు పరుచూరి అజయ్‌కుమార్, కార్యదర్శి మోతుకూరి అరుణ్‌కుమార్, మానవత సంస్థ ఛైర్మన్ వేమూరు బాబూరావు, ప్రధాన అధ్యాపకుడు మురాల శ్రీనివాసరావు, వ్యాయామ అధ్యాపకుడు డి. రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.



బొడ్డురాయి పార్కింగ్ ప్రదేశానికి టెండర్ పిలవాలి

వన్‌టౌన్, ఆగస్టు 9 : కెనాల్ రోడ్డులోని బొడ్డురాయి పార్కింగ్ ప్రదేశానికి వెంటనే టెండర్లు పిలవాలని, నగర కార్పొరేషన్ పరిధిలో ఉన్న అన్ని పార్కింగ్ ప్రదేశాలకు టెండర్లను పిలవటంపై కమిషనర్ దృష్టిపెట్టాలని జై భీమ్‌రావ్ భారత్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి, విజయవాడ పశ్చిమ ఇన్‌చార్జి పరసా సురేష్ శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. గత ఏడాది కెనాల్ రోడ్డు టెండర్ల నిర్వహణలో అవినీతి జరిగినట్లయితే కమిషనర్ విచారణ జరిపించి చర్యలు తీసుకోవాలన్నారు. లేదంటే తమ పార్టీ తరపున కోర్టును ఆశ్రయిస్తామని హెచ్చరించారు. కెనాల్ రోడ్డు పార్కింగ్ పక్కనే బొడ్డురాయి పార్కింగ్ స్థలం కూడా ఉందని, దానికి టెండర్లు పిలవాలని తెలిపారు. కార్పొరేషన్ షాపింగ్ కాంప్లెక్సుల్లో ఎస్సీలకు రిజర్వు చేసినట్లే పార్కింగ్‌లకు కూడా రిజర్వు చేయాలన్నారు.

కుమార్తె కనిపించడం లేదని ఫిర్యాదు

అజిత్‌సింగ్‌నగర్, ఆగస్టు 9 : తన కుమార్తె కనిపించడంలేదని ఓ మహిళ శుక్రవారం అజిత్‌సింగ్‌నగర్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాల ప్రకారం స్థానిక ఎంకే బేగ్ స్కూల్ ప్రాంతానికి చెందిన బాలిక(17) టైలరింగ్ నేర్చుకుంటోంది. గురువారం మధ్యాహ్నం టైలరింగ్ షాపునకు వెళుతున్నానని చెప్పి వెళ్లింది. రాత్రి ఎంత సేపటికీ ఇంటికి రాకపోవడంతో బంధువులు, స్నేహితులను ఆరా తీసినా బాలిక ఆచూకీ తెలియలేదు. దీంతో బాలిక కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలను సాంకేతిక విద్యలో ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన 'ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్' నోటిఫికేషన్ వెలువడింది. 'ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ)' ఏటా దీనిని ఆఫర్ చేస్తోంది. ఈ స్కీమ్ ద్వారా డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో అర్హులైన అమ్మాయిలకు ఆర్థిక సహకారం అందిస్తారు. ఒక కుటుంబం నుంచి ఇద్దరు అమ్మాయిలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షలకు మించకూడదు. అకడమిక్ మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.



ఏఐసీటీఈ

ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్

తెలుగు రాష్ట్రాల్లో స్కాలర్‌షిప్‌లు

- డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో ఒక్కోదానికి 5,000 చొప్పున దేశవ్యాప్తంగా మొత్తం 10,000 స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా నిర్దేశిత కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి దరఖాస్తు చేసుకొన్న విద్యార్థినులందరికీ స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పిస్తారు.
- డిప్లొమా కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 318, తెలంగాణకు 206 స్కాలర్‌షిప్‌లు కేటాయించారు.
- డిగ్రీ కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 566, తెలంగాణకు 424 స్కాలర్‌షిప్‌లు ప్రత్యేకించారు.

అర్హత వివరాలు

- డిప్లొమా కేటగిరీకి అప్లయ్ చేసుకోవాలంటే గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఈ విద్యా సంవత్సరానికి టెక్నికల్ డిప్లొమా లెవెల్ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా డిప్లొమా ద్వితీయ సంవత్సరంలో చేరినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- డిగ్రీ కేటగిరీకి దరఖాస్తు చేసుకోవాలంటే గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఏదేని టెక్నికల్ డిగ్రీ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా రెండో సంవత్సరంలో ప్రవేశం పొందినవారు కూడా అర్హులే.
- పదోతరగతి/ఇంటర్ పూర్తిచేసిన రెండేళ్లలోపు ఏఐసీటీఈ గుర్తింపు పొందిన సంస్థలో డిప్లొమా/డిగ్రీ ప్రవేశం పొంది ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇతర మెరిట్ స్కాలర్‌షిప్స్ పొందుతున్నవారు, పీఎంఎస్ఎస్ఎస్ స్కీం కింద చదువుకుంటున్నవారు, నాన్ టెక్నికల్ కోర్సుల్లో చేరినవారు, డ్యూయెల్ డిగ్రీ/పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందినవారు, ఇతరత్రా స్టయిపెండ్/ఆదాయం పొందుతున్నవారు దరఖాస్తుకు అనర్హులు.

స్కాలర్‌షిప్

- టెక్నికల్ డిప్లొమా రెగ్యులర్ కోర్సులో చేరినవారికి మూడేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు రెండేళ్లు; టెక్నికల్ డిగ్రీ రెగ్యులర్ కోర్సులో చేరినవారికి నాలుగేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు మూడేళ్లపాటు స్కాలర్‌షిప్ అందిస్తారు. కాలేజ్ ఫీజు, కంప్యూటర్ కొనుగోలు, సాఫ్ట్‌వేర్, స్టేషనరీ, బుక్స్, ఎక్విప్‌మెంట్ తదితరాల నిమిత్తం ఏడాదికి రూ.50,000లు ఇస్తారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) విధానంలో నేరుగా అమ్మాయి బ్యాంక్ ఖాతాకు ఈ మొత్తాన్ని జమ చేస్తారు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 31
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** పదోతరగతి/ఇంటర్ సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు; ఆదాయ ధ్రువీకరణ పత్రం; సంబంధిత కోర్సులో అడ్మిషన్ పొందిన లెటర్; ట్యూషన్ ఫీజు రిసీట్; ఆధార్ లింక్‌తో ఉన్న బ్యాంక్ ఖాతా నంబర్; ఐఎఫ్ఎస్‌సీ కోడ్; కుల ధ్రువీకరణ పత్రం; ఆధార్ కార్డ్; అభ్యర్థి ఫొటో
- **ఇన్‌స్టిట్యూట్ వెరిఫికేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 15
- **డీఎన్ఓ/ఎస్ఎన్ఓ/ఎంఎన్ఓ వెరిఫికేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 30
- **వెబ్‌సైట్:** scholarships.gov.in

దిక్సూచి DIKSUCHI

జేఎన్‌టీయూహెచ్‌లో స్పాట్ అడ్మిషన్స్



హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూ)కి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ యూనివర్సిటీ ఫారిన్ రిలేషన్స్(డీయూఎఫ్ఆర్)- డిగ్రీ ప్రోగ్రామ్‌లలో విదేశీ కోటా కింద మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో సీట్లు అలాట్ చేస్తారు. ఎఫ్ఎన్/పీఐఓ/సీఐడబ్ల్యూజీ/ఎన్ఆర్ఐ కేటగిరీల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఆసక్తిగలవారు ఒరిజినల్ సర్టిఫికెట్లు, నిర్దేశిత ఫీజులతో క్యాంపస్‌కు హాజరు కావాలి.

నాలుగేళ్ల బీటెక్ విభాగాలు-సీట్లు

- సీఎస్ఈ-ఏఐఎంఎల్ 6, సీఎస్ఈ-సైబర్ సెక్యూరిటీ 5, ఈసీఈ 4, ఈఈఈ 6, మెకానికల్ 6, సివిల్ 6, కెమికల్ 6, మెటలర్జీ 8, బయోటెక్నాలజీ 6, జియో ఇన్ఫర్మాటిక్స్ 8 సీట్లు చొప్పున మొత్తం 61 సీట్లు ఉన్నాయి.

అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ విభాగాలు-సీట్లు

- సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ విభాగాల్లో ఒక్కోదానిలో 5 సీట్లు చొప్పున మొత్తం 25 సీట్లు ఉన్నాయి.

మూడేళ్ల మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్-సీట్లు

- బీబీఏ ప్రోగ్రామ్‌లో 6 సీట్లు ఉన్నాయి.
- **స్పాట్ అడ్మిషన్స్:** ఆగస్టు 12 నుంచి
- **వేదిక:** డైరెక్టరేట్ ఆఫ్ యూనివర్సిటీ ఫారిన్ రిలేషన్స్, జేఎన్‌టీయూహెచ్, కూకట్‌పల్లి, హైదరాబాద్
- **వెబ్‌సైట్:** www.jntuh.ac.in

ఫిల్మ్ డైరెక్షన్‌లో ఆన్‌లైన్ కోర్సు

పుణెలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌టీఐఐ) ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ ఓపెన్ లెర్నింగ్(సీఎఫ్ఓఎల్)- 'ఫండమెంటల్స్ ఆఫ్ ఫిల్మ్ డైరెక్షన్' కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. మొత్తం 33 సీట్లు ఉన్నాయి.

కోర్సు వివరాలు: కోర్సు వ్యవధి అయిదు రోజులు. ఆగస్టు 26 నుంచి కోర్సు ప్రారంభమౌతుంది. ప్రతి రోజూ ఉదయం పదిన్నర నుంచి మధ్యాహ్నం పన్నెండున్నర వరకు, మరల మధ్యాహ్నం రెండున్నర నుంచి సాయంత్రం నాలుగున్నర వరకు సెషన్స్ ఉంటాయి. ఆంగ్ల మాధ్యమంలో తరగతులు నిర్వహించినప్పటికీ హిందీ మాధ్యమంలోనూ వివరణ ఇస్తారు. ఈ కోర్సులో సినిమా, లాంగ్వేజ్ ఆఫ్ సినిమా, స్పేస్ అండ్ టైమ్ ఆఫ్ సినిమా, ఫిల్మ్ ఫోరం, ఫిల్మ్ ఇమేజ్, ఫిల్మ్ సౌండ్, ఎలిమెంట్స్ ఆఫ్ స్టోరీ, స్క్రీన్‌ప్లే, వర్కింగ్ విత్ యాక్టర్స్, రోల్ ఆఫ్ ఫిల్మ్ డైరెక్టర్ తదితర అంశాలు వివరిస్తారు.

అర్హత: పదోతరగతి/పన్నెండో తరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 1 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి. అభ్యర్థులు కనీసం 4 జీబీ ర్యామ్ గల డెస్క్‌టాప్/ల్యాప్‌టాప్, విండోస్ 7/8/10 ఆపరేటింగ్ సిస్టమ్, ఆడియో-వీడియో సాఫ్ట్‌వేర్, హెడ్‌ఫోన్/ఇయర్‌ఫోన్, హెచ్‌డీ వెబ్ క్యామ్, రోజుకి కనీసం 5 జీబీ ఇంటర్నెట్ ప్యాక్, లేటెస్ట్ వెబ్ బ్రౌజర్ ఏర్పాటు చేసుకోవాలి.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 12
- **వెబ్‌సైట్:** ftii.ac.in

'దిక్సూచి' వెబ్ పేజీలో..
సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.
లేదా ఈ కింది యూఆర్ఎల్
https://ejyothy.com/GABEQtfలో చదవండి.

నవ్య | చిత్రజ్యోతి



మురారి చూస్తూ మూడుముళ్లు

అభిమాన హీరో సినిమా రిలీజ్ అవుతోందంటే క్షీరాభిషేకాలు, హారతులు, తీన్‌మార్ డప్పుల మోతలతో ఫ్యాన్స్ సందడి చేయడం తెలిసిందే. ఇప్పుడు మహేశ్‌బాబు అభిమానులు మరో అడుగు ముందుకేశారు. శుక్రవారం ఆయన నటించిన 'మురారి' చిత్రం రీ రిలీజ్ అయింది. ఈ సందర్భంగా కొందరు అభిమానులు థియేటర్లలో ప్రేక్షకులకు అక్షింతలు పంచగా, మరికొందరు థియేటర్లలోనే పెళ్లి చేసుకొన్నారు. ఈ వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. తెలుగు సినిమాల్లో పెళ్లి పాటల ప్రస్తావన తెస్తే అందులో 'మురారి' చిత్రంలోని 'అలనాటి రామచంద్రుడు' గీతం తప్పకుండా ఉంటుంది. అందుకేనేమో 'మురారి' సినిమా రీ రిలీజ్‌ను తమ పెళ్లికి వేదికగా చేసుకున్నారు మహేశ్‌బాబు అభిమానులు. 'అలనాటి రామచంద్రుడు' గీతం తెరపై ప్లే అవుతోన్న సమయంలో తన ప్రియురాలు మెడలో మూడు ముళ్లు వేశాడు ఓ యువకుడు. మరికొన్ని థియేటర్లలో అభిమానులు ప్రేక్షకులకు అక్షింతలు పంచారు. మహేశ్‌బాబు, సోనాలి బింద్రే పెళ్లి సీన్ రాగానే వాటిని తెరపైకి విసురుతూ వారంతా సందడి చేస్తున్న వీడియోలు నెట్టింట వైరల్ అవుతున్నాయి. కృష్ణవంశీ దర్శకత్వం వహించిన 'మురారి' చిత్రం 2001లో విడుదలై ఘన విజయం అందుకొంది.

షూటింగ్ షురూ



అభిమానులంతా ఎప్పుడెప్పుడు షూటింగ్ మొదలవుతుందా అని ఎదురుచూస్తున్న క్రేజీ ప్రాజెక్ట్‌లో డైరెక్టర్ ప్రశాంత్ నీల్, జూనియర్ ఎన్టీఆర్ సినిమా ఒకటి. 'ఎన్టీఆర్ నీల్' వర్కింగ్ టైటిల్‌తో తెరకెక్కనున్న ఈ సినిమాను శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్, డైరెక్టర్ నీల్ కుటుంబ సభ్యులతో పాటు సలువురు సినీ ప్రముఖులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మేకర్స్ మాట్లాడుతూ "ఈ సినిమాపై ఎన్ని అంచనాలు ఉన్నాయో తెలిసిందే. ఆ అంచనాలను మించి ఈ సినిమా ఉంటుంది. ఓ వైవిధ్యమైన సినిమాటిక్ ఎక్స్‌పీరియన్స్‌ను అందిస్తుంది" చెప్పారు. పాన్ ఇండియా ప్రాజెక్టుగా తెరకెక్కనున్న ఈ సినిమాపై భారీ అంచనాలు ఉన్నాయి. నవీన్ యెర్నేని, వై.రవిశంకర్, హరికృష్ణ కొసరాజు నిర్మిస్తున్న ఈ సినిమా 2026 జనవరి 9న విడుదల కానుంది.



బచ్చన్ అలరిస్తాడు

'మిస్టర్ బచ్చన్' సినిమాతో కథానాయికగా తెలుగుతెరకు పరిచయమౌతున్నారు భాగ్యశ్రీ బోర్సే. ఇప్పటికే రిలీజైన టీజర్, ట్రైలర్‌లో తన అందం, అభినయంతో కుర్రకారు మనసును దోచేసిన ఆమె.. ఈ నెల 15న సినిమా విడుదలవుతున్న సందర్భంగా మీడియాతో ముచ్చటించారు. "ఇందులో నేను పోషించిన పాత్ర పేరు జిక్కీ. సినిమాలో నా పాత్ర చాలా కీలకమైనది. దర్శకుడు హరీశ్ శంకర్ ఈ కథ చెప్పగానే నచ్చేసింది. నా పాత్రకు నేనే డబ్బింగ్ చెప్పాను. అంచనాలను మించేలా దర్శకుడు ఈ సినిమాను అద్భుతంగా తెరకెక్కించారు. ఇది బాలీవుడ్ సినిమా 'రైడ్'కు రీమేక్‌గా తెరకెక్కినా ఇందులో వినోదం, ప్రేమకథ అదనంగా ఉంటాయి. రవితేజ లాంటి అగ్ర నటుడితో కలసి నటించడం చాలా మధురానుభూతి. మిక్కీ.జే.మేయర్ సంగీతం ఈ సినిమాను మరో స్థాయికి తీసుకెళ్లింది. థియేటర్లో ప్రతి క్షణం ఎంజాయ్ చేసే సినిమా ఇది" అని చెప్పారు.

సూర్యకు స్వల్ప గాయం

తమిళ హీరో సూర్య స్వల్పంగా గాయపడ్డారు. ఆయన తాజాగా నటిస్తున్న చిత్రం షూటింగ్‌లో ఈ ప్రమాదం జరిగింది. అభిమానులు ఆందోళన చెందడంతో సూర్య స్నేహితుడు, సహ నిర్మాత రాజశేఖర్ పాండ్యన్ తన ఎక్స్ ఖాతాలో ఓ ట్వీట్ చేశారు. 'ప్రియమైన అభిమానులారా.. ఇది కేవలం చిన్న గాయం మాత్రమే. దయచేసి ఎవరూ ఆందోళన చెందకండి. మీ అందరి ఆదరాభిమానాలు, ప్రేమ, ప్రార్థనలతో సూర్య బాగానే ఉన్నారు' అని పేర్కొన్నారు. కాగా, 'కంగువా' సినిమా తర్వాత కార్తీక్ సుబ్బరాజ్ దర్శకత్వంలో 'సూర్య44' అనే వర్కింగ్ టైటిల్‌తో ఈ కొత్త చిత్రం తెరకెక్కుతోంది. ఊటీలో రెండో షెడ్యూల్ షూటింగ్ జూలై 26 నుంచి శరవేగంగా సాగుతోంది. ఇందులో భాగంగా 'నవానగర్ ప్యాలెస్'లో జూనియర్ ఫైటర్లతో కలిసి పోరాట సన్నివేశాన్ని చిత్రీకరిస్తుండగా, సూర్య తలకు స్వల్ప గాయమైంది. ఆ వెంటనే ఆయన్ని సమీపంలోని ఆస్పత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. ఈ ఘటన కారణంగా షూటింగ్ నిలిపివేశారు. చికిత్స అనంతరం సూర్య మళ్లీ లొకేషన్‌కు వచ్చి షూటింగ్‌లో పాల్గొన్నారు.

చెన్నై, (ఆంధ్రజ్యోతి)



కీలక షెడ్యూల్‌లో...



తమిళ స్టార్ హీరో అజిత్‌కుమార్ నటిస్తున్న లేటెస్ట్ చిత్రం 'గుడ్ బ్యాడ్ అగ్లీ'. తెలుగు-తమిళ భాషల్లో తెరకెక్కుతున్న ఈ బైలింగువల్ చిత్రానికి 'మార్క్ ఆంటోని' ఫేమ్ అధిక్ రవిచంద్రన్ దర్శకత్వం వహిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్ సమర్పణలో నవీన్ యెర్నేని, వై రవిశంకర్ నిర్మిస్తున్నారు. ఇటీవలే విడుదలైన ఫస్ట్ లుక్ అందరినీ ఆకట్టుకుంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన కీలక షెడ్యూల్ హైదరాబాద్‌లో జరుగుతోంది. సంక్రాంతి కానుకగా 2025లో చిత్రం విడుదలవుతోంది.

కొత్తగా...

నిరీక్షణకు తెర



'కేజీఎఫ్' తర్వాత యశ్ ఏ సినిమా చేస్తారా అని ఎదురు చూస్తున్న అభిమానుల నిరీక్షణకు తెర పడింది. ఆయన హీరోగా నటించే పాన్ ఇండియా మూవీ 'టాక్సిక్.. ఎ ఫెయిరీ టేల్ ఫర్ గ్రోన్ అప్స్' చిత్రం షూటింగ్ బెంగళూరులో పూజా కార్యక్రమాలతో మొదలైంది. యశ్ పుట్టిన రోజున ప్రారంభమైన ఈ చిత్రానికి గీతూ మోహన్‌దాస్ దర్శకత్వం వహిస్తున్నారు. పవర్‌ఫుల్ కథతో, ఎమోషనల్ సీన్స్‌తో విజువల్‌గా ఉన్నతంగా ఈ చిత్రాన్ని నిర్మిస్తామని నిర్మాత వెంకట్ కె నారాయణ చెప్పారు.

నిర్మాతగా మారిన దర్శకుడు



సీనియర్ దర్శకుడు ముత్యాల సుబ్బయ్య సమర్పణలో ఆయన తనయుడు ముత్యాల అనంత కిశోర్ నిర్మించే 'తల్లి మనసు' చిత్రం షూటింగ్ శుక్రవారం ఉదయం అన్నపూర్ణ స్టూడియోలో మొదలైంది. ముహూర్తపు షాట్‌కు ఏషియన్ గ్రూప్ మేనేజింగ్ డైరెక్టర్ భరత్ నారంగ్ కెమెరా స్విచ్ ఆన్ చేయగా, సీనియర్ నిర్మాత పోకూరి బాబూరావు తొలి క్లాప్ ఇచ్చారు. 'టైటిల్‌ను బట్టి చూస్తేనే ఇది ఎంత మంచి సబ్జెక్టో మీకు అర్థమవుతుంది' అన్నారు ముత్యాల సుబ్బయ్య. ఓ మధ్యతరగతి తల్లి చుట్టూ తిరిగే కుటుంబ కథా చిత్రమిదని దర్శకుడు శ్రీనివాస్ చెప్పారు.

ఎన్టీఆర్ మునిమనవడితో



నందమూరి హరికృష్ణ, బాలకృష్ణలతో సినిమాలు రూపొందించిన దర్శకుడు, సీనియర్ ఎన్టీఆర్ వీరాభిమాని అయిన వై.వి.ఎస్. చౌదరి తాజాగా ఓ చిత్రాన్ని రూపొందించనున్నారు. న్యూ టాలెంట్ రోర్స్ (ఎన్.టి.ఆర్.)పతాకంపై ఆయన సతీమణి గీత ఈ సినిమాను నిర్మించనున్నారు. సీనియర్ ఎన్టీఆర్ ముని మనవడు, హరికృష్ణ మనవడు నందమూరి తారక రామారావు ఈ చిత్రంతో హీరోగా పరిచయమవుతున్నారు. అలాగే తెలుగు అమ్మాయి వీణా రావుని హీరోయిన్‌గా పరిచయం చేస్తున్నట్లు శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వై.వి.ఎస్. చౌదరి చెప్పారు.

'డీల్' కుదిరిందా?



హీరో హను కోట్ల స్వీయ దర్శకత్వంలో తెరకెక్కుతున్న చిత్రం 'డీల్'. పద్మారమా కాంతారావు, కొల్వి రామకృష్ణ నిర్మిస్తున్నారు. ఇటీవలే ఈ సినిమా పోస్టర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా హను కోట్ల మాట్లాడుతూ "ఇదో డిఫరెంట్ కథతో వస్తున్న సినిమా. సస్పెన్స్ థ్రిల్లర్‌గా తెరకెక్కుతున్న ఈ సినిమా అందరినీ అలరిస్తుంది" అని తెలిపారు.

కర్ణాటక నాటక అకాడమీ పురస్కారాన్ని తిరస్కరించిన ప్రకాశ్‌రాజ్



కర్ణాటక నాటక అకాడమీ వార్షిక పురస్కారాన్ని విలక్షణ నటుడు ప్రకాశ్‌రాజ్ తిరస్కరించారు. ఈ మేరకు 'ఎక్స్'లో శుక్రవారం పోస్ట్ చేశారు. అభిమానులు, అకాడమీని క్షమాపణలు కోరారు. పురస్కారాన్ని తీసుకునేందుకు తన మనస్సాక్షి అంగీకరించడం లేదని, క్షమించాలని అన్నారు. ఇప్పుడిప్పుడే నాటకరంగంవైపు వెనుతిరిగానని, చేయాల్సిన పనులు ఎక్కువే ఉన్నాయని పేర్కొన్నారు. తనకంటే ఎంతో మంది అర్హులు రంగస్థలంలో ఉన్నారని, అందుకే తన మనస్సాక్షి అంగీకరించడం లేదని, పురస్కారాన్ని తిరస్కరించానని తెలిపారు.

బెంగళూరు (ఆంధ్రజ్యోతి)

నేనా.. సింగిలా..!



కీర్తి సురేశ్ నటించిన తమిళ చిత్రం 'రఘుతాత'. ఈ నెల 15న సినిమా విడుదలవుతోంది. ఈ సినిమా ప్రమోషన్స్‌లో ఉన్న ఆమె.. ఓ పాడ్‌కాస్ట్‌లో ఆసక్తికర విషయాన్ని పంచుకున్నారు. "ప్రస్తుతం నా కెరీర్‌ను ఎంతో బాగా ఆస్వాదిస్తున్నాను. నా దృష్టిలో పెళ్లి అంటే ఇద్దరు వ్యక్తులు ఒకరికొకరు గౌరవం ఇచ్చుకుంటూ జీవితాంతం కొనసాగడమే" అని పేర్కొన్నారు. ఓ విలేఖరి మీరు సింగిలా అని ఆమెని అడగ్గా.. "నేను మీకెప్పుడు సింగిల్ అని చెప్పలేదు కదా" అని బదులిచ్చారు. దీంతో ఆమె రిలేషన్‌షిప్‌లో ఉన్నారంటూ వస్తున్న వార్తలు నిజమేనేమో అని అభిమానులు భావిస్తున్నారు.

దుబాయ్‌లో అమ్మేస్తాడేమో...

తాప్సీ పన్ను నటించిన 'ఖేల్ ఖేల్ మే' ఈ నెల 15న విడుదలవుతోంది. ఈ చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా ఆమె మీడియాతో ముచ్చటించి ఓ ఆసక్తికర విషయాన్ని తెలియజేశారు. "నేను, నా భర్త మథియస్ బో 2013లో మొదటిసారి కలుసుకున్నాం. మొదటి సారి తనతో డేటింగ్‌కు వెళ్లాల్సినప్పుడు నన్ను దుబాయ్ రమ్మని మథియస్ ఆహ్వానించాడు. ఆ విషయం నా మిత్రురాలికి చెబితే.. జాగ్రత్త.. ఆయన నిన్ను దుబాయ్‌లో అమ్మేస్తాడేమో.. ఎందుకైనా మంచిది.. మా అక్క నంబర్ తీసుకో" అని ఓ స్నేహితురాలు చెప్పిన విషయాన్ని ఆమె గుర్తుచేసుకున్నారు.



సుప్రీం కోర్టులో లాపతా లేడీస్ ప్రదర్శన

బాలీవుడ్ చిత్రం 'లాపతా లేడీస్'కు అరుదైన గౌరవం దక్కింది. దేశ అత్యున్నత న్యాయస్థానం సుప్రీం కోర్టు చరిత్రలో తొలిసారి ప్రదర్శించిన సినిమాగా చరిత్ర సృష్టించింది. సుప్రీం కోర్టు వజ్రోత్సవాలను పురస్కరించుకొని 'లాపతా లేడీస్'ను శుక్రవారం సాయంత్రం కోర్టు ఆడిటోరియంలో ప్రత్యేకంగా ప్రదర్శించారు. ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ డీవై చంద్రచూడ్‌తో పాటు ఇతర న్యాయమూర్తులు, న్యాయస్థానం సిబ్బంది వారి కుటుంబ సభ్యులతో కలసి ఈ చిత్రాన్ని వీక్షించారు. తన సొంత ప్రొడక్షన్‌లో ఆమిర్‌ఖాన్ ఈ చిత్రాన్ని నిర్మించగా, ఆయన మాజీ భార్య కిరణ్‌రావు దర్శకత్వం వహించారు. వారిద్దరూ ఈ ప్రదర్శనకు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. లింగ సమానత్వం నేపథ్యంలో తెరకెక్కిన 'లాపతా లేడీస్' చిత్రం ఈ ఏడాది మార్చిలో విడుదలైంది. కమర్షియల్‌గా విజయం సాధించకపోయినా, విమర్శకుల ప్రశంసలతో పాటు పలు పురస్కారాలు అందుకుంది.

ప్రేమకథను ప్రశంసిస్తున్నారు



విజయ్‌శంకర్ హీరోగా నటించిన 'పాగల్ వర్సెస్ కాదల్' చిత్రం శుక్రవారం సినిమా విడుదలై మంచి టాక్‌తో దూసుకుపోతోంది. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ "డైరెక్టర్ ఈ కథ చెప్పినప్పుడు చాలా కొత్తగా అనిపించింది. కథకు అందరూ కనెక్ట్ అయ్యారు. ప్రేమకథ కొత్తగా ఉందని ప్రేక్షకులు ప్రశంసిస్తున్నారు. ఈ సినిమా విజయం సాధించడంతో ఎంతో ఆనందంగా ఉంది. యూత్, ఫ్యామిలీ.. ఇలా అన్ని వర్గాలకు చెందిన ప్రేక్షకులు సినిమాను ఆదరిస్తున్నారు" అని చెప్పారు.

ప్రణయ గాథ



ఎస్.ఎస్. సైదులు, భ్రమరాంబిక, అర్పిత లోహి ప్రధాన పాత్రల్లో తెరకెక్కుతున్న చిత్రం '1980ల రాధేకృష్ణ'. ఇస్మాయిల్ షేక్ దర్శకత్వంలో ఊడుగు సుధాకర్ నిర్మిస్తున్నారు. శుక్రవారం ఈ సినిమా టీజర్‌ను విడుదల చేశారు. ఈ సందర్భంగా దర్శకుడు ఇస్మాయిల్ షేక్ మాట్లాడుతూ "ఇదో అద్భుతమైన ప్రేమ కథ. ఈ సినిమా ప్రేక్షకులను తప్పకుండా అలరిస్తుంది" అని చెప్పారు.

2008 నుంచి మన రెజ్లర్లు పతకం లేకుండా ఒలింపిక్స్ నుంచి వెనుదిరిగిందే లేదు. కానీ పారిస్‌లో మెడల్ మాత్రం అతి సమీపం వరకు వచ్చినట్టే వచ్చి చేజారింది. గెలవాల్సిన మ్యాచ్‌లో నిషా దహియా గాయంతో వైదొలగడం.. ఇక కనీసం రజతం ఖాయమనుకున్న వినేశ్ ఫొగట్‌పై అనర్హత వేటుతో భారత క్రీడాభిమాని ఆవేదన మరింత రెట్టింపయ్యింది. ఈసారిక రిక్తహస్తాలతో వెనుదిరగడమేనా అనుకున్న వేళ.. నేనున్నానంటూ.. 21 ఏళ్ల అమన్ సెహ్రావత్ ముందుకొచ్చాడు. సెమీస్‌లో ఓడిన అతను కాంస్య పతక పోరుకు సై అంటూ ఉడుం పట్టుతో ప్రత్యర్థిని పడగొట్టాడు. మెడల్‌ను సగర్వంగా మెడలో వేసుకుని త్రివర్ణపతాకాన్ని రెపరెపలాడించాడు.

అమన్.. అదరహో

57 కిలోల ఫ్రీస్టయిల్‌లో కాంస్యం కైవసం

భారత్ ఖాతాలో ఆరో పతకం



పారిస్: కుస్తీలో భారత్ బోణీ కొట్టింది. పురుషుల 57 కేజీల ఫ్రీస్టయిల్ విభాగంలో 21 ఏళ్ల అమన్ సెహ్రావత్ కాంస్య పతకం సాధించాడు. తద్వారా పారిస్ ఒలింపిక్స్‌లో పతకం సాధించిన తొలి రెజ్లర్‌గా అమన్ నిలిచాడు. శుక్రవారం ప్యూర్టోరికోకు చెందిన డారియన్ క్రజ్‌ను అమన్ 13-5 తేడాతో చిత్తుగా ఓడించాడు. తద్వారా 2008 బీజింగ్ ఒలింపిక్స్ నుంచి భారత రెజర్లు పతకాలతోనే స్వదేశానికి వెళ్లే సంప్రదాయాన్ని కొనసాగించినట్టయ్యింది. అలాగే హరియాణాకు చెందిన అమన్‌కిది తొలి ఒలింపిక్స్ కావడం విశేషం. గురువారం జరిగిన సెమీస్‌లో అమన్ జపాన్ రెజ్లర్ రీ హిగుచి చేతిలో ఓడి కాంస్య పతక పోరుకు అర్హత సాధించాడు. ఓవరాల్‌గా భారత్ తరఫున ఒలింపిక్ పతకం సాధించిన ఏడో రెజ్లర్‌గా అమన్ సెహ్రావత్ నిలిచాడు. సుశీల్ ఒక్కడే రెండు పతకాలు సాధించాడు.

పూర్తి ఆధిపత్యం

రాత్రి 11.10 గంటలకు ఆరంభమైన కాంస్య పోరులో అమన్ వ్యూహాత్మకంగా ప్రత్యర్థిపై పట్టు సాధించాడు. మొదట తను ప్రత్యర్థికి చిక్కకుండా రింగ్ దాటి బయటకు వెళ్లడంతో పాయింట్ కోల్పోయినా.. ఆ తర్వాత డారియన్‌ను పడేయడంతో రెండు పాయింట్లు సాధించి ఆధిక్యం పొందాడు. కానీ అటు డారియన్ కూడా వెంటనే కోలుకుని రెండు పాయింట్లతో పోటీ ఇచ్చాడు. ఆ వెంటనే అమన్ వేగంగా కదిలి పడగొట్టడంతో 4-3తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఓ దశలో 6-5తో డారియన్ నుంచి కాస్త పోటీ ఎదురైనా ఆ తర్వాత తను అలిసిపోయినట్టు కనిపించాడు. అటు అమన్ మాత్రం పదేపదే అతడిని టేక్‌డౌన్ చేయడంతో పాయింట్లు వేగంగా పెరిగాయి. ప్రత్యర్థికి మరో పాయింట్ ఇవ్వకుండా 13-5తో ముగించడంతో భారత శిబిరంలో కంచు సంబరాలు ఆరంభయ్యాయి.

8 రెజ్లింగ్‌లో భారత్‌కు ఇది ఎనిమిదో ఒలింపిక్ పతకం

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

'త్రివర్ణ పతాకం గుర్తుతో కూడిన జెర్సీని ధరించడం నాకెంతో గర్వంగా ఉంటుంది. అందుకే బౌట్‌లో దిగిన ప్రతి సారీ అత్యుత్తమ ప్రదర్శన చేసి దేశం గర్వపడేలా చేస్తా..'

ఈ మాట అన్నది భారత యువ రెజ్లర్ అమన్ సెహ్రావత్. అలా అద్భుత ప్రదర్శన చేస్తున్నాడు కాబట్టే రెజ్లింగ్‌లో ప్రవేశించిన అనతికాలంలోనే ఒలింపిక్స్ కాంస్య పతకం సహా అంతర్జాతీయ స్థాయిలో ఎన్నో మరపురాని విజయాలు అందుకున్నాడు. 21 ఏళ్లకే విశ్వ క్రీడల్లో పతకం నెగ్గే స్థాయికి ఎదిగిన అమన్ బాల్యం విషాదమయం. హరియాణాలోని ఝజ్జర్ జిల్లా బిరోహర్ గ్రామం అమన్ స్వస్థలం. 11 ఏళ్ల వయస్సులోనే తల్లిదండ్రులు సోమ్‌వీర్ సెహ్రావత్, కమలేష్ సెహ్రావత్‌లను కోల్పోయాడు. దాంతో అమన్, అతడి చెల్లి పూజా సెహ్రావత్ ఆలనాపాలనను తాతయ్య సుధీర్ సెహ్రావత్ చేపట్టాడు. తల్లిదండ్రులను కోల్పోయి తీవ్ర డిప్రెషన్‌కు లోనైన అమన్ కోలుకున్నాడంటే అందుకు అతడి నానమ్మ మంగేరామ్ సెహ్రావతే కారణం. అమన్‌కు చిన్నతనం నుంచే రెజ్లింగ్‌పట్ల ఎంతో అనురక్తి. ఊరిలో జరిగే బురద కుస్తీ పోటీల్లో ఉత్సాహంగా పాల్గొనేవాడు. 2012 ఒలింపిక్స్‌లో సుశీల్ కుమార్ రజత పతకం గెలవడం అమన్‌లో రెజ్లింగ్‌పట్ల మరింత స్ఫూర్తి రగిల్చింది. అది గమనించిన అతడి తాతయ్య ఢిల్లీలోని ప్రఖ్యాత ఛత్రశాల్ స్టేడియంలో చేర్పించాడు. కోచ్ లలిత్ కుమార్ ఆధ్వర్యంలో కొద్ది సమయంలోనే రాటుదేలిన సెహ్రావత్ 2021లోనే తొలి జాతీయ టైటిల్ తన ఖాతాలో వేసుకున్నాడు. పట్టుదల, అంకితభావం, అద్భుత నైపుణ్యాల ఆలంబనగా రెజ్లింగ్‌లో తన కెరీర్‌కు బాటలు వేసుకొన్న అమన్ 2022లో అండర్-23 వరల్డ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకం కొల్లగొట్టాడు. తద్వారా ఈ టోర్నమెంట్‌లో పసిడి పతకం చేజిక్కించుకున్న తొలి భారత రెజ్లర్‌గా రికార్డు నెలకొల్పాడు. ఆపై 2022 ఆసియా క్రీడల్లో పురుషుల 57 కిలోల విభాగంలో కాంస్య పతకం చేజిక్కించుకొని సత్తా చాటాడు. తదుపరి ఏడాది ఆస్తానా వేదికగా జరిగిన ఆసియా రెజ్లింగ్ చాంపియన్‌షిప్‌లో స్వర్ణ పతకంతో అబ్బురపరిచాడు. ఇదే ఊపులో జాగ్రెబ్ రెజ్లింగ్ టోర్నమెంట్‌లో పసిడి పతకం సొంతం చేసుకున్నాడు. ఆ టోర్నీలో చైనాకు చెందిన ఝౌ వాన్‌హావోను 10-0తో చిత్తు చేసి విజేతగా నిలవడం 21 ఏళ్ల అమన్ అద్భుత నైపుణ్యాలకు తార్కాణం. ఇక.. తాను ఆరాధ్య రెజ్లర్ రవి దహియాకు షాకిచ్చిన అమన్ ఒలింపిక్ బెర్త్ పట్టేయడం విశేషం.



తల్లిదండ్రులను కోల్పోయి.. డిప్రెషన్‌లోకి వెళ్లి!

అతి పిన్న వయసులో ఒలింపిక్ పతకం సాధించిన భారత ప్లేయర్‌గా అమన్ (21 ఏళ్లు) **1**



అథ్లెటిక్స్‌లో పోరాటం ముగిసె..

ట్రాక్ అండ్ ఫీల్డ్ విభాగంలో భారత అథ్లెట్ల పోరాటం ముగిసింది. శుక్రవారం పురుషుల 4X400మీ. రిలే టీమ్ కొద్దిలో ఫైనల్ అవకాశాన్ని కోల్పోయింది. ఆసియా గేమ్స్‌లో స్వర్ణం సాధించిన వీరిపై ఒలింపిక్స్‌లోనూ అంచనాలు నెలకొన్నాయి. అయితే ముహమ్మద్ అనాస్, ముహమ్మద్ అజ్మల్, అమోజ్ జాకబ్, రాజేశ్ రమేశ్‌లతో కూడిన ఈ బృందం శుక్రవారం జరిగిన హీట్స్ 2 క్వాలిఫికేషన్‌లో 3:00.58 సెకన్ల టైమింగ్‌తో సీజన్ బెస్ట్ సాధించింది. అయితే రెండో స్థానంలో నిలిచిన నైజీరియా నిబంధనల ఉల్లంఘనతో డిస్‌క్వాలిఫై కావడంతో భారత్ ఐదు నుంచి నాలుగో స్థానానికి చేరింది. అలాగే భారత్‌కన్నా కేవలం 0.32 సెకన్ల వేగంతో రేసును ముగించి మూడో స్థానంలో నిలిచిన ఇటలీ ఫైనల్‌కు వెళ్లింది. రెండు హీట్స్‌ల నుంచి టాప్-3 టీమ్స్‌తో పాటు ఓవరాల్‌గా వారి తర్వాత అత్యంత వేగంగా పరిగెత్తిన రెండు టీమ్స్ ఫైనల్స్‌కు వెళతాయి. ఆ క్రమంలో భారత జట్టు మొత్తం 16 జట్లలో పదో స్థానంలో నిలిచింది. ఇక మహిళల 4X400మీ. రిలే క్వాలిఫికేషన్ హీట్2లో పోటీపడిన విద్యా రామ్‌రాజ్, జ్యోతిక శ్రీ దండి, పూవమ్మ రాజు, శుభా వెంకటేషన్ 3:32.51 సెకన్ల టైమింగ్‌తో చివరిదైన 8వ స్థానంలో నిలిచారు.

ప్రభావం చూపని గోల్ఫర్లు

మహిళల గోల్ఫ్ వ్యక్తిగత విభాగం మూడో రౌండ్‌లోనూ భారత్‌కు చెందిన అదితి అశోక్, దీక్షాడాగర్ ప్రభావం చూపలేదు. 14వ స్థానంతో శుక్రవారం ఆట కొనసాగించిన అదితి రౌండ్ ముగిసేసరికి 40వ స్థానంలో నిలిచింది. అలాగే దీక్ష 14వ స్థానంతో ఆరంభించి 42వ స్థానంలో నిలిచింది. శనివారం ఆఖరి, నాలుగో రౌండ్ జరుగుతుంది.



రజతమైనా అద్భుతమే..

భారత స్టార్‌తో మోదీ ఫోన్ సంభాషణ

న్యూఢిల్లీ: స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రాను ప్రధాని మోదీ ప్రశంసించారు. గురువారం రాత్రి జరిగిన పారిస్ ఒలింపిక్స్ పురుషుల జావెలిన్ త్రో ఫైనల్లో నీరజ్ రజత పతకం అందుకున్న విషయం తెలిసిందే. ఈమేరకు నీరజ్‌కు శుక్రవారంనాడు ప్రధాని ఫోన్ చేసి నాలుగు నిమిషాలపాటు సుదీర్ఘంగా మాట్లాడారు. గాయం కారణంగా తాను పసిడి పతకాన్ని నిలబెట్టుకోలేకపోయానని ప్రధానికి ఈ సందర్భంగా చోప్రా తెలిపాడు. దాంతో.. స్వర్ణ పతకం సాధించలేదని బాధపడొద్దని అతడికి సూచించారు. 'గాయం ఉన్నా రజత పతకం కైవసం చేసుకోవడం అద్భుతం. నీ ఫీట్ యువతరాన్ని అబ్బురపరుస్తుంది. దేశం కోసం ఏదైనా చేయాలనే స్ఫూర్తిని వారిలో రగులుస్తుంది' అని నీరజ్‌తో మోదీ అన్నారు. గాయాన్ని అధిగమించి ముందుకు ఎలా సాగాలో తర్వాత వివరంగా చర్చిద్దామని చోప్రాతో మోదీ అన్నారు.



గాయంతోనే బరిలో దిగా

అందుకే వేగం తగ్గింది.. త్వరలో శస్త్రచికిత్స

నీరజ్ వెల్లడి

న్యూఢిల్లీ: గాయం తనను బాధిస్తోందని, త్వరలో దానికి శస్త్రచికిత్స చేయించుకోనున్నట్టు స్టార్ జావెలిన్ త్రోయర్ నీరజ్ చోప్రా వెల్లడించాడు. గాయంతోనే తాను పారిస్‌లో అతి కష్టంగా బరిలోకి దిగానని, అది ఎప్పుడు తీవ్రం అవుతుందోనన్న ఆందోళన కూడా వెంటాడిందని తెలిపాడు. ఒలింపిక్స్ డిఫెండింగ్ చాంపియన్ నీరజ్..పారిస్ క్రీడలకంటే ముందే తొడ కండరాల నొప్పితో ఇబ్బంది పడుతున్నాడు. అయినా సీజన్‌లో తన అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన చోప్రా, 89.45 మీ. దూరం జావెలిన్ విసిరి రజతం దక్కించుకున్నాడు. 'గాయం గురించి ఆలోచిస్తూనే ఫైనల్లో ఈటెను విసిరా. ఎందుకంటే ఆ సమయంలో గాయపడకూడదు కదా. అందుకే ఫైనల్లో నాలో వేగం తగ్గింది. ఈ విషయాన్ని అంతా గమనించి ఉంటారు' అని చోప్రా తెలిపాడు. 'శస్త్ర చికిత్స చేయించుకోవాలని డాక్టర్ ఎప్పుడో సూచించాడు. కానీ వరల్డ్ చాంపియన్‌షిప్ ముందు, తర్వాత..ఆ విషయమై నిర్ణయం తీసుకోవడానికి నాకు సమయం లేదు. ఎందుకంటే..ఆపరేషన్ చేయించుకొన్న అనంతరం ఒలింపిక్స్‌కు సిద్ధం కావాలంటే చాలా సమయం పడుతుంది' అని వివరించాడు.

పస్తులుండి.. చందాలు పోగేసి..

పాక్ ఒలింపిక్ వీరుడి స్ఫూర్తిదాయక ప్రస్థానం

(ఆంధ్రజ్యోతి క్రీడా విభాగం)

అర్షద్ నదీమ్.. క్రీడా ప్రపంచంలో ఇప్పుడీ పేరు మారుమోగుతోంది. పారిస్ క్రీడల జావెలిన్ త్రో ఫైనల్లో డిఫెండింగ్ చాంపియన్, భారత హీరో నీరజ్ చోప్రాను వెనక్కినెట్టి ఒలింపిక్ చాంపియన్‌గా అవతరించాడు. ఎవరూ ఊహించని విధంగా 92.97 మీటర్ల దూరంలో ఈటెను విసిరి ఒలింపిక్ రికార్డుతో పాటు స్వర్ణం సాధించాడు. తన దేశం పాకిస్థాన్‌కు విశ్వక్రీడల్లో తొలిసారి పసిడికాంతులు వెదజల్లి ఒక్కసారిగా స్టార్‌గా మారిపోయాడు. ఇప్పుడతనికి విశ్వవ్యాప్తంగా ప్రశంసలతో పాటు అతని దేశంలో అనేకమంది పోటీలుపడుతూ రివార్డులు ప్రకటిస్తున్నారు. కానీ, ఈస్థాయికి వచ్చేందుకు నదీమ్ పడిన కష్టం అంతాఇంతా కాదు. ఒకప్పుడు తినడానికి తిండిలేక పస్తులుండి.. తన గ్రామస్థులు చందాలు వసూలు చేసి ఇచ్చిన డబ్బుతో శిక్షణకెళ్లి.. ఇలా ఎన్నో ఆటుపోట్లు, సవాళ్లు ఎదుర్కొంటూ ఒలింపిక్ హీరోగా మారిన 27 ఏళ్ల నదీమ్ జీవితం స్ఫూర్తిదాయకం.



నదీమ్ పాకిస్థాన్ పంజాబ్ ప్రావిన్స్‌లోని ఖనేవాల్ అనే గ్రామంలో జన్మించాడు. ఏడుగురు సంతానంలో మూడోవాడు. తండ్రి భవన నిర్మాణ కార్మికుడు. ఆ నిరుపేద కుటుంబానికి తండ్రి సంపాదనే ఆధారం. దీంతో పూట గడవక నదీమ్ కుటుంబ సభ్యులతో కలిసి తిండికి పస్తులుండిన సందర్భాలు అనేకం. ఏడాదిలో ఒక్క పండుగరోజు మాత్రమే మాంసం వండుకొని తినేవాళ్లు. ఇలా ఎన్నో కష్టాలు పడుతూనే తన లక్ష్యం ఆటల్లో రాణించడంపై నదీమ్ దృష్టి పెట్టేవాడు. పాఠశాల స్థాయిలో క్రికెట్, ఫుట్‌బాల్, అథ్లెటిక్స్ లాంటి క్రీడల్లో సత్తా చాటాడు. జిల్లాస్థాయిలో క్రికెట్ కూడా ఆడాడు. ఒకరోజు అథ్లెటిక్స్‌లో జావెలిన్‌ను అద్భుతంగా త్రో చేయడం గమనించిన కోచ్ రషీద్ అహ్మద్ అతడిని ఆ క్రీడ వైపు ప్రోత్సహించాడు. కానీ సరైన జావెలిన్ కొనేందుకు, నాణ్యమైన డైట్ తీసుకునేందుకు డబ్బులు లేకున్నా రషీద్ మాత్రం ప్రాక్టీస్ ఆపలేదు. ఈ క్రమంలో జిల్లాస్థాయి, రాష్ట్రస్థాయి, ఇంటర్‌బోర్డు మీట్, జాతీయస్థాయిలో అనేక పతకాలు సాధించాడు. ఈ సమయంలో ఇతర ప్రాంతాల్లో టోర్నీలకు వెళ్లేందుకు డబ్బులు లేకపోతే.. తమ గ్రామవాసులు, బంధువులు చందాలు పోగు చేసి సహాయం చేసే వారని నదీమ్ తండ్రి అష్రాఫ్ వెల్లడించాడు. ఎన్నో సందర్భాల్లో తమ ఊరివాళ్లు అండగా నిలిచారని, వాళ్ల మేలును ఎప్పటికీ మరిచిపోలేమని అతను చెప్పుకొచ్చాడు. ఆర్థిక పరిస్థితి కారణంగా పంజాబ్ యూనివర్సిటీలోని ఓ పురాతన జిమ్‌లో నదీమ్ ప్రాక్టీస్ చేసేవాడు. ఆ జిమ్‌లో ఏసీ ఉండేది కాదు, ఉక్కపోతను భరిస్తూనే అక్కడ తుప్పుపట్టిపోయిన ఎన్నోఏళ్ల నాటి పరికరాలతోనే శిక్షణ కొనసాగించేవాడని నదీమ్ కోచ్ తెలిపాడు.



దోస్తానా..

పారిస్‌లో నీరజ్ చోప్రాను అధిగమించి నదీమ్ విజేతగా నిలిచి ఉండొచ్చు. కానీ, వీళ్లిద్దరు అసలు ప్రత్యర్థులే కాదు. ఎందుకంటే, ఇద్దరికీ మంచి దోస్తానా ఉంది. టోక్యో ఒలింపిక్స్‌లో స్వర్ణం గెలిచినప్పుడు నీరజ్‌ను నదీమ్ మనస్ఫూర్తిగా అభినందించి వినమ్రతను చాటుకున్నాడు. టోక్యోలో ఐదోస్థానంలో నిలిచిన నదీమ్..నీరజ్ స్ఫూర్తితోనే తాను వచ్చే క్రీడల్లో సత్తాచాటుతానని చెప్పాడు. పారిస్ ఒలింపిక్స్‌కు సన్నద్ధమయ్యే క్రమంలో ఎప్పుడో 2015 నుంచి వాడుతున్న తన బల్లెం (ఈటె) దెబ్బతినడంతో కొత్తది ఇవ్వాలంటూ పాక్ క్రీడాధికారులను కోరాడు. అప్పుడు నీరజ్ కూడా నదీమ్‌కు అండగా నిలవాలంటూ పాక్ ప్రభుత్వానికి సోషల్ మీడియా ద్వారా విజ్ఞప్తి చేశాడు. ఆ తర్వాత వెంటనే అక్కడి ప్రభుత్వం కూడా నదీమ్‌కు కొత్త జావెలిన్‌ను సమకూర్చింది. నదీమ్ సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు గురైనప్పుడు అతనికి నీరజ్ మద్దతుగా నిలిచాడు.

టర్నింగ్ పాయింట్ ఇలా...

2015లో పూర్తిస్థాయిలో జావెలిన్ త్రోయర్‌గా మారిన నదీమ్ అంతర్జాతీయస్థాయిలో జావెలిన్ త్రోలో రాణించడమే లక్ష్యంగా పెట్టుకున్నాడు. 2016లో ప్రపంచ అథ్లెటిక్స్ నుంచి స్కాలర్‌షిప్ దక్కించుకున్నాడు. తద్వారా మారిషస్‌లో శిక్షణకు వెళ్లాడు. ఇదే అతనికి టర్నింగ్ పాయింట్. అక్కడ శిక్షణలో రాటుదేలిన నదీమ్ 2018 ఆసియా క్రీడల్లో కాంస్యం గెలిచి తన ప్రతిభను ప్రపంచానికి పరిచయం చేశాడు. ఆ తర్వాత పలుమార్లు గాయాలు వేధించినా వాటిని అధిగమిస్తూ ముందుకుసాగాడు. 2022లో తొలిసారి 90 మీటర్ల దూరంలో ఈటెను విసిరి కామన్వెల్త్ క్రీడల్లో స్వర్ణం గెలిచాడు. నిరుడు ప్రపంచ చాంపియన్‌షిప్‌లో రజతం సాధించాడు. ఇప్పుడిక ప్రతి క్రీడాకారుని స్వప్నమైన ఒలింపిక్స్‌లో బంగారు పతకాన్ని గెలిచి తన దేశానికే గర్వకారణమయ్యాడు.



ఇద్దరూ మాకు బిడ్డలే

నీరజ్, నదీమ్ తల్లిదండ్రుల ఆనందం

ఇరుదేశాల సరిహద్దుల మధ్య ఉద్రిక్త పరిస్థితులు ఉండొచ్చు కానీ, ఆ మాతృమూర్తుల మనసుల్లో మాత్రం ఎలాంటి కల్మషం లేదు. ఆటగాళ్ల పోటీని దేశాల మధ్య పోరుగా చూడొద్దనీ.. ఇద్దరినీ తమ బిడ్డల్లాగే భావిస్తామంటూ తమ సహృదయతను చాటుకున్నారు. నీరజ్-నదీమ్ పోరును భారత్-పాక్ పోరుతో పోల్చడం సరికాదని నీరజ్ అమ్మానాన్న, నదీమ్ తల్లిదండ్రులు కోరుతున్నారు. 'ఇక్కడ శత్రుదేశాల మధ్య పోరుగా చూడొద్దు. నీరజ్ ఎలాగో అర్షద్‌ను కూడా మా బిడ్డలాగే అనుకుంటాం. ఫైనల్లో మా పిల్లలే పోటీపడుతున్నట్టుగా అనిపించింది. ఇద్దరూ అత్యుత్తమ ప్రతిభ కల ఆటగాళ్లు. ఒకరు స్వర్ణం, మరొకరు రజతం గెలవడం మాకు సంతోషంగా ఉంది' అని నీరజ్ అమ్మానాన్న సరోజ్ దేవి, సతీష్ కుమార్ పేర్కొన్నారు. 'వాళ్లిద్దరూ స్నేహితులే కాదు.. అన్నదమ్ములు. నీరజ్ మా బిడ్డతో సమానం. అతనికోసం మేం ప్రార్థిస్తాం. నీరజ్ మరిన్ని విజయాలు అందుకోవాలని కోరుకుంటున్నా' అని నదీమ్ తల్లి రజియా పర్వీన్ పాక్ మీడియాతో చెప్పారు.

సిరాజ్‌కు ఇంటిస్థలం కేటాయింపు

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి క్రీడాప్రతినిధి): టీమిండియా పేసర్ మహ్మద్ సిరాజ్‌కు తెలంగాణ ప్రభుత్వం ఇంటిస్థలాన్ని కేటాయించింది. కొద్దిరోజుల కిందట సిరాజ్‌కు ఇంటిస్థలం ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించడం తెలిసిందే. రేవంత్ ఆదేశాల మేరకు జూబ్లీహిల్స్‌లోని రోడ్ నెంబర్ 78లో 600 గజాల స్థలాన్ని సిరాజ్‌కు కేటాయిస్తూ రాష్ట్ర రెవెన్యూ శాఖ కార్యదర్శి నవీన్ మిట్టల్ ఉత్తర్వులు జారీ చేశారు.

వినేశ్ కేసుపై విచారణ పూర్తి

తీర్పుపై ఐఓఏ ఆశాభావం

పారిస్: అనర్హతను సవాలు చేస్తూ భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగట్ వేసిన కేసుపై ఇక్కడి క్రీడా మధ్యవర్తిత్వ న్యాయస్థానం (సీఏఎస్)లో శుక్రవారం విచారణ జరిగింది. పారిస్ ఒలింపిక్స్ మహిళల 50 కిలోల ఫైనల్లో గత బుధవారం అమెరికా రెజ్లర్ సారా హిల్డ్‌బ్రాంట్‌తో వినేశ్ తలపడాల్సి ఉంది. అయితే నిర్దేశిత బరువుకంటే 100 గ్రాములు అదనంగా ఉండడంతో ఫైనల్ ఆడకుండా వినేశ్‌పై వేటు వేసిన విషయం తెలిసిందే. దీనిని సీఏఎస్‌లో ఫొగట్ సవాలు చేసింది. సీఏఎస్ అడ్‌హాక్ డివిజన్ ఎదుట జరిగిన శుక్రవారంనాటి విచారణకు వినేశ్ వర్చువల్‌గా హాజరైంది. ఆమె తరఫున ఫ్రాన్స్ న్యాయవాదులు వాదనలు వినిపించారు. ఆపై యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్ (యూడబ్ల్యూడబ్ల్యూ), అంతర్జాతీయ ఒలింపిక్ సంఘం (ఐఓసీ) లాయర్లు వాదనలు వినిపించారు. భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) తరఫున హాజరైన హరీశ్ సాల్వే, విధుష్పత్ సింఘానియా గంటపాటు తమ వాదనలు వినిపించారు. కాగా..తీర్పు వినేశ్‌కు అనుకూలంగా వస్తుందన్న ఆశాభావాన్ని భారత ఒలింపిక్ సంఘం వ్యక్తంజేసింది.

పతకాల పట్టిక



దేశం	స్వ	ర	కా	మొ
చైనా	32	25	21	78
అమెరికా	31	39	38	108
ఆస్ట్రేలియా	18	16	14	48
బ్రిటన్	14	20	23	57
ఫ్రాన్స్	14	20	22	56
భారత్	0	1	5	6

గమనిక: స్వ=స్వర్ణం, ర=రజతం, కా=కాంస్యం, మొ=మొత్తం.

భారత పతాకధారులుగా శ్రీజేష్, మను

న్యూఢిల్లీ: ఒలింపిక్స్ ముగింపు వేడుకలకు దేశ పతాకధారులుగా టీమిండియా హాకీ వెటరన్ గోల్ కీపర్ పీఆర్ శ్రీజేష్, స్టార్ షూటర్ మనుభాకర్‌లను ఎంపిక చేసినట్టు భారత ఒలింపిక్ సంఘం (ఐఓఏ) ప్రకటించింది. ఆదివారం జరగనున్న ఈ ముగింపు ఉత్సవంలో శ్రీజేష్, మను జాతీయ జెండాను చేతబూని, భారత బృందాన్ని ముందుండి నడిపించనున్నారు. వాస్తవానికి శ్రీజేష్‌తో పాటు నీరజ్ చోప్రా పేరును కూడా ఐఓఏ పరిశీలించింది. ఈ విషయమై నీరజ్‌తో ఐఓఏ అధ్యక్షురాలు పీటీ ఉష చర్చించగా, శ్రీజేష్ తనకంటే యోగ్యుడని.. పైగా అతడికి ఇవే చివరి ఒలింపిక్స్ కాబట్టి ఆ గౌరవం ఆయనకే ఇవ్వాల్సిందిగా సూచించాడు. ఆరంభ వేడుకలకు ప్యాడ్లర్ శరత్ కమల్, షట్లర్ పీవీ సింధు పతాకధారులుగా వ్యవహరించడం తెలిసిందే.



జూనియర్ హాకీ టీమ్ కోచ్‌గా శ్రీజేష్

న్యూఢిల్లీ: భారత హాకీ జట్టుకు ఒలింపిక్ కాంస్యం దక్కడంలో కీలక పాత్ర పోషించిన కీపర్ పీఆర్ శ్రీజేష్ కొత్త బాధ్యతలు తీసుకోబోతున్నాడు. ఇప్పటికే రిటైర్మెంట్ ప్రకటించిన అతడు ఇక జూనియర్ పురుషుల హాకీ కోచ్‌గా వ్యవహరించనున్నాడు. 'ఆటగాడి నుంచి కోచ్‌గా మారబోతున్న శ్రీజేష్ యువకులకు ఆదర్శంగా నిలుస్తాడని భావిస్తున్నాం. అలాగే అతని కోచింగ్ కోసం ఆసక్తిగా ఎదురుచూస్తున్నాం' అని హాకీ ఇండియా వెల్లడించింది. మరోవైపు ఈ సరికొత్త పాత్ర నిర్వహించేందుకు ఆత్రుతగా ఉందని శ్రీజేష్ తెలిపాడు. కనీసం 15 మంది కోచ్‌లతో పనిచేసిన అనుభవం ఉందని, దాన్ని వృథా చేయకుండా బాధ్యతలను నిర్వర్తిస్తానని అన్నాడు.

పారిస్‌లో నేటి భారతం

గోల్ఫ్: మహిళల వ్యక్తిగత ఫైనల్: అదితి అశోక్, దీక్షా డాగర్ (మ. 12.30)

రెజ్లింగ్: మహిళల 76 కిలోల ప్రీక్వార్టర్‌ఫైనల్ : రీతికా హుడా X బెర్నాడెట్ (హంగేరి) (మ. 2.51)

నవ్య 10

కుటుంబ కదంబం

వంటిల్లు

చల్లని వాతావరణంలో నాన్‌వెజ్ వంటకాల మీదకు మనసు మళ్లుతుంది. మీ పరిస్థితి కూడా అదే అయితే ఇవిగో ఈ నాన్‌వెజ్ రెసిపీలు వండుకుని కుటుంబంతో కలిసి ఎంజాయ్ చేయండి.



మాన్‌సూన్ స్పెషల్స్

ఉసిరికాయ మాంసం వేపుడు

కావలసిన పదార్థాలు

మటన్: అరకిలో
ఉసిరికాయలు: 5
ఉల్లిపాయలు: 4
అల్లం వెల్లుల్లి పేస్ట్: 2 టీస్పూన్లు
ధనియాలు: 2 టీస్పూన్లు
జీలకర్ర పొడి: 1 టీస్పూన్
పచ్చిమిరపకాయలు: 10
ఉప్పు, కారం, పసుపు: తగినంత
నూనె: వేపుడుకు సరిపడా
కొత్తిమీర: ఒక కట్ట
వెల్లుల్లి: 10 రెబ్బలు

తయారీ విధానం

వెల్లుల్లి, ఉసిరి, పచ్చిమిర్చి, రెండు ఉల్లిపాయలను ముక్కలుగా చేసుకొని, కొత్తిమీరతో కలిపి రుబ్బుకోవాలి. మటన్‌లో మరో రెండు ఉల్లిపాయలను ముక్కలుగా చేసి, అల్లంవెల్లుల్లి ముద్ద, ధనియాల పొడి, జీలకర్ర పొడి, నూనె కలిపి మెత్తగా ఉడికించు కోవాలి. తర్వాత ముందుగా నూరిపెట్టుకున్న ఉసిరి ముద్ద వేసి, నీరంతా ఇగిరిపోయి పొడిగా తయారయ్యే వరకూ వేయించుకోవాలి. చివర్లో కొత్తిమీర చల్లుకుని అన్నం లేదా చపాతీతో తినాలి.

అనంతగిరి కోడి కీమా బాల్స్

కావలసిన పదార్థాలు


చికెన్: అర కిలో
మిరియాల పొడి: ఒక టీస్పూను
తోక మిరియాలు: అర టీస్పూను
క్యాప్సికమ్ (రెడ్, ఎల్లో): రెండు
ఉల్లిపాయ తురుము: ఒక కప్పు
కొత్తిమీర: ఒక కట్ట
కారం: రెండు టీస్పూన్లు
వెల్లుల్లి పొడి: ఒక టీస్పూను
కోడిగుడ్డు: ఒకటి
మొక్కజొన్న పిండి: టీస్పూన్
శనగపిండి: ఒక టీస్పూన్
ఉప్పు, నూనె: వేపుడుకు సరిపడా



తయారీ విధానం

చికెన్ కీమాలో వెల్లుల్లి పొడి, కారం, ఉప్పు, శనగపిండి, కొత్తిమీర తరుగు, ఉల్లి తరుగు, క్యాప్సికమ్ ముక్కలు, కోడిగుడ్డు, మొక్కజొన్న పిండి, మిరియాలు, మిరియాల పొడి వేసి బాగా కలుపుకోవాలి. ఈ మిశ్రమాన్ని చిన్న ఉండలుగా చుట్టి, కాగే నూనెలో వేసి వేయించుకోవాలి. మంట మధ్యస్తంగా ఉంచి, ఉండలు బయటా, లోపలా సమంగా వేగేవరకూ ఉంచుకుని తీయాలి.

మేడారం కోడి పులావ్



కావలసిన పదార్థాలు

చికెన్: అరకిలో
నూనె: సరిపడా
ఉల్లిపాయలు: 2
కరివేపాకు: 2 రెమ్మలు
పచ్చిమిరపకాయలు: 5
బియ్యం: అరకిలో
చెక్క, లవంగ, యాలకులు: తగినన్ని
కొత్తిమీర, పుదీనా: చెరొక కట్ట
ధనియాల పొడి: 2 టీస్పూన్లు
అల్లంవెల్లుల్లి పేస్ట్: తగినంత
ఉప్పు: రుచికి సరిపడా

తయారీ విధానం

బియ్యం కడిగి నానబెట్టుకోవాలి. చికెన్‌లో ఉప్పు, కారం, అల్లంవెల్లుల్లి, పచ్చిమిరపకాయ ముక్కలు, కొద్దిగా నూనె కలుపుకుని అరగంట పాటు పక్కన పెట్టుకోవాలి. వేరే గిన్నెలో నూనె కాచి మసాలా దినుసులు, ధనియాల పొడి, తరిగిన ఉల్లి ముక్కలు, అల్లం వెల్లుల్లి పేస్ట్ వేసి వేయించుకోవాలి. తర్వాత ముందుగా కలిపి పెట్టుకున్న చికెన్ మిశ్రమం వేసి కొత్తిమీర, పుదీనా వేసి 15 నిమిషాలు వేయించుకోవాలి. తర్వాత బియ్యానికి సరిపడా నీళ్లు పోసి, కొద్దిగా ఉప్పు వేసి మరిగించాలి. నీళ్లు మరిగిన తర్వాత నానబెట్టుకున్న బియ్యం కలిపి చిన్న మంట మీద మూత పెట్టి ఉడికించుకోవాలి. 10 నిమిషాల్లో మేడారం కోడి పులావ్ సిద్ధమైపోతుంది.



చెఫ్ **యాదగిరి**
వివాహ భోజనంబు
బంజారాహిల్స్, హైదరాబాద్

మేకప్

ఈ మేకప్ రెయిన్ ప్రూఫ్

వర్షాలు కురిసేటప్పుడు మేకప్ చెదిరి పోయే ప్రమాదం ఉంటుంది. కాబట్టి తేమకూ, చెమ్మకూ చెక్కుచెదరని మేకప్ మెలకువలు అలవరుచుకోవాలి. అందుకోసం ఇవిగో ఈ చిట్కాలు పాటించాలి.

వాటర్‌ప్రూఫ్ ఇలా: వాటర్‌ప్రూఫ్, దీర్ఘ కాల ఫార్ములాలను కలిగి ఉండే సౌందర్య సాధనాలను ఎంచుకోవాలి. ఇవి వాతావర ణంలోని తేమకు, అకస్మాత్తుగా కురిసే వర్షానికీ చెక్కుచెదరకుండా ఉంటాయి. ఇందు కోసం వాటర్‌ప్రూఫ్ ఐలైనర్, మస్కారా, మ్యాట్ లిక్విడ్ లిప్‌స్టిక్స్ ఎంచుకోవాలి. చివర్లో మేకప్‌ను లాక్ చేయడం కోసం సెట్టింగ్ స్ప్రే వాడుకోవాలి. బ్లాటింగ్ పేపర్లు, మ్యాటిఫయింగ్ పౌడర్లు రోజంతా మేకప్‌ను తాజాగా ఉంచుకోవడంలో సహాయపడతాయి

లిప్‌స్టిక్ లవ్లీగా: వర్షాకాలంలో క్రీమీ, గ్లాసీ లిప్‌స్టిక్ వాడకం మానేయాలి. లాంగ్‌వేరింగ్, మ్యాటి లిక్విడ్ లిప్‌స్టిక్స్ ఎంచుకోవాలి. బోల్డ్‌గా, ముదురు రంగుల లిప్‌స్టిక్స్ ఈ కాలానికి సూటవుతాయి. ఎరుపు, బెర్రీ, డీప్ ప్లమ్ రంగులు ఈ కాలంలో చాలా బాగుంటాయి. ఇవి కారిపోవు. తేమతో కూడిన వాతావరణంలో వెలిసిపోకుండా ఉంటాయి.



మేకప్ ఇలా: వాటర్‌ప్రూఫ్, స్మడ్జ్‌ప్రూఫ్, లాంగ్ లాస్టింగ్ మేకప్‌లను ఈ కాలంలో ఎంచుకోవాలి. గాలిలో తేమకూ, చెమ్మకూ చెదిరిపోకుండా ఉండే క్రీమ్, జెల్ ఆధారిత సౌందర్య సాధనాలను ఎంచుకుంటే అవి చర్మానికి అంటిపెట్టుకుని ఉంటాయి. ఈ కాలంలో పౌడర్ ఆధారిత మేకప్ సామాగ్రికి దూరంగా ఉండాలి. బ్లష్ నుంచి ఐషాడో వరకూ క్రీమ్ బేస్డ్ ఉత్పత్తులనే వాడుకోవాలి.

ఆకలి పెంచే చాక్లెట్.. ఖాడవం



చాక్లెట్లు పెడితే పిల్లలకు పళ్లు చెడిపోతాయని, కడుపులో ఎలిక పాములు పెరుగుతాయని, ఆకలి చచ్చిపోతుందనీ, తిన్నది వంటపట్టదనీ... ఇలా రకరకాలుగా భయపడతాం. కానీ, దంతాలను బాగు చేసి, కడుపులో నులిపురుగుల్ని చంపి, ఆకలిని పెంచి, తిన్నది వంటబట్టేలా చేసే చాక్లెట్ గురించి క్షేమశర్మ తన 'క్షేమ కుతూహలం' గ్రంథంలో ఓ అద్భుతమైన ఫార్ములా ఇచ్చాడు. ఈ చాక్లెట్లను మల్టీనేషనల్ కంపెనీలు మాత్రమే తయారు చేసేవి కాదు, మనకు మనమే ఇంట్లో తయారు చేసుకోగలిగేవి. ఆ చాక్లెట్ల పేరే 'ఖాడవం'.

లోకం గురించి, జనం గురించి ఆలోచించేవాళ్లను ఋషులంటారు. తన గురించి తన వ్యాపార సామ్రాజ్యం గురించి మాత్రమే ఆలోచించేవాళ్లను కాపురుషులంటారు. క్షేమశర్మ... పిల్లలే కాదు, పెద్దలు కూడా తినదగిన, తినాల్సిన చాక్లెట్ లేదా క్యాండీని తయారు చేసుకునే విధానాన్ని ఇలా వివరించాడు:

కోలామలకజం చూర్ణా శుంఠ్యేలాశర్కరాన్వితమ్!
మాతులుంగ రసేనాక్తం శోషితం సూర్యరశ్మిభిః!

- ఎండిన ఉసిరికాయలు... వనమూలికలు అమ్మే షాపుల్లో లేదా, పెద్ద పచారీ కొట్లలో దొరుకుతాయి. ఈ కాయల్ని పగలకొట్టి, లోపలి గింజల్ని తీసేయండి. మిగిలిన ఉసిరకను మిక్సీ పట్టి, జల్లించిన మెత్తని పొడిని సిద్ధం చేసుకోండి.
- నల్ల మిరియాల పొడిని కూడా ఇలానే చేసి, పక్కన పెట్టుకోండి.
- అల్లాన్ని ఎండిస్తే అదే శొంఠి. దీన్ని పైపైన కాల్చి, మిక్సీ పడితే మెత్తని పొడి వస్తుంది. ఈ పొడిని జల్లించగా వచ్చిన పీచుని కూడా ఒకట్రెండుసార్లు మిక్సీ పట్టండి. పీచు పారేయవద్దు. అదే డయటరీ ఫైబర్. పేగులకు బలాన్నిస్తుంది.
- ఈ మూడింటికీ ప్రత్యేకంగా కొలతలు చెప్పలేదు. ఉసిరికాయ పొడికి చాలినంత మిరియాలు, శొంఠి, ఏలకుల పొడులు కలపండి. దీనికి పంచదార జత చేసి, అన్నీ బాగా కలిసేలా మరోసారి మిక్సీ పట్టండి.
- ఒక మట్టి ముంతలోకి ఈ పొడిని తీసుకుని, అది మునిగే దాకా మాదీఫల రసం కానీ, నిమ్మ రసం కానీ పొయ్యండి. మూతపెట్టి ఒక రోజంతా నాననివ్వండి.
- మర్నాడు ఉదయం ఆ రసంతో సహా మిశ్రమాన్ని ఒక మూకుడులోకి తీసుకుని, మంచి ఎండలో ఎండనివ్వండి.
- రాత్రికి మళ్లీ అందులో నిమ్మ రసం కలిపి, రాత్రంతా నాననిచ్చి, మర్నాడు మళ్లీ ఎండలో పెట్టండి.

ఏవంతు బహుశోభ్యక్తం శోషితంచ పునః పునః!
ఈషల్లవణ సంయుక్తం చూర్ణా ఖాడవముచ్యతే!

ఈ విధంగా నిమ్మ రసంలో నానబెట్టి, ఎండబెట్టడం వల్ల నిమ్మలోని సారం అంతా ఉసిరి, మిరియాలు, శొంఠి పొడికి పట్టుకుంటుంది. దీన్ని 'భావన చేయటం' అంటారు. 'భావన' అంటే 'వాసన పట్టటం' అని నిఘంటువు అర్థం. ఏదైనా ద్రవంలో నాననివ్వటాన్ని 'భావన చేయటం' అంటారు. శొంఠి పొడి, కరక్కాయ, జీలకర్ర, వాము, లేదా సోంపును ఇలా భావన చేసి... భావన జీలకర్ర/ భావనశొంఠి లాంటివి తయారు చేస్తారు. ఏదైనా ఒక ద్రవ్యాన్ని అల్లం రసంలో ఏడుసార్లు భావన చేస్తే... అది శుద్ధి అవుతుంది. ఆయుర్వేద పద్ధతిలో ఇలా దోషాలు లేకుండా వనమూలికలు, లోహాలను భావన చేస్తారు.

ఇప్పుడు మనం ఉసిరికాయ, మిరియాలు, శొంఠి... ఈ మూడు గొప్ప వనమూలికలను నిమ్మ రసంలో భావన చేశాం. కనీసంలో కనీసం ఏడు రోజులు భావన చేయటంవల్ల ఈ మూడు ద్రవ్యాలూ నిమ్మ రసంతో శక్తిమంతమవుతాయి. తద్వారా కొన్ని అదనపు ఔషధ గుణాలను పొందుతాయి.



బాగా ఎండిన తరువాత దీన్ని మరొకసారి మిక్సీ పట్టండి. ఇందులో తగినంత ఉప్పు కూడా కలపమన్నాడు క్షేమశర్మ. అందువల్ల ఇది తీపి, పులుపు, ఉప్పు, కారం, వగరు, చేదు రుచుల్ని కలిగి, ఆరు రసాల సమన్వితం అవుతుంది. ఈ పొడిని 'ఖాడవ' అంటారని వివరించాడు క్షేమశర్మ. ఆప్టే సంస్కృత నిఘంటువు 'ఖాడవ' అంటే 'క్యాండీ' అనే అర్థాన్నిచ్చింది.

'ఖాడవం ముఖవైశద్య కారకం రుచిధారకమ్! హృద్రోగశమనం చేతి ముఖవైరస్యనాశనమ్!' ఇలా తయారు చేసిన 'ఖాడవం' అనే చాక్లెట్‌ను చప్పరిస్తే ఆకలి అమాంతం పెరుగుతుంది. నాలుక మీద జిగురు పోయి, నోటికి రుచి తెలుస్తుంది. గుండెకు మంచిది. ఉసిరికాయ జీవన క్రియల్ని పెంపు చేసే ద్రవ్యం. ఈ విధంగా రోజూ ఉసిరికాయను పిల్లలకు కూడా ఇవ్వటానికి ఈ బిళ్లలు తోడ్పడతాయి. నోటి దుర్వాసన పోతుంది. దంత వ్యాధులు ఉపశమిస్తాయి. ఖాడవం పేగుల్ని శుభ్రపరుస్తుంది. జీర్ణశక్తిని దెబ్బ తీసే దోషాలన్నీ పోగొడుతుంది.

ఈ పొడిని మన చాక్లెట్‌గా మలచుకోవాలి. దీని కోసం పంచదార లేత పాకం పట్టి, అందులో ఈ పొడిని కలపండి. తడిపిన తెల్లని వస్త్రాన్ని పరిచి, దానిమీద చెంచాతో చిన్నచిన్న బిళ్లల్లా లేదా వడియాల్లా పెట్టి ఆరనిస్తే అందరూ ఇష్టంగా తినే క్యాండీలు తయారవుతాయి. ఒక్కో బిళ్లని బుగ్గన పెట్టుకుని చప్పరించటమే!

విషపూరితమైన రంగులు, రసాయనాలు, ప్రిజర్వేటివ్స్, కృత్రిమ తీపి పదార్థాల్లాంటివి కలిపి తయారు చేసే చాక్లెట్లు, బిళ్లలే గొప్ప అనుకొంటున్నాం. అవేవి అవసరం లేని అద్భుతమైన క్యాండీని 'ఖాడవం'గా పరిచయం చేశాడు క్షేమశర్మ. దీన్ని ఇంట్లోనే చేసుకోవచ్చు.

• గంగరాజు అరుణాదేవి

బిజినెస్



లంబోర్ఘిని ఉరుస్ ఎస్‌ఈ

ప్రారంభ ధర రూ.4.57 కోట్లు


న్యూఢిల్లీ: ఇటలీకి చెందిన లగ్జరీ కార్ల కంపెనీ లంబోర్ఘిని భారత మార్కెట్లోకి ప్లగ్ ఇన్ హైబ్రిడ్ వెర్షన్ ఎస్‌యూవీ ఉరుస్ ఎస్‌ఈ విడుదల చేసింది. ఈ కారు ప్రారంభ ధర రూ.4.57 కోట్లు (ఢిల్లీ ఎక్స్‌షోరూమ్). ప్రపంచ మార్కెట్లోకి మరికొన్ని హైబ్రిడ్ వాహనాలను విడుదల చేయగానే వాటిని కూడా భారత్‌కు తీసుకురానున్నట్లు కంపెనీ ప్రకటించింది. ట్విన్-టర్బో 4.0 వీ8 ఇంజన్‌తో కూడిన ఈ సరికొత్త ఉరుస్ ఎస్‌ఈ కారును విద్యుత్ మోటార్‌తో కూడా పనిచేసే విధంగా మార్పులు చేసినట్లు కంపెనీ ఆసియా పసిఫిక్ ప్రాంతీయ డైరెక్టర్ ఫ్రాన్సిస్కో స్కార్డయోనీ చెప్పారు.

- గోదావరి ఎలక్ట్రికల్స్ తన ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలైన ఈబ్లూ ఫియో, ఈబ్లూ ఫియో ఎక్స్‌పై మాన్‌సూన్ ఆఫర్లను ప్రకటించింది. ప్రస్తుతం ఈ ఎలక్ట్రిక్ స్కూటర్ల ఎక్స్‌షోరూమ్ ధర రూ.99,999గా ఉండగా ఆఫర్‌లో భాగంగా రూ.89,999కి అందిస్తోంది.
- ఐటీసీ సన్‌ఫీస్ట్ చిన్నారుల కోసం ప్రత్యేక పోషకాలతో కూడిన బిస్కట్స్‌ను విడుదల చేసింది. చిన్న పిల్లల్లో గుడ్డు, పాల వినియోగాన్ని పెంపొందించే ఉద్దేశంతో 'సూపర్ ఎగ్ అండ్ మిల్క్' పేరుతో ఈ బిస్కట్స్‌ను తీసుకువచ్చింది. రూ.5, రూ.10, రూ.30 ధరలతో ఈ బిస్కట్స్ అందుబాటులో ఉండనున్నాయి.



బంగారం ధరలు (10 గ్రాములకు రూ.లలో)	24 క్యారెట్లు	22 క్యారెట్లు	కేజీ వెండి
హైదరాబాద్	70,090 ▲	64,250 ▲	88,000 ▲
ముంబై	69,663 ▲	63,811 ▲	80,263 ▲

ఫారం గేటు అమ్మకం ధరలు (నెక్ 100 గుడ్లు)



10వ తేదీ			
హైదరాబాద్	405	విజయవాడ	430
వరంగల్	407	గోదావరి	426
చిత్తూరు	493	విశాఖపట్నం	430
		డజను గుడ్లు రూ.	66

ఫామ్‌గేట్ ధర (కిలో) రూ. వెన్‌కాబ్ బ్రాయిలర్ చికెన్



హైదరాబాద్	80	విజయవాడ	88
వరంగల్	80	గుంటూరు	88
కరీంనగర్	80	ఒంగోలు	88
మహబూబ్‌నగర్	80	చిత్తూరు	90
కర్నూలు	80	నెల్లూరు	90
విశాఖపట్నం	84	అనంతపురం	88
గోదావరి	88		

బ్యాంక్ ఖాతాకు నలుగురు నామినీలు

ఖాతాదారులకు మరింత వెసులుబాటు

» బ్యాంకింగ్ నిబంధనల సవరణ బిల్లును లోక్‌సభలో ప్రవేశపెట్టిన ప్రభుత్వం



న్యూఢిల్లీ: ప్రస్తుతం ఒక వ్యక్తి తన బ్యాంక్ ఖాతాకు ఒక నామినీని మాత్రమే ఎంచుకునే వీలుంది. త్వరలో ఖాతాదారు తన అకౌంట్‌కు గరిష్ఠంగా నలుగురిని నామినీలుగా ఎంచుకునే వెసులుబాటు లభించనుంది. ఇందుకు వీలు కల్పించే 'బ్యాంకింగ్ నిబంధనల (సవరణ) బిల్లు, 2024'ను కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి శుక్రవారం లోక్‌సభలో ప్రవేశపెట్టారు. ఈ బిల్లు బ్యాంక్ అకౌంట్లు, లాకర్ల ఖాతాకు ఏకకాలంలో, వరుసగా నలుగురి పేర్లను నామినీలుగా చేర్చే సదుపాయం కల్పిస్తుంది. దురదృష్టవశాత్తూ బ్యాంక్ ఖాతాదారు మరణిస్తే, తన అకౌంట్‌లోని సొమ్ము లేదా లాకర్‌లోని వస్తువులు నామినీకి చెందుతాయి. అయితే, నామినీ వాటిని బ్యాంక్ నుంచి క్లెయిమ్ చేసుకోవాల్సి ఉంటుంది. గత వారమే కేంద్ర కేబినెట్ ఆమోదం పొందిన బ్యాంకింగ్ నిబంధనల సవరణ బిల్లులో ప్రతిపాదించిన మరిన్ని అంశాలు..

- క్లెయిమ్ చేయని డివిడెండ్లు, షేర్లు, బాండ్లను ఇన్వెస్టర్ ఎడ్యుకేషన్ అండ్ ప్రొటెక్షన్ ఫండ్ (ఐఈపీఎఫ్)కు బదిలీ చేసే అధికారం కల్పించడంతోపాటు వ్యక్తులు ఆ ఫండ్ నుంచి తమ సొమ్మును తిరిగి క్లెయిమ్ చేసుకునేందుకు అనుమతించాలని బిల్లు ప్రతిపాదించింది.
- డైరెక్టర్‌షిప్‌కు సబ్‌స్టాన్షియల్ ఇంట్రెస్ట్ పరిమితిని ఆరు దశాబ్దాల క్రితం నిర్దేశించిన రూ.5 లక్షల స్థాయి నుంచి రూ.2 కోట్లకు పెంచాలని బిల్లు ప్రతిపాదించింది.
- బ్యాంక్‌లు తమ ఆడిటర్లకు చెల్లించే పారితోషికంపై మరింత స్వేచ్ఛ కల్పించాలని బిల్లు ప్రతిపాదించింది. అలాగే, నియంత్రణ నియమావళికి లోబడి బ్యాంక్‌ల రిపోర్టింగ్ తేదీలను ప్రస్తుతం పాటిస్తున్న రెండు, నాలుగో శుక్రవారాలకు బదులు ప్రతినెలా 15వ తేదీతో పాటు నెల చివరి రోజుకు మార్చాలని బిల్లు ప్రతిపాదించింది.
- సహకార బ్యాంక్‌ల్లో చైర్మన్, పర్మినెంట్ డైరెక్టర్లు మినహా మిగతా డైరెక్టర్ల పదవీకాలాన్ని 8 ఏళ్ల నుంచి 10 ఏళ్లకు పొడిగించాలని బిల్లు ప్రతిపాదించింది.
- రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం 1934, బ్యాంకింగ్ నియమావళి చట్టం 1949, స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా చట్టం 1955, బ్యాంకింగ్ కంపెనీస్ (అక్విజిషన్ అండ్ ట్రాన్స్‌ఫర్ ఆఫ్ అండర్‌టేకింగ్స్) చట్టం 1970, బ్యాంకింగ్ కంపెనీస్ (అక్విజిషన్ అండ్ ట్రాన్స్‌ఫర్ ఆఫ్ అండర్‌టేకింగ్స్) చట్టం 1980లను సవరించాలని కూడా బిల్లు ప్రతిపాదించింది.

భారతీయ వాయుయాన్ విధాయక్ బిల్లుకు ఆమోదం

దేశంలో విమానయాన రంగ అభివృద్ధి మరింత పుంజుకోనుంది. ఇందుకు దోహదం చేసే 'భారతీయ వాయుయాన్ విధాయక్ బిల్లు'కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. 1934 నాటికి ఎయిర్‌క్రాఫ్ట్ చట్టం స్థానంలో ప్రభుత్వం ఈ బిల్లు తీసుకొచ్చింది. దీంతో దేశంలో పౌర విమానయాన వ్యాపారం మరింత సులభతరం అవుతుందని భావిస్తున్నారు. ఈ బిల్లును ప్రవేశపెడుతూ దేశంలో విమాన చార్జీలకు సంబంధించిన సమస్యలను పరిష్కరించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు చెప్పారు.

మార్కెట్లో రికవరీ ర్యాలీ

సెన్సెక్స్ 819 పాయింట్లు అప్



ముంబై: ఈ వారం ఆరంభ నష్టాల నుంచి స్టాక్ మార్కెట్లు క్రమంగా కోలుకున్నాయి. వారాంతం ట్రేడింగ్‌లో ప్రపంచ మార్కెట్లతో పాటు దేశీయ ఈక్విటీ సూచీలూ ర్యాలీ తీశాయి. సెన్సెక్స్ ఒక దశలో 1,098 పాయింట్ల వరకు పెరిగి 79,984.24 వద్ద ఇంట్రాడే గరిష్ఠాన్ని నమోదు చేసింది. చివరికి 819 పాయింట్ల లాభంతో 79,705.91 వద్ద స్థిరపడింది. నిఫ్టీ సైతం ఇంట్రాడేలో 302 పాయింట్లు ఎగబాకినప్పటికీ, చివర్లో 250.50 పాయింట్ల లాభంతో 24,367.50 వద్ద క్లోజైంది. అమెరికాలో నిరుద్యోగ భృతి క్లెయిమ్‌ల గణాంకాలు సానుకూలంగా నమోదు కావడంతో ఆర్థిక మాంద్యం భయాలు తగ్గుముఖం పట్టాయి. దాంతో అమెరికాతో పాటు ప్రపంచ మార్కెట్లో ట్రేడింగ్ సెంటిమెంట్ మెరుగుపడిందని ఈక్విటీ నిపుణులు పేర్కొన్నారు. మరిన్ని ముఖ్యాంశాలు..

- ఈక్విటీ ఇన్వెస్టర్ల సంపదగా పరిగణించే బీఎస్‌ఈ లిస్టెడ్ కంపెనీల మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.4.46 లక్షల కోట్లు పెరిగి రూ.450.21 లక్షల కోట్లకు (5.37 లక్షల కోట్ల డాలర్లు) చేరుకుంది.
- సెన్సెక్స్‌లోని 30 నమోదిత కంపెనీల్లో 28 లాభపడ్డాయి. టెక్ మహీంద్రా షేరు 2.74 శాతం ఎగబాకి సూచీ టాప్ గెయినర్‌గా నిలిచింది. టాటా మోటార్స్, ఎం అండ్ ఎం, జేఎస్‌డబ్ల్యూ స్టీల్, హెచ్‌సీఎల్ టెక్, ఎస్‌బీఐ షేర్లూ రెండు శాతానికి పైగా పెరిగాయి. మార్కెట్ దిగ్గజ షేర్లు రిలయన్స్ ఇండస్ట్రీస్ 1.82 శాతం, ఇన్ఫోసిస్ 1.71 శాతం, టీసీఎస్ 1.42 శాతం రాణించాయి.

ఓలా ఎలక్ట్రిక్ లిస్టింగ్ హిట్ .. తొలిరోజే 20 శాతం ఎగబాకిన షేరు

విద్యుత్ ద్విచక్ర వాహనాల తయారీ సంస్థ ఓలా ఎలక్ట్రిక్ మొబిలిటీ లిమిటెడ్ స్టాక్ మార్కెట్ లిస్టింగ్‌కు మంచి స్పందన లభించింది. శుక్రవారం కంపెనీ తన షేర్లను స్టాక్ ఎక్స్ఛేంజీల్లో నమోదు చేసింది. ఐపీఓ ధర రూ.76తో పోలిస్తే, బీఎస్‌ఈలో కంపెనీ షేరు 0.01 శాతం డిస్కౌంట్‌తో రూ.75.99 వద్ద లిస్టయినప్పటికీ, ఇంట్రాడేలో క్రమంగా పుంజుకుంది. మధ్యాహ్నానికల్లా అప్పర్ సర్క్యూట్ లిమిట్ 19.97 శాతం పెరిగి రూ.91.18కి చేరుకున్న షేరు.. తొలిరోజు ట్రేడింగ్ ముగిసేసరికి అదే స్థాయి వద్ద ముగిసింది. దాంతో కంపెనీ మార్కెట్ విలువ (క్యాపిటలైజేషన్) రూ.40,217.95 కోట్లుగా నమోదైంది. మంగళవారంతో ముగిసిన ఈ రూ.6,145 కోట్ల ఐపీఓకు 4.27 రెట్ల సబ్‌స్క్రిప్షన్ లభించింది.

ఇంధన విప్లవానికి భారత్ కేంద్రం కావాలి

» అమర రాజా 'ఎవాల్వ్' సదస్సులో అమితాబ్ కాంత్

హైదరాబాద్ (ఆంధ్రజ్యోతి బిజినెస్): తక్కువ కర్బన వ్యర్థాలను విడుదల చేసే టెక్నాలజీలపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి పెరుగుతున్న నేపథ్యంలో ప్రపంచస్థాయిలో ఇంధన విప్లవానికి భారత్ కేంద్రంగా మారాలని జీ-20 షెర్పా, నీతి ఆయోగ్ మాజీ సీఈఓ అమితాబ్ కాంత్ పిలుపు ఇచ్చారు. ఆధునిక బ్యాటరీ టెక్నాలజీలపై చర్చించేందుకు అమర రాజా ఎనర్జీ అండ్ మొబిలిటీ (ఏఆర్‌ఈఎం) పూర్తి యాజమాన్య సంస్థ అమరరాజా అడ్వాన్స్‌డ్ సెల్ టెక్నాలజీస్ (అరాక్ట్) నిర్వహించిన "ఎవాల్వ్ 2024" సదస్సులో మాట్లాడుతూ ఆయన ఈ వ్యాఖ్య చేశారు. ఎవాల్వ్ సదస్సు వంటివి పరిశ్రమకు చెందిన నాయకులు, విద్యావేత్తలు, విధాన నిర్ణేతలను ఒకే వేదిక పైకి తెస్తాయని ఆయన అన్నారు. "ఇంధన పరివర్తన: భవిష్యత్ సంసిద్ధత, భారత ప్రాధాన్య వైఖరి" పేరిట అరాక్ట్ ఈ కార్యక్రమం నిర్వహించింది. తక్కువ కర్బన టెక్నాలజీలతో పారిశ్రామికీకరణ, పట్టణీకరణ ద్వారా ప్రపంచానికే నాయకత్వం వహించగల స్థాయిలో భారత్ ఉన్నదని కాంత్ అన్నారు. కీలకమైన టెక్నాలజీ, సరఫరా వ్యవస్థలకు సంబంధించిన సవాళ్లకు దీటైన పరిష్కారాలు కనుగొనేందుకు భాగస్వామ్య వర్గాలన్నింటినీ ఒకే వేదిక పైకి తీసుకురావడం ఎవాల్వ్ 2024 లక్ష్యమని ఏఆర్‌ఈఎం చైర్మన్, మేనేజింగ్ డైరెక్టర్ జయదేవ్ గల్లా అన్నారు.



ప్రభుత్వ రంగంలోని యూనియన్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (యూబీఐ) 2023-24 ఆర్థిక సంవత్సరానికి గాను కేంద్ర ప్రభుత్వానికి రూ.2,054 కోట్ల డివిడెండ్‌ను అందజేసింది. శుక్రవారం ఢిల్లీలో కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్, ఆర్థిక శాఖ సంయుక్త కార్యదర్శి (బ్యాంకింగ్) సమీర్ శుక్లాకు యూబీఐ ఎండీ, సీఈఓ ఏ. మణిమేఖలై ఈ డివిడెండ్ చెక్‌ను అందజేశారు.

కెనరా బ్యాంక్ ఎంసీఎల్ఆర్ రేట్లు పెంపు

న్యూఢిల్లీ: ప్రభుత్వ రంగంలోని కెనరా బ్యాంక్ నిధుల సమీకరణ ఆధారిత వడ్డీ రేటును (ఎంసీఎల్ఆర్) 0.05 శాతం మేరకు పెంచింది. ఈ పెంపు వల్ల కెనరా బ్యాంక్ వినియోగ రుణాలు ప్రియం అవుతాయి. బ్యాంక్ తాజా నిర్ణయం ప్రకారం ఆటో, వ్యక్తిగత రుణాలపై ఎంసీఎల్ఆర్ రేటు 8.95 శాతం నుంచి 9 శాతానికి పెరుగుతుంది. మూడు సంవత్సరాల కాలపరిమితి రుణాలపై ఎంసీఎల్ఆర్ 9.40 శాతానికి పెరుగుతుంది. అలాగే నెల, మూడు నెలలు, ఆరు నెలల కాల పరిమితి రుణాలపై వడ్డీ రేటు 8.35 శాతం నుంచి 8.80 శాతం మధ్యన ఉంటుంది. ఈ కొత్త రేట్లు ఈ నెల 12వ తేదీ నుంచి అమల్లోకి వస్తాయని బ్యాంక్ ప్రకటించింది.

సమాచార నాణ్యతా ముఖ్యమే

» ఇందుకోసం రెండు వ్యవస్థలు : సెబీ

న్యూఢిల్లీ: క్యాపిటల్ మార్కెట్‌ను మరింత సంస్కరించేందుకు మార్కెట్ నియంత్రణ మండలి సెబీ సిద్ధమైంది. ఇందులో భాగంగా పెర్ఫార్మెన్స్ వ్యాలిడేషన్ ఏజెన్సీ, డేటా బెంచ్‌మార్కింగ్ ఇనిస్టిట్యూషన్ పేరుతో రెండు ప్రత్యేక వ్యవస్థలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. సెక్యూరిటీస్ మార్కెట్లో మదుపరులకు అందే సమాచార నాణ్యత పెంచేందుకు సెబీ ఈ చర్యలు ప్రతిపాదించింది. ఇన్వెస్ట్‌మెంట్ అడ్వైజర్స్ (ఐఏ), రీసెర్చ్ అనలిస్టులు (ఆర్ఏ), ఆల్గో ప్రొవైడర్ల సేవల నాణ్యతను పెర్ఫార్మెన్స్ వ్యాలిడేషన్ ఏజెన్సీ మదింపు చేస్తుంది. ఇక వివిధ ఆస్తులకు సంబంధించిన ప్రామాణిక డేటా వివరాలను డేటా బెంచ్‌మార్కింగ్ ఇనిస్టిట్యూషన్ పర్యవేక్షిస్తుంది. గత ఆర్థిక సంవత్సరం వార్షిక నివేదికలో సెబీ ఈ వివరాలు వెల్లడించింది.

మున్సిపల్ బాండ్స్‌లోనూ మదుపు చేయండి: బీమా కంపెనీలు, పెన్షన్ ఫండ్ సంస్థలు మున్సిపల్ బాండ్స్‌లోనూ మదుపు చేయాలని సెబీ ఈడీ ప్రమోద్ రావు కోరారు. మన దేశ ఆర్థిక వ్యవస్థతో పోలిస్తే ప్రస్తుతం ఈ బాండ్స్ మార్కెట్ 30,000 కోట్ల అమెరికా డాలర్లు మాత్రమేనన్నారు. అమెరికాలో మున్సిపల్ బాండ్స్ మార్కెట్ 4లక్షల కోట్ల డాలర్లు ఉంటుందన్నారు.

తిరుపతి, వైజాగ్‌లో రియల్టీ జోరు

» టాప్-17 సిటీల జాబితాలో చోటు
» కోలియర్స్ ఇండియా

న్యూఢిల్లీ: ఆంధ్రప్రదేశ్‌లోని తిరుపతి, విశాఖపట్నం నగరాల్లో స్థిరాస్తి రంగానికి మంచి భవిష్యత్ కనిపిస్తోంది. ముందు ముందు ఈ రెండు నగరాలు దేశంలోని టాప్-17 ఎమర్జింగ్ రియల్ ఎస్టేట్ హాట్‌స్పాట్‌లుగా ఎదుగుతాయని రియల్టీ కన్సల్టెన్సీ సంస్థ కోలియర్స్ ఇండియా ఒక నివేదికలో తెలిపింది. ఉత్తరాదిన అయోధ్య, అమృత్‌సర్, జైపూర్, కాన్పూర్, లక్నో, వారణాసి నగరాలు ఈ జాబితాలో చోటు సంపాదించాయి. దేశ తూర్పు ప్రాంతం నుంచి పాట్నా, పూరి నగరాలకు చోటు దక్కింది. పశ్చిమ భారతం నుంచి ద్వారక, నాగపూర్, షిర్డీ, సూరత్‌లకు, దక్షిణ భారత్ నుంచి ఏపీలోని తిరుపతి, వైజాగ్ నగరాలు, తమిళనాడులోని కోయంబత్తూర్, కేరళలోని కోచి నగరాలకు ఈ జాబితాలో చోటు దక్కింది. ఈ నగరాల్లో రియల్టీ అభివృద్ధికి ఈ కింది అంశాలు దోహదం చేస్తాయని కోలియర్స్ అంచనా.

- పెరుగుతున్న మౌలిక సదుపాయాలు
- డిజిటైజేషన్, పర్యాటక రంగాలు
- ఈ నగరాల్లో ఏర్పాటు కానున్న కార్యాలయాల భవనాలు
- పెరుగుతున్న వేర్‌హౌసింగ్ సదుపాయాలు
- సీనియర్ సిటిజన్లలో ఎక్కువ మంది ఉండేందుకు ఇష్టపడడం





జస్టిస్ దుర్గాప్రసాదరావు కుటుంబ సభ్యులకు జ్ఞాపిక అందజేస్తున్న చీఫ్ జస్టిస్ ఠాకూర్, హైకోర్టు న్యాయవాదుల సంఘం ప్రతినిధులు

16 వేలకుపైగా కేసుల పరిష్కారం

- కీలక తీర్పులు ఇచ్చిన జస్టిస్ దుర్గాప్రసాదరావు
- పదవీ విరమణ వీడ్కోలు సభలో చీఫ్ జస్టిస్ ఠాకూర్

అమరావతి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ యు.దుర్గాప్రసాదరావుకు శుక్రవారం హైకోర్టు ఘనంగా వీడ్కోలు పలికింది. ఈ నెల 11న ఆయన పదవీ విరమణ చేయనున్న నేపథ్యంలో శుక్రవారమే వీడ్కోలు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా చీఫ్ జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్ మాట్లాడుతూ జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు అందించిన న్యాయసేవలను కొనియాడారు. హైకోర్టు న్యాయమూర్తిగా 16వేలకుపైగా కేసులను పరిష్కరించారన్నారు. పలు కీలక తీర్పులు ఇచ్చారన్నారు. జస్టిస్ యు.దుర్గాప్రసాదరావు మాట్లాడుతూ పౌరుల హక్కులు కాపాడడంలో న్యాయవ్యవస్థది కీలకపాత్ర అన్నారు. న్యాయవ్యవస్థ సాఫీగా నడిచేందుకు భాగస్వాములఅందరూ కృషి చేయాలన్నారు. అంతకముందు అడ్వకేట్ జనరల్ దమ్మాలపాటి శ్రీనివాస్, హైకోర్టు న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు కె.చిదంబరం, బార్ కౌన్సిల్ చైర్మన్ ఎన్.ద్వారకానాథ్‌రెడ్డి, అడిషనల్ సొలిసిటర్ జనరల్ బి.నరసింహశర్మ మాట్లాడుతూ జస్టిస్ దుర్గాప్రసాదరావు న్యాయసేవలను కొనియాడారు.

పంచాయతీల్లో తిరంగా పండుగ

- స్వాతంత్ర్య వేడుకలకు ఖర్చు చేసుకునే వెసులుబాటు
- డిప్యూటీ సీఎం పవన్ ఆదేశాలతో ఉత్తర్వులు జారీ



అమరావతి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఒకప్పుడు స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలు గ్రామాల్లో మొక్కుబడిగా చేపట్టేవారు. ఆయా గ్రామాల్లో సర్పంచ్‌లు స్కూళ్లకు వెళ్లి జెండాలు ఎగురవేసేవాళ్లు. గతంలో 5వేల లోపు జనాభా ఉన్న పంచాయతీలకు రూ.100, అంతకంటే ఎక్కువమంది ఉంటే రూ.250 మాత్రమే సాధారణ నిధుల నుంచి ఖర్చు చేసుకునే అవకాశం ఉండేది. అయితే, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ ఆదేశాలతో పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ డైరెక్టర్ కృష్ణతేజ స్వాతంత్ర్య దినోత్సవం రోజున ఖర్చు చేసే వ్యయాన్ని ఏకంగా రూ.10 వేల నుంచి రూ.25 వేలకు పెంచారు. అంటే 5వేల లోపు జనాభా ఉన్న గ్రామ పంచాయతీలు రూ.10 వేల దాకా, 5 వేల పైబడిన పంచాయతీల్లో రూ.25 వేలు సాధారణ నిధుల నుంచి వాడుకోవచ్చని ఆదేశాలిచ్చారు. పంచాయతీ పరిధిలో ఉన్న ప్రైవేట్, ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు ఆగస్టు 15 విశిష్టత, రాజ్యాంగ విలువ, స్థానిక సంస్థల పాలన లాంటి అంశాలపై వ్యాస రచన, క్విజ్, డిబేట్‌తో పాటు ఆటల పోటీలు నిర్వహించాలని పేర్కొన్నారు. తాము అడిగిన వెంటనే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలకు రూ.10 వేలు, రూ.25 వేలకు పెంచిన పవన్ కల్యాణ్‌కు ఏపీ సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు చిలకలపూడి పాపారావు, అధికార ప్రతినిధి గళ్లా తిమోతి కృతజ్ఞతలు తెలిపారు.

రాష్ట్రంలో బ్లూ ఎకానమీ ప్రాజెక్ట్: పవన్

ప్రపంచబ్యాంక్ ప్రతినిధులు, సీనియర్ పర్యావరణ శాస్త్రవేత్తలతో పవన్ శుక్రవారం భేటీ అయ్యారు. రాష్ట్రంలో సముద్ర వనరుల సమర్థ వినియోగంపై చర్చించారు. ఇప్పటికే కర్ణాటక, తమిళనాడులో బ్లూ ఎకానమీ ప్రాజెక్ట్‌కు సహాయం అందిస్తున్న విషయాన్ని ప్రపంచ బ్యాంక్ ప్రతినిధులు పవన్‌కు వివరించారు. దీంతో ఏపీలోనూ అదే తరహా ప్రాజెక్ట్ అమలుకు సాయం చేయాలని పవన్ కోరగా.. వారు సానుకూలంగా స్పందించారు. స్వాతంత్ర్య దినోత్సవం, వినాయక చవితి ఉత్సవాల నేపథ్యంలో ప్రజలు పర్యావరణహిత కార్యక్రమాలు చేపట్టాలని ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ పిలుపునిచ్చారు. శుక్రవారం మంగళగిరిలోని జనసేన పార్టీ కేంద్ర కార్యాలయంలో ప్లాన్ ఏ ప్లాంట్ సంస్థ ప్రతినిధులు పవన్‌ను కలిసి, ప్రత్యేకంగా విత్తనాలతో తయారు చేసిన జాతీయ జెండా, మట్టితో చేసిన గణపతి విగ్రహాన్ని అందజేశారు.

శాప్ ఎండీగా గిరిషా

- కర్నూలు జేసీగా పి.నవ్య.. 11 మంది ఐఏఎస్‌లకు స్థానచలనం

అమరావతి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ క్రీడా ప్రాధికార సంస్థ ఎండీగా పీఎస్ గిరిషాను ప్రభుత్వం నియమించింది. రాష్ట్రంలో 11 మంది ఆల్ ఇండియా సర్వీసెస్ అధికారులను ప్రభుత్వం బదిలీ చేసింది. ఈ మేరకు శుక్రవారం రాత్రి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ ఉత్తర్వులు జారీ చేశారు. గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా ఉన్న పి.నవ్యను ప్రభుత్వం బదిలీ చేసింది. ఆమెను కర్నూలు జిల్లా జేసీగా నియమించింది. ప్రస్తుతం గురుకులం కార్యదర్శిగా ఉన్న ఎస్.భార్గవిని బదిలీ చేసి గిరిజన సంక్షేమ శాఖ డైరెక్టర్‌గా నియమించింది. గురుకులం సెక్రటరీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. ఏపీ ఫైబర్ నెట్ ఎండీగా కె.దినేశ్ కుమార్‌ను నియమించింది. ఏపీ గ్యాస్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ ఎండీగా ఆయనకే అదనపు బాధ్యతలు అప్పగించింది. ప్రస్తుతం మారిటైమ్ బోర్డు సీఈవోగా ఉన్న సీవీ ప్రవీణ్ ఆదిత్యకు ఏపీ ఎయిర్‌పోర్టు డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఎండీగా అదనపు బాధ్యతలు అప్పగించింది. పోస్టింగ్ కోసం ఎదురుచూస్తున్న డి.హరితను అనంతపురం జేసీగా ప్రభుత్వం నియమించింది. ఏపీ ఎస్సీ కో-ఆపరేటివ్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఎండీగా ఉన్న చిన్నరాముడును బదిలీ చేసింది. ఆయనను తూర్పుగోదావరి జిల్లా జేసీగా నియమించింది. చిత్తూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా ఉన్న పి.శ్రీనివాసులును బదిలీ చేసిన ప్రభుత్వం గుంటూరు మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌గా బాధ్యతలు అప్పగించింది. సీతంపేట ఐటీడీఏ పీవోగా ఉన్న టి.రాహుల్ కుమార్ రెడ్డిని బదిలీ చేసింది. ఆయనను పశ్చిమగోదావరి జిల్లా జాయింట్ కలెక్టర్‌గా నియమించింది. పార్వతీపురం ఐటీడీఏ పీవోగా ఉన్న సేతు మాధవన్‌ను బదిలీ చేసిన ప్రభుత్వం విజయనగరం జిల్లా జేసీగా నియమించింది. అక్కడున్న కె.కార్తీక్‌ను బదిలీ చేసి నెల్లూరు జిల్లా జాయింట్ కలెక్టర్‌గా బాధ్యతలు అప్పగించింది. వీరితో పాటు విశాఖపట్నం డీఎఫ్‌వోగా ఉన్న ఐఎఫ్ఎస్ అధికారి అనంత శేఖర్‌ను ప్లానింగ్ విభాగంలో జాయింట్ సెక్రటరీగా నియమిస్తూ మరొక జీవో జారీ చేసింది.

ఏసీబీ ఎస్పీలు ఇంటెలిజెన్స్‌కు..

- రమాదేవి, రామ్మోహన్, లావణ్య లక్ష్మి బదిలీ

అమరావతి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): అవినీతి నిరోధక శాఖ ఎస్పీ రమాదేవి, రాయలసీమ రేంజ్ జాయింట్ డైరెక్టర్ రామ్మోహన్‌ను ప్రభుత్వం ఇంటెలిజెన్స్‌కు బదిలీ చేసింది. తిరుపతి ట్రాన్స్‌కో ఎస్పీ లావణ్య లక్ష్మిని సైతం నిఘా విభాగానికి బదిలీ చేస్తూ హోంశాఖ ముఖ్య కార్యదర్శి కుమార్ విశ్వజీత్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. 2010 బ్యాచ్‌కు చెందిన ఈ గ్రూప్-1 అధికారులు గత ప్రభుత్వంలో లూప్‌లైన్‌లో ఉన్నారు.

మొదటి దశతో ఆపేద్దామనుకున్నా..

- సీఎంగా చంద్రబాబు వచ్చారు
- ఉత్పత్తి విస్తరణకు వెళ్తాం
- నాడు ఆయనే శంకుస్థాపన చేశారు
- అక్టోబరు 25న బాబు చేతుల మీదుగా స్టీల్ ఉత్పత్తికి శ్రీకారం చుడతాం
- జైరాజ్ ఇస్పాత్ ఎండీ గోయెంకా
- పెట్టుబడులకు బ్రాండ్ అంబాసిడర్ సీబీఎన్
- 1,800 కోట్లతో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్ అభివృద్ధి: మంత్రి భరత్

కర్నూలు, జూలై 9(ఆంధ్రజ్యోతి): 'రాష్ట్ర విభజన తరువాత అప్పటి సీఎం చంద్రబాబు మా జైరాజ్ ఇస్పాత్ స్టీల్ పరిశ్రమ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. అక్టోబరు 25 నాటికి పనులు పూర్తి చేసి ఆయన చేతుల మీదుగా స్టీల్ ఉత్పత్తికి శ్రీకారం చుడతాం' అని జైరాజ్ ఇస్పాత్ స్టీల్ కంపెనీ ఎండీ సజ్జన్ కుమార్ గోయెంకా అన్నారు. శుక్రవారం కర్నూలు జిల్లా ఓర్వకల్లు ఇండస్ట్రియల్ మెగా హబ్‌ను, అందులోని ఇస్పాత్ నిర్మాణ పనులనూ పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితతో కలసి మంత్రి టీజీ భరత్ పరిశీలించారు. స్టీల్ పరిశ్రమ పురోగతిపై ఆ కంపెనీ ప్రతినిధులు పవర్ పాయింట్ ద్వారా వివరించారు. ఈ సందర్భంగా కంపెనీ ఎండీ మాట్లాడుతూ, 'ప్రస్తుతం ఫేజ్-1 కింద రూ.2,000 కోట్ల పెట్టుబడి పెట్టాం. 1.5 విలియన్ టన్నుల ఉత్పత్తి సామర్థ్యంతో కంపెనీ నిర్మాణం పూర్తయింది. 2,500 మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉద్యోగ, ఉపాధి కల్పిస్తాం. ఇక్కడితో యూనిట్ నిర్మాణం ఆపేద్దామని అనుకున్నాం. కాని, మళ్లీ చంద్రబాబు ముఖ్యమంత్రి అయ్యారు. అందుకనే మా నిర్ణయాన్ని పునఃసమీక్షించాం. 2.5 మిలియన్ టన్నుల ఉత్పత్తికి విస్తరణకు ముందుకు వెళ్లామని నిర్ణయించాం' అని వివరించారు. మంత్రి టీజీ భరత్ మాట్లాడుతూ, "రాష్ట్రంలో పెట్టుబడులకు బ్రాండ్ అంబాసిడర్ సీబీఎన్. చంద్రబాబు సీఎంగా బాధ్యతలు చేపట్టగానే పెట్టుబడులు పెట్టేందులు పారిశ్రామికవేత్తలు ముందుకు వస్తున్నారు. ఏపీలో పరిశ్రమ ఏర్పాటు చేయాలనుకున్న కలకత్తాకు చెందిన ఓ పారిశ్రామికవేత్త గత వైసీపీ విధానాలు నచ్చక పక్క రాష్ట్రానికి వెళ్లిపోయారు. అక్కడ రూ.3 వేల కోట్లు పెట్టుబడులు పెట్టారు. చంద్రబాబు సీఎం కాగానే అదే పారిశ్రామికవేత్త ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు వచ్చారు. రూ.1,800 కోట్లతో ఓర్వకల్లు ఇండస్ట్రియల్ హబ్‌లో మౌలిక వసతులు ఏర్పాటు చేస్తాం. రైల్వే లైన్, జలాశయం నిర్మాణం, విజయవాడకు ఇక్కడి నుంచి విమానాలు నడిపేలా చర్యలు తీసుకుంటాం' అని మంత్రి వివరించారు.



ఓర్వకల్లులోని జైరాజ్ ఇస్పాత్ స్టీల్ పరిశ్రమను పరిశీలిస్తున్న మంత్రి టీజీ భరత్

ఇక చైతన్యం 2.0

(మొదటి పేజీ తరువాయి)

చనిపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఏ పని చేసినా పేదలను దృష్టిలో పెట్టుకోవాలని కోరారు. "ఆదివాసీల్లో పేదరికం ఎక్కువగా ఉంది.. వారిని అన్ని విధాలా పైకి తీసుకొచ్చే బాధ్యత నాది. రాబోయే ఐదేళ్లలో నిర్దిష్ట ప్రణాళికతో పేదరికాన్ని తగ్గిస్తాం. పేరుకు పథకాలివ్వడం కాదు. అవి ఫలితాన్నిచ్చేలా ఉండాలి. గిరిజనుల జీవన ప్రమాణాల్లో మార్పులు తీసుకొస్తాం. ఏఐ గురించి మాట్లాడుకుంటున్న ఈ రోజుల్లో డోలీమోతలు కనబడటం చాలా బాధగా ఉంది. రహదారి సదుపాయం లేని ప్రాంతాల నుంచి ఆసుపత్రులకు డోలీల్లో వెళ్తున్నారని గుర్తించి ఫీడర్ అంబులెన్సులు తీసుకొచ్చాం. కానీ గత ప్రభుత్వం వాటిని నిర్వీర్యం చేసింది. మళ్లీ డోలీల్లో మోసుకొచ్చే పరిస్థితికి తీసుకొచ్చింది. డోలీల్లోనే ప్రసవాలు అవుతున్నాయంటే ఏంటీ ఈ దౌర్భాగ్యం?" అని ఆవేదన వ్యక్తం చేశారు. ఇంకా ఆయన ఏమన్నారంటే...

డీఎస్సీ రాసే గిరిజన అభ్యర్థులకు శిక్షణ

"ఇటీవల 16,347 పోస్టులతో మెగా డీఎస్సీ ప్రకటించాం. డీఎస్సీ రాసే గిరిజన అభ్యర్థులకు ఉచితంగా శిక్షణ అందిస్తాం. అరకు గిరిజన నృత్యం దేశంలోనే ప్రత్యేకమైంది. ఇంత కళ చేతిలో ఉంచుకుని కూడా ఆదివాసీలు చాలా రంగాల్లో వెనుకబడి ఉన్నారు. ప్రతి ఏడాది ఆగస్టు 9న ప్రపంచ ఆదివాసీ దినోత్సవం నిర్వహించాలని ఐక్యరాజ్యసమితి ప్రకటించగానే జీవో 127ను నాడు టీడీపీ ప్రభుత్వం విడుదల చేసింది. కానీ గత ప్రభుత్వం ఆదివాసీ దినోత్సవం నిర్వహించడం ఆపేసింది. నేను రాజకీయ వివక్ష చూపించను. కక్ష సాధింపులకు పాల్పడను. కానీ దోచిన సొమ్మును రికవరీ చేసి పేదలకు ఖర్చు పెడతాం ఆదివాసీలకు శౌర్యం, ప్రతిభ, నైపుణ్యం ఉంటాయి. ప్రకృతిని ఆరాధిస్తారు. స్వాతంత్ర్య పోరాటంలో ఆదివాసీలు పెద్దఎత్తున పోరాడారు. గిరిజనుల్లో అనేక కట్టుబాట్లు ఉన్నాయి. జీవన ప్రమాణాలు తక్కువ. వారికి కనీసం రోడ్లు కూడా సరిగా లేవు. ఈ పరిస్థితిని తొలగించడానికి గతంలో చైతన్యం కార్యక్రమం రూపొందించాం. అరకు కాఫీని ప్రమోట్ చేశాం. గిరిజన ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ఉన్న అవకాశాలను అందిపుచ్చుకున్నాం. పారిస్‌లో కూడా ప్రస్తుతం అరకు కాఫీ అమ్ముతున్నారు. ప్రధాని మోదీ వైజాగ్‌కు వచ్చినప్పుడు అరకు కాఫీ రుచి చూశారు. ఆ విషయం ఇటీవల పార్లమెంటులో ఆయన పంచుకున్నారు."

ఆదివాసీలకు అడిగినవన్నీ చేస్తా...

"గిరిజన యోధుల త్యాగాలను తెలియజేసేందుకు లంబసింగిలో మ్యూజియం ఏర్పాటు చేస్తాం. గిరిజనులకు ట్రైకార్ ద్వారా రుణాలందిస్తాం. 2014-19లో ఇచ్చినట్లుగానే ఇన్నోవా కార్లు ఆదివాసీ యువతకు అందిస్తాం. గతంలో 80 స్కూళ్లను రెసిడెన్షియల్‌గా మార్చాం. వాటి కోసం కొత్త భవనాలు నిర్మిస్తాం. గ్రామ సచివాలయాల్లో పనిచేసే ఏఎన్ఎంలను ట్రైబల్ స్కూళ్లలో పెట్టి పిల్లల ఆరోగ్యాల్ని పర్యవేక్షిస్తాం. అరకు కాఫీ నాణ్యతను పెంపొందిస్తాం. వాణిజ్య పంటల కంటే కాఫీ పంటకు ఆదాయం అధికంగా వచ్చేలా చేస్తాం. ఆర్గానిక్ పంటల ఉత్పత్తులకు మార్కెట్ సదుపాయం కల్పిస్తాం. జీఓ నెం.3ను నేనే తీసుకొచ్చాను. విశాఖలో ఎన్నికలు ఉండటం వల్ల దానిపై మాట్లాడలేకపోతున్నాను. సీతంపేట ఐటీడీఏల్లో రూ.7కోట్లతో సమగ్ర పసుపు ఉత్పత్తి కేంద్రాన్ని ఏర్పాటు చేస్తాం. ఎన్టీఆర్ ఎడ్వంచర్ పార్క్ రూ.2.54 కోట్లతో అభివృద్ధి చేస్తాం. పార్వతీపురం ఐటీడీఏ కొమరాడ మండలం పూర్ణపాడు-లాబేసు గ్రామాల మధ్య నాగావళి నదిపై హైలెవల్ బ్రిడ్జి నిర్మిస్తాం. చింతూరు ఐటీడీఏ పరిధిలో 11 ఎత్తిపోతల పథకాలను రూ.2.5 కోట్లతో నిర్మిస్తాం. పాడేరులో మెడికల్ కళాశాలను రూ.500 కోట్ల ఖర్చు చేసి పూర్తిచేస్తాం. 418 ఏకోపాధ్యాయ పాఠశాలలకు రూ.50 కోట్లతో భవనాలు పూర్తి చేస్తాం. అల్లూరి జిల్లా కేంద్రంలో మూడు ప్రధాన రహదారుల కారిడార్‌ను రూ.50కోట్లతో పూర్తి చేస్తాం. పాడేరు ఏజెన్సీలో రూ.10 కోట్లతో పర్యాటకాన్ని అభివృద్ధి చేస్తాం. 2191 గిరిజన గ్రామాలకు త్వరలో రోడ్డు మార్గాలు నిర్మిస్తాం. 16,816 గిరిజన నివాస ప్రాంతాలకు కుళాయి ద్వారా నీళ్లందిస్తాం" అని సీఎం హామీ ఇచ్చారు.



విల్లు ఎక్కుపెట్టిన సీఎం చంద్రబాబు

సవర మహిళతో వర్చువల్ ముచ్చట

పార్వతీపురం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): పార్వతీపురం మన్యం జిల్లాలోని సీతంపేట ఐటీడీఏలో గిరిజన మహిళ సవర తులసితో చంద్రబాబు వర్చువల్‌గా మాట్లాడారు. చిరుధాన్యాలు సాగు చేస్తున్నామని, గిరిజన సంప్రదాయాల ప్రకారం జీవనం సాగిస్తున్నామని ఆమె తెలిపారు. సీతంపేట మండలంలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ ఏర్పాటు చేయాలని, ఆస్పత్రి నిర్మాణ పనులు త్వరగా అయ్యేలా చూడాలని కోరారు. ఆమె కోరినవన్నీ అందిస్తామని చంద్రబాబు హామీ ఇచ్చారు. రూ.7కోట్లతో పసుపు ప్రాసెసింగ్ యూనిట్‌ను ఏర్పాటుచేస్తామని తెలిపారు. కాగా, ఆదివాసీ దినోత్సవం సందర్భంగా మన్యం జిల్లా కేంద్రంలోని ఐటీడీఏలో అడవి తల్లి విగ్రహానికి పాలభిషేకం చేశారు. చీరలు, గాజులు, పసుపు, కుంకుమ సమర్పించారు. విద్యార్థులు థింసా నృత్యాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు.

ఏపీలో అపోలో సేవల విస్తరణ

- సీఎం చంద్రబాబుకు యాజమాన్యం నివేదన

అమరావతి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): అపోలో హెల్త్ వర్సిటీని మరింత అభివృద్ధి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వ సహకారం కావాలని, తమ సేవలు మరింత విస్తరిస్తామని సీఎం చంద్రబాబును అపోలో సంస్థ కోరింది. అపోలో సంస్థ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్‌పర్సన్ ప్రీతిరెడ్డి, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్ సంగీత రెడ్డి శుక్రవారం సీఎం చంద్రబాబును సచివాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు. 2014-19 మధ్య చిత్తూరులో ఏర్పాటు చేసిన అపోలో మెడికల్ కాలేజీని మరింత అభివృద్ధి చేసినట్టు తెలిపారు. అపోలో హెల్త్‌వర్సిటీ పరిధిని పెంచాలని నిర్ణయించామని, ప్రభుత్వం నుంచి సహాయ, సహకారాలు అందించాలని కోరారు. వారి ప్రతిపాదనపై సీఎం చంద్రబాబు సానుకూలంగా స్పందించారు. పూర్తిస్థాయి ప్రతిపాదనలతో రావాలని ఆయన సూచించారు.

జగన్ ఎమ్మెల్యే మాత్రమే.. సీఎం కాదు

- స్పీకర్‌గా నాకంతా సమానమే: అయ్యన్న

గొల్లప్రోలు, ఆగస్టు 9: జగన్మోహన్‌రెడ్డి ఇప్పుడు సాధారణ ఎమ్మెల్యే మాత్రమే. సీఎం కాదు. మీపై నమ్మకం ఉంచి ప్రజలు వారి ప్రాంత అభివృద్ధి కోసం ఎమ్మెల్యేగా ఎన్నుకున్నారు. అసెంబ్లీకి వచ్చి ప్రజా సమస్యలపై చర్చించాలి. ప్రజా తీర్పును గౌరవించాలి. అంతే గాని అసెంబ్లీకి రాను అనడం సమంజసం కాదు' అని శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు అన్నారు. స్పీకర్‌గా ఆయనకు అవకాశమిస్తానని.. వైసీపీకి వచ్చిన సీట్లకు అనుగుణంగా సమయం కేటాయిస్తానని చెప్పారు. కాకినాడ జిల్లా గొల్లప్రోలు పట్టణ శివారులోని పిఠాపురం మాజీ ఎమ్మెల్యే ఎస్వీఎస్ఎన్ వర్మ అతిథిగృహంలో ఆయన శుక్రవారం విలేకరులతో మాట్లాడారు. 'ఎమ్మెల్యేగా జగన్ అసెంబ్లీకి వచ్చి స్వేచ్ఛగా మాట్లాడవచ్చు, నేను అవకాశం ఇస్తా, ఇవ్వనని ఎందుకు అనుకుంటున్నారు? స్పీకర్‌గా నాకు అందరూ సమానమే' అని తెలిపారు.

ఎంటీఎంసీలో విజిలెన్స్ విచారణ

మంగళగిరి, ఆగస్టు 9: మంగళగిరి-తాడేపల్లి నగరపాలక సంస్థ (ఎంటీఎంసీ)లో విజిలెన్స్ విచారణ ఆరంభమైంది. శుక్రవారం రాత్రి విజిలెన్స్ అధికారుల బృందం ఎంటీఎంసీ ప్రధాన కార్యాలయాన్ని చేరుకుంది. అనేక ఫైళ్లను స్వాధీనం చేసుకొని తమతో పాటు తీసుకెళ్లినట్టు తెలిసింది. గత వైసీపీ ప్రభుత్వ హయాంలో 2019 నుంచి 2024 ఎన్నికల వరకు ఎంటీఎంసీ ఆధ్వర్యంలో జరిగిన పలు అభివృద్ధి పనులకు సంబంధించిన ఫైళ్లన్నీ ఈ బృందం పరిశీలించనుంది.

నీకో దండం సామీ!

(మొదటి పేజీ తరువాయి)

అర్థమై.. పార్టీకి గుడ్‌బై చెబుతున్నారు.

అజ్ఞాతంలోకి మాజీలు..

ఎన్నికలకు ముందు టీడీపీ నేతలపై ఒంటికాలితో లేచి వారిని అణచివేయాలని చూసిన పలువురు వైసీపీ నాయకులు ఇప్పటికే అజ్ఞాతంలోకి వెళ్లిపోయారు. గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి కేసులో నిందితుడిగా ఉన్న మాజీ ఎమ్మెల్యే వల్లభనేని వంశీ ఆచూకీ తెలియడం లేదు. కుప్పంలో చంద్రబాబు గెలిస్తే.. తాను రాజకీయాలు వదిలేసి జీవితాంతం ఆయన బూట్లు తుడుస్తూ బతికేస్తానంటూ ప్రకటించిన గుడివాడ మాజీ ఎమ్మెల్యే కొడాలి నాని ఇప్పుడు బహిరంగంగా కనిపించడమే లేదు. కొందరు నేతలు చంద్రబాబుపై బూతులవర్షం కురిపించారు. ఇంకొందరు ఆయన ఇంటిపైకే దండయాత్ర చేశారు. వీరిలో మాజీ మంత్రి జోగి రమేశ్ ప్రముఖుడు. చంద్రబాబు ఇంటిపై దాడికి వెళ్లినందుకు ఇప్పుడు కేసు నమోదైంది. ఏ క్షణంలోనైనా అరెస్టు తప్పదన్న భయంతో ఆయన హైకోర్టును ఆశ్రయించారు. వైసీపీ అధికారంలో ఉన్నప్పుడు.. సకలం తానే అన్నట్లుగా వ్యవహరించిన సజ్జల రామకృష్ణారెడ్డి ఇప్పుడు మీడియా ముందుకు రావడమే మానేశారు.

కూటమి వైపు ద్వితీయ శ్రేణి నాయకత్వం!

ఇక ద్వితీయశ్రేణి నాయకుల్లో పలువురు పాలక కూటమి వైపు చూస్తున్నారు. చాలా మంది స్థానిక సంస్థల ప్రజాప్రతినిధులు టీడీపీ, జనసేనల్లో చేరిపోతున్నారు. కుప్పంలో వైసీపీ ఖాళీ అయింది. పలువురు కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. విశాఖకు చెందిన చాలా మంది వైసీపీ కార్పొరేటర్లు టీడీపీ, జనసేనల్లో చేరారు. ఫలితంగా తాజాగా జీవీఎంసీ స్టాండింగ్ కమిటీలు మొత్తాన్నీ కూటమి కైవసం చేసుకుంది. తాడేపల్లిలోని ఆ పార్టీ కేంద్ర కార్యాలయాన్ని ఏకంగా జగన్ తాడేపల్లి నివాసంలోకి మార్చడం విశేషం. మంగళగిరిలో మాజీ ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి తన కార్యాలయాన్ని వదిలేశారు. ఇప్పుడిక్కడ హోటల్ నడుస్తోంది.



వైసీపీకి ఆళ్ల నాని గుడ్‌బై

- ఏలూరు జిల్లా అధ్యక్ష పదవికి రాజీనామా

ఏలూరు, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): గోదావరిలో వైసీపీకి గట్టి షాక్ తగిలింది. ఏలూరు జిల్లాలో ఆ పార్టీ కీలక నాయకుడు, మాజీ సీఎం వైఎస్ జగన్మోహన్‌రెడ్డికి అత్యంత సన్నిహితుడు, మాజీ ఉప ముఖ్యమంత్రి ఆళ్ల కాళీకృష్ణ శ్రీనివాస్ (నాని) ఆ పార్టీకి రాజీనామా చేశారు. జిల్లా అధ్యక్ష పదవి, ఏలూరు అసెంబ్లీ ఇన్‌చార్జి పదవుల నుంచి కూడా వైదొలిగారు. అసలు ప్రత్యక్ష రాజకీయాలకే గుడ్‌బై చెబుతున్నట్టు శుక్రవారం వైసీపీ అధ్యక్షుడు జగన్‌కు రాసిన లేఖలో పేర్కొన్నారు. రెండున్నర దశాబ్దాల పాటు అటు కాంగ్రెస్‌లోను, ఇటు వైసీపీ ఆవిర్భావం నుంచి నాని కీలక నేతగా ఉన్నారు. ఏలూరు అసెంబ్లీ స్థానం నుంచి ఐదు సార్లు పోటీ చేసి మూడు సార్లు 2004, 09 ఎన్నికల్లో కాంగ్రెస్ తరఫున, 2019 ఎన్నికల్లో వైసీపీ నుంచి గెలుపొందారు. 2014-19 నడుమ ఆయన వైసీపీ ఎమ్మెల్సీగా, ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా అధ్యక్షుడిగా వ్యవహరించారు. 2019 జూన్ 8 నుంచి 2022 ఏప్రిల్ 7 వరకు దరిదాపుగా మూడేళ్లు జగన్ కేబినెట్‌లో ఉపముఖ్యమంత్రి (వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి)గా పనిచేశారు. మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణలో పదవి కోల్పోయారు. దీంతో ఆయన తీవ్ర మనస్తాపానికి గురైనట్లు వార్తలు వచ్చాయి. ఆ తర్వాత 2024 ఎన్నికల్లో ఏలూరు అసెంబ్లీ నియోజకవర్గం నుంచి పోటీ చేయగా, టీడీపీ అభ్యర్థి బడేటి రాధాకృష్ణయ్య చేతిలో భారీ తేడాతో ఓడిపోయారు. దీంతో పూర్తి నిరాశలో ఉండిపోయారు. ఇప్పుడు ఆకస్మికంగా ప్రత్యక్ష రాజకీయాల నుంచి వైదొలుగుతున్నట్లు జగన్‌కు లేఖ రాయడం వైసీపీ వర్గాల్లో కలకలం రేపుతోంది. ఇప్పటికే ఆయన సన్నిహితులైన ఏలూరు నగర పార్టీ అధ్యక్షుడు బొద్దాని శ్రీనివాస్, ఏఎంసీ మాజీ చైర్మన్ మంచెం మైబాబు వైసీపీకి రాజీనామా చేశారు. దీంతో నగరంలో ఆ పార్టీ ఖాళీ అయినట్లయింది.

ఓరి దేవుడా!

(మొదటి పేజీ తరువాయి)

తాను ఇస్తానని... గుడి ఘనంగా నిర్మించాలని ఆ అధికారి మాట ఇచ్చారు. అన్నట్లుగానే అదే ప్రాంతానికి చెందిన తన సమీప బంధువు ద్వారా గుడి నిర్మాణానికి రూ.2కోట్లు చెల్లించారు. ఇదేకాదు... మరిన్ని గుడులు, చర్చిలు నిర్మాణానికీ చందాలు పంచి పెట్టారు. ఆ మద్యం అధికారి తాను కొట్టేసిన సొమ్మును రియల్ ఎస్టేట్‌లో భారీగా పెట్టుబడులు పెట్టారు. గుంటూరు, కృష్ణా, విశాఖ జిల్లాలతోపాటు హైదరాబాద్‌లోనూ భారీగా ఆస్తులు కొనుగోలు చేశారు. కృష్ణా జిల్లా వత్సవాయి మండలం చిట్యాలలో 6ఎకరాల భూమిని భారీ ధరకు కొనుగోలు చేసినట్లు తెలుస్తోంది. కృష్ణా, గుంటూరు జిల్లాల్లో సుమారు 50 ఎకరాలు కొనుగోలు చేసినట్లు సమాచారం. దుగ్గిరాలలోనే రూ.14కోట్ల విలువైన భూములు కొన్నారు. దొంగ సొమ్ము కావడంతో ఈ స్థిరాస్తులను బినామీల పేర్లతోనే రిజిస్టర్ చేయించారు.

అటు కిక్కు.... ఇటు మిల్కు

జగన్ ప్రభుత్వ హయాంలో రాష్ట్రంలోని మద్యం మాఫియాను నడిపించిన ఆ అధికారికి అనేక వ్యాపారాలు ఉన్నట్లు తెలుస్తోంది. ఒకవైపు కిక్కులో కాసులు దోచేస్తూ... ఆ డబ్బులను పాల వ్యాపారంలో పెట్టుబడిగా పెట్టినట్లు సమాచారం. తన బావమరిది పేరుతో సూర్యాపేట జిల్లా కోదాడలో పాలడెయిరీ పెట్టినట్లు తెలుస్తోంది. రాష్ట్రంలో సంపాదించిన సొమ్మును పలు రాష్ట్రాల్లో ఇటువంటి వ్యాపారాల్లో ఆ అధికారి పెట్టుబడుల రూపేణా పెట్టినట్లు చెబుతున్నారు. సహజంగా ప్రభుత్వం మద్యం పాలసీని ప్రకటించాక ఆయా బేవరేజస్ నుంచి టెండర్లు ఆహ్వానిస్తుంది. జగన్ ప్రభుత్వంలో అంతా రివర్స్‌గా జరిగింది. టెండర్లు పిలిచింది వాళ్లే.. మద్యం సరఫరా చేసింది వాళ్లే! అమ్మకాలు జరిగిందీ వారి కనుసన్నల్లోనే! సొంత జేబులు నింపుకొనేలా మద్యం విధానం రూపొందించింది. ఇందులో ఆ అధికారే దాదాపు వెయ్యి కోట్లు వెనకేసుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఐదేళ్లపాటు తమ సొంత బ్రాండ్లు... లేదా తమకు కమీషన్ ఇచ్చే కంపెనీల బ్రాండ్లు మాత్రమే విక్రయించారు. దీనికి సంబంధించిన డీలింగ్స్ మొత్తం హైదరాబాద్‌లోనే జరిగినట్లు తెలుస్తోంది. శాఖలో పని చేస్తున్న ఒక కింది స్థాయి అధికారి అక్కడ అపార్ట్‌మెంట్‌లో ఉండి అన్ని వ్యవహారాలు చక్కబెట్టారు. మద్యం కంపెనీల ప్రతినిధులను పిలిపించి కమీషన్లు అక్కడే ఫైనల్ చేసినట్లు తెలుస్తోంది. అక్కడ ఆయన ఓకే చేసిన తర్వాతే ఇక్కడ ఫైల్ కదిలేది అన్న ప్రచారం జరుగుతోంది.

ఎన్నికలకు మద్యం... డబ్బు...

మళ్లీ జగన్ అధికారంలోకి వస్తే ఇదే రీతిలో వేల కోట్లు సంపాదించుకోవచ్చన్న ఆలోచనతో సదరు అధికారి వైసీపీకి ఎన్నికల నిధులు భారీగా సమకూరేలా సహకరించారు. ఎన్నికల్లో ఓటర్లకు పంచేందుకు వీలుగా నియోజకవర్గాల్లోని వైసీపీ నేతలకు భారీస్థాయిలో మద్యాన్ని సరఫరా చేశారు. కీలకమైన తన పోస్టును కాపాడుకునేందుకు ఆ అధికారి... వైసీపీకి చెందిన చిత్తూరు జిల్లా నేతకు గులాంగిరీ చేశారు. సదరు నేతతో సంబంధమున్న కంపెనీల మద్యాన్ని భారీగా కొన్నారు. ఆయన చెప్పినట్లుగా శాఖను నడిపించారు. నోట్ల రద్దు తర్వాత డిజిటల్ పేమెంట్‌లకు ప్రాధాన్యం పెరిగింది. ఏపీలోని మద్యం దుకాణాల్లో నగదు మాత్రమే తీసుకొని అమ్మకాలు జరిపారు. డిజిటల్ పేమెంట్ జరిగితే అక్రమాలు బయటకు వస్తాయని... 'క్యాష్ అండ్ క్యారీ'నే ఉండాలనే ఆలోచన ఆ అధికారిదే. జగన్ ప్రభుత్వానికి ముందు మద్యానికి సంబంధించిన లావాదేవీలన్నీ సీ టెల్ సాఫ్ట్‌వేర్‌లో జరిగేవి. అన్ని విషయాలు తెలిసిపోతాయని ఆ సాఫ్ట్‌వేర్‌ను మార్చేందుకు కూడా సిద్ధపడ్డారు. మరో సాఫ్ట్‌వేర్‌తో మద్యం లావాదేవీలు రిపోర్టులను క్రోడీకరించారు. ఇందులో రిపోర్టులు సరిగ్గా రాక కిందిస్థాయి అధికారులు ఇబ్బందులు పడ్డారు.


ఆక్వా రంగానికి ప్రభుత్వ ప్రోత్సాహం: అహ్మద్ బాబు

అమరావతి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ఆక్వా రంగాన్ని ప్రోత్సహించే లక్ష్యంతో ప్రభుత్వం వివిధ కార్యక్రమాలు అమలు చేస్తోందని మత్స్యశాఖ ముఖ్యకార్యదర్శి అహ్మద్‌బాబు చెప్పారు. విజయవాడలో శుక్రవారం ఆక్వా రైతులు, రొయ్యల పరిశ్రమల ప్రతినిధులు, మత్స్యశాఖ అధికారులు, వివిధ బ్యాంకుల అధికారులతో రొయ్యల ఉత్పత్తి, శుద్ధి, ఎగుమతులపై సదస్సు జరిగింది. రొయ్యల పెంపకం, ప్రొసెసింగ్, ఎగుమతులపై చర్చించారు. అహ్మద్‌బాబు మాట్లాడుతూ రొయ్యల్లో వ్యాధి నిర్ధారణ, సంతాన లభ్యత, పర్యావరణ సవాళ్లను అధిగమించడానికి ప్రభుత్వం చర్యలు తీసుకుంటోందని, ఇందుకు నాబార్డు వంటి సంస్థల సహకారం ముఖ్యమని చెప్పారు. నాబార్డు చీఫ్ జనరల్ మేనేజర్ ఎమ్మార్ గోపాల్ మాట్లాడుతూ రొయ్యల సంతానోత్పత్తికి న్యూక్లియస్ బ్రీడింగ్ కేంద్రాల స్థాపనకు కేంద్ర బడ్జెట్‌కు అనుగుణంగా ఆర్థిక సహాయం అందిస్తామన్నారు. మత్స్యశాఖ కమిషనర్ డోలా శంకర్, నాబార్డు డీఎండీ రావత్ తదితరులు మాట్లాడారు.

రాజ్యాంగ శిల్పి పేరుతో రాతోన్మాదం!

- అంబేడ్కర్‌కు అపచారమంటూ జగన్ పత్రిక రాతలు

విజయవాడ, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి.. రాజ్యాంగ నిర్మాత బాబా సాహెబ్ అంబేడ్కర్‌కు సమానుడా? 'అంబేడ్కర్‌కు నేనెంత మాత్రం తక్కువకాదు' అన్నట్లుగా రాసుకున్న 'వైఎస్ జగన్మోహన్ రెడ్డి' అనే అక్షరాలను పీకేయడం బాబా సాహెబ్‌ను అవమానించడమా? ఇది రాజ్యోన్మాదమా? లేక.. జగన్ రోత పత్రిక 'రాతోన్మాదమా'? ఇవీ దళిత వాదుల ప్రశ్నలు! 'రాజ్యాంగ రూపశిల్పిపై రాజ్యోన్మాదం' అంటూ శుక్రవారం జగన్ పత్రిక పతాకస్థాయిలో వాపోయింది. ఆ మహనీయుడి విగ్రహానికి అపచారం జరిగిందేమో అనిపించేలా కథనం ప్రచురించింది. నిజానికి.. అక్కడ జరిగింది వేరు. 'వైఎస్ జగన్మోహన్ రెడ్డి, ముఖ్యమంత్రివర్యులు' అంటూ పెద్దగా రాసుకున్న అక్షరాలను మాత్రమే ఆగంతకులు పీకేశారు.



అంబేడ్కర్ విగ్రహం కింది భాగంలో తొలగించిన పేరు

అంబేడ్కర్‌తో సమానమా?

విజయవాడ స్వరాజ్ మైదాన్‌లో ఏర్పాటు చేసిన 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఈ ఏడాది జనవరిలో ముఖ్యమంత్రి హోదాలో జగన్ ప్రారంభించారు. ఇక్కడ జగన్ 'పేరు' పిచ్చి అంబేడ్కర్ సాక్షిగా బయటపడింది. ఏదైనా ప్రాజెక్టును, పథకాన్ని ఆవిష్కరించిన వారి పేరు, హోదాను శిలాఫలకంపై రాయడం రివాజు. కానీ... అంబేడ్కర్‌తో సమానంగా జగన్ తన పేరూ పెద్దగా రాసుకున్నారు. 'భారత రత్న బాబా సాహెబ్ డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సామాజిక న్యాయ మహాశిల్పం... ఆవిష్కర్త శ్రీ వైఎస్ జగన్మోహన్ రెడ్డి, గౌరవ ముఖ్యమంత్రివర్యులు' అంటూ స్టీల్ ఎంబోజ్డ్ అక్షరాలతో రాశారు. దీనిపై అప్పట్లోనే దళిత సంఘాలు నిరసన వ్యక్తం చేసినా అప్పటి వైసీపీ సర్కార్ పట్టించుకోలేదు. తాజాగా గురువారం రాత్రి కొందరు ఆగంతకులు 'వైఎస్ జగన్మోహన్ రెడ్డి' పేరున్న అక్షరాలు పీకేశారు. అంబేడ్కర్ విగ్రహానికి గానీ, ఆయన పేరును కానీ తాకలేదు. అయినా సరే... 'రాజ్యాంగ రూపశిల్పిపై రాజ్యోన్మాదం' అంటూ జగన్ పత్రిక తన రాతోన్మాదం ప్రదర్శించింది. వివిధ పథకాలకు అంబేడ్కర్ పేరు తొలగించి జగన్ తన పేరు పెట్టుకున్నారు. ఇది అంబేడ్కర్‌కు జరిగిన అవమానం. కానీ... విగ్రహం కింద ఉన్న జగన్ పేరు తొలగించడం అంబేడ్కర్‌ను అవమానించడమేనని వైసీపీ నేతలు ఆక్రోశిస్తుండటం విశేషం. శుక్రవారం ఉదయమే వైసీపీ నేతలు మేరుగ నాగార్జున, లేళ్ల అప్పిరెడ్డి, మొండితోక అరుణ్ కుమార్, మల్లాది విష్ణు, దేవినేని అవినాశ్ తదితరులు అంబేడ్కర్ విగ్రహం వద్ద నిరసనకు దిగారు. ఇది ప్రజాస్వామ్యంపై దాడేనని వ్యాఖ్యానించారు. వెంటనే జగన్ రెడ్డి పేరును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. అనంతరం డీసీపీ హరికృష్ణను కలిసి ఫిర్యాదు చేశారు. కాగా, 125 అడుగుల అంబేడ్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేయడాన్ని దళితులు అంతా హర్షిస్తారని, కానీ దళిత ద్రోహి.. వైఎస్ జగన్ పేరును అంబేడ్కర్ చెంత పెట్టడాన్ని ఏ దళితుడూ హర్షించడని సోషల్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు, టీడీపీ దళిత నాయకుడు మాదిగాని గుర్నాథం ఆగ్రహం వ్యక్తం చేశారు. జగన్ పాలనలో దళితులు తీవ్ర అణచివేతకు గురయ్యారని, ఆ ఆగ్రహంతోనే వైసీపీలోని దళితులే అంబేడ్కర్ చెంత ఆయన పేరు ఉండకూడదని తొలగించి ఉంటారని టీడీపీ దళిత నాయకుడు పరిశపోగు రాజేశ్ పేర్కొన్నారు. కడుపుమండిన దళితుడు జగన్ పేరు తొలగిస్తే అది అంబేడ్కర్‌కు ఎలా అపచారమో వైసీపీ నాయకులు వివరించాలని మాజీ కార్పొరేటర్ కొట్టేటి హనుమంతరావు అన్నారు.

జగన్ పేరు తొలగింపుపై వైసీపీ నీచ రాజకీయం

- ప్రభుత్వానికి ఆపాదించడం సరికాదు: మంత్రి డోలా

అమరావతి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): రాజకీయ లబ్ధి కోసం వైసీపీ నీచ రాజకీయం చేస్తోందని మంత్రి డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి ఆగ్రహం వ్యక్తం చేశారు. విజయవాడలో అంబేడ్కర్ విగ్రహానికి ఉన్న జగన్ పేరును ఎవరో ఆగంతకులు తొలగిస్తే, వైసీపీ నేతలు సిగ్గు లేకుండా నానా యాగీ చేస్తున్నారని మండిపడ్డారు. విదేశీ విద్యకు అంబేడ్కర్ పేరు మార్చి జగన్ పేరు పెట్టుకుంటే వైసీపీ దళిత నేతలు ఎందుకు నోరు మెదపలేదని నిలదీశారు. అంబేడ్కర్ విగ్రహంపై చిన్న గీత కూడా పడకపోయినా.. విగ్రహాన్ని ధ్వంసం చేస్తున్నారంటూ తప్పుడు ప్రచారం చేస్తూ, దాన్ని ప్రభుత్వానికి ఆపాదించడం సరికాదన్నారు.

జగన్‌కు కలలోనూ రెడ్‌బుక్ గుర్తొస్తోంది: నిమ్మల

ఎక్కడ ఎరుపు రంగు కనిపించినా... జగన్‌రెడ్డికి రెడ్ బుక్ కనిపిస్తోందని, కలలో కూడా అదే గుర్తొస్తోందని మంత్రి నిమ్మల రామానాయుడు ఎద్దేవా చేశారు. 'కక్షలు, కేసులు, వేధింపులు, హత్యలకు మారుపేరైన జగన్‌రెడ్డి... కూటమి గెలుపు ఓర్వలేక, తప్పుడు రాతలతో ప్రభుత్వంపై దుష్ప్రచారం చేసి, ప్రజల్ని మభ్యపెట్టాలని చూస్తున్నారు. నంద్యాలలో పాత కక్షల నేపథ్యంలో జరిగిన సుబ్బారాయుడు హత్యను జగన్ రెడ్డి రాజకీయం చేస్తున్నారు' అని నిమ్మల మండిపడ్డారు.



పరవళ్లు తొక్కుతూ సంద్రంలోకి...

కొండకోనలు దాటుకొచ్చిన కృష్ణమ్మ పరవళ్లు తొక్కుతూ సముద్రం వైపు వడివడిగా సాగుతోంది. ప్రకాశం బ్యారేజీ నుంచి దిగువకు వదిలేయడంతో శుక్రవారం నది నిండుగా పారుతున్న నీరు

పీఎస్ఆర్ బది'లీలలు'!

(మొదటి పేజ తరువాయి)

తాడేపల్లి ప్యాలెస్ వద్ద భద్రతా సిబ్బందిగా విధుల్లో చేరారు. వారి సేవలకు మెచ్చిన జగన్ సతీమణి... నచ్చిన శాఖలోకి పంపిస్తామని వారికి హామీ ఇచ్చారని సమాచారం. దీంతో వారంతా రవాణా శాఖను కోరుకున్నారు. ఈ నేపథ్యంలోనే 2021 నవంబరు మొదటి వారం నుంచి చివరి వారం వరకు సుమారు 50 మంది ఏఆర్ కానిస్టే బుళ్లు రావాణాశాఖలోకి డిపార్ట్మెంట్ ట్రాన్స్‌ఫర్ అయ్యారు.



కృష్ణబాబు ఇచ్చిన డిపార్ట్‌మెంట్ ట్రాన్స్‌ఫర్ ఉత్తర్వులు

ఇష్టారాజ్యంగా బదిలీలు

సాధారణంగా ఒక శాఖ నుంచి మరో శాఖకు బదిలీ అంత సులువు కాదు. సదరు ఉద్యోగి సమాన హోదాలో ఇతర శాఖలోకి అస్సలు బదిలీ చేయకూడదు. అయితే నిబంధనల పట్టింపు లేకుండా ఈ ప్రత్యేక బదిలీలు జరిగిపోయాయి. ఎల్ఆర్ నం: 440132/సి2/2021 (17.5.2021) ప్రకారం.. 2021 ఆగస్టు 25న అప్పటి ప్రిన్సిపల్ సెక్రటరీ ఎంటీ కృష్ణబాబు బదిలీ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ జీవోను రహస్యంగా ఉంచారు. అదే ఏడాది నవంబరులో ఉమ్మడి కడప, కర్నూలు, అనంతపురం, చిత్తూరు, నెల్లూరు జిల్లాలతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ఉన్న పలు రవాణా శాఖ కార్యాలయాల్లో వీరంతా విధుల్లో చేరిపోయారు. ఇలా బదిలీ అయిన వారిలో దాదాపు అందరూ జగన్ సామాజిక వర్గం వారే ఉండటం ప్రత్యేక ఉత్తర్వులకు కారణమని ఆ శాఖలో గుసగుసలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం ఈ వ్యవహారం రవాణా శాఖలో చర్చనీయాంశమైంది.

అంతులేని అరాచకాలు

జగన్‌పై ఎనలేని స్వామిభక్తి ప్రదర్శించే అప్పటి రవాణా శాఖ కమిషనర్ పీఎస్ఆర్ ఆంజనేయులు.. నిబంధనలకు విరుద్ధంగా వీళ్లందరికీ దశల వారీగా పోస్టింగులు ఇచ్చారు. ఇలా బదిలీపై వచ్చిన ఈ కానిస్టేబుళ్లు.. తమకు జగన్, ఆయన సతీమణి బాగా తెలుసంటూ.. అక్కడ పనిచేసే ఉన్నతాధికారులపైనే అజమాయిషీ చేసేవారని ఆరోపణలు ఉన్నాయి. శాఖ కార్యాలయానికి ఏదైనా పనిమీద వచ్చేవారితో స్వయంగా మాట్లాడుకుని.. మామూళ్లు వసూలు చేశారని పలువురు ఆరోపిస్తున్నారు. సాధారణ ప్రజలతో కూడా దురుసుగా వ్యవహరించే వారని చెబుతున్నారు. కమీషన్‌లో వాటా కోసం మోటార్ వెహికల్ ఇన్‌స్పెక్టర్లను బెదిరించేవారని అంటున్నారు. ఎవరైనా ఒప్పుకోకపోతే 'సీఎం సార్‌తో మాట్లాడతావా?' అని బెదిరింపులకు దిగేవారని పలువురు పేర్కొంటున్నారు. పనిచేసే కార్యాలయంలో కూడా తమకంటూ.. ఓ ప్రత్యేక కుర్చీ వేసుకుని కూర్చునే వాళ్లనే ఆరోపణలు ఉన్నాయి. ఇంకా కొందరు బరితెగించి తమకున్న పలుకుబడిని ఉపయోగించి ఆన్‌డ్యూటీ వేయించుకుని.. జిల్లాలు దాటి చెక్‌పోస్టుల్లో డ్యూటీకి వెళ్లారని తెలిసింది. కానిస్టేబుల్ స్థాయి ఉద్యోగి ఎట్టి పరిస్థితుల్లోనూ ఆన్‌డ్యూటీ పేరుతో జిల్లా పరిధి దాటకూడదు. అయితే జగన్ ప్రభుత్వంలో ఏదైనా జరుగుతుందనేందుకు ఈ ఉదంతమే నిదర్శనం. ఆదాయమే లక్ష్యంగా ఉద్యోగాలు వెలగబెట్టిన వీరంతా వైసీపీ ప్రభుత్వ పాలనలో ఆడుతూ పాడుతూ గడిపేశారు.

దీర్ఘకాలిక సెలవులకు సిద్ధం

జగన్ పాలనలో ఎటువంటి ఆటంకాలు లేకుండా ఉద్యోగాలు చేసిన వీళ్లకు రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పడటంతో భయం పట్టుకున్నట్లు సమాచారం. నిబంధనలకు విరుద్ధంగా శాఖల బదిలీ జరగడం.. ప్రభుత్వం నుంచి ఎటువంటి అనుమతి లేకుండా జగన్ పాదయాత్రకు రక్షణ డ్యూటీకి వెళ్లడం.. జగన్ సీఎం కాగానే.. విధులకు హాజరుకాని రోజులకు కూడా వేతనాలు తీసుకోవడం.. ఇలా ఒకదాని వెంట మరొకటి చేసిన అక్రమాలు వెలుగులోకి వస్తాయనే భయంతో సదరు కానిస్టేబుళ్లు హడలిపోతున్నట్లు తెలిసింది. దీంతో ఉన్నత విద్య పేరుతో మూడేళ్ల పాటు సెలవు కోసం పలువురు దరఖాస్తు చేసుకున్నట్లు సమాచారం. ఈ అక్రమాలపై కొత్త ప్రభుత్వం విచారణ జరిపించి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

సీఐడీ రిటైర్డ్ ఏఎస్పీ విజయ్‌పాల్‌కు షాక్

- ముందస్తు బెయిల్‌కు హైకోర్టు నో
- విచారణ ఈ నెల 20కి వాయిదా

అమరావతి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): సీఐడీ రిటైర్డ్ ఏఎస్పీ విజయ్‌పాల్‌కు హైకోర్టు షాక్‌ఇచ్చింది. మధ్యంతర ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. గత వైసీపీ హయాంలో సీఐడీ అధికారులు తనను చిత్రహింసలకు గురిచేసి, హత్యాయత్నం చేసేందుకు యత్నించారని టీడీపీ ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా విజయ్‌పాల్‌పై కేసు నమోదైంది. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఆయన హైకోర్టును ఆశ్రయించగా బెయిల్ ఇచ్చేందుకు నిరాకరించింది. ఈ వ్యవహారంపై పూర్తి వివరాలతో కౌంటర్ దాఖలు చేయాలని పోలీసులను ఆదేశించింది. విచారణను ఈ నెల 20కి వాయిదా వేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ వీఆర్‌కే కృపాసాగర్ ఉత్తర్వులు ఇచ్చారు. అప్పటి సీఎం జగన్, వైసీపీ ప్రభుత్వం ప్రతిష్ఠను దిగజార్చేలా వ్యాఖ్యలు చేశారని ఆరోపిస్తూ అప్పటి వైసీపీ ఎంపీ రఘురామపై పోలీసులు రాజద్రోహం సహా ఇతర సెక్షన్ల కింద 2021లో కేసు నమోదు చేశారు. సీఐడీ అధికారులు 2021, మే 14న రఘురామను అరెస్టు చేసి గుంటూరులోని సీఐడీ కార్యాలయానికి తరలించారు. ఆ రోజు రాత్రి తనను తీవ్ర చిత్రహింసలకు గురిచేశారని, హత్య చేసేందుకు ప్రయత్నించారని రఘురామ ఇటీవల గుంటూరు నగరంపాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో పోలీసులు అప్పటి సీఐడీ చీఫ్ పీవీ సునీల్‌కుమార్, అప్పటి నిఘా విభాగం చీఫ్ పీఎస్ఆర్ ఆంజనేయులు, మాజీ సీఎం జగన్, అప్పటి ఏఎస్పీ విజయ్‌పాల్, గుంటూరు జీజీహెచ్ అప్పటి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభావతి తదితరులపై కేసు నమోదు చేశారు. ఈ కేసులో తనకు ముందస్తు బెయిల్ మంజూరు చేయాలని కోరుతూ విజయ్‌పాల్ హైకోర్టును ఆశ్రయించారు. శుక్రవారం ఈ వ్యాజ్యం విచారణకు రాగా పిటిషనర్ తరఫు న్యాయవాది జీవీఎస్ కిశోర్ కుమార్ వాదనలు వినిపించారు. రఘురామను సీఐడీ అధికారులు అరెస్టు చేసి మూడేళ్లు గడిచిపోయిందన్నారు. చిత్రహింసలకు గురిచేశారనే ఆరోపణలతో నగరంపాలెం పోలీసులు తాజాగా కేసు నమోదు చేశారని, కానీ, శరీరంపై ఎలాంటి గాయాలూ లేవని హైకోర్టు ఏర్పాటు చేసిన మెడికల్ బోర్డు నివేదిక ఇచ్చిందని వివరించారు. పిటిషనర్ తనను అరెస్ట్ చేస్తారనే ఆందోళనలో ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేయలని కోరారు.

రాజద్రోహం విడ్డూరం

పోలీసుల తరఫున సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ లూత్రా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపించారు. ప్రభుత్వ విధానాలు, సీఎం నిర్ణయాలను విమర్శిస్తే రాజద్రోహం కేసు నమోదు చేయడం విడ్డూరంగా ఉందన్నారు. కస్టోడియల్ టార్చర్‌కు గురిచేసిన అధికారులకు న్యాయస్థానాలు మధ్యంతర ముందస్తు బెయిల్ ఇచ్చిన దాఖలాలు లేవని తెలిపారు. రఘురామను చిత్రహింసలకు గురిచేయడం వెనుక ఎవరున్నారో తేల్చాల్సి ఉందన్నారు. అప్పటి మెడికల్ రికార్డులు లభ్యంగా ఉన్నాయా? లేక వాటిని ధ్వంసం చేశారా? అనే విషయాన్ని తేల్చాల్సి ఉందని తెలిపారు. ప్రస్తుతం కేసు విచారణ ప్రాథమిక దశలో ఉందని, రఘురామ పాదాలపై గాయాలున్నట్లు సికింద్రాబాద్ ఆర్మీ హాస్పిటల్ నిర్ధారించిందని పేర్కొన్నారు. వైద్యులు ఇచ్చిన నివేదికను సుప్రీంకోర్టు పరిగణనలోకి తీసుకుందని, రఘురామను హింసించినట్లు అభిప్రాయానికి వచ్చిందన్నారు. ఈ దశలో మధ్యంతర ముందస్తు బెయిల్ మంజూరు చేస్తే దర్యాప్తునకు అవరోధం కలుగుతుందని తెలిపారు. అనుబంధ పిటిషన్ వేయకుండా అరెస్ట్ నుంచి రక్షణ కల్పించాలని పిటిషనర్ కోరడం సరికాదన్నారు. ఈ వాదనలతో ఏకీభవించిన న్యాయమూర్తి.. మధ్యంతర ముందస్తు బెయిల్ ఇచ్చేందుకు ఇది సముచితమైన కేసు కాదని అభిప్రాయపడ్డారు. రఘురామ తరఫు న్యాయవాది వీవీజీ ఉమేశ్‌చంద్ర స్పందిస్తూ.. ఈ కేసులో వాదనలకు అనుమతి కోరుతూ అనుబంధ పిటిషన్ వేసినట్టు తెలిపారు. బాధితుడిగా ఇంప్లీడ్ అయ్యేందుకు పిటిషనర్‌కు హక్కు ఉందన్నారు. ఇంప్లీడ్ పిటిషన్‌కు విచారణార్హత లేదని, దీనిపై కౌంటర్ వేసేందుకు సమయం ఇవ్వాలని విజయ్‌పాల్ తరఫు న్యాయవాది కోరారు. దీనికి అంగీకరించిన న్యాయమూర్తి విచారణను వాయిదా వేశారు.

'ఉచిత ప్రయాణం'పై ఎల్లుండి ప్రకటన

- ఆ రోజు ఆర్టీసీపై సమీక్షలో సీఎం నిర్ణయం
- మహిళలకు ఇచ్చిన హామీని అమలుచేస్తాం
- ఐదేళ్లలో ఆర్టీసీని నిర్వీర్యం చేసిన వైసీపీ
- కొత్త బస్సుల్లేవు.. ఉన్నవాటికి రిపేర్లు లేవు
- ఆర్టీసీ, రవాణాశాఖ మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి

అమరావతి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం త్వరలో అందుబాటు లోకి వస్తుందని రవాణాశాఖ మంత్రి మండిపల్లి రామ్‌ప్రసాద్ రెడ్డి తెలిపారు. ఈ నెల 12న రవాణా, ఆర్టీసీపై సమీక్ష సందర్భంగా మహిళలకు ఇచ్చిన ఉచిత ప్రయాణ హామీపై ముఖ్యమంత్రి చంద్రబాబు కీలక నిర్ణయం తీసుకుంటారన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఆర్టీసీ నిర్వీర్యం అయిందని, ఒక్కటంటే ఒక్క కొత్త బస్సు కొనుగోలు చెయ్యని జగన్ ప్రభుత్వం, కనీసం బస్సుల మరమ్మతులు కూడా పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తంచేశారు. 1,400 కొత్త బస్సులు వస్తున్నాయని, ఇప్పటికే ఉన్నవాటిలో పూర్తి ఫిట్‌నెస్‌తో ఉన్న బస్సులను మాత్రమే రోడ్లపైకి పంపుతామని స్పష్టంచేశారు. ఇసుక, మైనింగ్, బియ్యం... ఇలా రాష్ట్ర సంపద మొత్తాన్ని వైసీపీ పాలకులు దోచుకెళుతుంటే రవాణా అధికారులు చోద్యం చూశారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. రవాణాశాఖ, ఆర్టీసీపై శుక్రవారం ఆయన సమీక్ష నిర్వహిం చారు. ఆర్టీసీ దుస్థితిపై ఆవేదన చెందిన మంత్రి, రవాణా శాఖలో అవినీతిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రవాణా శాఖలో అక్రమార్కుల పనిపట్టి ప్రభుత్వానికి ఆదాయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అనంతరం విలేకరులతో మంత్రి మాట్లాడారు. "వైసీపీ ప్రభుత్వ వివక్ష, నిర్లక్ష్యంతో ఆర్టీసీ ఆక్యుపెన్సీ 45 శాతానికి పడిపోయింది. ఉద్యోగులు ప్రభుత్వంలో బస్సులు కార్పొరేషన్‌లో ఉంచి ఆప్ బాయిల్డ్ తరహాలో ఏషియాలో



ఆర్టీసీ విభాగం సమీక్షలో మంత్రి రాంప్రసాద్ రెడ్డి, అధికారులు

పెద్ద రవాణా సంస్థను నాశనం చేశారు. గతంలో చంద్రబాబు పాలనలో 70శాతానికి పైగా ఆక్యుపెన్సీ రేషియో ఉంది. తిరిగి ఆ స్థాయికి పెంచుతాం. ఎలక్ట్రిక్ బస్సులు విడతల వారీగా రాష్ట్రానికి తెప్పిస్తాం. కేంద్రం నుంచి వచ్చే వాటిలో మనకు 600కు పైగా వస్తాయి" అని మంత్రి అన్నారు.

రాష్ట్రాన్ని దోచేస్తుంటే చోద్యం చూశారు : మంత్రి

ఐదేళ్లుగా రాష్ట్రంలోని ఇసుక, మైనింగ్, రేషన్ బియ్యం ఇలా మొత్తం సంపదను దోచుకెళుతుంటే ఆర్టీఏ అధికారులు చోద్యం చూశారని మంత్రి రామ్‌ప్రసాద్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. కొందరు అధికారులు అవినీతికి అలవాటు పడి రాష్ట్ర ఖజానాకు నష్టం కలిగిస్తున్నారని, చేతివాటం ఇకపై ప్రదర్శిస్తే ఉపేక్షించబోనని హెచ్చరించారు. ఇసుక ఓవర్ లోడ్ వెళుతుందని తెలిసినా కేసు రాయలేదు.. చవక బియ్యం కాకినాడ పోర్టుకు అక్రమంగా తరలుతోందని తెలిసినా పర్మిట్లు అడగలేదు.. ఒకే నెంబర్ ప్లేట్‌తో మైనింగ్ వాహనాలు తిరుగుతున్నాయని తెలిసినా అడ్డుకోలేదు.. అంటూ సీరియస్ అయ్యారు. రాష్ట్ర సరిహద్దుల్లో చెక్‌పోస్టుల ఎత్తివేతపై ఫిర్యాదులు వస్తున్నాయని, కేంద్రం సూచనతోనే ఈ నిర్ణయం ఎన్నికల ముందు జరిగిందన్నారు. అయితే రాష్ట్ర ఆదాయానికి నష్టం వాటిల్లేలా ఉంటే ఎన్‌ఫోర్స్‌మెంట్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సిద్ధం చేయాలని, సీఎం దృష్టికి దీనిని 12న తీసుకెళ్లి సముచిత నిర్ణయం తీసుకుందామన్నారు. గతంలో చంద్రబాబు ప్రభుత్వం దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేని విధంగా 83 రకాల ఆన్‌లైన్ సేవలు ప్రవేశపెట్టి ప్రజలకు సేవలు సులభతరం చేస్తే, డబ్బు తీసుకుని ఆర్‌సీ కార్డు ఇవ్వలేని దుస్థితికి రవాణా శాఖను వైసీపీ ప్రభుత్వం తెచ్చిందని మంత్రి ఆవేదన వ్యక్తం చేశారు.

Printed and Published by Koganti Venkata Seshagiri Rao on behalf of Aamoda Publications Pvt. Ltd., Printed and Published at Aamoda Press, Andhra Jyothi Buildings, Survey No: 70/1 & 2, Vedurupavuluru Village, Mustabad Gramapanchayathi, Gannavaram Mandal, Krishna District, PIN : 521 107, Editor : K. Srinivas, RNI No:3470/1960, Managing Director : Vemuri Radha Krishna, Founder : K.L.N. Prasad.


నృత్య ప్రదర్శన చేస్తున్న శ్రీలక్ష్మి కూచిపూడి బృందం

అలరించిన కూచిపూడి నృత్య ప్రదర్శన

వన్‌టౌన్, ఆగస్టు 9 : ఇంద్రకీలాద్రి ధర్మపదం వేదికపై శుక్రవారం శ్రీలక్ష్మీ కూచిపూడి బృందం పలు కీర్తనలకు నృత్యం చేసి ప్రేక్షకుల నుంచి హర్షధ్వానాలు అందుకున్నారు. చక్కటి అభినయంలో తమదైన శైలిని ప్రదర్శించారు. అమ్మవారికి సంబంధించిన పలు కీర్తనలకు లయబద్ధంగా నాట్యం చేసి ఆహూతులను అలరించారు.

డ్రంక్ అండ్ డ్రైవ్‌లో 39 మందికి జైలు

విజయవాడ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి) : నగరంలో మద్యం తాగి వాహనాలు నడిపిన 36 మందికి రైల్వేకోర్టు జైలు శిక్షతోపాటు జరిమానా విధించింది. ట్రాఫిక్ ఆరో పోలీస్‌స్టేషన్ సిబ్బంది మొత్తం 36 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. ఈ కేసుల్లో నిందితులను రైల్వేకోర్టులో శుక్రవారం ప్రవేశపెట్టారు. వారికి కోర్టు జైలు శిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.10వేల చొప్పున జరిమానా విధించింది.


తమిళనాడుతో తలపడుతున్న ఏపీ జట్టు

జాతీయ బీచ్ కబడ్డీలో పురుషుల జట్టు శుభారంభం

విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు 9 : బీహార్ రాష్ట్రం బోధగయలో శుక్రవారం ప్రారంభమైన సీనియర్ నేషనల్ బీచ్ కబడ్డీలో ఆంధ్రప్రదేశ్ పురుషుల జట్టు శుభారంభం చేసింది. తమిళనాడుపై ఏపీ జట్టు ఘన విజయం సాధించింది. ఏపీ టీమ్ పోరాడి 39 పాయింట్లను సాధించగా తమిళనాడు జట్టు 33 పాయింట్లను చేసి పరాజయం పాలైంది. ఆంధ్రప్రదేశ్ మహిళా జట్టు హర్యానాతో జరిగిన మ్యాచ్‌లో 20 పాయింట్ల తేడాతో పరాజయం పాలైంది. హర్యానా 37, ఏపీ 17 పాయింట్లును చేశాయని ఏపీ కబడ్డీ అసోసియేషన్ సెక్రటరీ యలమంచిలి శ్రీకాంత్ తెలిపారు.

యోగా డిప్లమోలో అడ్మిషన్లు ప్రారంభం

మొగల్రాజపురం, ఆగస్టు 9: పీబీ సిద్ధార్థ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో 2024-25కు గాను డి ప్లోమో ఇన్ యోగా నందు అడ్మిషన్స్ ప్రారంభం అయ్యాయని ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కోర్సుకు కనీస విద్యార్హత ఇంటర్ అని, కోర్స్ కాల వ్య వధి ఏడాది అని తెలిపారు. విద్యార్థులు ఉద్యోగులు, గృహిణులు, ఉపయోగించుకోవచ్చని తెలిపారు. వివరాలకు కళాశాలలో సంప్రదించాలని సూచించారు.

16న ఉమ్మడి కృష్ణా యోగాసన పోటీలు

విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు 9 : కృష్ణాజిల్లా యోగాసన స్పోర్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఈ నెల 16న ఉదయం 8 గంటలకు సింగ్ నగర్‌లోని వివేకానంద సెంటీనరీ హైస్కూల్‌లో నిర్వహిస్తున్నట్లు జిల్లా అసోసి యేషన్ సెక్రటరీ ఎల్ మురళీకృష్ణ ఒక ప్రకటనలో తెలిపారు. సబ్ జూనియర్, జూనియర్, సీనియర్ బాల,బాలికలు, స్త్రీ, పురుషులకు వేర్వేరు విభాగాల్లో జిల్లా స్థాయి పోటీలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో పాల్గొనే వారు ఈ నెల 14వ తేదీలోగా రిజిస్ట్రేషన్ చేసుకోవాలని, ఇతర వివరాలకు ఎల్ మురళీకృష్ణ 9441119909, ఎల్ శాంతి 9440276648 నెంబర్లలో సంప్రదించాలన్నారు.

వరుస పతకాలతో దూసుకెళ్తున్న స్విమ్మర్లు

విజయవాడ స్పోర్ట్స్, ఆగస్టు 9 : ఒడిస్సా రాష్ట్రం కళింగపట్నం స్టేడియంలో జరుగుతున్న నేషనల్ ఆక్వా టిక్ చాంపి యన్‌షిప్‌లో ఎన్టీఆర్, కృష్ణా జిల్లా స్విమ్మర్లు వరుస పత కాలతో దూసుకెళ్త న్నారు. శుక్రవారం జూనియర్ విభాగంలో తీర్థ సమ్‌దేవ్ 800 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో స్వర్ణం, జి సంపత్‌కుమార్ ఇదే విభాగంలో రజతంను కైవసం చేసుకున్నారు. సబ్ జూనియర్ విభాగంలో ఎం. యజ్ఞసాయి 1500 మీటర్ల ఫ్రీస్టయిల్‌లో రజతంను కైవసం చేసుకున్నారు.

రైతుబజార్‌లో షాపులకు దరఖాస్తుల ఆహ్వానం

పాయకాపురం, ఆగస్టు 9 : పాయకాపురం మోడల్ రైతుబజార్‌లో డ్వాక్రా షాపుల ఏర్పాటు కు అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జాయింట్ కలెక్టర్ శుక్రవారం ఓ ప్రకటనలో కోరారు. మొత్తం పది డ్వాక్రా షాపులకు వారం రోజుల్లో దరఖాస్తులు చేసుకోవాలని తెలిపారు. దరఖాస్తు చేసుకునే వారు పాయకాపురం రైతుబజార్ కార్యాలయంలో గాని, గొల్లపూడిలోని వ్యవసాయ మార్కెటింగ్ అధికారి కార్యాలయంలోగాని దరఖాస్తు చేసుకోవాల్సిందిగా తెలియజేశారు. ఈ నెల 16వ తేదీ లోపు దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ఘనంగా ముగిసిన ప్లాస్మా వైజ్ఞానిక ప్రదర్శన

మొగల్రాజపురం, ఆగస్టు 9 : పర్వతనేని బ్రహ్మయ్య సిద్ధార్థ కళాశాలలో ఐదురోజులుగా జరుగుతున్న అంతర్జాతీయ ప్లాస్మా వైజ్ఞానిక ప్రదర్శన శనివారంతో ముగిసింది. కళాశాల భౌతిక శాస్త్ర విభాగం, ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా రీసెర్చ్ (అణువిభాగం) సంయుక్తంగా ఈ వైజ్ఞానిక ప్రదర్శన జరిగింది. 24 నమూనాలతో విద్యార్థులకు ప్లాస్మా అంటే ఏమిటి, దాని వల్ల ప్రయోజనాలు, ప్లాస్మా వల్ల భవిష్యత్‌లో రాబోయే మార్పుల గురించి వివరించామని, ఐదు రోజుల పాటు జరిగిన ఈ ప్రదర్శనను వివిధ కళాశాలు, పాఠశాలలకు చెందిన దాదాపు 6వేల మంది విద్యార్థులు సందర్శించారని కళాశాల భౌతిక శాస్త్ర విభాగాధిపతి డాక్టర్ టి.శ్రీనివాస కృష్ణ తెలిపారు. ఐదు రోజుల పాటు జరిగిన ఈ ప్రదర్శనలో పాల్గొన్న విద్యార్థులలో సిద్ధార్థ కళాశాల పిజి విద్యార్థులు మహిమ, భావనలకు ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ ప్లాస్మా రీసెర్చ్‌కు చెందిన చేతన్, హర్ష చేతుల మీదుగా ప్లాస్మా మోడల్ నమూనాను బహుమతులుగా అందిచారు. ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మేకా రమేష్, డీన్ రాజేష్ జంపాల, స్టూడెంట్ కో- ఆర్డినేటర్ దీపిక తోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

గిరిజనుల అభ్యున్నతికి చంద్రబాబు భరోసా

- సోషల్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు గురునాథం

వన్‌టౌన్, ఆగస్టు 9 : గిరిజనుల అభ్యున్నతికి, సంక్షేమానికి చంద్రబాబు నాయుడు పూర్తి భరోసాను ఇచ్చారని సోషల్ డెమొక్రటిక్ ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు మాదిగాని గురునాథం అన్నారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా తుమ్మలపల్లి కళాక్షేత్రంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ప్రోటోకాల్ మేరకు ఆయన పాల్గొన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, గిరిజనాభివృద్ధి శాఖ మంత్రి గుమ్మడి సంధ్యారాణి, మాజీ కార్పొరేటర్ నరసింహ చౌదరితో పాటు అన్ని స్టాళ్లను సందర్శించారు. గిరిజన కాఫీని రుచి చూశారు. గిరిజనులు ప్రదర్శించిన ధింసా నాట్యం, లంబాడాల నాట్యం, కోయ దొరల జోస్యం వంటి గిరిజన సంప్రదాయల ప్రదర్శనలను ఆస్వాదించారు.

సిద్ధార్థ వైద్యకళాశాలో ఇనుప వస్తువుల వేలం

పటమట, ఆగస్టు 9 : సిద్ధార్థ వైద్యకళాశాలో పనికిరాని ఇనుము, ప్లాస్టిక్ వస్తువులు కేజీల తూకం ద్వారా ఈనెల 17వ తేదీ మధ్యాహ్నం బహి రంగ వేలం నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఒక ప్రకట నలో తెలి పారు. పాటదారులు ఈనెల 14వ తేదీ సాయంత్రం లోపు రూ.500 చెల్లించి రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని, రూ.2000 డీడీ తీసి అందజేయాలని, వివరాలకు 8008736337లో సంప్రదించాలని సూచించారు.

ప్రజాహితమే ఏపీ సర్వోదయ మండల్ లక్ష్యం

ధర్నాచౌక్, ఆగస్టు 9 : ప్రజాహితమే లక్ష్యంగా ఆంధ్రప్రదేశ్ సర్వోదయ మండల్ కృషి చేస్తుందని ఆ సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఎస్.రాంబాబు నాయుడు స్పష్టం చేశారు. గాంధీనగర్‌లోని ఓ ఫంక్షన్‌హాల్‌లో శుక్రవారం జరిగిన సమావేశంలో సంస్థ నూతన కమిటీని ఎన్నుకున్నారు. ఉపాధ్యక్షులుగా వల్లూరు లత, ఏ.రవితేజ, కే.వరప్రసాద్, ప్రధాన కార్యదర్శిగా డి.దీన బంధు, కోశాధికారిగా వై.సురేష్‌బాబు, సహాయ కార్యదర్శులుగా డి.ఆశా జ్యోతి, పీవీఎస్‌ఎన్.ప్రసాద్, ఎం.రాజేంద్రప్రసాద్, కార్యనిర్వాహక కార్యదర్శులుగా జి.రవికుమార్, గంగవరపు ప్రదీప్‌దాస్, వై.సత్యేంద్రరెడ్డి ఎన్నిక య్యారు. నూతన కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు.

కొత్త జైలు నిర్మాణం జరిగేనా?

మూలపాడు, నున్న, కేసరపల్లి, నూజివీడు ప్రాంతాల్లో చేసిన సర్వేలు అటకెక్కినట్టేనా!

- ఖైదీలకు సరిపోని ప్రస్తుత జిల్లా జైళ్లు
- ఉమ్మడి కృష్ణాజిల్లాలోని పలు జైళ్లు, రాజమండ్రి సెంట్రల్ జైలు ఖైదీలతో ఫుల్...
- దీంతో నెల్లూరు జిల్లా జైలుకు ఖైదీల రిమాండ్
- మార్గమధ్యంలో ఖైదీ పారిపోతే సిబ్బంది ఇంటికే..
- లబోదిబోమంటున్న రిమాండ్ ఖైదీల ఎస్కార్టు సిబ్బంది


విజయవాడలోని జిల్లా జైలు(ఫైల్)

విజయవాడ లీగల్, ఆగస్టు 9: కృష్ణా, ఎన్టీఆర్ జిల్లాలకు కలిపి జిల్లా జైలు విజయవాడలోని గాంధీనగర్‌లో వుంది. దీనిలో ఖైదీల కెపాసిటీ 166. ఇందులో 162 మంది పురుషులు, 4గురు మహిళా ఖైదీలకు మాత్రమే రిమాండ్ చేసేందుకు వీలుంది. అయితే ప్రస్తుతం 170 వరకు ఖైదీలు రిమాండ్‌లో ఉన్నారు. వీరిలో కొత్తగా నేరం చేసిన నేరస్తులు, వారెంట్ల మీద జైలు కొచ్చిన ముద్దాయిలు మొత్తం కలిపి జిల్లాజైలులో 170 మంది ఉన్నారు. ఈ నేపథ్యంలో విజయవాడ సిటీ సివిల్ కోర్టులలోని న్యాయమూర్తులు ఖైదీల రిమాండ్‌లను నూజివీడు, గన్నవరం, నందిగామ, గన్నవరం, బందరు జైలుకు రాసేవారు. అవి కూడా ఖాళీ లేపోతే రాజమండ్రి సెంట్రల్ జైలుకు రిమాండ్‌కు రాసేవారు. ఏపీ రాజధాని కేంద్రంగా ఉన్న విజయవాడ నగరంలో ధర్నాలు, ఆందోళనలు ఎక్కువగానే జరుగుతుంటాయి. అరెస్టైన వారికి వెంటనే బెయిల్ వస్తే పర్వాలేదు కానీ పొరపాటున రిమాండ్ విధిస్తే జిల్లాజైలు, ఉమ్మడి కృష్ణాజిల్లాలోని పైప్రదేశాలలో పేర్కొన్న జైళ్ల ఖైదీలతో నిండిపోవడంతో రిమాండ్ విధించిన వారిని నెల్లూరు జిల్లా జైలుకు పంపిస్తున్నారు. దీంతో ఎస్కార్టు సిబ్బంది నిందితుడి రిమాండ్ తమ చావుకొచ్చిందని లబోదిబోమంటున్నారు. కోర్టు నిందితుడికి మొదటిసారి రిమాండ్ విధించినప్పుడు సివిల్ పోలీస్, వాయిదాల సమయంలో రిజర్వ్ పోలీసులు ఎస్కార్టుగా వెళ్తుంటారు. ఈ నేపథ్యంలో సివిల్, రిజర్వ్ పోలీసులిద్దరికీ ముద్దాయిలను జైలుకు తీసుకెళ్లే సమయంలో తమ జేబుకు చిల్లు పడుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఎందుకంటే సిబ్బందికి టీఏ, డీఏలు ఇవ్వకపోవడంతో రిమాండ్ ఖైదీతో పాటు వెంట వెళ్లే సిబ్బంది టిఫిన్, భోజన ఖర్చులన్నీ ఒక్కోసారి తామే భరించాల్సి వస్తోందని ఎస్కార్టు పోలీసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఒకవేళ నెల్లూరు తీసుకెళ్లే మార్గమధ్యంలో నిందితుడు కాలకృత్యాల కోసం, టిఫిన్, భోజనాల కోసం ఎక్కడైనా ఆగాల్సి వస్తే పొరపాటున ఖైదీ గనుక పారిపోతే ఇక తాము ఇంటిబాట పట్టాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. నెల్లూరు జిల్లాజైలుకు ఖైదీల రిమాండ్ తీసుకెళ్లడం వ్యయప్రయాసలతో పాటు తమ ఉద్యోగానికే ముప్పు వస్తుందా అని భయమేస్తోందని సిబ్బంది ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

కొత్త జిల్లా జైలు నిర్మాణంపై పూర్తయిన సర్వే

వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాకముందు ప్రస్తుత టీడీపీ ప్రభుత్వం అధికారంలో వుండగా కొత్తగా జిల్లా జైలు నిర్మాణం చేసేందుకు పలు ప్రాం తాలను పరిశీలించారు. దాదాపు 30 ఎకరాల విస్తీర్ణంలో రెండు, మూడు అంతస్తులతో దాదాపు వెయ్యి మంది ఖైదీలు రిమాండ్‌లో వుండేందుకు వీలుగా, సిబ్బంది క్వార్టర్స్ అన్నీ కూడా అక్కడే నిర్మించేలాగా కొన్ని ప్రాం తాలను జైళ్ల శాఖ ఉన్నతాధికారులు అప్పట్లో సర్వేలు కూడా చేశారు. వీటిలో మూలపాడు, కేసరపల్లి, నున్న, నూజివీడులోని పలు ప్రాంతాలను సందర్శిం చడం జరిగింది. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఆ మాటే మరిచిపో యింది. మళ్లీ టీడీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఇప్పుడైనా కొత్త జిల్లా జైలు నిర్మాణానికి అంకురార్పణ జరిగేనా అని సిబ్బంది ఎదురు చూస్తున్నారు.

కొత్త నియామకాలు లేవు.. పెరిగిన పనిభారం

గత వైసీపీ ప్రభుత్వం ఐదేళ్ల పాలనలో కనీసం ఒక్క హోంగార్డును కూడా రిక్రూట్ చేయలేదని, ఈ నేపథ్యంలో రిటైర్‌మెంట్ వయస్సుకు వచ్చిన వారు రిటైరై వెళ్లిపోతుండటం వలన కమిషనరేట్ పరిధిలోని అన్ని పోలీసు స్టేషన్‌లలో సిబ్బంది కొరత తీవ్రంగా వుందని సిబ్బంది ఆరోపిస్తున్నారు. పది మంది చేయాల్సిన పనిని సిబ్బంది కొరత వలన ఐదుగురు చేయాల్సి వస్తోందని దీంతో పనిభారం పెరిగిపోయిందని వారు ఆక్రోశం వ్యక్తం చేస్తున్నారు. సత్యనారాయణపురం, ఉయ్యూరు టౌన్, రూరల్, కొత్తపేట పోలీసు స్టేషన్ల నిర్మాణాలకు గ్రహణం పట్టిందనే ఆరోపణలున్నాయి. గత ప్రభుత్వ హయాంలో నిధుల కొరతతో పై స్టేషన్ల నిర్మాణం చాన్నాళ్ల నుంచి ఇప్పటివరకు కొనసాగుతూనే వుంది. ఇప్పటివరకు వాటి నిర్మాణం పూర్తికాకపోవడంతో అద్దె భవనాల్లో వేలాది రూపాయలు అద్దె చెల్లించి స్టేషన్లు నడుపుతున్నారు. పై సమస్యలన్నింటిని కొత్తగా వచ్చిన పోలీసు కమిషనర్ పరిశీలించి పరిష్కారం దిశగా చర్యలు చేపడతారని సిబ్బంది ఆశిస్తున్నారు.

'అవినీతి జలగ'పై విజిలెన్స్ ఎంక్వైరీ

- డీఓపీ 'జల్లా' అవినీతి అక్రమాలపై నివేదిక ఇవ్వాలని విజిలెన్స్‌ను కోరిన ప్రభుత్వం

[ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్]

విజయవాడ లీగల్, ఆగస్టు 9 : గత ప్రభుత్వ హయాం లో డైరక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌గా వ్యవహరించిన జల్లా సుదర్శన రెడ్డి అవినీతి, అక్రమాలపై సమగ్ర విచారణ జరిపి నివేదిక ఇవ్వా లంటూ ప్రభుత్వం విజిలెన్స్ విచారణకు శుక్రవారం ఆదేశించింది. జూన్ నెలలో జల్లా అవినీతి అక్రమాలపై రాష్ట్ర క్యాడర్ పబ్లిక్ ప్రాసిక్యూటర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు లాం అజయ్ ప్రేమ్ కుమార్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, హోం సెక్రటరీ, డీజీపీలకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదును ఆధారంగా చేసుకొని ఆంధ్రజ్యోతిలో జూన్ 12వ తేదీన 'అవినీతి జలగ' పేరుతో ఒక ప్రత్యేక కథనం ప్రచురితమైంది. ఈ నేపథ్యంలో చట్టవిరుద్ధంగా డీఓపీగా ఎన్నికైన జల్లా సుదర్శనరెడ్డి రాష్ట్రంలోని ఏపీపీలను వేధించడం, హైకోర్టు తీర్పుకు విరుద్ధంగా రూ.50 లక్షల వరకు జీత భత్యాలు తీసుకోవడం, ప్రభుత్వం నుంచి ఎటువంటి ఉత్తర్వులు పొందకుండా తానే డైరక్టర్‌గా చెలామణి అయి అధికార దుర్వినియోగానికి పాల్పడ డంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించి గత ప్రభుత్వానికి 'తొత్తు'గా 'జల్లా' వ్యవహరించారని అజయ్ తన ఫిర్యాదులో పేర్కొన్నారు. పై విషయాలన్నింటిపై కూలంకషంగా విచారణ జరిపి నివేదిక సమర్పించాలని విజిలెన్స్ అధికారులను ప్రభుత్వం ఆదేశించింది.


వై.ఎస్.జగన్‌తో అవినీతి జలగ 'జల్లా' (ఫైల్)


కరెంట్ లేని సమయంలో ప్రభుత్వ కొత్తాస్పత్రిలో వైద్యులతో మాట్లాడుతున్న కలెక్టర్ సృజన

ప్రభుత్వాస్పత్రిలో కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

- విద్యుత్ సరఫరాలో అంతరాయంపై సమగ్ర నివేదిక ఇవ్వాలని అధికారులకు ఆదేశం

వన్‌టౌన్, ఆగస్టు 9: విజయవాడ ప్రభుత్వ కొత్త ఆసుపత్రిని కలెక్టర్ సృజన గురువారం రాత్రి ఆకస్మిక తనిఖీ చేశారు. ఇదే సమయంలో విద్యుత్ సరఫరా ఆగిపోయిన విషయాన్ని గమనించి అధికారులను నిలదీశారు. ఎక్కడ లోపం ఉందో, విద్యుత్ సరఫరా ఎందుకు నిలిచిపోయిందో తెలియజేస్తూ సమగ్ర నివేదిక ఇవ్వాలని ఆమె ఆసుపత్రి సూపరింటెండెంట్‌ను ఆదేశించారు. కలెక్టర్ ఆకస్మిక తనిఖీకి రావటంతో అధికారులు ఒక్కసారిగా ఖంగుతిన్నారు. గురువారం సాయంత్రం నుంచి ఆగిపోయిన విద్యుత్ సరఫరా శుక్రవారం వరకు కూడా పునరుద్ధరించలేదు. జనరేటర్ సహాయంతో కొన్ని విభాగాలకు విద్యుత్ సరఫరా చేశారు. మిగతా విభాగాలు విద్యుత్ సరఫరా లేక రోగులు అవస్థలు పడ్డారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ వలనే విద్యుత్ సరఫరా ఆగిపోయిందన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. అధికారులు దీనిని గోప్యంగా ఉంచారు. దీనిపై ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ వెంకటేష్ స్పందిస్తూ ఐసీయూలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్ జరగలేదన్నారు. సాంకేతిక సమస్య కారణంగా విద్యుత్ సరఫరా ఆగిపోయిందని, రెండవ బ్లాక్‌లోని విద్యుత్ గదిలో ఒక పరికరం కాలిపోయిందని చెప్పారు.

బంగ్లా దమనకాండ వ్యతిరేక కవిత్వ పోటీలు

భవానీపురం, ఆగస్టు 9 : బంగ్లాదేశ్ దమనకాండ వ్యతిరేక కవిత్వం పోటీలను నిర్వహిస్తున్నట్లు జాతీయ కవితా వేదిక రాష్ట్ర కన్వీనర్ నిర్వాహకులు జింకా చక్రధర్, సామల కిరణ్‌లు ఒక ప్రకటనలో తెలిపారు. కవిత్వం 20 నుంచి 30 వరుసల్లో ఉండోచ్చని, కవితలు బంగ్లా ప్రజాస్వామ్య ఖననం, ఇస్లాం మత ఛాందసవాదం, హిందూవులపై మారణ కాండ, హిందువుల కర్తవ్యం మొదలైన అంశాలుండాలని, ఈ నెల 13వ తేదీలోగా కవితలను 9949394688, 9246471593 నెంబర్లకు పంపాలన్నారు. ఇందులో శీర్షిక, కవిత, పూర్తి పేరు, చిరునామా, సెల్ ఫోన్ నెంబర్ వివరాలుండాలన్నారు.


మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్ మీరా

వైసీపీ పాలనలో హింస, అధికార దుర్వినియోగం

- వాటన్నిటినీ బయట పెడతాం: నాగుల్ మీరా


విద్యాధరపురం, ఆగస్టు 9 : వైసీపీ పాలనలో జరిగిన హింసా రాజకీయాలు, అధికార దుర్వినియోగం, అక్రమాలను బయట పెడతామని టీడీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి నాగుల్‌మీరా అన్నారు. భవానీపురంలోని ఎన్డీయే కూటమి కార్యాలయంలో బీజేపీ ఎన్టీఆర్ జిల్లా అధ్యక్షుడు అడ్డూరి శ్రీరామ్‌తో కలిసి శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 60 రోజుల కూటమి ప్రభుత్వ పాలనలో ఎంతో మార్పు కనపడిందని, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా పాలన సాగుతుందని, రాష్ట్రం సుభిక్షంగా ఉందని అన్నారు. గత వైసీపీ పాలనలో ఎన్నో అరాచకాలు, దుర్మార్గాలు జరిగాయన్నారు. వెల్లంపల్లి శ్రీనివాస్ నియంత పాలన కొనసాగించి పశ్చిమ నియోజకవర్గాన్ని భ్రష్టుపట్టించాడని అడ్డూరి శ్రీరామ్ విమర్శించారు. తన అనుచరులకు, బినామీలకు దుర్గగుడి, కాళేశ్వరరావు మార్కెట్, గాంధీ హిల్ ప్రాంతాల్లో టెండర్లు వేయకుండానే అనధికారింగా పార్కింగ్‌లు కట్టబెట్టి కార్పొరేషన్ ఆదాయానికి గండికొట్టారన్నారు. అప్పటి అవినీతి అక్రమాల పై విచారణ చేపడతామన్నారు. ఎమ్మెల్యే సుజనా చౌదరి పశ్చిమ నియోజకవర్గాన్ని అభివృద్ధి చేసేందుకు నియోజకవర్గ ప్రజల ఆకాంక్షలను నెరవేర్చేందుకు శక్తివంచన లేకుండా కృషి చేస్తున్నారని తెలిపారు. కూటమి నాయకులు బుల్లాబ్బాయ్, మల్లెపు విజయలక్ష్మి, తిరుపతి అనూష, సాయి శరత్, తదితరులు పాల్గొన్నారు.

మాదిగల్లో నేటికీ సామాజిక వెనుకబాటు

- రిజర్వేషన్ ఫలాలు సరిగా అందుకోలేకపోవడమే కారణం
- ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ పరిరక్షణ సమితి నేతల ఆవేదన

ధర్నాచౌక్, ఆగస్టు 9 : రాజ్యాంగం ఏర్పడిన నాటి నుంచి నేటి వరకు విద్యా, ఉద్యోగాల్లో రిజర్వేషన్లు తగినంత సాధించలేక మాదిగలు సామాజికంగా వెనుకబడి పోయారని ఎస్సీ, ఎస్టీ వర్గీకరణ పరిరక్షణ సమితి రాష్ట్ర నేతలు రాయవరపు చిరంజీవిరావు, ఎల్.జైబాబు, గ్రిటన్, శిరిపురపు ఫ్రాన్సిస్ ఆవేదన వ్యక్తం చేశారు. గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో శుక్రవారం ఏర్పాటు చేసిన ప్రెస్‌మీట్‌లో వారు మాట్లాడారు. ఎస్సీలోని 59 కులాలకు అందాల్సిన రిజర్వేషన్ ఫలాలను ఒక్క మాల సామాజికవర్గమే తన్నుకుపోయిందన్నారు. మాలలు వర్గీకరణపై విచారించాల్సిన అవసరం లేదన్నారు. మాలల వనరులు, ఇతర ఆస్తులు మాదిగలు లాక్కోవడం జరగదన్నారు. కొందరు స్వార్థ కాంగ్రెస్‌పార్టీ నేతలు మాలలను రెచ్చగొట్టి లబ్ధిపొందాలని చూస్తున్నారన్నారు. వర్గీకరణను అడ్డుకునే ప్రయత్నాలు చేస్తూ బంద్‌లకు పిలుపునిచ్చి లా అండ్ ఆర్డర్ ప్రాబ్లమ్ సృష్టించేం దుకు కుటీల ప్రయత్నాలు చేస్తున్నారని విమర్శించారు. గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు జిల్లాను ఒక యూనిట్‌గా చేసి జనాభా లెక్కలు తేల్చి సమన్యాయం చేయాలని సీఎం చంద్రబాబుకు విజ్ఞప్తి చేశారు.

మహాశూన్యం హిందీ అనువాద గ్రంథావిష్కరణ


గ్రంథాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, విజయభాస్కర్, నారాయణరావు తదితరులు

విజయవాడ కల్చరల్, ఆగస్టు 9 : అలనాటి మహాకవులు రచించిన గొప్ప కవితా గ్రంథాల పక్కన ఉండగలిగిన కవితా సంకలనం 'మహాశూన్యం' అని, అతి త్వరలోనే ఈ కవిత సంకలనానికి జాతీయస్థాయి గుర్తింపు లభిస్తుందని అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ అన్నారు. పోలవరపు కోటేశ్వరరావు సాంస్కృతిక సమితి, సంవత్సర సేవా సమితి, సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో దీర్ఘాసి విజయభాస్కర్ తెలుగులో రచించిన మహాశూన్యం కవిత సంకలనాన్ని అనువాద సాహిత్య రత్న డాక్టర్ వెన్నా వల్లభరావు హిందీలో మహాశూన్య పేరిట అనువదించారు. యానువాద పుస్తక ఆవిష్కరణ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. దీర్ఘాసి విజయభాస్కర్ అనేక రచనలు చేసి 15కు పైగా భాషల్లో అనువాదాలు పొంది ఆయా భాషల్లో రంగస్థలం ప్రదర్శనలు జరిగి దేశమంతటా ప్రశంసలు అందుకున్న గొప్ప నాటకకర్త అన్నారు. దక్షిణ భారత హిందీ ప్రచార సభ సీనియర్ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ పేరిశెట్టి శ్రీనివాసరావు గ్రంథ సమీక్ష చేశారు. సభకు అధ్యక్షత వహించిన డాక్టర్ గుమ్మా సాంబశివరావు మహాశూన్యంలోని కవితలను వినిపించి దానిలోని తాత్విక సాహిత్య దృష్టిని ఆవిష్కరించారు. హిందీ ప్రొఫెసర్ కొచ్చర్లకోట వెంకట సుబ్బారావు, డాక్టర్ జీవీ పూర్ణచంద్ తదితరులు ప్రసంగించారు. పోలవరపు కోటేశ్వరరావు సాహితీ సమితి అధ్యక్షులు గోళ్ల నారాయణరావు సభను నిర్వహించారు. చింతా వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

ఆచంట వెంకటరత్నంనాయుడు విగ్రహావిష్కరణ 12న

అలనాటి ప్రముఖ రంగస్థల నటుడు ఆచంట వెంకటరత్నం నాయుడు కాంస్య విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమం ఈ నెల 12వ తేదీ తుమ్మలపల్లి కళాక్షేత్ర ఆవరణలో జరుగుతుందని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ తెలిపారు. గాంధీనగర్‌లోని హోటల్ ఐలాపురంలో శుక్రవారం విలేకరుల సమావేశంలో కార్యక్రమ పోస్టర్‌ను ఆవిష్కరించారు. మాజీ ఉప రాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు చేతుల మీదుగా కాంస్య విగ్రహ ఆవిష్కరణ జరుగుతుందన్నారు. విగ్రహ ఆవిష్కరణ కమిటీ అధ్యక్షులు అం బటి మధు మోహన్‌కృష్ణ, ఆచంట బాలాజీ నాయుడు, ఉపాధ్యక్షులు గోళ్ల నారాయణ రావు, వేముల హజరత్తయ్యగుప్తా, రావి వెంకట్, మాసబత్తుల శ్రీనివాస్, బొజ్జ గౌరీశంకర్, చింతా వెంకటేశ్వర్లు, తదితరులు పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమంలో పాల్గొన్నారు.


నిస్సాన్ ఎక్స్- ట్రయల్ కారును విడుదల చేస్తున్న ఎండీ పాములపాటి కిరణ్

మార్కెట్‌లో నిస్సాన్ ఎక్స్ ట్రయల్ కారు

భవానీపురం, ఆగస్టు 9 : విజయవాడ మార్కెట్‌లోకి కొత్త నిస్సాన్ ఎక్స్-ట్రయల్ 7 సీటర్ కారును ఎక్స్‌ప్రెస్ నిస్సాన్ షోరూమ్‌లో శుక్రవారం ఉదయం ఆవిష్కరించారు. నిస్సాన్ ఎక్స్-ట్రయల్ కారు అత్యాధునిక ఫ్యూచర్స్ కలిగి ఉందని మేనేజింగ్ డైరెక్టర్ పాములపాటి కిరణ్ తెలిపారు. వీసీ టర్బో ఇంజన్, 360 డిగ్రీ కెమెరా, పనోరమిక్ ఎలక్ట్రికల్ సన్‌రూఫ్, 7 ఎయిర్ బ్యాగ్స్, ఆల్ వీల్ డిస్క్ బ్రేక్స్‌తో ఉన్నాయని తెలిపారు. మూడు రం గుల్లో లభిస్తుందని, బుకింగ్ కోసం 9121144848లో సంప్రదించాలని తెలి పారు. షోరూమ్ మేనే జింగ్ డైరెక్టర్ పాములపాటి కిరణ్, ముఖ్య అతిథులు డాక్టర్ కోనేరు శ్రీధర్, డాక్టర్ ఆట్లూరి పల్లవి, ఆట్లూరి అనిల్, షోరూమ్ జనరల్ మేనేజర్ సతీష్ కుమార్, సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

ఒకటిన్నర నిమిషంలో

అంగ ప్రదక్షిణ కోటా బుకింగ్ పూర్తి

తిరుమల, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి అంగ ప్రదక్షిణకు సంబంధించి 250 టోకెన్ల కోటా కేవలం 90 సెకన్లలోనే పూర్తయింది. గతంలో రోజూ 750 టోకెన్లను తిరుమలలోనే ఆఫ్‌లైన్ ద్వారా కేటాయించేవారు. అయితే క్యూలైన్లలో భక్తులు అధిక సమయం వేచి ఉంటున్నారని, టోకెన్లు లభించని భక్తులు ఆందోళనలు చేస్తారనే ఉద్దేశంతో ఈ టోకెన్లను కూడా ఆన్‌లైన్ ద్వారానే కేటాయించేందుకు గతంలో నిర్ణయం తీసుకున్నారు. అయితే కొందరు స్థానికులు ఈ నిర్ణయాన్ని వ్యతిరేకించారు. ప్రతి శనివారం అంగ ప్రదక్షిణ చేసేందుకు ప్రత్యేక స్థానిక బృందం ఉందని టీటీడీ దృష్టికి తీసుకువచ్చారు. ఈ క్రమంలో 250 టోకెన్లను స్థానిక ఎమ్మెల్యేకు బదిలీ చేస్తూ వచ్చారు. ఆన్‌లైన్‌లో 750 టోకెన్లు కేటాయిస్తే శనివారం 500 టోకెన్లు మాత్రమే కేటాయించేవారు. కూటమి ప్రభుత్వమొచ్చాక ప్రతి శనివారం ఇచ్చే ఈ 250 టోకెన్లను కూడా ఆన్‌లైన్‌లోనే అందుబాటులో ఉంచాలని టీటీడీ తాత్కాలికంగా నిర్ణయం తీసుకుంది. 10వ తేదీ శనివారానికి 250 టోకెన్లను శుక్రవారం మధ్యాహ్నం 12 గంటలకు టీటీడీ అధికారిక వెబ్‌సైట్‌లో విడుదల చేయగా 90 సెకన్లలోనే భక్తులు బుక్ చేసుకున్నారు.

28 నుంచి ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియ

అమరావతి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఓటర్ల జాబితాల సవరణ ప్రక్రియకు భారత ఎన్నికల కమిషన్ శ్రీకారం చుట్టింది. జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని 2025, జనవరి 1లోపు సవరించిన తుది జాబితాలను ప్రకటించాలని నిర్ణయించింది. 18-19 సంవత్సరాల యువతీ యువకులను కొత్త ఓటర్లు గా నమోదు చేసి వారికి ఎపిక్ కార్డులను నేషనల్ ఓటర్స్ డే రోజున అందించాలని భావిస్తోంది. రెండు దశల్లో ఈ సవరణ కార్యక్రమాన్ని పూర్తి చేసేందుకు ముందస్తు కార్యాచరణ ప్రకటించింది. ఈ నెల 28 నుంచి అక్టోబరు 18 వరకు బీఎల్‌వోలు ఇంటింటికీ వెళ్లి ఓటర్ల సమాచారాన్ని ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది. ప్రస్తుత ఓటర్ల జాబితాల్లో పొరపాట్లను గుర్తించి తొలగించడం, ఓటర్ల ఫొటోల నాణ్యతను మెరుగుపరచడం, పోలింగ్ స్టేషన్ల హేతుబద్ధీకరణ తదితర కార్యక్రమాలను పూర్తి చేయాల్సి ఉంది. అక్టోబరు 19 నుంచి 28 వరకు 1 నుంచి 8 వరకు ఫారాల తయారీతోపాటు వచ్చే ఏడాది జనవరి 1వ తేదీ నాటికి సమగ్రమైన డ్రాఫ్ట్ రోల్స్‌ను సిద్ధం చేయాలని ఎన్నికల కమిషన్ ఆదేశించింది. అనంతరం రెండో దశ రివిజన్ కార్యక్రమాలు మొదలవుతాయి. మొదటి దశలో రూపొందించిన సమగ్రమైన డ్రాఫ్ట్ రోల్స్‌ను అక్టోబరు 29న ప్రచురిస్తారు. వాటిపై అభ్యంతరాలు, ఇతర క్లెయిములకి నవంబరు 28 వరకు సమయం ఇచ్చారు. ఈ ఏడాది డిసెంబరు 24 నాటికి అభ్యంతరాలు, క్లెయిములను పరిష్కరిస్తారు. తుది ఓటర్ల జాబితాలను 2025, జనవరి 6న ప్రచురించనున్నారు.

కేడర్ సీనియారిటీనే తీసుకోవాలి

- టీచర్ల సర్దుబాటుపై సంఘాల డిమాండ్

అమరావతి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల పని సర్దుబాటులో కేడర్ సీనియారిటీని పరిగణలోకి తీసుకోవాలని ఉపాధ్యాయ సం ఘాలు డిమాండ్ చేశాయి. స్కూల్ పాయింట్ సీనియారిటీని తీసుకునే విధానం గతంలో లేదని తెలిపాయి. శుక్రవారం పాఠశాల విద్యాశాఖ అధికారులు, ఉపాధ్యాయ సంఘాల ప్రతినిధులతో నిర్వహించిన వెబ్‌ఎక్స్ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. జీవో 117 ప్రకారం కాకుండా జీవో 53 ఆధారంగా పని సర్దుబాటు చేయాలని నేతలు కోరారు. అంతర జిల్లాల బదిలీలు, ఎయిడెడ్ పాఠశాలల నుంచి విలీనమైన టీచర్లను జూనియర్లుగా గుర్తించాలని కోరగా అందుకు ఇప్పటికే ఆదేశాలిచ్చామని అధికారులు తెలిపారు. సర్దుబాటును మండల, డివిజన్‌స్థాయికే చేయాలని కోరారు.

మొరాయించిన వీటీపీఎస్

- 4 యూనిట్లలో నిలిచిన ఉత్పత్తి

అమరావతి, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): విజయవాడ థర్మల్ పవర్ ప్లాంట్‌లోని నాలుగు యూనిట్లలో విద్యుదుత్పత్తి నిలిచిపోయింది. దీంతో జెన్కో అధికారులు ఆందోళనలో పడ్డారు. వీటీపీఎస్‌లో 4, 5 యూనిట్లలో ఒకదాన్ని ఓవర్‌హాలింగ్ చేస్తున్నారు. మరో యూనిట్ రిపేరుకు వచ్చింది. ఇటీవల.. ఉత్పత్తిని ప్రారంభించిన చెరో 800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 7, 8 యూనిట్లలో సాంకేతిక లోపాలు తలెత్తాయి. ఇటీవల ప్రారంభించిన ఈ యూనిట్లను రూర్కీకి చెందిన బీహెచ్‌ఈఎల్ ఇన్‌స్టాల్ చేసింది. ఇటీవల వర్షాలకు కొన్ని ఎలక్ట్రానిక్ పరికరాల్లోకి తేమ చేరడం వల్ల మోటార్లు మొరాయిస్తున్నాయని అధికారులు చెబుతున్నారు. ప్రస్తుతం ఈ రెండు యూని ట్లు గ్యారెంటీలో ఉన్నందున.. వాటిని స్థానిక ఇంజనీర్లు మరమ్మతులు చేసేందుకు సాహసించడం లేదు. బీహెచ్‌ఈఎల్‌ను సంప్రదించి ఉత్పత్తిని పునరుద్ధరించేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు. మొత్తానికి వీటీపీఎస్‌లో నాలుగు యూనిట్లలో ఉత్పత్తి లేకపోవడంతో విద్యుత్తు లోటు వస్తుందని అధికారులు ఆందోళన చెందుతున్నారు. అయితే.. కృష్ణపట్నం థర్మల్, నాగార్జునసాగర్, శ్రీశైలం, సీలేరు జల విద్యుత్కేంద్రాల నుంచి ఉత్పత్తి చేస్తుండటం, డిమాండ్ తగ్గడంతో సరఫరాలో సమస్యలు ఎదురుకావడం లేదని అధికారులు చెబుతున్నారు.

జాతీయ మామిడి బోర్డు ఏర్పాటు చేయండి



న్యూఢిల్లీ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఏపీలో జాతీయ మామిడి బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్‌ను రాష్ట్ర ఎంపీలు కోరారు. శుక్రవారం ఢిల్లీలో బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు, ఎంపీ దగ్గుబాటి పురందేశ్వరి నేతృత్వంలో కేంద్రమంత్రిని చిత్తూరు ఎంపీ దగ్గుమళ్ల ప్రసాదరావు, బీజేపీ జిల్లా అధ్యక్షుడు జగదీశ్వర్ నాయుడు, మాజీ ఎమ్మెల్యే వెంకటేశ్వర చౌదరి కలిసి వినతి పత్రం అందజేశారు.

ప్రకృతి వ్యవసాయమే శరణ్యం: రాజశేఖర్

అమరావతి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): వాతావరణంలో వస్తున్న విపరీత మార్పులను అధిగమించానికి ప్రకృతి వ్యవసాయ పద్ధతులే శరణ్యమని వ్యవసాయ శాఖ ప్రత్యేక ముఖ్య కార్యదర్శి బుడితి రాజశేఖర్ అన్నారు. శుక్రవారం తాడేపల్లిలోని పంచాయతీరాజ్‌శాఖ కమిషనర్ కార్యాలయంలో ప్రకృతి వ్యవసాయంపై జిల్లా వ్యవసాయ అధికారులు, కమ్యూనిటీ నేచురల్ ఫార్మింగ్ ప్రాజెక్ట్ మేనేజర్లకు రెండు రోజుల శిక్షణను ఆయన ప్రారంభించారు ప్రతి పార్లమెంట్ స్థానంలో 10వేల ఎకరాలను ప్రకృతిసాగులోకి తేవాలన్నారు.

ప్రత్యేక రక్షణ దళం అప్రమత్తంగా ఉండాలి

- ఏపీఎస్‌పీఎఫ్ చీఫ్ త్రివిక్రమ వర్మ

అమరావతి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ఏపీ ప్రత్యేక రక్షణ దళం విధులు నిర్వహిస్తున్న సంస్థలలో ఏపీఎస్‌పీఎఫ్ అధికారులు, సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, ఎలాంటి అవాంఛనీయ సంఘటనలకు తావు లేకుండా, భద్రతను కట్టుదిట్టం చేయాలని ఏపీఎస్‌పీఎఫ్ చీఫ్ త్రివిక్రమ వర్మ ఆదేశించారు. ఈ ఏడాది పదోన్నతి పొందిన ఏపీఎస్‌పీఎఫ్ ఉద్యోగులతో ఆయన సమావేశమయ్యారు.

సీఎస్‌తో వైస్ అడ్మిరల్ భేటీ

ఢిల్లీలోని భారత నావికాదళ ప్రధాన కేంద్రం వైస్ అడ్మిరల్ ఏవై సర్దేశాయి ఏపీ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్‌కుమార్ ప్రసాద్‌తో భేటీ అయ్యారు. రాష్ట్రంలో నావికాదళ కార్యకలాపాలకు సంబంధించిన అంశాలపై సీఎస్‌తో వైస్ అడ్మిరల్ చర్చించారు. రియర్ అడ్మిరల్ గిరీష్ కే గార్గ్, రాష్ట్ర రెవెన్యూ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఆర్పీ సిసోడియా పాల్గొన్నారు.

విశాఖ-సికింద్రాబాద్ వందేభారత్‌కు మంగళవారం సెలవు

విశాఖపట్నం, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): విశాఖపట్నం-సికింద్రాబాద్-విశాఖపట్నం మధ్య నడుస్తున్న వందే భారత్ రైలు(20833/34) షెడ్యూల్‌లో స్వల్ప మార్పులు చేస్తున్నట్టు సీనియర్ డీసీఎం కె.సందీప్ శుక్రవారం ఒక ప్రకటన లో తెలిపారు. ఆదివారం నిర్వహణ పనుల కోసం నిలిపివేస్తున్నారు. అయితే ఆదివారాల్లోనే ఎక్కువ మందికి దీని అవసరం ఉందని, ఆ రోజున నడపాలని సూచనలు రావడంతో డిసెంబరు 10 నుంచి ఆదివారం కూడా నడపాలని నిర్ణయించారు. అయితే మంగళవారం సర్వీసు నిలిపివేస్తారు.

జేపీసీలో నలుగురు తెలుగు ఎంపీలు

న్యూఢిల్లీ, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): వక్ఫ్ చట్టం సవరణ బిల్లు పరిశీలనకు కేంద్రం ఏర్పాటు చేసిన సంయుక్త పార్లమెంటరీ కమిటీ(జేపీసీ)లో తెలుగు రాష్ట్రాలకు చెందిన నలుగురు ఎంపీలు ఉన్నారు. 21 మంది లోక్‌సభ, 10 మంది రాజ్యసభ సభ్యులతో జేపీసీని ఏర్పాటు చేశారు. ఇందులో తెలంగాణ నుంచి డీకే అరుణ(బీజేపీ), హైదరాబాద్ ఎంపీ అసదుద్దీన్ ఒవైసీ(ఎంఐఎం), ఏపీ నుంచి ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు(టీడీపీ), రాజ్యసభ సభ్యుడు విజయసాయి రెడ్డి(వైసీపీ) సభ్యులుగా ఉన్నారు.

కృష్ణా జలాలపై హక్కు కోసం పోరాడండి

- సీఎం చంద్రబాబుకు రాష్ట్ర సమగ్రాభివృద్ధి అధ్యయన వేదిక కన్వీనర్ లేఖ

అమరావతి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): కృష్ణా నదీల జలాలపై హక్కుల కోసం సుప్రీంకోర్టులో పోరాటం చేయాలని సీఎం చంద్రబాబును రాష్ట్ర సమగ్రాభివృద్ధి అధ్యయన వేదిక కన్వీనర్ టి.లక్ష్మీనారాయణ కోరారు. శుక్రవారం చంద్రబాబుకు బహిరంగ లేఖ రాశారు. కృష్ణా నదీ జలాల హక్కులపై సుప్రీంకోర్టులో న్యాయపోరాటం చేయాల్సిన బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపై ఉందన్నారు. ఏపీ మిగులు జలాలను వినియోగించుకునే స్వేచ్ఛను బచావత్ ట్రిబ్యునల్ కల్పించిందని గుర్తు చేశారు. ఆ స్వేచ్ఛను హరిస్తూ బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ తీర్పు ఇచ్చిందని తప్పుబట్టారు.

సకాలంలో ఇక కొండల్లోనూ విద్యుత్ కాంతులు

- దేశంలోనే తొలి పైలెట్ ప్రాజెక్టుగా చింతూరు డివిజన్

చింతూరు, ఆగస్టు 9: ప్రధానమంత్రి జన్‌మన్ యోజన పథకంలో భాగం గా కొండ ప్రాంతాల ప్రజలకు కూడా స్టాండ్ సోలార్ సెట్ల ద్వారా విద్యుత్ సౌకర్యం కల్పించనున్నారు. దేశంలోనే తొలిసారిగా ఏపీ ఈ అవకాశాన్ని దక్కించుకుంది. దీనిలో బాగంగా ఏపీఈపీడీసీఎల్ సీఎండీ పృథ్వీతేజ్ అల్లూరి సీతారామరాజు జిల్లా చింతూరు డివిజన్‌లోని చింతూరు, కూనవరం, వరరామచంద్రపురం, ఎటపాక మండలాలను పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు. ప్రపంచ ఆదివాసీ దినోత్సవం సందర్భంగా శుక్రవారం చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య, ఏపీఈపీడీసీఎల్ రాజమండ్రి ఎస్ఈ తిలక్‌కుమార్ 94 కొండరెడ్ల కుటుంబాలకు స్టాండ్ సోలార్ సెట్లను ఉచితంగా అందించే కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ వ్యవస్థ ద్వారా ఐదు బల్బులు, ఒక ఫ్యాన్, ఒక లాప్‌ట్యాప్, ఒక మొబైల్‌కు విద్యుత్ సరఫరా అందనుంది.

అందని వైద్యం.. తల్లి, బిడ్డ మృతి

- చింతపల్లి ఏరియాలో ఘటన

గూడెంకొత్తవీధి, ఆగస్టు 9: ఆదివాసీ దినోత్సవం వేళ ఏజెన్సీలో విషాదం నెలకొంది. నిండు గర్భిణికి సకాలంలో వైద్య అందకపోవడంతో తల్లి, శిశువు మృతి చెందారు. అల్లూరి సీతారామరాజు జిల్లా గూడెంకొత్తవీధి మండలం రింతాడ పంచాయతీ ఊబపాలం గ్రామంలో ఈ ఘటన జరిగింది. మృతురాలి భర్త కృష్ణ, తల్లిదండ్రులు బంగారం, భానుమతి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన వంతల పరిమళ(21)కు నెలలు నిండటంతో గురువారం ఆమెను అంబులెన్స్‌లో చింతపల్లి ఏరియా ఆసుపత్రికి తీసుకువెళ్లారు. ఆమెకు సిజేరియన్ అవసరమని వైద్యులు గుర్తించారు. అయితే అక్కడ గైనకాలజిస్టు, మత్తు మందు వైద్యుడు అందుబాటులో లేకపోవడంతో పరిమళను అంబులెన్స్‌లో 60 కిలోమీటర్ల దూరంలో ఉన్న అనకాపల్లి జిల్లా నర్సీపట్నం ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడి వైద్యులు ఆమెకు సహ జ కాన్పు చేశారు. అయితే శిశువు కడుపులోనే మృతిచెందింది. తల్లి ఆరోగ్య పరిస్థితి కూడా విషమంగా ఉండటంతో శుక్రవారం తెల్లవారుజామున విశాఖ కేజీహెచ్‌కు తరలిస్తుండగా, మార్గమధ్యంలోనే పరిమళ తుదిశ్వాస విడిచింది.

వైసీపీ భూ బాధితులతో కలసి ధర్నాలు: సీపీఐ

తిరుపతి(ఆటోనగర్), ఆగస్టు 9: వైసీపీ ప్రభుత్వ హయాంలో జరిగిన భూ ఆక్రమణల బాధితులను ఏకం చేసి వారికి న్యాయం చేయడానికి ఆందోళన కార్యక్రమాలు చేపడతామని సీపీఐ జాతీయ కార్యదర్శి కె.నారాయణ పేర్కొన్నారు. తిరుపతిలో శుక్రవారం ఆయన మాట్లాడారు. 'మదనపల్లెలో వున్న భూములకు పులివెందులలో రికార్డులు తారుమారు చేసి రిజిస్ట్రేషన్ చేసుకున్న విషయాన్ని ప్రశ్నించిన వేంకటేశ్వరరావుపై గత ప్రభుత్వం కేసులు బనాయించింది. పోలవరం ప్రాజెక్టుకు జాతీయ హోదా కల్పించి నిధులను గ్రాంట్ రూపంలో కేటాయించాలి. ఎన్నికల్లో బ్యాలెట్ పేపరు విధానమే మం చిది. వయనాడ్‌లో జరిగిన విపత్తును కేంద్ర ప్రభుత్వం జాతీయ విపత్తుగా గుర్తించి నిధులు కేటాయించాలి' అని నారాయణ డిమాండ్ చేశారు. వయనాడ్ బాధితుల కోసం నిత్యావసర వస్తువుల లారీని ఆయన ప్రారంభించారు.

నంబర్ వన్ క్రిమినల్ జగన్

- మాజీ సీఎంపై మండిపడ్డ మంత్రులు, ఎంపీ, ఎమ్మెల్యేలు

నంద్యాల(నూనెపల్లె), ఆగస్టు 9: దేశంలోనే నంబర్ వన్ క్రిమినల్ లీడర్ వైఎస్ జగన్మోహన్ రెడ్డి అని టీడీపీ రాష్ట్ర మంత్రులు ఎన్ఎండి ఫరూక్, బీసీ జనార్దనరెడ్డి విమర్శించారు. శుక్రవారం నంద్యాలలో మంత్రి ఫరూక్ మాట్లాడుతూ.. 'ఇప్పటికైనా జగన్ హత్యా రాజకీయాలపై మాట్లాడటం మానుకోవాలి' అని హితవు పలికారు. మంత్రి జనార్దన్‌రెడ్డి మాట్లాడుతూ.. 'జగన్ ఐదేళ్ల పాలనలో 2,686 హత్యలు జరిగాయి. వాటిపై కూడా కేసులు పెట్టాలి. వైఎస్ కుటుంబ చరిత్ర అంతా రక్త చరిత్రే. సీతారామపురంలో రెండు పార్టీల మధ్య గొడవ జరగలేదు. కేవలం రెండు కుటుంబాల మధ్య గొడవ జరిగింది' అని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే భూమా అఖిలప్రియ మాట్లాడుతూ.. '11 సీట్లకే వైసీపీని పరిమితం చేసినా జగన్‌కు బుద్ధి రాలేదు' అని అన్నారు.

కాంట్రాక్ట్ ఉద్యోగులను రెగ్యులర్ చేయండి

- హెల్త్ డైరెక్టరేట్, ఐఈఆర్పీల వినతి
- ప్రజాదర్బార్‌లో మంత్రి లోకేశ్‌కు వినతుల వెల్లువ

తాడేపల్లి, ఆగస్టు 9: ఏపీ సమగ్ర శిక్ష సొసైటీలో ఇంక్లూజివ్ ఎడ్యుకేషన్ విభాగంలో ప్రత్యేక అవసరాలు గల పిల్లల విద్యాభివృద్ధి కోసం కాంట్రాక్టు, ఔట్ సోర్సింగ్ పద్ధతిలో పని చేస్తున్న 1350 మంది ఐఈఆర్పీలను విద్యాశాఖలో విలీనం చేసి క్రమబద్ధీకరించాలని ఏపీ భవిత స్పెషల్ ఎడ్యుకేటర్ ఫెడరేషన్ ప్రతినిధులు మంత్రి లోకేశ్‌కు విజ్ఞప్తి చేశారు. సెకండరీ హెల్త్ డైరెక్టరేట్‌లో పని చేస్తున్న 203 మంది కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని సంబంధిత సిబ్బంది లోకేశ్‌ను కోరారు. ఉండవల్లిలోని తన నివాసంలో 23వ రోజైన శుక్రవారం విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ నిర్వహించిన ప్రజాదర్బార్‌కు మంగళగిరితోపాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చారు. ప్రజల వినతులను శాఖలవారీగా విభజించి పరిష్కరించాలని ఆదేశాలు జారీ చేశారు. పుట్టుకతో దివ్యాంగుడినైన తాను డిగ్రీ వరకు చదివానని, ఉద్యోగం కల్పించాలని తూర్పుగోదావరి జిల్లా దేచర్లకు చెందిన వెలగాల వెంకటేశ్ కోరారు. పుట్టుకతో అంధుడినైన తనకు గత వైసీపీ ప్రభుత్వం దివ్యాంగ పెన్షన్ తొలగించిందని తిరిగి పునరుద్ధరించాలని మాచర్లకు చెందిన ఎం.కొండలరావు కోరారు. కళాకారుల పెన్షన్ అందించి ఆదుకోవాలని నవులూరుకు చెందిన షేక్ షంషున్నీసా కోరారు. బ్లడ్ క్యాన్సర్‌తో చికిత్స పొందుతున్న తన 11 ఏళ్ల కుమార్తెకు సీఎం రిలీఫ్ ఫండ్ అందించాలని ఉండవల్లికి చెందిన మేకల ఆదినారాయణ కోరారు.



దివ్యాంగుల నుంచి వినతులు స్వీకరిస్తున్న నారా లోకేశ్

పోలీసు అధికారి బెదిరిస్తున్నారు

తమ వద్ద 8 ఏళ్ల కిందట రూ.5 లక్షల అప్పు తీసుకున్న పోలీసు అధికారి తిరిగి చెల్లించకుండా బెదిరిస్తున్నారని గుంటూరు జిల్లా వట్టిచెరుకూరు మండలం కర్నూతలకు చెందిన మిక్కిలి మరియమ్మ మంత్రి లోకేశ్‌ను కలిసి కన్నీటిపర్యంతమయ్యింది. గతంలో అసెంబ్లీ చీఫ్ మార్షల్ సెక్యూరిటీ ఏఎస్పీగా పని చేసిన తియోఫిలాస్‌కు పొలం తాకట్టు పెట్టి అప్పు ఇచ్చాం. ఇంతవరకు చెల్లించలేదు. దీనిపై 2022లో డీజీపీకి ఫిర్యాదు చేసినా, చర్యలు తీసుకోలేదని వాపోయారు. పరిశీలించి చర్యలు తీసుకుంటానని లోకేశ్ భరోసా ఇచ్చారు.

తేమ ప్రవాహాలతో వయనాడ్ విపత్తు

వాతావరణ నిపుణుల విశ్లేషణ.. 70 ఏళ్లలో 596 సార్లు కుంభవృష్టి

- నైరుతి సీజన్‌లోనే ఎక్కువ ఘటనలు
- ఈ సీజన్‌లో ఏడు శాతం ఎక్కువ వర్షపాతం
- తూర్పు, ఈశాన్య, వాయవ్య భారతాల్లో లోటు



విశాఖపట్నం, ఆగస్టు 9 (ఆంధ్రజ్యోతి): కేరళలోని వయనాడ్‌లో ప్రకృతి విలయానికి 300 మంది ప్రాణాలు కోల్పోయారు. రుతుపవనాల తీవ్రత, విచ్చలవిడిగా భూవినియోగ మార్పిడే వయనాడ్ విపత్తుకు కారణమని కొందరు నిపుణులు అంచనా వేస్తున్నారు. అయితే.. ఆకాశంలో ఏర్పడిన తేమ ప్రవాహాలే ఈ విలయానికి కారణమని వాతావరణ నిపుణులు విశ్లేషిస్తున్నారు. భూ ఉపరితలంపై 300 మీటర్ల ఎత్తు నుంచి 3వేల మీటర్ల ఎత్తు మధ్యన ఏర్పడిన తేమ ప్రవాహాలు వర్షించడం వల్ల వయనాడ్ తరహా విపత్తులు సంభవిస్తున్నాయని చెబుతున్నారు. నైరుతి రుతుపవనాల సీజన్‌లో జూన్ నుంచి సెప్టెంబరు వరకు తేమ ప్రవాహాల తీవ్రత ఎక్కువగా ఉంటుంది. మరీ ముఖ్యంగా గత రెండేళ్లుగా జూలైలో తేమ ప్రవాహాల తీవ్రత ఎక్కువగా ప్రభావం చూపుతోంది. గతేడాది జూలైలో దేశంలో 1,113 చోట్ల అతి భారీవర్షాలు (115.6 మి.మీ. నుంచి 204.5 మి.మీ. వర్షపాతం వరకు), 205 చోట్ల కుంభవృష్టిగా వర్షాలు (204.5 మి.మీ. కంటే ఎక్కువ) కురిశాయి. ఈ ఏడాది జూలైలో 1,030 చోట్ల అతి భారీవర్షాలు, 193 చోట్ల కుంభవృష్టి వర్షాలు కురిశాయి. పెరుగుతున్న ఎండలకు ఉష్ణమండల ప్రాంతాల్లో సముద్రాలు వేడెక్కి నీరు తేమ (ఆవిరి)గా మారి పైకి వెళ్లి ధ్రువాల వైపు వెళుతుంది. ఈ క్రమంలో పడమర నుంచి తూర్పునకు పయనించే అత్యంత వేగమైన గాలుల ప్రభావంతో తేమ మరింత పైకి వెళ్లి అక్కడ ఎక్కువ ప్రాంతంలో విస్తరిస్తోంది. భూ ఉపరితలంపై 300 మీటర్ల నుంచి 3వేల మీటర్ల ఎత్తు మధ్యన ఎక్కువ ప్రాంతంలో విస్తరించే తేమ ప్రవాహంగా మారి (వీటిని వెర్టికల్ ఇంటిగ్రేటెడ్ మాయిశ్చర్ ట్రాన్స్‌పోర్టు అని పిలుస్తారు) తర్వాత వర్షిస్తోంది. ఈ నేపథ్యంలో ఆయా ప్రాంతాల్లో అతి భారీ నుంచి కుంభవృష్టి వర్షాలు కురిసి వరదలు సంభవిస్తాయి. ఇంకా కొండ చరియలు విరిగిపడి మరింత మానవ నష్టం జరుగుతుందని నిపుణులు చెబుతున్నారు.

దేశంలో అనేకచోట్ల సంభవించే వరదలకు తేమ ప్రవాహాలే కారణమని గతేడాది నేచర్ జర్నల్‌లో ఒక పరిశోధన పత్రం ప్రచురితమైంది. గత 35 ఏళ్లలో దేశంలో సంభవించిన వరదలకు 70 శాతం వరకు తేమ ప్రవాహాలే కారణమయ్యాయి. ఇందుకు బ్రహ్మపుత్ర, గంగా పరీవాహక ప్రాంతాల్లో సంభవించిన వరదలే నిదర్శనంగా చెబుతారు. 70 ఏళ్లలో దేశంలో 596 తీవ్రమైన వరదలకు తేమ ప్రవాహాలే కారణమని గుర్తించారు. ముఖ్యంగా జూన్ నుంచి సెప్టెంబరులో ఎక్కువగా జరిగాయని, కేరళలోని వయనాడ్‌లో విపత్తుకు అదే కారణమని తాజాగా కొందరు వాతావరణ నిపుణులు అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది జూన్ నుంచి ఆగస్టు తొలి వారం వరకు అస్సాం, మేఘాలయ, గుజరాత్, ఉత్తరాఖండ్, హిమాచల్‌ప్రదేశ్, కేరళ, ముంబై, గోదావరి పరీవాహక ప్రాంతం, పశ్చిమ కనుముల్లో వరదలు పరిశీలిస్తే తేమ ప్రవాహాల తీవ్రతే కారణమని పేర్కొంటున్నారు. దేశంలో అడవుల విస్తీర్ణం తగ్గడంతో వరదలకు కొండ చరియలు విరిగిపడి ప్రాణ, ఆస్తి నష్టం సంభవిస్తుందని రిటైర్డు వాతావరణ అధికారి ఒకరు పేర్కొన్నారు.

నైరుతి సీజన్‌లో జూన్ ఒకటో తేదీ నుంచి శుక్రవారం వరకూ దేశంలో 526.9 మి.మీ.కుగాను 563.7 మి.మీ. (సాధారణం కంటే ఏడు శాతం ఎక్కువ) వర్షపాతం నమోదైంది. దక్షిణ భారతంలో 425.1 మి.మీ.కు 529.1 (24 శాతం ఎక్కువ), మధ్య భారతంలో 596.2 కి 702.3 మి.మీ. (18 శాతం ఎక్కువ), తూర్పు, ఈశాన్య భారతంలో 843.8కి 753 (11 శాతం తక్కువ), వాయవ్య భారతంలో 351.8కి 335.9 మి.మీ. (ఐదు శాతం తక్కువ) వర్షపాతం నమోదైంది. దక్షిణ, మధ్య భారతంలో సాధారణానికి మించి వర్షపాతం నమోదైనా అనేకచోట్ల భారీవర్షాలు, అక్కడక్కడా కుంభవృష్టితో వరదలు సంభవించగా కొన్నిచోట్ల ఇంకా వర్షాభావం కొనసాగుతోందని నిపుణులు వివరించారు.

వేల కోట్లు ఖర్చు చేస్తే 2 లక్షల మంది ఎందుకు తగ్గారు?

- వైసీపీ ప్రభుత్వం ఖర్చు కాగితాలకే పరిమితం
- గవర్నమెంట్ బడుల్లో ఇంటర్నెట్ సౌకర్యం తప్పనిసరి
- పేరెంట్స్ మీటింగ్స్‌కు సీఎం, ఎమ్మెల్యేలూ హాజరు
- 'సాల్ట్' ప్రాజెక్టు సమీక్షలో మంత్రి లోకేశ్

అమరావతి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): నాణ్యమైన విద్యా బోధన ద్వారా ప్రభుత్వ పాఠశాలలపై ప్రజల్లో నమ్మకం పెంచాలని మంత్రి నారా లోకేశ్ అన్నారు. ప్రపంచ బ్యాంకు సహకారంతో అమలవుతున్న 'సపోర్టింగ్ ఆంధ్రాస్ లెర్నింగ్ ట్రాన్స్‌ఫర్మేషన్'(సాల్ట్) ప్రాజెక్టు అమలు తీరుపై శుక్రవారం ఉండవల్లిలోని తన నివాసంలో సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి గత ప్రభుత్వంలో సాల్ట్ ప్రాజెక్టు అమలులో వెనుకబాటుపై ఆరా తీశారు. 'నాడు-నేడు, సాల్ట్ ప్రాజెక్టులకు రూ.వేల కోట్లు ఖర్చు చేసినట్లు గత ప్రభుత్వం కాగితాల్లో చూపింది. అదే నిజమైతే గతేడాది ప్రభుత్వ బడుల్లో 2 లక్షల మంది విద్యార్థులు ఎందుకు తగ్గారు? రాబోయే ఐదేళ్లలో ప్రభుత్వ పాఠశాలలను ప్రైవేటు బడులకు దీటుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన ప్రణాళికలు రూపొందించాలి. అన్ని ప్రభుత్వ బడుల్లో తప్పనిసరిగా ఇంటర్నెట్ సౌకర్యం ఉండాలి. ప్రథమ్ సంస్థ ప్రతినిధులు.. ప్రాథమిక పాఠశాలల స్థాయిలో విద్యార్థుల అభ్యసన సామర్థ్యం అంచనా మరింత శాస్త్రీయంగా ఉండేలా డిజైన్‌లో మార్పులు చేయాలి. టీచింగ్ టూల్స్ పరిశీలన, ఆబ్జెక్టివ్ ఓరియంటెడ్ బోధనా పద్ధతులను మెరుగుపర్చేందుకు చర్యలు తీసుకోవాలి. అధికారులు... ఇంటర్మీడియట్‌లో మార్కులకు బదులుగా గ్రేడింగ్ విధానం అమలుకు అవకాశాలను పరిశీలించాలి. నాతోపాటు సీఎం నుంచి ఎమ్మెల్యేల వరకు.. అందరూ తల్లిదండ్రులు, టీచర్ల సమావేశాలకు హాజరై తల్లిదండ్రుల మనోగతాన్ని తెలుసుకుంటాం. బాల్యం నుంచే మహిళలను గౌరవించేలా వచ్చే విద్యా సంవత్సరం నుంచి పాఠ్యాంశాల్లో మార్పులు చేయాలి' అని మంత్రి లోకేశ్, అధికారులను ఆదేశించారు.

సమస్యల పరిష్కారానికి 'వారధి'

- బీజేపీ కార్యాలయంలో వినతులు

అమరావతి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): ప్రజల సమస్యలు నేరుగా విని పరిష్కరించేందుకు శ్రీకారం చుట్టిన చంద్రబాబు నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వంలో భాగస్వామ్య పార్టీలు మూడూ ఒకే బాట పట్టాయి. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి వచ్చే ప్రజల సమస్యలను విని పరిష్కరించేందుకు ప్రతి రోజూ ఒక మంత్రి, ఇద్దరు పార్టీ ముఖ్య నేతలను టీడీపీ కేంద్ర కార్యాలయంలో పార్టీ అధినేత, సీఎం చంద్రబాబు అందుబాటులో ఉంచారు. అదే విధానాన్ని ఎన్డీఏలో కీలక భాగస్వామ్య పక్షమైన జనసేన కూడా అనుసరిస్తోంది. తాజాగా బీజేపీ కూడా 'వారధి' పేరుతో ప్రజా సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు సిద్ధమైంది. బీజేపీ ప్రజాప్రతినిధులు ఆదివారం మినహా అన్ని రోజులూ విజయవాడలోని రాష్ట్ర బీజేపీ కార్యాలయంలో అందుబాటులో ఉంటారని ఆ పార్టీ అధికార ప్రతినిధి లంకా దినకర్ తెలిపారు. ప్రతి నెలా మొదటి, మూడో సోమవారం నాడు రాష్ట్ర పార్టీ అధ్యక్షురాలు, ఎంపీ పురందేశ్వరి ప్రజలు, కార్యకర్తల నుంచి వినతులు స్వీకరిస్తారు. ఎన్డీఏ ప్రభుత్వంలోని సంబంధిత శాఖల అధికారులకు వాటిని పంపి పరిష్కారానికి కృషి చేస్తారు. ప్రతి నెలా మొదటి, మూడో మంగళవారం రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ 'వారధి'లో పాల్గొంటారు.

అమ్మో.. అబార్షన్..!

- గుంటూరులో పెరిగిపోతున్న గర్భవిచ్ఛిత్తి
- అతి తక్కువ రోజుల్లోనే 1,789 మందికి అబార్షన్
- ఆడా.. మగా తెలిసే సమయంలోనే ఎక్కువ అబార్షన్లు
- గుంటూరు, మంగళగిరి, తెనాలి, పొన్నూరు, తాడేపల్లిలో అధికం
- ఆందోళన కలిగిస్తున్న నివేదిక

గుంటూరు సిటీ, ఆగస్టు 9: నేషనల్ హెల్త్ మిషన్ గర్భిణుల కోసం కోట్ల రూపాయలు వెచ్చించి అనేక పథకాలు ప్రవేశపెట్టినా అబార్షన్లు ఆగడం లేదు. వందలకొద్దీ ప్రాణాలు పిండ దశలోనే గాలిలో కలిసి పోతున్నాయి. పుట్టబోయేది ఆడా.. మగా అన్న విషయం స్పష్టంగా తెలిసే సమయంలోనే ఎక్కువగా గర్భవిచ్ఛిత్తి జరుగుతున్నట్లు తెలుస్తోంది. రాష్ట్రంలోని గుంటూరు జిల్లాలో అబార్షన్లు (గర్భవిచ్ఛిత్తి) అధికంగా ఉన్నట్టు అధికారిక నివేదికలు స్పష్టం చేస్తున్నాయి. ముఖ్యంగా పట్టణ ప్రాంతాల్లో ఎక్కువ అబార్షన్లు జరుగుతుండడం మరింత ఆందోళన కలిగిస్తోంది. 2024-2025 సంవత్సరానికి గాను (2024కు ముందు గర్భిణిగా నమోదై ప్రసవం కాని వారు కూడా ఈ లెక్కలోకి వస్తారు) జిల్లా వ్యాప్తంగా సుమారు 20 వేల మంది గర్భం దాల్చగా.. అందులో 1,789 మందికి అబార్షన్ అయినట్లు అధికారిక నివేదికలు చెబుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ నిర్దేశించిన శాతానికి మించి అబార్షన్లు జరిగినట్లు సమాచారం. గుంటూరు, మంగళగిరి, తెనాలి, పొన్నూరు, తాడేపల్లి పరిధిలోని అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ఎక్కువ అబార్షన్లు జరిగినట్లు వైద్య శాఖ నివేదిక చెబుతోంది. ఆయా అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నమోదైన గర్భాలలో 10 శాతం నుంచి 15 శాతం మేర అబార్షన్లు జరిగాయి. గ్రామీణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో ముప్పాళ్ళలో అధికంగా 16.8శాతం, ఫిరంగిపురంలో 14, నుదురుపాడులో 13.3, మన్నవలో 13.4 శాతం అబార్షన్లు నమోదయ్యాయి. ఈ కేంద్రాలన్నీ స్కానింగ్ సెంటర్లు ఎక్కువగా ఉన్న గుంటూరుకు సమీపంలోనే ఉన్నాయి. ఎలాంటి దురుద్దేశాలు లేకుండానే ఎక్కువ అబార్షన్లు జరుగుతున్నా దానికి వైద్య, ఆరోగ్యశాఖ బాధ్యత వహించాల్సి ఉంటుంది. గర్భం దాల్చిన మొదటి నెల నుంచే సదరు గర్భిణీకి అన్ని రకాల వైద్య సేవలు అందుబాటులో ఉంచాలని నేషనల్ హెల్త్ మిషన్ చెబుతోంది. అందులో భాగంగానే రాష్ట్రానికి ఏటా వందల కోట్ల నిధులు కేటాయిస్తోంది. అయినా అబార్షన్లు పెరుగుతుండడం.. గర్భిణులకు అందిస్తున్న సేవల్లో జరుగుతున్న లోపాలను ఎత్తిచూపుతోంది.

లింగ నిర్ధారణ చట్టం నిర్వీర్యం..?

నగరం, పట్టణాల పరిధిలోని చాలా స్కానింగ్ సెంటర్లలో గర్భస్థ లింగ నిర్ధారణ చట్టం నిర్వీర్యమైనట్లు కనిపిస్తోంది. సెంటర్లకు వచ్చిన వారిని సంతృప్తి పరిచేందుకు పుట్టబోయేది అబ్బాయా.. అమ్మాయా.. అనే విషయాన్ని ముందుగానే వెల్లడిస్తున్నారు. కొంతమంది వైద్యులు కూడా ఈ విషయంలో అత్యుత్సాహం ప్రదర్శిస్తున్నట్లు తెలుస్తోంది. ఫలితంగా పీసీపీఎన్‌డీటీ యాక్టు ఉన్నా భ్రూణహత్యలు జరుగుతున్నట్లు రుజువవుతోంది. కలెక్టర్ ఆదేశాలతో వైద్య ఆరోగ్య శాఖ స్కానింగ్ సెంటర్లలో తనిఖీలు నిర్వహిస్తున్నా అవి తూతూమంత్రమే అన్న ఆరోపణలు ఉన్నాయి. జిల్లా కార్యాలయంలోని కొందరు అధికారులు ఈ విషయంలో స్కానింగ్ సెంటర్లకు, అధికారులకు మధ్యవర్తులుగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. తెనాలి ప్రాంతంలో ఎక్కువగా లింగ నిర్ధారణ పరీక్షలు చేసి రిపోర్ట్ వెల్లడి చేస్తున్నారన్న ప్రచారం జరుగుతోంది.

బాలికల వివాహ వయసు 9 ఏళ్లే!

- ఇరాక్ పార్లమెంట్‌లో అనాగరిక బిల్లు

న్యూఢిల్లీ, ఆగస్టు 9: బాలికల కనీస వివాహ వయసును 9ఏళ్లకు, బాలురకు 15 ఏళ్లకు తగ్గించేందుకు ఇరాక్ ప్రభుత్వం సిద్ధమైంది. ఇప్పటికే పితృస్వామ్య కట్టుబాట్లతో నిండిన సమాజంలో ఇరాక్ పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఈ ప్రతిపాదిత బిల్లు మహిళల హక్కులను కాలరాస్తుందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ అనాగరిక, వివాదాస్పద బిల్లుపై మానవ హక్కుల సంఘాలు తీవ్ర ఆందోళన వ్యక్తంచేస్తున్నాయి. ప్రస్తుతం ఇరాక్‌లో బాలికల వివాహ వయసు 18 సంవత్సరాలుగా ఉంది. ప్రస్తుత బిల్లు పాస్ అయితే బాలికలు 9 ఏళ్ల, బాలురు 15 ఏళ్లకు వివాహం చేసుకోవడానికి చట్టపరంగా ఎలాంటి అడ్డంకులూ ఉండవు.

భారత్‌ను ముక్కలు చేస్తాం: పన్నూన్

న్యూఢిల్లీ, ఆగస్టు 9: ఖలిస్తానీ వేర్పాటువాది గురుపత్వంత్ సింగ్ పన్నూన్ మరోసారి రెచ్చిపోయారు. వాషింగ్టన్ డీసీ నుంచి మెల్‌బోర్న్ వరకూ ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని భారత రాయబార కార్యాలయాల్లో త్రివర్ణ పతాకాన్ని దహనం చేయబోతున్నామని హెచ్చరించారు. భారత్‌లో పంజాబ్ భాగం కానందున, ఆగస్టు 15న సీఎం భగవంత్ సింగ్ మాన్ త్రివర్ణ పతాకం ఎగురవేయకూడదని పేర్కొన్నారు. జలంధర్‌లో జాతీయ జెండా ఎగురవేయకుండా మాన్‌ను అడ్డుకున్నవారికి తమ సంస్థ తరఫున రూ.కోటి ఇస్తామని ప్రకటించారు.

వైసీపీ లిక్కర్‌తో కిడ్నీలు చెడిపోయాయి

- లక్షల్లో డయాలసిస్ పేషెంట్లు: మంత్రి సత్యకుమార్

నెల్లూరు(వైద్యం), ఆగస్టు 9: గత వైసీపీ ప్రభుత్వం తీసుకువచ్చిన లిక్కర్ పాలసీ వల్ల రాష్ట్రంలో వేలాది మందికి మూత్రపిండాలు(కిడ్నీలు) చెడిపోయాయని మంత్రి సత్యకుమార్ యాదవ్ ఆరోపించారు. నెల్లూరు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. గత ప్రభుత్వంలో వైసీపీ నేతల మద్యం డిస్ట్రిబ్యూటరీ, పరిశ్రమల వల్ల నాసిరకం మద్యం రాష్ట్రంలో విచ్చలవిడిగా చలామణిలో ఉండేది. దీని వల్ల గడచిన ఐదేళ్లలో నాసిరకం మద్యం తాగి ఎంతోమంది మృత్యువాత పడ్డారు. మూత్రపిండాలు దెబ్బతిని ఆసుపత్రుల పాలయ్యారు. ప్రజలకు అన్ని రకాల సేవలు అందించాల్సిన జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం వారి ఆరోగ్యంతో చెలగాట మాడింది. దేశంలో 3.45 కోట్లమంది మూత్రపిండాలు చెడిపోయి డయాలసిస్ చేయించుకుంటున్నారు. ఇందులో అత్యధికంగా రాష్ట్రంలోనే ఉన్నారు. ఆరోగ్యశ్రీని ఎట్టి పరిస్థితుల్లోనూ ఎత్తివేయం. రూ.25 లక్షల వరకు ఆరోగ్యశ్రీ ట్రస్ట్ ద్వారా, ఎన్టీఆర్ వైద్యసేవ బీమా పథకం కింద రూ.2 లక్షలు, మరో రూ.5 లక్షల వరకు ఆయుష్మాన్ భారత్ కింద వైద్య సేవలు అందిస్తాం' అని మంత్రి సత్యకుమార్ వివరించారు. కార్యక్రమంలో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

వైసీపీ కార్యకర్తలు చంపడానికీ వెనుకాడటం లేదు!

- టీడీపీ కార్యాలయంలో మంత్రికి గోడు వెళ్లబోసుకున్న బాధితులు

అమరావతి, ఆగస్టు 9(ఆంధ్రజ్యోతి): 'గత 40 ఏళ్లుగా మేం సాగు చేసుకుంటున్న భూమిని వైసీపీ కార్యకర్తలు ఆక్రమించారు. మాపైనే దాడి చేశారు. చంపడానికైనా వెనుకాడమంటూ దౌర్జన్యం చేస్తున్నారు' అంటూ ఓ మహిళ, మంత్రి నిమ్మల రామానాయుడు ఎదుట గోడు వెళ్లబోసుకున్నారు. శుక్రవారం టీడీపీ కేంద్ర కార్యాలయంలో ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, టీఎన్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ప్రణవ్ గోపాల్‌తో కలసి, ప్రజల నుంచి మంత్రి అర్జీలు స్వీకరించారు. వైసీపీ రాజకీయ కక్ష సాధింపులకు గురైన టీడీపీ కార్యకర్తలు, వైసీపీ నేతల భూకబ్జాలపై బాధితులు తమ గోడును మంత్రికి చెప్పుకున్నారు. పల్నాడు జిల్లా రావులాపురంలో 40 ఏళ్లుగా సాగు చేసుకుంటున్న భూమిని వైసీపీ కార్యకర్తలు హరిబాబు, ఏసోబు, వెంకటేశ్వర్లు ఆక్రమించి, దౌర్జన్యం చేస్తున్నారని మేరీ అనే మహిళ ఫిర్యాదు చేశారు. పల్నాడు జిల్లాకు చెందిన ధనరాజుపల్లి కోటయ్య.. నా మూడెకరాల భూమిని మాజీ మంత్రి విడదల రజినీ మరిది గోపీనాథ్ రూ.25 లక్షలకు కొన్నారు. ఆ డబ్బు ఇవ్వకుండా వేధిస్తున్నారు' అని ఫిర్యాదు చేశారు. నెల్లూరు జిల్లా దగదర్తి గ్రామ టీడీపీ నాయకుడు వడ్డే పవన్‌కుమార్ కుటుంబాన్ని వైసీపీ నేతలు కక్షపూరితంగా అక్రమ కేసులు పెట్టి వేధించారని, తమకు న్యాయం చేయాలని వేడుకున్నారు. గుంటూరు జిల్లా నంబూరుకు చెందిన నాగదుర్గ తన ఇల్లు కాలిపోయి నాలుగేళ్లుగా ఇబ్బందిపడుతున్నామని, భర్త అనారోగ్యంతో బాధ పడుతున్నాడని కన్నీటి పర్యంతమైంది. దీనిపై టీడీపీ నేతలు మాట్లాడుతూ త్వరలో పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

జయాబచ్చన్ వర్సెస్ చైర్మన్

మహిళా సభ్యుల సంబోధన పట్ల రాజ్యసభలో వాడీవేడి సంవాదం

- మహిళలతో మీ మాటతీరు బాలేదు
- చైర్‌ను ఉద్దేశించి జయ ఫిర్యాదు
- సభామర్యాదలను తెలుసుకోండి: ధన్‌ఖడ్
- జయకు మద్దతుగా విపక్షాల వాకౌట్

న్యూఢిల్లీ, ఆగస్టు 9: మహిళా సభ్యులతో చైర్మన్ జగదీప్ ధన్‌ఖడ్ మాట్లాడే తీరు బాగోలేదంటూ సమాజ్‌వాదీ పార్టీ సభ్యురాలు, సీనియర్ నటి జయాబచ్చన్ అభ్యంతరం వ్యక్తం చేయడం రాజ్యసభను వేడెక్కించింది. నేరుగా చైర్మన్‌ను ఉద్దేశించి ఆమె ఈ వ్యాఖ్యలు చేయడం, ప్రతిగా చైర్మన్ స్పందించడం, తిరిగి జయ మాట్లాడటం.. ఇలా పెద్దల సభలో తీవ్రస్థాయిలో వాగ్యుద్ధం రాజుకుంది. చైర్ తనకు క్షమాపణలు చెప్పాలని జయ గట్టిగా డిమాండ్ చేశారు. జయాబచ్చన్‌కు మద్దతుగా కాంగ్రెస్ అగ్ర నాయకురాలు సోనియాగాంధీ నేతృత్వంలో రాజ్యసభలోని విపక్ష పార్టీల సభ్యులంతా సభ నుంచి వాకౌట్ చేశారు. గత సోమవారం రాజ్యసభలో చైర్మన్ తనను 'జయా అమితాబ్ బచ్చన్' అంటూ సంబోధించడాన్ని ఆమె అభ్యంతరపెట్టారు. 'జయా బచ్చన్ అనండి చాలు. నా భర్త పేరును జోడించి పిలవడం ఒక మహిళగా నాకు ఇబ్బందిగా ఉంది. మాకు సొంత అస్తిత్వం లేదన్నట్టు మీ సంబోధన ఉంది" అని తేల్చిచెప్పారు. ఇదే క్రమంలో శుక్రవారం రాజ్యసభ కార్యకలాపాలు మొదలైన కొద్దిసేపటికి చైర్మన్ జగదీప్ ధనఖడ్‌పై జయాబచ్చన్ మరోసారి సభలో ఫిర్యాదు చేశారు. 'మీ మాటతీరు బాగాలేదు' అని ఆమె అన్నారు. దీనిపై చైర్మన్ తీవ్రంగా స్పందించారు. మాట్లాడుతున్న ఆమెను మధ్యలో ఆపివేసి.. "మీరు ప్రముఖ నటి కావచ్చు. కానీ, సభా మర్యాదలను మీరు అర్థం చేసుకోవాలి" అని కటువుగా సూచించారు. దీనిపై జయ తిరిగి స్పందిస్తూ.. " సర్! నేను జయా అమితాబ్ బచ్చన్‌ను. (కొన్ని బెంచీల నుంచి ముసిముసి నవ్వులు వినిపించాయి) నేను నటిని. బాడీ ల్యాంగేజ్, ఎక్స్‌ప్రెషన్ (వ్యక్తీకరణ) నాకు అర్థం అవుతాయి. మీ మాట తీరు సబబుగా లేదు. ఈ మాట అన్నందుకు నన్ను మన్నించండి" అంటూ భావోద్వేగానికి గురయ్యారు. దీనికి చైర్మన్ స్పందిస్తూ.. " మీరు గొప్ప పేరు ప్రతిష్ఠలు సంపాదించుకున్నారు. నటి విషయం డైరెక్టర్‌కు సంబంధించింది. మీకు ఇవన్నీ వేలు పట్టుకుని నేర్పించాల్సిన అవసరం లేదు. లేదు.. లేదు.. ఇక ఆపండి.." అంటూ ఆమె వైపు చేతులు ఊపారు. అనంతరం జయాబచ్చన్ సహా సభలో విపక్ష సభ్యులంతా వాకౌట్ చేశారు. పార్లమెంటు వెలుపల మిగతా రాజ్యసభ సభ్యులతో కలిసి ఆమె మీడియాతో మాట్లాడారు. సభలో చైర్మన్ అన్ పార్లమెంటరీ భాషను వాడుతున్నారని జయా బచ్చన్ ఆరోపించారు.



పార్లమెంటు ఆవరణలో జయాబచ్చన్, సోనియా

జేఎన్‌టీయూ హెచ్‌లో స్పాట్ అడ్మిషన్స్

హైదరాబాద్‌లోని జవహర్‌లాల్ నెహ్రూ టెక్నలాజికల్ యూనివర్సిటీ(జేఎన్‌టీయూ)కి చెందిన డైరెక్టరేట్ ఆఫ్ యూనివర్సిటీ ఫారిన్ రిలేషన్స్(డీయూఎఫ్ఆర్)- డిగ్రీ ప్రోగ్రామ్‌లలో విదేశీ కోటా కింద మిగిలిన సీట్ల భర్తీకి స్పాట్ అడ్మిషన్స్ నిర్వహిస్తోంది. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో సీట్లు అలాట్ చేస్తారు. ఎఫ్ఎన్/పీఐఓ/సీఐడబ్ల్యూజీ/ఎన్ఆర్ఐ కేటగిరీల అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. ఆసక్తిగలవారు ఒరిజినల్ సర్టిఫికెట్లు, నిర్దేశిత ఫీజులతో క్యాంపస్‌కు హాజరు కావాలి.

నాలుగేళ్ల బీటెక్ విభాగాలు-సీట్లు

- సీఎస్ఈ-ఏఐఎంఎల్ 6, సీఎస్ఈ-సైబర్ సెక్యూరిటీ 5, ఈసీఈ 4, ఈఈఈ 6, మెకానికల్ 6, సివిల్ 6, కెమికల్ 6, మెటలర్జీ 8, బయోటెక్నాలజీ 6, జియో ఇన్ఫర్మాటిక్స్ 8 సీట్లు చొప్పున మొత్తం 61 సీట్లు ఉన్నాయి.

అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీటెక్ విభాగాలు-సీట్లు

- సీఎస్ఈ, ఈసీఈ, ఈఈఈ, మెకానికల్, సివిల్ విభాగాల్లో ఒక్కోదానిలో 5 సీట్లు చొప్పున మొత్తం 25 సీట్లు ఉన్నాయి.

మూడేళ్ల మేనేజ్‌మెంట్ ప్రోగ్రామ్-సీట్లు

- బీబీఏ ప్రోగ్రామ్‌లో 6 సీట్లు ఉన్నాయి.

ముఖ్య సమాచారం

- **వార్షిక ఫీజు:** బీటెక్, ఇంటిగ్రేటెడ్ బీటెక్ ప్రోగ్రామ్‌లకు 3500 యూఎస్ డాలర్లు; బీబీఏ ప్రోగ్రామ్‌నకు 3000 యూఎస్ డాలర్లు; సార్క్ దేశాల అభ్యర్థులకు 50 శాతం రాయితీ వర్తిస్తుంది.
- **రిజిస్ట్రేషన్ ఫీజు:** 200 యూఎస్ డాలర్లు
- **డెవలప్‌మెంట్ ఫీజు:** 1000 యూఎస్ డాలర్లు
- **స్పాట్ అడ్మిషన్స్:** ఆగస్టు 12 నుంచి
- **వేదిక:** డైరెక్టరేట్ ఆఫ్ యూనివర్సిటీ ఫారిన్ రిలేషన్స్, జేఎన్‌టీయూహెచ్, కూకట్‌పల్లి, హైదరాబాద్
- **వెబ్‌సైట్:** www.jntuh.ac.in

ఆంధ్రజ్యోతి

దిక్సూచి

విజయవాడ ● శనివారం 10 ఆగస్టు 2024

diksuchi@andhrajyothy.com

ఫిల్మ్ డైరెక్షన్‌లో ఆన్‌లైన్ కోర్సు

పుణెలోని ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా(ఎఫ్‌టీఐఐ) ఆధ్వర్యంలోని సెంటర్ ఫర్ ఓపెన్ లెర్నింగ్(సీఎఫ్ఓఎల్)- 'ఫండమెంటల్స్ ఆఫ్ ఫిల్మ్ డైరెక్షన్' కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. దీనిని ఆన్‌లైన్ మోడ్‌లో నిర్వహిస్తారు. మొత్తం 33 సీట్లు ఉన్నాయి. ఫస్ట్ కమ్ ఫస్ట్ సర్వ్‌డ్ పద్ధతిలో అభ్యర్థులను ఎంపిక చేస్తారు.

కోర్సు వివరాలు

కోర్సు వ్యవధి అయిదు రోజులు. ఆగస్టు 26 నుంచి కోర్సు ప్రారంభమౌతుంది. ప్రతి రోజూ ఉదయం పదిన్నర నుంచి మధ్యాహ్నం పన్నెండున్నర వరకు, మరల మధ్యాహ్నం రెండున్నర నుంచి సాయంత్రం నాలుగున్నర వరకు సెషన్స్ ఉంటాయి. ఆంగ్ల మాధ్యమంలో తరగతులు నిర్వహించినప్పటికీ హిందీ మాధ్యమంలోనూ వివరణ ఇస్తారు. ఈ కోర్సులో సినిమా, లాంగ్వేజ్ ఆఫ్ సినిమా, స్పేస్ అండ్ టైమ్ ఆఫ్ సినిమా, ఫిల్మ్ ఫోరం, ఫిల్మ్ ఇమేజ్, ఫిల్మ్ సౌండ్, ఎలిమెంట్స్ ఆఫ్ స్టోరీ, స్క్రీన్‌ప్లే, వర్కింగ్ విత్ యాక్టర్స్, రోల్ ఆఫ్ ఫిల్మ్ డైరెక్టర్ తదితర అంశాలు వివరిస్తారు. కనీసం 90 శాతం అటెండెన్స్ తప్పనిసరి. నిబంధనల ప్రకారం కోర్సు పూర్తిచేసిన వారికి ఈ-సర్టిఫికెట్లు ప్రదానం చేస్తారు.

అర్హత

పదోతరగతి/పన్నెండో తరగతి ఉత్తీర్ణులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 1 నాటికి 18 ఏళ్లు నిండి ఉండాలి. అభ్యర్థులు కనీసం 4 జీబీ ర్యామ్ గల డెస్క్‌టాప్/ల్యాప్‌టాప్, విండోస్ 7/8/10 ఆపరేటింగ్ సిస్టమ్, ఆడియో-వీడియో సాఫ్ట్‌వేర్, హెడ్‌ఫోన్/ఇయర్‌ఫోన్, హెచ్‌డీ వెబ్ క్యామ్, రోజుకి కనీసం 5 జీబీ ఇంటర్నెట్ ప్యాక్, లేటెస్ట్ వెబ్ బ్రౌజర్ ఏర్పాటు చేసుకోవాలి.

ముఖ్య సమాచారం

- **కోర్సు ఫీజు:** రూ.3,900
- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 12
- **వెబ్‌సైట్:** ftii.ac.in



మహిళలను సాంకేతిక విద్యలో ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన 'ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్' నోటిఫికేషన్ వెలువడింది. 'ఆలిండియా కౌన్సిల్ ఫర్ టెక్నికల్ ఎడ్యుకేషన్ (ఏఐసీటీఈ)' ఏటా దీనిని ఆఫర్ చేస్తోంది. ఈ స్కీమ్ ద్వారా డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో అర్హులైన అమ్మాయిలకు ఆర్థిక సహకారం అందిస్తారు. ఒక కుటుంబం నుంచి ఇద్దరు అమ్మాయిలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవచ్చు. కుటుంబ వార్షికాదాయం రూ.8 లక్షలకు మించకూడదు. అకడమిక్ మెరిట్ ఆధారంగా ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తారు.

ఏఐసీటీఈ ప్రగతి స్కాలర్‌షిప్ స్కీమ్

తెలుగు రాష్ట్రాల్లో స్కాలర్‌షిప్‌లు

- డిప్లొమా, డిగ్రీ కేటగిరీల్లో ఒక్కోదానికి 5,000 చొప్పున దేశవ్యాప్తంగా మొత్తం 10,000 స్కాలర్‌షిప్‌లు అందుబాటులో ఉన్నాయి. వీటికి అదనంగా నిర్దేశిత కేంద్ర పాలిత ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి దరఖాస్తు చేసుకొన్న విద్యార్థినులందరికీ స్కాలర్‌షిప్ సౌకర్యం కల్పిస్తారు.
- డిప్లొమా కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 318, తెలంగాణకు 206 స్కాలర్‌షిప్‌లు కేటాయించారు.
- డిగ్రీ కేటగిరీలో ఆంధ్రప్రదేశ్‌కు 566, తెలంగాణకు 424 స్కాలర్‌షిప్‌లు ప్రత్యేకించారు.



అర్హత వివరాలు

- డిప్లొమా కేటగిరీకి అప్లయ్ చేసుకోవాలంటే గుర్తింపు పొందిన పాఠశాల నుంచి పదోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఈ విద్యా సంవత్సరానికి టెక్నికల్ డిప్లొమా లెవెల్ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి. లేటరల్ ఎంట్రీ ద్వారా డిప్లొమా ద్వితీయ సంవత్సరంలో చేరినవారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- డిగ్రీ కేటగిరీకి దరఖాస్తు చేసుకోవాలంటే గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన పరీక్ష ఉత్తీర్ణులై ఉండాలి. ఏదేని టెక్నికల్ డిగ్రీ కోర్సులో ప్రవేశం పొంది ఉండాలి.

లేటరల్ ఎంట్రీ ద్వారా రెండో సంవత్సరంలో ప్రవేశం పొందినవారు కూడా అర్హులే.

- పదోతరగతి/ఇంటర్ పూర్తిచేసిన రెండేళ్ల లోపు ఏఐసీటీఈ గుర్తింపు పొందిన సంస్థలో డిప్లొమా/డిగ్రీ ప్రవేశం పొంది ఉండాలి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల నుంచి ఇతర మెరిట్ స్కాలర్‌షిప్స్ పొందుతున్నవారు, పీఎంఎస్ఎస్ఎస్ స్కీం కింద చదువుకుంటున్నవారు, నాన్ టెక్నికల్ కోర్సుల్లో చేరినవారు, డ్యూయెల్ డిగ్రీ/పీజీ కోర్సుల్లో ప్రవేశం పొందినవారు, ఇతరత్రా స్టయిపెండ్/ఆదాయం పొందుతున్నవారు దరఖాస్తుకు అనర్హులు.

స్కాలర్‌షిప్

- టెక్నికల్ డిప్లొమా రెగ్యులర్ కోర్సులో చేరిన వారికి మూడేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు రెండేళ్లు; టెక్నికల్ డిగ్రీ రెగ్యులర్ కోర్సులో చేరిన వారికి నాలుగేళ్లు, లేటరల్ ఎంట్రీ అభ్యర్థులకు మూడేళ్లపాటు స్కాలర్‌షిప్ అందిస్తారు. కాలేజ్ ఫీజు, కంప్యూటర్ కొనుగోలు, సాఫ్ట్‌వేర్, స్టేషనరీ, బుక్స్, ఎక్విప్‌మెంట్ తదితరాల నిమిత్తం ఏడాదికి రూ.50,000లు ఇస్తారు. డైరెక్ట్ బెనిఫిట్ ట్రాన్స్‌ఫర్(డీబీటీ) విధానంలో నేరుగా అమ్మాయి బ్యాంక్ ఖాతాకు ఈ మొత్తాన్ని జమ చేస్తారు.

ముఖ్య సమాచారం

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** అక్టోబరు 31
- **దరఖాస్తుకు జతచేయాల్సిన పత్రాలు:** పదోతరగతి/ఇంటర్ సర్టిఫికెట్‌లు, మార్కుల పత్రాలు; ఆదాయ ధ్రువీకరణ పత్రం; సంబంధిత కోర్సులో అడ్మిషన్ పొందిన లెటర్; ట్యూషన్ ఫీజు రిసీట్; ఆధార్ లింక్‌తో ఉన్న బ్యాంక్ ఖాతా నంబర్; ఐఎఫ్ఎస్‌సీ కోడ్; కుల ధ్రువీకరణ పత్రం; ఆధార్ కార్డ్; అభ్యర్థి ఫొటో
- **ఇన్‌స్టిట్యూట్ వెరిఫికేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 15
- **డీఎన్ఓ/ఎస్ఎన్ఓ/ఎంఎన్ఓ వెరిఫికేషన్‌కు చివరి తేదీ:** నవంబరు 30
- **వెబ్‌సైట్:** scholarships.gov.in



దామోదరం సంజీవయ్య వర్సిటీలో ఎల్ఎల్‌బీ

విశాఖపట్నంలోని దామోదరం సంజీవయ్య నేషనల్ లా యూనివర్సిటీ(డీఎస్ఎన్ఎల్‌యూ)- ఎల్ఎల్‌బీ ప్రోగ్రామ్‌లో ప్రవేశానికి దరఖాస్తులు కోరుతోంది. ప్రోగ్రామ్ వ్యవధి మూడేళ్లు. దీనికి 144 క్రెడిట్లు నిర్దేశించారు. సంస్థ నిర్వహించే ఆలిండియా ఎంట్రెన్స్ టెస్ట్(డీఈటీ) ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. రాష్ట్ర ప్రభుత్వ నిబంధనల మేరకు రిజర్వేషన్లు వర్తిస్తాయి.

ప్రోగ్రామ్ వివరాలు

- ప్రోగ్రామ్‌లో భాగంగా క్లాస్ రూం టీచింగ్, ట్యుటోరియల్స్, ప్రాజెక్టులు, గ్రూప్ డిస్కషన్స్, సెమినార్ ప్రజంటేషన్స్, కోర్టు కాంపిటీషన్స్, పార్లమెంటరీ డిబేట్స్, సెమినార్లు, కాన్ఫరెన్స్‌లు, వర్క్‌షాప్‌లు, క్విజ్ ప్రోగ్రామ్‌లు ఉంటాయి.
- క్లాస్ టెస్టులు, కోర్టు అసైన్‌మెంట్లు, కేస్ స్టడీస్, ప్రాజెక్ట్ అసైన్‌మెంట్స్, గ్రూప్ డిస్కషన్స్, మిడ్ సెమిస్టర్ ఎగ్జామ్స్, ఎండ్ సెమిస్టర్ ఎగ్జామ్స్ నిర్వహిస్తారు.
- అడ్వకేట్లు, లా సంస్థలు, జడ్జీల ఆధ్వర్యంలో సమ్మర్, వింటర్ ఇంటర్న్‌షిప్‌లు పూర్తిచేయాల్సి ఉంటుంది.

సీట్ల వివరాలు

- మొత్తం 138 సీట్లు ఉన్నాయి. ఏపీ స్టేట్ కోటా కింద 66 సీట్లు; ఆలిండియా కోటా కింద 54 సీట్లు; ఫారిన్ అభ్యర్థులు/ఎన్ఆర్ఐలు/ స్పాన్సర్డ్ ఎన్ఆర్ఐలకు 12 సీట్లు; కశ్మీరీ అభ్యర్థులకు 6 సీట్లు నిర్దేశించారు. ఏపీ స్టేట్ కోటా కింద సీట్లు మిగిలిన పక్షంలో డీఈటీ ర్యాంక్ ఆధారంగా ఇతర రాష్ట్రాల అభ్యర్థులకు అలాట్ చేస్తారు.

అర్హత

- గుర్తింపు పొందిన కళాశాల నుంచి మూడేళ్ల వ్యవధి గల ఏదేని డిగ్రీ ఉత్తీర్ణులై ఉండాలి. జనరల్ అభ్యర్థులకు 45 శాతం; బీసీ అభ్యర్థులకు 42 శాతం; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు 40 శాతం మార్కులు ఉండాలి. పీజీ అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఎంట్రెన్స్ టెస్ట్

- దీనిని ఆబ్జెక్టివ్ విధానంలో నిర్వహిస్తారు. ఇందులో జనరల్ నాలెడ్జ్, లీగల్ ఆప్టిట్యూడ్, కరెంట్ అఫైర్స్ అంశాల నుంచి మొత్తం 100 మల్టిపుల్ ఛాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ప్రశ్నకు ఒక మార్కు. చొప్పున మొత్తం మార్కులు 100. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో ఉంటుంది. పరీక్ష సమయం రెండు గంటలు.



ముఖ్య సమాచారం

- **దరఖాస్తు ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.2,500; బీసీ/ఓబీసీ అభ్యర్థులకు రూ.2,200; ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1800
- **దరఖాస్తుకు చివరి తేదీ:** ఆగస్టు 15
- **ఎంట్రెన్స్ టెస్ట్ తేదీ:** ఆగస్టు 24
- **ఎంట్రెన్స్ టెస్ట్ సెంటర్:** డీఎస్ఎన్ఎల్‌యూ క్యాంపస్, విశాఖపట్నం
- **డాక్యుమెంట్స్ వెరిఫికేషన్:** ఆగస్టు 25న
- **వెబ్‌సైట్:** www.dsnlu.ac.in

జాబ్ కార్నర్

పట్నా ఎయిమ్స్‌లో సీనియర్ రెసిడెంట్స్

ఖాళీలు 76

పట్నాలోని ఆల్ ఇండియా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్(ఎయిమ్స్)...కింద పేర్కొన్న పోస్టుల భర్తీకి అర్హులైన అభ్యర్థుల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: సీనియర్ రెసిడెంట్

విభాగాలు: అనస్తీషియాలజీ, జనరల్ సర్జరీ, జనరల్ మెడిసిన్, మైక్రోబయాలజీ, డెర్మటాలజీ, న్యూరాలజీ, బయో కెమిస్ట్రీ, ఆర్థోపెడిక్స్, పీడియాట్రిక్స్, పాథాలజీ, ట్రాన్స్‌ఫ్యూజన్ మెడిసిన్ అండ్ బ్లడ్ బ్యాంక్ తదితరాలు.

అర్హత: పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో ఎంబీబీఎస్, ఎండీ, ఎంఎస్, ఎమ్మెస్సీ, డీఎన్‌బీ, పీజీ ఉత్తీర్ణతతోపాటు పని అనుభవం ఉండాలి.

దరఖాస్తు ఫీజు: జనరల్, ఓబీసీ అభ్యర్థులకు రూ.1500. ఎస్సీ/ఎస్టీ/అభ్యర్థులకు రూ. 1200; ఎక్స్ సర్వీస్ మెన్/దివ్యాంగ/మహిళా అభ్యర్థులకు ఫీజులో మినహాయింపు ఉంటుంది.

ఎంపిక ప్రక్రియ: రాత పరీక్ష, ఇంటర్వ్యూ తదితరాల ఆధారంగా

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ: ఆగస్టు 19

రాత పరీక్ష: సెప్టెంబరు 2

వెబ్‌సైట్: https://aiimspatna.edu.in/advertisement/

వెస్ట్ సెంట్రల్ రైల్వేలో అప్రెంటిస్‌లు

ఖాళీలు 3,317

జబల్‌పూర్‌లోని రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)- వెస్ట్ సెంట్రల్ రైల్వే...డబ్ల్యూసీఆర్ పరిధిలోని డివిజన్/యూనిట్‌లలో కింద పేర్కొన్న అప్రెంటిస్ ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

పోస్టు: యాక్ట్ అప్రెంటిస్

ఆర్ఆర్‌సీ డివిజన్/యూనిట్‌లు: జేబీపీ డివిజన్, బీపీఎల్ డివిజన్, కోటా డివిజన్, సీఆర్‌డబ్ల్యూఎస్ బీపీఎల్, డబ్ల్యూఆర్ఎస్ కోటా, హెచ్‌క్యూ/జేబీపీ

అర్హత: పదో తరగతి, 12వ తరగతి, సంబంధిత ట్రేడ్‌లో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.

ట్రేడ్‌లు: ఏసీ మెకానిక్, బుక్ బైండర్, కార్పెంటర్, డీజిల్ మెకానిక్, డ్రాఫ్ట్స్‌మన్, ఎలక్ట్రీషియన్, ఫిట్టర్, హౌస్ కీపర్, మెషినిస్ట్, పెయింటర్, ప్లంబర్, స్టెనోగ్రాఫర్, సర్వేయర్, వెల్డర్, వైర్‌మ్యాన్ తదితరాలు.

వయోపరిమితి: 2024 ఆగస్టు 5 నాటికి 15 నుంచి 24 సంవత్సరాల మధ్య ఉండాలి.

ఎంపిక విధానం: పదో తరగతి, 12వ తరగతి, ఐటీఐ మార్కులు, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపిక చేస్తారు.

దరఖాస్తు రుసుము: రూ.141. ఎస్సీ, ఎస్టీ, దివ్యాంగులు, మహిళా అభ్యర్థులకు రూ.41.

ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరితేదీ: సెప్టెంబరు 4

వెబ్‌సైట్: https://wcr.indianrailways.gov.in/

యూనివర్సిటీ ఆఫ్ మాంచెస్టర్‌లో ఎమ్మెస్సీ సోషల్ నెట్‌వర్క్ అనాలిసిస్

ఇంగ్లాండ్‌లోని ద యూనివర్సిటీ ఆఫ్ మాంచెస్టర్... ఎమ్మెస్సీ సోషల్ నెట్‌వర్క్ అనాలిసిస్ కోర్సులో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తోంది. 2024 సెప్టెంబరు నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయి. https://www. manchester.ac.uk/

ఇది ఏడాది వ్యవధి గల కోర్సు. ప్రోగ్రామ్‌ను విజయవంతంగా పూర్తిచేసిన వారికి మాస్టర్ ఆఫ్ సైన్స్ (ఎమ్మెస్సీ) డిగ్రీ ఇన్ సోషల్ నెట్‌వర్క్ అనాలిసిస్ పట్టాను యూనివర్సిటీ ప్రదానం చేస్తుంది. సోషల్ సైన్సెస్‌లో భాగంగా నిర్వహించే ఈ కోర్సు కరికులమ్‌ని థియరీస్, మెథడాలజీస్, అప్లికేషన్స్‌తో రూపొందించారు.

అర్హతలు

- సోషల్ సైన్సెస్/మేథమెటిక్స్/ఫిజిక్స్/కంప్యూటర్ సైన్స్‌లో బ్యాచిలర్స్ డిగ్రీ విత్ ఆనర్స్ ఉత్తీర్ణత లేదా తత్సమానమైన విదేశీ విద్యలో ఉత్తీర్ణత.
- ఐఈఎల్‌టీఎస్ అకడమిక్ టెస్ట్ మొత్తం స్కోరు 7 ఉండాలి.
- టోఫెల్ ఐబీటీ స్కోరు మొత్తం 100కు తగ్గకూడదు.
- పియర్‌సన్ టెస్ట్ ఆఫ్ ఇంగ్లీష్(పీటీఈ) మొత్తం స్కోరు 76కు తగ్గకూడదు.
- **ప్రీ-సీజనల్ ఇంగ్లీష్ కోర్స్:** పైన పేర్కొన్న స్కోరు కంటే తక్కువగా ఉన్న అభ్యర్థులు కోర్సు ప్రారంభం అయ్యే కంటే ముందు మాంచెస్టర్ యూనిర్సిటీ నిర్వహించే ప్రీ-సీజనల్ ఇంగ్లీష్ లాంగ్వేజ్ కోర్సు పూర్తి చేసి ఉండాలి. ఐఈఎల్‌టీఎస్ మొత్తం స్కోరు 6.5 ఉన్నవారు 6 వారాల ప్రీ సీజనల్ కోర్సును, 6.0 స్కోరు ఉన్న వారు 10 వారాల కోర్సును పూర్తి చేయాల్సి ఉంటుంది.

ట్యూషన్ ఫీజు: 2024 సెప్టెంబరు నుంచి ప్రారంభమయ్యే కోర్సు ఫీజు ఏడాదికి 24,500 పౌండ్లు.

స్కాలర్‌షిప్స్

కోర్సులో ప్రవేశం లభించిన వారికి స్కాలర్‌షిప్స్ లభిస్తాయి.

- హ్యుమానిటీస్ బైసెంటనరీ స్కాలర్‌షిప్. ఏడాదికి 10,000 పౌండ్లు చెల్లిస్తారు.
- ద మాంచెస్టర్ అలూమ్ని స్కాలర్‌షిప్ స్కీమ్
- కామన్‌వెల్త్ స్కాలర్‌షిప్స్ అండ్ ఫెలోషిప్స్ ప్లాన్ (సీఎస్ఎఫ్‌పీ) జనరల్ స్కాలర్‌షిప్

ఇవే కాకుండా ఇండియాలో కూడా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అర్హులైన అభ్యర్థులకు వివిధ స్కాలర్‌షిప్‌లను మంజూరు చేస్తున్నాయి.

- రాజీవ్‌గాంధీ స్కాలర్‌షిప్ ఫర్ అకడమిక్ ఎక్సలెన్స్(రాజస్థాన్)
- నేషనల్ ఓవర్సీస్ స్కాలర్‌షిప్ స్కీమ్
- మారంగ్ గోమ్కే జైపాల్ ముండా ఓవర్సీస్ స్కాలర్‌షిప్(జార్ఖండ్)


చిన్న కప్ప అజాగ్రత్త

అనగనగా ఒక ఊరిలో ఒక పెద్ద చేదబావిలో కొన్ని కప్పలు నివసిస్తూ ఉండేవి. వాటిలో ఒక తల్లి కప్ప తన పిల్లను ఎంతో జాగ్రత్తగా చూసుకుంటూ ఉండేది. చిన్న కప్పకు బావి బయటకు వెళ్లి చుట్టూ ఉన్న ప్రపంచం ఎలా ఉందో చూడాలని ఉండేది. తల్లి కప్ప 'బయట చాలా ప్రమాదాలు ఉంటాయి బయటకు వెళ్లకూడదు' అని ఆపుతూ ఉండేది. ఓ రోజు ఆ బావి దగ్గరకు నీళ్ల కోసం వచ్చిన ఒకావిడ బిందెను బావిలోకి జార విడిచింది. చిన్న కప్ప తన పక్కనే ఉన్న మిగతా కప్పలు ఎంత చెప్పినా వినకుండా, బయటకు పోయి చూడాలన్న ఆతృతతో ఆ బిందెలోకి వెళ్లిపోయింది. బిందెను పైకి తీసుకున్న ఆవిడ నీటిలో కప్పను గమనించి, ఆ నీటినికింద పారబోసింది. కప్ప ఆ నీటితో పాటుకింద పడిపోయి, చుట్టూ ఉన్న చెట్లు, పొదలను పువ్వులను ఆకాశాన్ని ఆనందంగా చూడసాగింది. ఈ లోగాఆ పొదల్లోకి, ఒక పెద్దపాము వచ్చి, కప్పనుచూసింది. ఇంకేముంది? పామునుచూసి, గడగడా వణికిన కప్ప అలాగే గెంతుకుంటూ వెళ్లి, తనబావిలో దూకేసింది దానిని చూసిన కప్ప తల్లి, మిగతా కప్పలు చిన్నకప్పతో చూసావా వద్దంటే బయటకు వెళితే ప్రమాదాలు ఎలా ఉంటాయో?అన్నాయి.'నిజమే మరోసారి ఒంటరిగ ఎక్కడికీ వెళ్లను అమ్మా'అని ఏడ్చి బుద్ధి తెచ్చుకుంది చిన్న కప్ప.





10 తేడాలను కనుక్కోండి



దారి కనుక్కోండి



ఎన్ని చేపలు ఉన్నాయి?



సరైన నీడను జత పరచండి

3	2		
	1		
		3	
		4	1

డైలీ సుడోకు - 380

సుడోకు - 379 సమాధానం

3	5	4	6	2	1
1	2	6	3	4	5
5	4	3	1	6	2
2	6	1	4	5	3
4	1	2	5	3	6
6	3	5	2	1	4

ప్రతి బాక్స్‌లో 9 గళ్లు ఉంటాయి. ఒక్కో బాక్స్‌ను 1 నుంచి 9 వరకు అంకెలతో పూరించాలి. అన్ని బాక్స్‌లనూ కలిపి చూస్తే నిలువుగా, అడ్డంగానూ ఏ లైనులోనూ ఒకసారి వాడిన అంకెను తిరిగి వాడకూడదు.